


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 7.00

సంపుటి: 17

సంచిక: 1

ఆదివారం 24-3-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

◆ LKG to Intermediate State Syllabus ◆ LKG to +1 & +2 Central Syllabus ◆ Co-education ◆ Residential School & College

VISWASANTHI
EDUCATIONAL INSTITUTIONS
CBSE SCHOOL

IIT & Medical Foundation from VI to X Classes

VUYYURU (Near Vijayawada),
Krishna Dt., ANDHRA PRADESH.
Cell : 994 898 4444, 913 331 8502,
924 745 6148, 991 277 5666, 833 300 0899.
Web Site : www.sriviswasanthischools.in
E-mail Id : director.sriviswasanthi@gmail.com

JEE Main & Advanced, NEET, BITSAT, NDA, EAMCET Coaching by... Super Senior Lecturers

Separate Sections & Hostel for...BOYS & GIRLS
A.C. CAMPUS

ADMISSIONS ARE IN PROGRESS
NCC "A" & "B" Certificates

CENTRE OF SUCCESS WITH TOP RANKS
SINGLE CAMPUS WITH LIMITED STRENGTH

ALL INDIA LEVEL CLASS Xth TOPPERS
above 480/500 marks

ALL INDIA RANK 9th — 491 — MUTTATH ASHISH SIMON
ALL INDIA RANK 10th — 490 — MADALA SUHASINI

488 PRABHAT KUMAR	486 KALE ROHITH	486 RENUKA SUDHAKAR RAO	485 AADARSH KOHADE	484 GUNDU NAGA SAI NIHAR
484 RAVULAPALLI JUHI	483 KONA HARSHITH SAI	482 MEESALA JASWANTH	482 SHASHVAT R SHARMA	482 SAKET KUMAR
482 NIHAL RANJAN	482 SRIHARSHA MARAM	481 K. S. DURGA PRASAD	481 CH. L. ROSHITHA	481 MANAV MEHTA
480 K. V. KHUSHI	480 P. DYOTHAK SAI SIDDHARDH	480 T. MADHAVI	480 SARASWATI	480 G. LIKHIL

ALL INDIA LEVEL XII CLASS PCM TOPPERS
above 466/500 marks

480 — M. BHAVYA SRI
478 — MD. RAFIVULLA

477 D. V. SAI LOKESH REDDY	477 M. VENKATA CHARAN RAJ	477 K. VIGNESWAR REDDY	477 S. V. SUDARSH	476 M. MANU SRI
475 KATTA SAI DURGA PRASAD	475 P. THANUSRI	474 S. VINISHA	474 B. SAMYUKTHA	474 R. S. P. FANINDRA MAHARA
474 J. V. S. S. SATHISH REDDY	473 SAKET KUMAR	473 K. SOUMYA	473 B. MANEESHA	472 E. NIDHI
472 SRIMUKTHA LANKA	472 NANCY SINGH	472 B. DEEKSHITH	471 G. LIKHIL	471 G.V.N.M. CHINMAIE
471 KAUSTUBH V BANKAR	470 R. VAISHNAVI	470 Y. ISHA NAGA RATHNAIAH	470 B. KALYANI	470 K. SNEHA LATHA
470 ANURAG RANJAN	470 TEJAS RAJ K WASEKAR	468 T RAKESH KUMAR	467 T VIKRAM RATHOD	466 B P SAI MANIKANTA

ALL INDIA LEVEL XII CLASS PCB TOPPERS
above 465/500 marks

478 — INAPAKURTHI BHUMIKA
475 — AKHIL M THOMAS

474 CH. DHANUSH PRASAD	473 J. NISSIE ORANGE	471 P. NISHIGANDHA	471 M. JYOTHI	471 M. GEETHIKA
470 P. HEZEKI JONE	469 SWATI TAMMENENI	469 Y. MANIDEEP	469 TRIPURANENI MADHAVI	468 D. KSHAKHINAH GOLDY
468 K. S. HARSHINI YADAV	467 R. D. SAI SARANYA	465 L. RAGHAVENDRA	465 W. ANANYA NITIN	



A HOME AWAY FROM HOME


- 80 Acre lush green campus with 20 acre playground.
- AC Campus & the One and Only Campus.
- Highly Qualified Staff.
- 'SMART' Classrooms.
- IIT & Medical Foundation for VI to X Classes.
- Olympiads : NSO, NCO, IMO, IEO, NTSE, NSTSE, IRAO, YATT.
- Provision for... NCC - Army, Navy, & Air Wing with A & B Certification.
- Personal efforts for each Student.
- Students from 22 States.
- SEPARATE MUSIC Block.
- Spacious dining halls for Boys & Girls.
- Providing Roti at Dinner Every Day.
- A campus dairy farm with 500 Cows / Buffalos provide the School with fresh Milk & Dairy Products.
- Facilities for... Cricket, Basketball, Volleyball, Football, Handball, Chess, Badminton, Kabaddi, Table Tennis, Kho-Kho and etc.,
- Karate, Yoga, Boxing & Skating.
- A 200 meter running track.
- Expert Coaches.

ACTIVELY ENCOURAGE SPORTS



CONGRATULATION TO ALL THE STUDENTS FOR SECURING TOP MARKS... DUE TO LACK OF SPACE WE PRINT LIMITED STUDENTS.... MANY MORE TOPPERS... PLEASE CONTACT FRONT OFFICE.

JAYA GRAPHICS - 984 834 3105


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00 సంపుటి: 17 సంచిక: 1

SUNDAY Special ఆదివారం 24-3-2024



సన్‌రైజర్స్ పరాజయం

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ 4 పరుగుల తేడాతో కోల్‌కతా చేతిలో ఓటమిపాలైంది. కోల్‌కతా 208 పరుగులు చేయగా, హైదరాబాద్ 204 పరుగులకే పరిమితమైంది.

- వివరాలు 10లో



గర్భిణులు- వ్యాక్సిన్లు

ప్రతీ మహిళా గర్భం ధరించినప్పటి నుంచి కొన్ని వ్యాక్సిన్లు తీసుకోవాల్సి ఉంటుంది. వాటిపై అవగాహన కలిగించే ప్రత్యేక కథనం..

- ఫ్యామిలీలో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



త్వరలో వస్తా..

'ఏ జైలూ ఎక్కువ రోజులు బంధించలేదు. బయటికొచ్చి వాగ్దానాలను నెరవేరుస్తా' అని కేజ్రీవాల్ వీడియో సందేశమిచ్చారు.

వివరాలు 6లో ►



విరాళాలు లేకుండా కష్టం

'విరాళాలు తీసుకోకుండా ఏ పార్టీ మనుగడ సాగించలేదు. సుప్రీంకోర్టు ఎలక్టోరల్ బాండ్లపై సూచనలిస్తే బాగుండేది' అని గడ్కరీ అన్నారు.

వివరాలు 6లో ►



ఒకే ఒక్కరు..

100 మైళ్లు.. 60 గంటలు.. పరుగెత్తుతూనే ఉండాలి. ఈ మారథాన్‌లో పురుషులకు దీటుగా తొలిసారి ఓ అతివ గెలిచింది.

వివరాలు 6లో ►



కేట్ మిడిల్టన్‌కు క్యాన్సర్

బ్రిటన్ యువరాణి కేట్ మిడిల్టన్ క్యాన్సర్ బారిన పడ్డారు. కీమోథెరపీ చేయించుకుంటున్నట్లు ఆమె వెల్లడించారు.

వివరాలు 6లో ►

మత్తు బంధం ▸ బహిర్గతం

డ్రగ్స్ కుతంత్రం అంతా పచ్చ నేతలదే..

పాత్రధారి సంధ్యా ఆక్వా ఎండీ కోటయ్య చౌదరి..

సూత్రధారులు టీడీపీ నేతలే

- వ్యాపార, వ్యక్తిగత బంధం అంతా వారితోనే.. ఆధారాలతో అడ్డంగా దొరకడంతో చంద్రబాబు బెంబేలు
- ఫ్లెక్సీ చూపిస్తూ వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారానికి టీడీపీ కుట్ర
- బెడిసికొట్టిన పన్నాగం.. టీడీపీ నేతల్లో తీవ్ర ఆందోళన
- బాలకృష్ణ చిన్నల్లుడు భరత్‌కు కోటయ్య చౌదరితో సాన్నిహిత్యం
- ఆలపాటి రాజాతోనూ చౌదరి ఆర్థిక బంధం బట్టబయలు
- 2019లోనే సంధ్యా ఆక్వా దరఖాస్తును తిరస్కరించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్
- అప్పట్లో ఈ నిర్ణయంపై రచ్చ చేసిన టీడీపీ, ఎల్లో మీడియా

3 లో



విశాఖ పోర్టు.. ఏమిటో లోగుట్టు?

- డ్రైఈస్ట్‌ను ప్రకాశం యూనిట్‌కు పంపించేందుకు తీసుకొచ్చిన సంధ్యా ఆక్వా సంస్థ
- దగ్గరలో ఉన్న కట్టుపల్లి పోర్టును ఎందుకు ఎంపిక చేసుకోలేదు?
- దూరంలో ఉన్న వైజాగ్‌కు తేవడం వెనుక ఆంతర్యం ఏమిటి?

5లో

'మేత'వన్నె పులి

- 'సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్' ఆగడాలెన్నో
- గతంలోనే అప్పుడా కొరడా
- రొయ్యల మేతలో 'డ్రైడ్ ఈస్ట్' వాడకం తక్కువే.. దేశంలోనే ఉత్పత్తి కంపెనీలకు కొదవలేదు
- కొద్ది నెలల క్రితమే ఫీడ్ తయారీ ప్లాంట్ ఏర్పాటు.. ఉత్పత్తి సామర్థ్యం తక్కువే అయినా 25 టన్నులు దిగుమతి

3లో



సిటీ హాలు వద్ద మృతులకు నివాళులర్పిస్తున్న చిన్నారి

మాస్కోలో మారణహోమం

క్రాకస్ సిటీ హాల్‌లో కాల్పుల ఘటనలో 133కి చేరిన మృతుల సంఖ్య

- చావుబతుకుల్లో మరో 120 మంది..
- తమ పనేనన్న ఉగ్రవాద సంస్థ ఐసిస్
- ఉక్రెయిన్ హస్తం ఉందన్న రష్యా

రష్యా రాజధాని మాస్కోలోని క్రాకస్ సిటీ హాల్‌లో ముష్కరులు కాల్పులకు తెగబడ్డారు. శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న ఈ మారణహోమంలో మృతుల సంఖ్య శనివారం నాటికి 133కి చేరుకుంది. 120 మందికిపైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ప్రపంచ దేశాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి.

- వివరాలు 6లో

ఫ్యాక్ట్‌చెక్

బాబు పాలన గంజాయి ఖజానా

- ఏవోబీలో వేలాది ఎకరాల్లో దర్జాగా గంజాయి సాగు
- చంద్రబాబు కోటరీ ఆధ్వర్యంలోనే మాఫియా
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే దందాకు అడ్డుకట్ట
- సీఎం జగన్ పట్టుదలతో ప్రత్యేకంగా ఎస్‌ఈబీ ఏర్పాటు
- ఆపరేషన్ పరివర్తన్‌తో గంజాయి సాగు సమూలంగా ధ్వంసం
- ఏపీ ప్రభుత్వాన్ని ప్రశంసించిన కేంద్ర హోం శాఖ

- వివరాలు 3లో

డీలాపడే.. ఇళ్లపై రంకెలు

- 15 లక్షల పేదల ఇళ్లకు రిజి్రస్టేషన్లు చేయడం నిజంకాదా రామోజీ?
- పేదల ఇళ్ల రిజి్రస్టేషన్లలో చరిత్ర సృష్టించిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- జగనన్న కాలనీల్లో 22 లక్షల మంది ఇళ్లు కట్టుకుంటుండడం తెలీకపోతే ఎలా?
- 31 లక్షల ఇళ్ల స్థలాల్లో 7 లక్షల ఇళ్లకు గతంలోనే పొజిషన్ సర్టిఫికెట్లు
- ఎన్నికల కోడ్‌తో తాత్కాలికంగా రిజి్రస్టేషన్లు నిలుపుదల
- ఈసీ అనుమతితో త్వరలో మిగిలిన రిజి్రస్టేషన్లూ ప్రారంభం

- వివరాలు 9లో

షెల్ కంపెనీతో సీఎం రమేశ్ టోకరా

బోగస్ సబ్ కాంట్రాక్టుతో రూ.450 కోట్లు స్వాహా

సంతకాలు ఫోర్జరీ చేసి.. తప్పుడు జీపీఏ సృష్టించి ఘరానా మోసం



- ఉత్తరాఖండ్ వరకూ విస్తరించిన రిత్విక్ కంపెనీ అక్రమాలు
- బాధితులు సినీనటుడు వేణు, కేంద్ర మాజీమంత్రి కావూరి సాంబశివరావు కుమారుడు భాస్కర్
- పీసీఎల్ కంపెనీ ఫిర్యాదుతో హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు
- కీలక ఆధారాలు అందించిన బాధితులు
- ఉద్దేశపూర్వకంగా సంతకాలు ఫోర్జరీ చేసినట్లు ఫోరెన్సిక్ పరీక్షల్లో నిర్ధారణ

5 లో

ఎలుగుబంటి దాడిలో ఇద్దరు మృతి



జీడిమామిడి తోటలో పనిచేస్తున్న వారిపై ఓ ఎలుగుబంటి దాడి చేసింది. ఈ ఘటనలో ఇద్దరు రైతులు మరణించగా.. మరో మహిళ తీవ్రంగా గాయపడింది. దాడి చేసిన ఎలుగుబంటిని గ్రామస్తులు వెంటాడి హతమార్చారు. ఈ ఘటన శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం అనకాపల్లిలో జరిగింది.

- వివరాలు 12లో

టీడీపీలో ఆరని మంటలు

- టీడీపీలో టికెట్ల కేటాయింపుపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
- డబ్బున్నవారికే ప్రాధాన్యం ఇచ్చారని నేతల మండిపాటు
- కార్యకర్తల అభిప్రాయమే శిరోధార్యమంటున్న దేవినేని స్మిత
- మైలవరంలో వసంతను ఓడిస్తామంటున్న పార్టీ శ్రేణులు
- కాకినాడలో 'సానా'కు చుక్కెదురు
- ఏలూరు ఎంపీ టికెట్ గారపాటికి కేటాయించాలని డిమాండ్



అసంతృప్తి వ్యక్తం చేస్తున్న టీడీపీ పెనమలూరు నియోజకవర్గ నాయకురాలు దేవినేని స్మిత

సాక్షి నెట్‌వర్క్: టీడీపీలో టికెట్ల లొల్లి చల్లారేలా లేదు. రాష్ట్ర వ్యాప్తంగా అసమ్మతి జ్వాలలు చెలరేగుతున్నాయి. టికెట్ ఆశించి భంగపడినవారు ఒక్కొక్కరిగా రోడ్డెక్కుతున్నారు. పార్టీకి వ్యతిరేకంగా ర్యాలీలు, నిరసనలు చేస్తున్నారు. ఏళ్ల తరబడి పార్టీకోసం కష్టపడి పనిచేసిన వారిని కాదని డబ్బు మూటలతో వచ్చిన వారికి చంద్రబాబు ప్రాధాన్య మిస్తున్నారని దుమ్మెత్తిపోస్తున్నారు. ఇదే జరిగితే ఇండిపెండెంట్‌గానైనా బరిలోకి దిగుతామని పార్టీకి హెచ్చరికలు పంపుతున్నారు. ఏలూరు ఎంపీ అభ్యర్థిగా గారపాటి సీతారామాంజనేయ చౌదరికి టికెట్ కేటాయించాలని బీజేపీ జిల్లా నాయకులు కోరుతున్నారు.సంవత్సరాల తరబడి ఇక్కడ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న


మిగతా 9వ పేజీలో ►

అభ్యర్థులపై మళ్లీ సర్వే చేయిస్తా

- కూటమి అభ్యర్థుల వర్క్‌షాప్‌లో చంద్రబాబు

9 లో

ఇదంతే!



ఇలా డబ్బులు వేయగానే మరుక్షణం నుంచి మనమెలా చెబితే అలా చేస్తుంది.. వెరీ సింపుల్!!


SASI GROUP
VALUES WE LIVE...
VELIVENNU | RAJAHMUNDRY | TIRUPATI | BENGALURU
44 YEARS OF EXCELLENCE IN QUALITY EDUCATION
SASI EDUCATIONAL INSTITUTES VELIVENNU
95532 00007, 95428 50007
www.sasi.edu.in
B.VENUGOPALA KRISHNA
Founder Chairman
B.RADHA RANI
Founder Director
B.RAVI KUMAR
Chairman
B.LAXMI SUPRIYA
Vice Chairman
SSC 1 STATE MARK
POLYCET 1 STATE RANK
NEET 18 AIR GEN EWS
NEET 15 AIR OBC
APRJC 2 STATE RANK
B.PLAN 3 AIR
JEE ADV. 151 AIR GEN EWS
JEE MAIN 96 AIR GEN EWS
B.ARCH 5 AIR
2023 TOP RANKS
CBSE & STATE
ADMISSIONS OPEN
2024-25
DAY & RESIDENTIAL
GRAND ADMISSION DRIVE
MARCH 29th FRIDAY
Class 1 to 9 & Class 10+1 (M.P.C & Bi.P.C) CBSE & STATE
Syllabus with IIT-JEE MAIN, ADVANCED & NEET Coaching
SINGLE CAMPUS SENSATION
232 ENGG. - 2023 IIT, NIT, IIIT, GFTI & BITS SEATS
259 NEET - 2023 MBBS SEATS
SASI CELEBRATES
J SRI HARSHITH
99.92 PERCENTILE
ABOVE 99%ile 40 STUDENTS
JEE MAIN-2024 (SESSION-1)
CH PURANDHARA SATYA
99.91 PERCENTILE
VELIVENNU 08819-350007 95428 40007
TIRUPATI 0877-2223007 80963 00007
BENGALURU 70363 00007 70369 00007
RAJAHMUNDRY 0883-3520007 70365 00007
KANURU 08819-275151 95532 00007
MANDAPETA 95052 00007 95425 60007
NIDADAVOLE 96401 00007 85005 35599
NALLAJERLA 87591 55555 87592 55555
CHINTALAPUDI 95054 00007 95427 90007

మత్తు బంధం బహిర్గతం

డ్రగ్స్ కుతంత్రం అంతా పచ్చ నేతలదే • పాత్రధారి సంధ్యా ఆక్వా ఎండీ కోటయ్య చౌదరి • సూత్రధారులు టీడీపీ నేతలే..

కిలో కాదు.. రెండు కిలోలు కాదు.. ఏకంగా 25 వేల కిలోల డ్రై ఈస్ట్‌లో కలగలిసిన డ్రగ్స్ పట్టుబడిన వ్యవహారం చంద్రబాబు అండ్ గ్యాంగ్ వ్యాపార పునాదులను కదిలిస్తోంది. డ్రగ్స్ కంటైనర్ బ్రెజిల్ నుంచి నౌకలో బయలు దేరడం.. ఆ సమాచారం ఇంటర్‌పోల్ చెవిన పడటం.. వారు సీబీఐకి చేరవేయడం.. హుటాహుటిన సీబీఐ బృందం విశాఖ పోర్ట్‌కు రావడం .. ఆ కంటైనర్‌ను గుర్తించి సోదాలు, పరీక్షలు చేయడం.. అందులో కొకైన్ తదితర డ్రగ్స్ ఉన్నట్లు స్పష్టం కావడం.. అంతా సస్పెన్స్, థ్రిల్లర్ సినిమాను తలపించింది. ఇంత భారీ పరిమాణంలో డ్రగ్స్ పట్టుబడిన ఈ వ్యవహారంలో అన్ని వేళ్లూ చంద్రబాబు, ఆయన బంధుగణంపైనే చూపిస్తుండటం రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.

పచ్చ గ్యాంగ్ నాడు అలా.. నేడు ఇలా

భారీ డ్రగ్స్‌ను విశాఖ పోర్టుకు తీసుకువచ్చి అడ్డంగా దొరికిపోయిన సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది రోజులకే కొరడా ఝుళిపించింది. కాలుష్య నియంత్రణకు సంబంధించిన నిబంధనలు పాటించకుండానే కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్(సీఎఫ్‌ఈ) కోసం విజయవాడలోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ జోనల్ కార్యాలయానికి సంధ్యా ఆక్వా దరఖాస్తు చేసింది. దీనిపై విచారణ జరపగా ఆ కంపెనీ నిబంధనలేమీ పాటించలేదని తేలింది. దీంతో దరఖాస్తును తిరస్కరిస్తున్నట్లు 2019 సెప్టెంబర్ 18న ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఉత్తర్వులు జారీ చేస్తూ కంపెనీకి లిఖిత పూర్వకంగా తెలియజేసింది. నిజానికి అంతకు ముందు కూడా దరఖాస్తు చేయగా తిరస్కరించామని, ఇదే కంపెనీ అదే మళ్లీ అలానే దరఖాస్తు చేసినందున తిరస్కరిస్తున్నామని స్పష్టం చేసింది. సంధ్యా ఆక్వాలో నీరు, గాలి సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, వ్యర్థాలను శుద్ధి చేయడానికి తగినంత భూమి వారి వద్ద అందుబాటులో లేదని తెలిపింది. వ్యర్థాలను సమీపంలోని కాలువలో వదిలేస్తున్నట్లు తాము గుర్తించామని ఆర్డర్‌లో పేర్కొంది. ఈ నేపథ్యంలో పొల్యూషన్ బోర్డు అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణ, అభివృద్ధి పనులు చేపట్టకూడదని ఆదేశించింది. అప్పటికే ఏవైనా కార్యకలాపాలు ప్రారంభించి ఉంటే వెంటనే వాటన్నింటినీ నిలిపివేయాలని కూడా హెచ్చరించింది. దీనిని బట్టి సంధ్యా ఆక్వా అక్రమాలకు ఆదిలోనే అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించిందనేది సుస్పష్టం అవుతోంది. అలాంటప్పుడు ఇంతలా చర్యలు తీసుకున్న ప్రభుత్వంపై బురద జల్లడానికి పచ్చ గ్యాంగ్, పచ్చ మీడియా విఫలయత్నం చేస్తోంది. తమ సన్నిహిత సంస్థ అని ఆ రోజు భుజానకెత్తుకుని, ఈ ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం లేదంటూ రచ్చ చేసిన టీడీపీ, ఎల్లో మీడియా.. ఇప్పుడు డ్రగ్స్ కుంభకోణం బయట పడేసరికి ప్లేటు ఫిరాయించాలని చూస్తోంది. కానీ నిందితులంతా టీడీపీ పెద్దలకు అత్యంత ఆప్తులనే విషయం ఇప్పటికే ప్రజలకు అర్థమైంది.



2019 సెప్టెంబర్ 18న సంధ్యా ఆక్వాకు అనుమతులు నిరాకరిస్తూ కార్యకలాపాలు నిలిపివేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ జారీ చేసిన ఉత్తర్వులు

ఫ్లెక్సీ పట్టుకుని గోదారి ఈదాలన్నది టీడీపీ యత్నం

డ్రగ్స్ స్మగ్లింగ్ వ్యవహారంలో తమ వ్యవహారం బట్టబయలు కావడంతో దిక్కుతోచని స్థితిలో చంద్రబాబు తానేం చేస్తున్నారో గుర్తించలేకపోతున్నారు. అయోమయానికి గురై వైఎస్సార్‌సీపీపై నిరాధార ఆరోపణలు చేస్తూ తానే అడ్డంగా దొరికిపోతున్నారు. కూనం ప్రభాకర్ చౌదరి ఫొటోలు ఉన్న ఓ ఫ్లెక్సీని చూపిస్తూ వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం చేసేందుకు యత్నిస్తున్నారు. ఆయన ఈ ఏడాది సంక్రాంతి పండుగకు తమ స్వగ్రామం ప్రకాశం జిల్లాలోని ఈదుమూడి వెళ్లారు. ఆ సందర్భంగా పార్టీలకు అతీతంగా కుటుంబ వ్యవహారంగా ఆ గ్రామస్తులు వేసిన ఫ్లెక్సీలో కూనం ప్రభాకర్ చౌదరి ఫొటోలు వేశారు. అదేమీ వైఎస్సార్‌సీపీ రాజకీయ కార్యక్రమం కాదు.. ప్రభుత్వ కార్యక్రమం అంత కంటే కాదు. భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ ఆ గ్రామస్తులు రాజకీయాలతో నిమిత్తం లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ అది. అందులో ఎక్కడా వైఎస్సార్‌సీపీ పేరు కూడా లేదు. అయినా ఆ ఫ్లెక్సీలో ఫొటో ఉంది కాబట్టి కూనం ప్రభాకర్ చౌదరి వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తి అంటూ టీడీపీ దుష్ప్రచారం చేస్తుండటం విడ్డూరం. డ్రగ్స్ దందాలో నిండా మునిగిన చంద్రబాబు ఈ ఫ్లెక్సీ పట్టుకుని గోదారి ఈదాలన్నట్టుగా భావిస్తుండటం హాస్యాస్పదంగా మారిందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

సాక్షి, అమరావతి: విశాఖ డ్రగ్స్ దందాలో అడ్డంగా దొరికిన చంద్రబాబు–దగ్గుబాటి కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. బ్రెజిల్ నుంచి భారీ ఎత్తున డ్రగ్స్ దిగుమతి చేయించిన సంధ్యా ఆక్వా కంపెనీ కూనం కోటయ్య చౌదరి వెనుక ఉన్నది తమ కోటరీయేనని ఆధారాలతో సహా బట్టబయలు కావడంతో ప్రజల్ని మభ్యపెట్టేందుకు దుష్ప్రచార కుట్రకు పదును పెడుతున్నాయి. అందుకే వాస్తవాలను వక్రీకరిస్తూ తమ అనుకూల మీడియా, టీడీపీ సోషల్ మీడియా ద్వారా అవాస్తవాలను, అభూతకల్పనలను ప్రచారంలోకి తెస్తున్నాయి. కుక్కతోక పట్టుకుని గోదారి ఈదాలన్నట్టుగా.. ఫ్లెక్సీలను పట్టుకుని రాద్ధాంతం చేసేందుకు యత్నిస్తున్నాయి. ఆ సాకుతో కూనం వీరభద్ర చౌదరి, కోటయ్య చౌదరిలతో దగ్గుబాటి కుటుంబ వ్యాపార బంధాన్ని కప్పిపుచ్చేందుకు విఫలయత్నం చేస్తున్నాయి. సంధ్యా ఆక్వా కంపెనీతో టీడీపీ నేతల వ్యాపార లావాదేవీలు, బంధుత్వాలు, సన్నిహిత సంబంధాలు ఏమీ తెలీనట్లుగా ఓ వర్గం మీడియా నటిస్తోంది. కానీ కోటయ్య చౌదరి డ్రగ్స్ దందా చంద్రబాబు–దగ్గుబాటి కుటుంబాల మెడకు ఇప్పటికే చుట్టుకుందన్నది బహిరంగ రహస్యం. మసిపూసి మారేడుకాయ చేయాలన్న కుతంత్రాలు బెడిసి కొడుతుండటంతో చంద్రబాబు ఆత్మరక్షణలో పడిపోయారు.

అంతా చౌదరి కుటుంబమే..

డ్రగ్స్ దందాలో పాత్రధారులు కూనం కోటయ్య చౌదరి కుటుంబం కాగా, సూత్రధారులు అందరూ టీడీపీ, బీజేపీలోని టీడీపీ కోటరీ సభ్యులేనన్నది బట్టబయలైంది. బ్రెజిల్ నుంచి భారీ ఎత్తున డ్రగ్స్ దిగుమతి చేయించిన వ్యవహారంలో సంధ్యా ఆక్వా కంపెనీ చైర్మన్ కూనం వీరభద్ర చౌదరి, ఎండీ కోటయ్య చౌదరి ప్రధాన పాత్రధారులుగా ఉన్నారు. కాగా ఈ దందాకు ఆర్థిక, రాజకీయ అండదండలు అందించడం, డ్రగ్స్ భారత్‌కు చేరుకున్నాక మార్కెటింగ్ వ్యూహం అమలు సూత్రధారులు అందరూ టీడీపీ, బీజేపీలోని టీడీపీ కోటరీ నేతలే కావడం గమనార్హం. ముఖ్యంగా ఈ వ్యవహారంలో చంద్రబాబుకు అత్యంత సన్నిహితులు, దగ్గుబాటి పురందేశ్వరి కుటుంబ సభ్యుల వైపే వేళ్లన్నీ చూపుతున్నాయి. అసలు సంధ్యా ఆక్వా కంపెనీ ఏర్పాటులోనే దగ్గుబాటి పురందేశ్వరి కుటుంబం కీలక పాత్ర పోషించింది. ఆమె కుమారుడు దగ్గుబాటి చెంచురామ్, వియ్యంకుడు భాగస్వాములుగానే ఆ కంపెనీని స్థాపించారు. అనంతరం ఆ కంపెనీని మూడుగా విభజించి అంతర్జాతీయ స్థాయిలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. కాగా ఆ అంతర్జాతీయ స్థాయి వ్యాపారం వెనుక డ్రగ్స్ స్మగ్లింగ్ లోగుట్టు దాగుందన్నది తాజాగా సీబీఐ సోదాల్లో వెల్లడైంది. మరోవైపు చంద్రబాబుకు అత్యంత సన్నిహితులైన టీడీపీ ముఖ్య నేతలు, వారి వారసులతో సంధ్యా ఆక్వా కంపెనీ కోటయ్య చౌదరికి అత్యంత సన్నిహిత సంబంధాలు ఉండటం గమనార్హం. దామచర్ల సత్య (ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్ధన్ సోదరుడు), రాయపాటి జీవన్ (టీడీపీ మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు తమ్ముడు గోపాలకృష్ణ కుమారుడు), లావు శ్రీకృష్ణ దేవరాయలు (నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి)లతో ఓ కోటరీగా గూడుపుఠాణి నిర్వహించారన్నది వెలుగులోకి వచ్చింది. టీడీపీ అధినేత చంద్రబాబుకు దామచర్ల జనార్ధన్ అత్యంత సన్నిహితుడు కాగా, ఆయన సోదరుడు దామచర్ల సత్య ప్రస్తుతం లోకేశ్ కోటరీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆ పచ్చ ముఠా సభ్యులంతా తరచూ విదేశీ పర్యటనలు చేస్తారని.. ఆ ముసుగులో వ్యాపార వ్యవహారాలు సాగిస్తారని.. కలసి ఎంజాయ్ చేస్తారనే ఫొటోలు సోషల్ మీడియాలో రెండు రోజులుగా హల్‌చల్ చేస్తున్నాయి.

ఆలపాటి రాజాకూ లింకు

చంద్రబాబు గీచిన గీత జవదాటరనే పేరున్న ఆలపాటి రాజాకు సంధ్యా ఆక్వా కంపెనీ కూనం వీరభద్ర చౌదరి, కోటయ్య చౌదరీలతో ఆర్థిక బంధం ఉందని నిరూపించే పత్రాలు వెలుగులోకి వచ్చాయి. వారిద్దరూ కలసి ఎన్నో వ్యాపార లావాదేవీలు నిర్వహించినట్టు నిగ్గు తేలింది. విశాఖపట్నం ప్రధాన కేంద్రంగా రాష్ట్రంలోని ఇతర తీర ప్రాంతాల్లో తమ దందాను విస్తరించిన సంధ్యా ఆక్వా కంపెనీతో నందమూరి బాలకృష్ణ కుటుంబ సభ్యులకు సన్నిహిత సంబంధాలు ఉండటం గమనార్హం. బాలయ్య చిన్న అల్లుడు, నారా లోకేశ్ తోడల్లుడు, విశాఖపట్నం టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.భరత్ కుటుంబం విశాఖలో సంధ్యా ఆక్వా కంపెనీ ఎండీ కూనం కోటయ్య చౌదరికి పలు వ్యవహారాల్లో సహకారం అందించింది. భరత్ కుటుంబ సహకారంతోనే విశాఖపట్నంలో సంధ్యా ఆక్వా వ్యాపార కార్యకలాపాలు విస్తరించాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి కూడా భరత్ కుటుంబంతో మొదటి నుంచీ సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నది బహిరంగ రహస్యం. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆమె కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రిగా ఉన్న తరుణంలోనే భరత్ కుటుంబానికి చెందిన గీతం విద్యా సంస్థలకు డీమ్డ్ యూనివర్సిటీ హోదా లభించిందన్నది గమనార్హం. ఈ వాస్తవాలు, పరిణామాలన్నీ కూడా డ్రగ్స్ దందాలో పాత్రధారి అయిన సంధ్యా ఆక్వా కంపెనీతో చంద్రబాబు, పురందేశ్వరి కుటుంబాలు, కోటరీలకు సన్నిహిత సంబంధాలున్నాయని స్పష్టంచేస్తున్నాయి.

బాబు పాలన గంజాయి ఖజానా

చంద్రబాబు అక్రమాలను కడుపులో పెట్టుకుని దాచుకోవడంలో రామోజీ సిద్ధహస్తుడు. బాబు ఓటమి రామోజీ కళ్లముందు స్పష్టంగా కనిపిస్తుంటే...ఆ మనోవేదనలో చిత్తచాంచల్యపు రాతలతో జగన్ ప్రభుత్వంపై చెలరేగిపోతున్నారు. చంద్రబాబు పాలనలో గంజాయి దందాను సాక్షాత్తూ టీడీపీ నేతలే సాగించినా, ఆ సమయంలో ఏ రోజునా ఈ అక్రమాల గురించి రామోజీ రాయలేదు. నర్సీపట్నం కేంద్రంగా బాబుకు సన్నిహితులైన టీడీపీ నేతలు బరితెగించి, అంతర్ రాష్ట్ర సిండికేట్ నడిపారు. బాబు హయాంలో అక్రమాలను రాయడానికి రామోజీ లేని చత్వారాన్ని, బధిరత్వాన్ని అరువు తెచ్చుకుని, పెన్ను మూసుక్కూర్చున్నారు...వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గంజాయి దందాలపై ఉక్కు పాదం మోపుతోంది. అన్ని మార్గాల్లోనూ గంజాయి దందాలకు చెక్ పెట్టి, దాని ఆనవాళ్లు లేకుండా చేయాలని నిరంతరం దాడులు చేస్తుంటే ఆ నేరనిరోధ చర్యలు రామోజీకి నచ్చడం లేదు... పనిలో పనిగా గంజాయి సాగును అరికట్టే క్రమంలో సంస్కరణలు సైతం చేపట్టింది. ఆపరేషన్ పరివర్తన్ కింద గంజాయి సాగును ధ్వంసం చేయడంతోపాటు గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధిగా ఆపరేషన్ నవోదయం పథకాన్ని తీసుకొచ్చింది. ఇలా సంస్కరణలనే ఆయుధంగా చేసుకుని, గిరిజన జీవితాల్లో వెలుగురేఖలు నింపుతోంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే దందాకు అడ్డుకట్ట



గిరిజనులకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం

దశాబ్దాలుగా జీవనోపాధి లేక గంజాయి సాగుపై ఆధారపడుతున్న గిరిజనుల జీవితాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్త వెలుగులు తీసుకొచ్చింది. ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా వారిని ప్రోత్సహించింది. అందుకోసం రూ.144 కోట్లతో ఆపరేషన్ నవోదయం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. కాఫీ, రాగులు, జొన్నలు, రాజ్మా, మామిడి, కొబ్బరి, నిమ్మ, జీడి మామిడి, వేరుశెనగ, డ్రాగన్ ఫ్రూట్ తదితర పంటల సాగు చేపట్టేలా ప్రోత్సహించింది. ఇందులో భాగంగా ఉచితంగా విత్తనాలను సరఫరా చేయడంతో పాటు ఈ–క్రాపింగ్ ద్వారా అన్నిరకాల పథకాలను అందుబాటులోకి తెచ్చింది. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పిస్తూ ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలను పంపిణీ చేసింది.

సాక్షి, అమరావతి: రాబోయే ఎన్నికల్లో టీడీపీకి మరోసారి ఓటమి ఖాయమన్న స్పష్టమైన సంకేతాలు ఈనాడు రామోజీరావుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. హైదరాబాద్ శివారులోని ఫిల్మ్ సిటీ కొండపైన అక్రమంగా కట్టుకున్న కోటవంటి భవంతిలో నిద్రలేని రాత్రులు గడుపుతున్న రామోజీలో పైత్యం పరిపరి విధాలుగా ప్రకోపిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో గంజాయి దందా అంతర్జాతీయ స్థాయికి చేరుకుందని పిచ్చపిచ్చగా పచ్చ రాతలతో విరుచుకుపడుతున్నారు. ఏదో విధంగా రోజూ ఈనాడు పత్రిక నిండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దుష్ప్రచారం చేయందే రామోజీకి తిన్న ఆ కాస్త ముద్ద అరిగేలా అనిపించడం లేదు. ఆ పైత్యపు రాతలతో రామోజీ కడుపు మంట తీరుతుందేమోగానీ, అవాస్తవాలను వాస్తవం అంటూ ప్రజల్ని మోసం చేయలేరు. చంద్రబాబు హయాంలో విశృంఖలంగా నడిచిన గంజాయి మాఫియాను ఆంధ్రప్రదేశ్ ప్రజలు చూశారు... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గంజాయి సాగును ధ్వంసం చేసిన ఆపరేషన్ పరివర్తన్ విజయవంతం కావడాన్నీ గుర్తించారు. మీ ఒక్కరే వీటిని గుర్తించనట్లు నటిస్తున్నారు రామోజీ... మీ నిద్రలేమి సమస్యకు... కడుపు మంటకు ఏదైనా డాక్టర్‌ను సంప్రదిస్తే మంచిది.... కట్టుకథలతో ఈనాడు పత్రికను నింపేస్తే చిరిగేది మీ చాటేనని చెప్పేందుకే ఈ ఫ్యాక్ట్ చెక్...

చంద్రబాబు హయాంలోనే గంజాయి మాఫియా...

చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో గంజాయి మాఫియా రాజ్యమేలింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ... 2014లో విభజన అనంతరం 2019 వరకు టీడీపీ అధికారంలో ఉన్న కాలంలోనే రాష్ట్రంలో గంజాయి దందా యథేచ్ఛగా సాగింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ గంజాయి దందాకు ఏపీ కేంద్ర బిందువుగా మారింది. అంటే అదంతా టీడీపీ ప్రభుత్వ హయాంలోనే. చంద్రబాబుకు సన్నిహితులైన టీడీపీ కీలక నేతలు నర్సీపట్నం కేంద్రంగా అంతర్రాష్ట్రస్థాయిలో గంజాయి సిండికేట్‌ను నిర్వహించారు. ఏకంగా పోలీసు ఉన్నతాధికారుల అండతో ఉత్తరాంధ్రలో అరకు, **పాడేరు,** రంపచోడవరం నియోజకవర్గాల్లో **భారీ** ఎత్తున గంజాయి సాగు చేయించారు. 2014 తరువాత అప్పట్లో ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా పోలీసు ఉన్నతాధికారిగా నియమితుడైన టీడీపీ రాజ్యసభ సభ్యుడి సమీప బంధువే ఈ దందాకు **సూత్ర**ధారిగా వ్యవహరించారు. గంజాయి **సాగు కోసం** విశాఖ ఏజెన్సీలో ఓ వ్యవస్థను సృష్టించారు. సాగును ధ్వంసం చేస్తే గిరిజనులు మావోయిస్టులకు సన్నిహితమయ్యే ప్రమాదముందని ఓ కట్టుకథను అధికారికంగా తెరపైకి తెచ్చారు. ఆ సాకుతో సాగును చూసీచూడనట్టు వదిలేయాలని టీడీపీ ప్రభుత్వం అధికారికంగా విధాన నిర్ణయం తీసుకుంది. ఇదే అదనుగా టీడీపీ గంజాయి మాఫియా చెలరేగిపోయింది. వేలాది ఎకరాల్లో దర్జాగా సాగు చేస్తూ... నర్సీపట్నం గుండా అటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు, ఇటు చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి మీదుగా ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా స్మగ్లింగ్ చేస్తూ బరితెగించి మరీ అక్రమాలకు పాల్పడింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో గంజాయి మాఫియా ద్వారా చంద్రబాబు కోటరీ వేల కోట్ల రూపాయలు ఆర్జించింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే నవోదయం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో డ్రగ్స్ దందాను నిర్మూలించేందుకు విప్లవాత్మక విధాన నిర్ణయాలు తీసుకుంది. అందులో ప్రధానమైనది గంజాయి సాగును ధ్వంసం చేయడం. రాష్ట్రంలో దశాబ్దాలుగా వ్యవస్థీకృతమైన గంజాయి సాగును అడ్డుకోలేమని పలువురు అభిప్రాయపడినప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ససేమిరా అన్నారు. యువత భవిష్యత్‌ను నాశనం చేస్తున్న ఈ మత్తు పంటను తుదముట్టించాల్సిందేనని విస్పష్టంగా ప్రకటించారు. గంజాయి, అక్రమ మద్యం, నాటు సారా దందాను సమూలంగా తుడిచిపెట్టడానికి ప్రత్యేకంగా 'స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను ఏర్పాటు చేసి, ఈ బ్యూరోకు విస్తృత అధికారాలు కల్పించారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో **'సెబ్'** గంజాయి సాగును నిర్మూలించేం**దుకు** 'ఆపరేషన్ పరివర్తన్' కార్యక్ర**మా**న్ని రెండు దశల్లో విజయవంతంగా **పూ**ర్తి చేసింది. అందుకోసం గిరిజనుల్లో **చై**తన్యం కలిగించి వారి సహకారం **తీసు**కోవడం వ్యూహాత్మకంగా సత్ఫలి**తాలని**చ్చింది. గంజాయి సాగు వల్ల అన**ర్థాల గురిం**చి ప్రభుత్వం ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో విస్తృత అవగాహన కల్పించింది. పోలీసు, రెవెన్యూ, సెబ్, గ్రామ సచివాలయ అధికారులు, సిబ్బంది సమన్వయంతో చేపట్టిన అవగాహన కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. ఈ పంట సాగు నిర్మూలన కోసం ప్రత్యేక బృందాలను నియమించారు. శాటిలైట్ ఫొటోలతో ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంత్రాన్ని జియో మ్యాపింగ్ చేశారు. అనంతరం ప్రత్యేక యంత్రాలతో రెండు దశల్లో ఏకంగా 11,550 ఎకరాల్లో పంటను ధ్వంసం చేశారు. ఏకంగా 4.50 కోట్ల గంజాయి మొక్కలను తొలగించి దహనం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో గంజాయి సాగు లేనే లేదు. ఆ విషయాన్ని స్వయంగా కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ నిర్ధారించింది. ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి సాగును నిర్మూలించినప్పటికీ సరిహద్దు అవతల ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సాగు కొనసాగుతోంది. ఆ రాష్ట్రాల్లో పండించిన గంజాయిని ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగుతున్న అక్రమ రవాణానూ అడ్డుకునేందుకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. అందుకోసం ప్రత్యేకంగా అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, ఇతర చెక్ పోస్టులను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోంది. ఇప్పటివరకు 4.50 లక్షల కేజీల గంజాయి, 131 లీటర్ల ద్రవ రూప గంజాయిని స్వాధీనం చేసుకుంది. 13,210 మందిని అరెస్ట్ చేయడంతో పాటు 2,950 వాహనాలను జప్తు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ పరివర్తన్'కు జాతీయస్థాయిలో ప్రశంసలు లభించాయి. గంజాయి సాగును సమర్థంగా అడ్డుకున్న రాష్ట్రాల జాబితాలో ఏపీ మొదటిస్థానంలో నిలిచిందని కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో వెల్లడించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

'మేత'వన్నె పులి

'సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్' ఆగడాలెన్నో..

- గతంలోనే అప్పుడా కొరడా
- రొయ్యల మేతలో 'డ్రై ఈస్ట్' వాడకం తక్కువే
- దేశంలోనే ఉత్పత్తి కంపెనీలకు కొదవలేదు
- తక్కువ ధరకు వస్తుందనే విదేశాల నుంచి దిగుమతి
- ఎక్కువగా ఉపయోగించేది బేకరీ, ఆహార ఉత్పత్తుల్లోనే
- కొద్ది నెలల క్రితమే ఫీడ్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేసిన సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్
- ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం తక్కువే అయినా 25 టన్నులు దిగుమతి
- ఇంత పెద్దమొత్తంలో అవసరమేమిటో అర్థం కాని ప్రశ్న
- ఇది టీడీపీ, బీజేపీ సమేత డ్రగ్స్ కథా చిత్రమే!



కాకినాడ సమీపంలోని సంధ్యా ఆక్వా సంస్థ

సాక్షి, అమరావతి: డ్రై ఈస్ట్ మాటున రూ.వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను బ్రెజిల్ నుంచి సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్టు కంపెనీ పేరిట దిగుమతి చేసుకున్న ఘటన జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించింది. రొయ్యల మేత మాటున రూ.లక్షల కోట్ల డ్రగ్స్ దందా సాగిస్తూ 'మేత'వన్నె పులిగా 'సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్' ఖ్యాతిపొందింది. ఈ క్రమంలో అసలు డ్రై ఈస్ట్ అంటే ఏమిటి? ఎలా తయారవుతుంది.? ఏయే అవసరాల కోసం ఎంత మోతాదులో వినియోగిస్తారు. ఆక్వా ఫీడ్ తయారీలో నిజంగానే వాడతారా? ఫీడ్ తయారీలో ఈ సంస్థ ఎప్పుడు అడుగు పెట్టింది ? ప్లాంట్ సామర్థ్యం ఎంత ? ఎందుకు ఇంత పెద్ద మొత్తంలో ఆర్డర్ ఇవ్వాల్సి వచ్చింది? అనే అంశాలపై చర్చ జరుగుతోంది

90 శాతానికిపైగా ఆహార ఉత్పత్తుల తయారీలోనే

డ్రై ఈస్ట్ అనేది సజీవ సూక్ష్మజీవుల సమాహారం. ఇదొక ఇమినో బూస్టర్‌లా ఉపయోగపడుతుంది. శిలీంద్రాల జాతికి చెందిన దీని శాస్త్రీయ నామం సక్కరో మైసెస్. ప్రధానంగా యాక్టివ్ డ్రై ఈస్ట్, ఇన్‌స్టంట్ డ్రై ఈస్ట్, ఫాస్ట్ యాక్టింగ్ ఇన్‌స్టంట్ ఈస్ట్, బ్రెడ్ మెషిన్ ఈస్ట్ రకాలు అందుబాటులో ఉన్నాయి. ఎక్కువగా బేకరీ, ఆహార ఉత్పత్తుల తయారీలో వాటి ఆకృతి, రుచి, పెరుగుదలకు వాడుతుంటారు. ఆక్వా, పౌల్ట్రీ, యానిమల్ ఫీడ్ తయారీలోనూ కొద్దిగా వాడతారు. ఈస్ట్‌ను ఉత్పత్తి చేసే కంపెనీలు దేశీయంగా చాలా ఉన్నాయి. డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి లేకపోవడం, విదేశాలతో పోల్చుకుంటే ధర ఎక్కువగా ఉండడంతో మెజార్టీ ఆహార ఉత్పత్తుల తయారీదారులు విదేశాల నుంచే ఎక్కువగా దిగుమతి చేసుకుంటుంటారు. బ్రెజిల్, ఆస్ట్రేలియా, యూఎస్ఏ, చైనాలో ఎక్కువగా ఉత్పత్తి జరుగుతుంది. దేశీయంగా క్వాలిటీని బట్టి కిలో రూ.200 నుంచి రూ.480 వరకు ఉంటే, ఒక్క బ్రెజిల్‌లోనే కిలో రూ.70కు అందుబాటులో ఉంటుంది. కారణం ఇక్కడ ఎక్కువగా పండే బార్లీ నుంచి ఈస్ట్ ఉత్పత్తి చేసే కంపెనీలు ఎక్కువగా ఉండడమే. అందుకే ఒక్క బ్రెజిల్ నుంచి ఏటా 500 టన్నుల ఈస్ట్ మన దేశానికి దిగుమతి అవుతుంది. దిగుమతి అయ్యే డ్రై ఈస్ట్‌లో నూటికి 90 శాతానికి పైగా ఆహార ఉత్పత్తుల తయారీలోనే ఉపయోగిస్తారు. ఆక్వా, పౌల్ట్రీ, యానిమల్ ఫీడ్ తయారీలో వాడకం ఐదు శాతం లోపే ఉంటుందని చెబుతున్నారు. ఎక్కువగా ఫీడ్ సప్లిమెంట్ కోసం వాడతారు.

ఆక్వా సాగులోనూ హెక్టారుకు 5 గ్రాములకు మించి వాడరు

ఆక్వాసాగులో ఈస్ట్‌ను రైతులు ఉపయోగిస్తుంటారు. సాగుకు ముందు చెరువులను సిద్ధం చేసే సమయంలో వాటర్ ప్యూరిఫికేషన్ చేస్తారు. ఈ సమయంలో వరిపిండి, తవుడు, బెల్లం, నీరు కలిపిన ద్రావణంలో 1–2 గ్రాములు ఈస్ట్‌ను కలిపి 24 గంటలపాటు పులియబెట్టి ఆ తర్వాత చెరువులో కలుపుతారు. దీనివల్ల ఫైటో ప్లాంటన్ (వృక్ష సంబంధమైన ప్లవకం), జూ ప్లాంటన్ (జంతు సంబంధమైన ప్లవకం) తయారవు తుంది. వీటిని తినేందుకు రొయ్యలు ఎక్కువగా ఇష్టపడుతుంటాయి. ఇలా హెక్టార్‌కు ఐదు గ్రాములకు మించి వినియోగించరు. ఆ తర్వాత వ్యాధికారక క్రిములను తట్టుకొని మెరుగైన రోగనిరోధకశక్తిని పొందేందుకు, నీటి నాణ్యతను మెరుగుపర్చేందుకు ప్రో బయోటిక్స్‌గానూ వాడుతుంటారు. వీటి తయారీలో కూడా ఈస్ట్‌ను ఫీడ్ కంపెనీలు ఉపయోగిస్తుంటాయి. రొయ్యల మేత తయారు చేసే ఫీడ్ కంపెనీలు దేశీయంగా 16 ఉన్నాయి. వీటి ద్వారా ఏటా 14 లక్షల టన్నుల మేత ఉత్పత్తి జరుగుతుంది. ఒక్క అవంతి ఫీడ్ కంపెనీయే ఏటా 5–6 లక్షల టన్నులు ఉత్పత్తి చేస్తుంది. ఆ తర్వాత సీపీఎఫ్ కంపెనీ 2 లక్షల టన్నులు ఉత్పత్తి చేస్తుంటే, మిగిలిన కంపెనీలన్నీ ఏటా 50 వేల నుంచి లక్ష టన్నులలోపు ఉత్పత్తి చేస్తుంటాయి.


ఏకంగా 25 టన్నులెందుకు?

ఇక సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెట్ పేరిట అధికారికంగా పామర్రులో రెండు ప్రాసెసింగ్ యూనిట్లు ఉండగా, నెల్లూరులో బ్లాక్‌వాటర్ షల్ ఫిష్ హేచరీ ఉంది. రెండు నెలల క్రితం కాకినాడ జిల్లా మూలపేట వద్ద మరో ప్రాసెసింగ్ ప్లాంట్, వజ్రకూటం వద్ద ఏటా 60వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఆక్వా ఫీడ్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు ఒక్క కిలో కూడా మార్కెట్‌లోకి రాలేదు. కేజీ మేత తయారీ కోసం కేవలం 5 గ్రాములకు మించి డ్రై ఈస్ట్‌ను వాడరు. అంటే 25 టన్నుల డ్రై ఈస్ట్ ద్వారా కనీసం 5 లక్షల నుంచి 6 లక్షల టన్నుల మేత తయారు చేయొచ్చు. ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం ఏటా 60 వేల టన్నులు మాత్రమే. ఈ లెక్కన ఇంత పెద్ద ఎత్తున డ్రైడ్ ఈస్ట్ దిగుమతికి ఆర్డర్ ఇవ్వడం వెనుక చాలా గూడుపుఠాణి ఉందని అర్థమవుతోంది. టీడీపీ, బీజేపీ పెద్దల సహకారంతోనే డ్రై ఈస్ట్ పేరిట డ్రగ్స్‌ను దిగుమతి చేసుకుంటున్నారన్న ఆరోపణలకు బలం చేకూరుతోంది.

రైతులకు రూ.కోట్లలో బకాయిలు

మరోవైపు సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్ సంస్థ రోజుకు 80 టన్నుల నుంచి 150 టన్నుల రొయ్యలను ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి నెల్లూరు వరకు ఉన్న ఆక్వా రైతుల నుంచి కొనుగోలు చేస్తుంది. వీటిని ప్రాసెస్ చేసి అమెరికా, చైనాకు ఎగుమతి చేస్తుంది. గతంలో ఎక్స్‌పోర్ట్ కంపెనీలు చెప్పిందే ధర.. ఇచ్చిందే సొమ్ము అన్నట్టుగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అప్సడా చట్టం చేయడం, పైగా కౌంట్‌ల వారీగా ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ప్రాసెసింగ్ కంపెనీలు కొనుగోలు చేసేలా ప్రతి 15రోజుల కోసారి పర్యవేక్షిస్తుండడంతో కంపెనీల ఆటలు సాగడం లేదు. స్థానిక ఆక్వా రైతులను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈక్వెడార్ నుంచి 17 కంటైనర్లలో రొయ్యలను దిగుమతి చేసుకొని వాటిని ప్రాసెస్ చేసి తిరిగి అమెరికా, చైనాకు ఎగుమతి చేస్తున్నారని తెలియడంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కంపెనీని కొంతకాలం పాటు సీజ్ చేసింది. ఎగుమతులకూ బ్రేకు లేసింది. ఇటీవల కాలంలో ఈ సంస్థ రైతులకు రూ.కోట్లలో బకాయి పడింది. రొయ్యలు సరఫరా చేసినందుకు ఈ కంపెనీ తనకు రూ.50 లక్షలు చెల్లించాల్సి ఉందని భీమవరానికి చెందిన ఓ రైతు 'సాక్షి'కి తెలిపారు. ఈ విధంగా సుమారు రూ.10 కోట్లకు పైగా ఈ సంస్థ రైతులకు చెల్లించాల్సి ఉందని సమాచారం.

బకాయిలు చెల్లించేలా చూడాలి



సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్ కంపెనీ వ్యవహారం ఆది నుంచి వివాదాస్పదమే. ఈక్వెడార్ నుంచి దిగుమతి చేసుకున్న రొయ్యలను ప్రాసెస్ చేసి అమెరికాకు పంపుతున్న సమయంలో అప్సడా ఉక్కుపాదం మోపింది. చట్టపరంగా చర్యలు తీసుకుని కంపెనీని చాన్నాళ్లు మూసేసింది. ఇటీవల ప్రారంభించిన ఫీడ్ ప్లాంట్ తయారీకి ఎలాంటి అనుమతులూ లేవని చెబుతున్నారు. ఉత్పత్తిని పూర్తిస్థాయిలో ప్రారంభించని ఈ సంస్థకు ఇంతపెద్ద ఎత్తున డ్రై ఈస్ట్ దిగుమతి చేసుకోవల్సిన అవసరం ఏముంది? ఏదేమైనా ముందుగా రైతులకు చెల్లించాల్సిన బకాయిలు అణాపైసలతో సహా చెల్లించి తీరాల్సిందే. ఈ సంస్థను అడ్డంపెట్టుకుని డ్రై ఈస్ట్ మాటున డ్రగ్స్ రాకెట్ నడుపుతున్న టీడీపీ, బీజేపీ పెద్దలెవరో తెలియాలంటే సీబీఐ నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలి.

– వడ్డి రఘురాం, కో–వైస్ చైర్మన్, అప్సడా



లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకేగాని
లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంప లేదు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.చతుర్దశి ఉ.9.28 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** పుబ్బ ఉ.7.20 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** ప.3.20. నుండి 5.04 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.34 నుండి 5.22 వరకు, **అమృతఘడియలు:** రా.2.01 నుండి 3.45 వరకు, హోలీ పౌర్ణమి

సూర్యోదయం : 6.05
సూర్యాస్తమయం : 6.07
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

కపిల్ సిబల్ (ఎంపీ, న్యాయవాది)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

లోకానికి నాలుగు దిక్కులు ఉన్నట్లే లోకంలోని ప్రతి మనిషికీ నాలుగు దారులు ఉంటాయి. వెళుతున్న దారొకటి. వెళ్లాలనుకున్న దారొకటి. వెళ్లకూడదనుకునీ వెళుతున్న దారొకటి. వెళ్లాలనుకునీ వెళ్లలేకపోతున్న దారొకటి.

ఈ నాలుగూ కాకుండా ఐదో దారి కూడా ఒకటి ఉంది! ఏ దారి ఎటు వెళుతుందో తెలియని దారి!

"ఉన్నదే నాలుగు దారులైతే... ఐదో దారిని తెచ్చి, దానికి 'ఏ దారి ఎటు వెళుతుందో తెలియని దారి' అని పేరు పెడితే అదొక దారైపోతుందా?!" అని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ బేలా ఎం. త్రివేది వంటి న్యాయ కోవిదులు నన్నడగొచ్చు.

చట్టంలో లేనిదేదీ దారి తప్పి కోర్టు హాల్లోకి రాకూడదు జడ్జిలకు. ఒకవేళ నేను లాయర్‌ని కాకుండా జడ్జిని అయివుంటే... నేను కూడా... కేసు వాదిస్తున్న లాయర్‌ని అలాగే ప్రశ్నిస్తానా... "ఐదో దారి ఎక్కడిది! శాస్త్రంలో లేదే!" అని?

జడ్జిలు ఎప్పుడూ శాస్త్రాన్ని ఆశ్రయిస్తూ తీర్పులు చెబుతూ పోతుంటే శాస్త్రం శాస్త్రంలానే ఉండిపోతుంది. వ్యక్తి కన్నా శాస్త్రం గొప్పదే.



కానీ, శాస్త్రం ఎప్పటికీ నిలబడి ఉండాలంటే అప్పుడప్పుడూ శాస్త్రమూ వ్యక్తుల ఆశ్రయం పొందుతుండాలి. వ్యక్తులంటే న్యాయవాదులు.

వాదన... శాస్త్రంతో కలబడుతుంది.

వాదనే శాస్త్రాన్ని నిలబెడుతుంది.

కవితకు బెయిలు కేసులో శుక్రవారం నా వాదనల్ని నేను బలంగా వినిపిస్తున్నప్పుడు నన్నొట్టి బలహీనమైన భావోద్వేగ ప్రాణిగా చూసిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనంలోని జడ్జిలే... ఖన్నా, సుందరేశ్, త్రివేది.

"మైలార్డ్స్... నా క్లయింట్ కవితకు బెయిల్ ఇవ్వకపోవటం అన్నది సుప్రీంకోర్టు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడదు" అన్నాన్నేను.

కవితను అరెస్ట్ చేయటం నాకెందుకో సరిగా అనిపించటం లేదు. అందుకే ఆ మాట అన్నాను.

వారు నా వైపు జాలిగా చూశారు. గౌరవంగా చూశారు. లాజికల్‌గా చూశారు.

"మిస్టర్ సిబల్.. హృదయంతో ఆలోచించ కండి. హృదయం బెయిలుకు దారి ఇప్పించ లేదు."

"అండ్... మిస్టర్ సిబల్! మీ క్లయింట్ బెయిల్ కోసం మొదట ట్రయల్ కోర్టుకు వెళ్లాలి. తర్వాత హైకోర్టుకు, ఆ తర్వాతే సుప్రీం కోర్టు వరకు రావాలి. వేరే దారి లేదు."

"సీ... మిస్టర్ సిబల్, ప్రముఖులకు ప్రత్యే కంగా ప్రొసీజర్లు ఉండవన్న విషయం మీకు తెలియందా? బెయిలన్నది రావలసిన దారిలోనే రావాలి."

రాత్రంతా కలత కునుకు. ధర్మాసనం నన్ను కలగాపులగంగా మేల్కొలిపింది.

లేచి మెల్లిగా బాల్కనీలోకి వచ్చాను. కింద హైయిలీ దారి పలుచగా ఉంది. వెళుతున్న దారి, వెళ్లాలనుకున్న దారి, వెళ్లకూడదనుకునీ వెళుతున్న దారి, వెళ్లాలనుకునీ వెళ్లలేకపోతున్న దారి... ఈ నాలుగు దారులవాళ్లూ హైయిలీ దారిలో ఉండొచ్చు! అంటే... దారి ఒక్కటే. మనుషులే నాలుగు దారుల వాళ్లు.

మరి... ఏ దారి ఎటు వెళుతుందో తెలియని ఆ ఐదో రకం దారిలో నడిచే ఆ మనుషు లెవరు?

చేతిలో ఫోన్ రింగ్ అయింది.

కాంగ్రెస్ నుండి నేను బయటికి వచ్చిన దాదాపు రెండేళ్ల తర్వాత దారి తప్పి వచ్చిన తొలి కాల్ ఇది నాకు!

"సిబల్‌జీ! మీరూ వస్తారా?"

దారి తప్పిన మోదీ పాలనకు వ్యతిరేకంగా న్యాయ పోరాటం చేయటానికి మీరూ వస్తారా అని 'ఇండియా' కూటమి నుంచి పిలుపు!

ఏ దారి ఎటు వెళుతుందో తెలియని వారితో కలిసి అడుగులో అడుగు వేయటం కంటే... అనుకున్న దారిలో నడిచే మోదీకి ఒక్కడినై ఎదురు నిలవటం నయం కదా!

"మోదీకి వ్యతిరేకంగా కవిత కేసు వాదిస్తాను. కేజ్రీవాల్ కేసు వాదిస్తాను. రేపు రాఘవ్ చద్దాను అరెస్ట్ చేస్తే అతడి కేసూ వాదిస్తాను... నా దారిలో నన్ను నడవ నివ్వండి..." అని నవ్వుతూ చెప్పాను.

ఎవరీ కొత్త హవాలా కొలంబస్?



జనతంత్రం

వర్ధెల్లి మురళి



గత సంవత్సరం బ్రెజిల్ అధ్యక్షునిగా లూల డసిల్వా ఎన్నికయ్యారు. ఆయనకు ట్విట్టర్ వేదికగా వైసీపీ నాయకుడు విజయసాయిరెడ్డి అభినందనలు తెలియజేశారట! యెల్లో మీడియా ఎంతో కష్టపడి శోధించి ఈ విషయాన్ని కనిపెట్టింది. బ్రెజిల్ నుంచి విశాఖపట్నం కోటయ్య చౌదరి కంపెనీకి ఓ కంటెయినర్ పార్సెల్ వచ్చింది. ఇంటర్‌పోల్ సమాచారంతో ఆ కంటెయినర్‌ను తనిఖీ చేసిన సీబీఐ అధికారులు జరిపిన మాదక ద్రవ్యాల పరీక్షలో 'పాజిటివ్' ఫలితాలొచ్చాయి. ఆ విషయాన్ని వారు విడుదల చేసిన ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించారు.

కోటయ్య చౌదరి కంపెనీకి (సంధ్యా ఎక్స్‌పోర్ట్స్) రొయ్యలు, చేపలకు సంబంధించిన ఎగుమతుల వ్యాపారం ఉన్నది. రొయ్య విత్తనాన్ని పొదిగే హేచరీ కూడా ఉన్నది. త్వరలో రొయ్యల దాణాను తయారు చేసే మరో కేంద్రాన్ని కూడా తెరవబోతున్నారు. ఆ దాణా తయారీలో ఉపయోగించడానికి పొడి చేసిన యీస్ట్‌ను తెప్పించుకోవడానికి సంధ్య కంపెనీ బ్రెజిల్‌లో ఆర్డర్ పెట్టింది. ఈ పదార్థాన్ని చైనా నుంచీ, యూరప్ నుంచీ కూడా దిగుమతి చేసుకోవచ్చు. బ్రెజిల్‌తో పోలిస్తే దూరాభారం కూడా తక్కువ. కానీ బ్రెజిల్‌నే ఎంపిక చేసుకోవడం వెనుక ఆ కంపెనీకి తనదైన ప్రత్యేక కారణం ఉండవచ్చు.

'యీస్ట్' అనే మాటకు తెలుగు అర్థం కోసం వెతికితే మన నిఘంటువుల్లో సంతృప్తికరమైన సమాధానాలు దొరకలేదు. మధు శిలీంధ్రం, పులియబెట్టినది అనే అర్థాలున్నాయి. పూర్వం మన వంటిళ్లలో అన్నం వార్చే రోజుల్లో కలి, గంజి ఉండేవి. కలో గంజో తాగి బతకాలని సామెత. అందులోని కలిని యీస్ట్‌గా పరిగణిస్తాము. రకరకాల అవసరాలకు యీస్ట్‌ను ఉపయోగించడం తెలిసిందే. బ్రూవరీలు, వైనరీలు, బేకరీల్లో ప్రధానంగా వాడుతారు. ఆక్వా దాణా కోసం కూడా వాడుతారట. కోటయ్య చౌదరి కంపెనీ తెప్పించిన పొడి యీస్ట్ డబ్బాల్లో డ్రగ్స్ బయటపడ్డాయనే వార్త లోకానికి ఇంకా తెలియకముందే లోకేశ్‌బాబుకు తెలిసిపోయింది. 'ఎక్స్' వేదికగా ఆయన ఉలిక్కిపడ్డారు. వైజాగ్‌ను నాశనం చేసేందుకు వైసీపీ వాళ్లు తెప్పించారని ఆరోపణలు చేశారు. చినబాబు ఉలికిపాటు సరిపోలేదని చంద్రబాబు కూడా మరోసారి గట్టిగా ఉలిక్కిపడ్డారు.

తెల్లారి లేచేసరికి 'ఈనాడు' పత్రిక మరింత గట్టిగా ఉలిక్కిపడింది. దాంతోపాటు మిగతా యెల్లో మీడియా కూడా! ఈ డ్రగ్స్ సరఫరా వెనుక కచ్చితంగా వైసీపీ హస్తం ఉందని వారు ఏకగ్రీవంగా తీర్మానించి పారేశారు. నెమ్మదిగా అసలు విషయాలు బయటకు రావడం మొదలైంది. కోటయ్య కంపెనీ చుట్టూ అల్లుకున్న తెలుగుదేశం, బీజేపీ నేతల బాంధవ్యాలు బయటపడ్డాయి. సామాజిక బాంధవ్యాలే కాదు, వ్యాపార భాగస్వామ్యాలు కూడా వెల్లడి కావడం మొదలైంది. దాంతో మన యెల్లో మీడియా ఉలికిపాటులోంచి తత్తరపాటులోకి మారింది. ఆ తత్తరపాటులోంచి వచ్చిందే లూల డసిల్వాకు విజయసాయిరెడ్డి అభినందనలు చెప్పారనే మోకాలు – బోడిగుండు సంబంధిత ఆరోపణ.

విజయ సాయిరెడ్డి అభినందనలు ట్విట్టర్‌లో చెప్పారు కనుక కృతజ్ఞతగా బ్రెజిల్ అధ్యక్షుడు దగ్గరుండి డ్రగ్స్‌ను షిప్‌లో లోడ్ చేయించి ఉంటారని మన జనాల్ని నమ్మించాలనే వెధవాయిత్వం యెల్లో మీడియాలో కనిపించింది. సూర్యుడిపై ఉమ్మేయజూసే మూర్ఖత్వమంటే ఇదే! లూయిజ్ ఇనాసియో లూల డసిల్వా ఒక కార్మికోద్యమనేతగా తన ప్రజా జీవితాన్ని ఆరంభించిన వ్యక్తి. ఒకనాటి చిలీ అధ్యక్షుడు డాక్టర్ సాల్వెడార్ అలెండీ, వెనిజులా అధ్యక్షుడు హ్యూగో చావెజ్‌ల వరుసలోని లాటిన్ అమెరికా వామపక్ష యోధుడు. మొదటిసారి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు ఆయన అమలుచేసిన బొల్సా ఫామిలియా (పేద కుటుంబాలకు ఆర్థిక సాయం), ఫోమ్ జీరో (ఆకలి నిర్మూలన) పథకాలు కోట్లాది మంది బ్రెజిలియన్లను దారిద్ర్యం నుంచి విముక్తం చేశాయి. కోట్లాది పేద కుటుంబాల పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాయి.

అమెరికా ఖండంలో అగ్రరాజ్య ప్రయోజనాలకు కంట్లో నలుసుగా డసిల్వా మారాడు కనుక ఆయన అధికారం నుంచి దూరం కావలసి వచ్చింది. అవినీతి ఆరోపణలు మోపి మూడేళ్ల పాటు జైల్లో నిర్బంధించారు. ఆరోపణలన్నీ శుద్ధ అభాండాలేనని సుప్రీంకోర్టు తీర్పు చెప్పి ఆయన్ను జైలు నుంచి విడుదల చేసింది. తర్వాత జరిగిన ఎన్నికల్లో దేశాధ్యక్షునిగా మూడోసారి

కోటయ్య చౌదరి కంపెనీ తెప్పించిన పొడి యీస్ట్ డబ్బాల్లో డ్రగ్స్ బయటపడ్డాయనే వార్త లోకానికి ఇంకా తెలియకముందే లోకేశ్‌బాబుకు తెలిసిపోయింది. 'ఎక్స్' వేదికగా ఆయన ఉలిక్కిపడ్డారు. వైజాగ్‌ను నాశనం చేసేందుకు వైసీపీ వాళ్లు తెప్పించారని ఆరోపణలు చేశారు. చినబాబు ఉలికిపాటు సరిపోలేదని చంద్రబాబు కూడా మరోసారి గట్టిగా ఉలిక్కిపడ్డారు.

తెల్లారి లేచేసరికి 'ఈనాడు' పత్రిక మరింత గట్టిగా ఉలిక్కిపడింది. దాంతోపాటు మిగతా యెల్లో మీడియా కూడా! ఈ డ్రగ్స్ సరఫరా వెనుక కచ్చితంగా వైసీపీ హస్తం ఉందని వారు ఏకగ్రీవంగా తీర్మానించి పారేశారు. నెమ్మదిగా అసలు విషయాలు బయటకు రావడం మొదలైంది. కోటయ్య కంపెనీ చుట్టూ అల్లుకున్న తెలుగుదేశం, బీజేపీ నేతల బాంధవ్యాలు బయటపడ్డాయి. సామాజిక బాంధవ్యాలే కాదు, వ్యాపార భాగస్వామ్యాలు కూడా వెల్లడి కావడం మొదలైంది. దాంతో మన యెల్లో మీడియా ఉలికిపాటులోంచి తత్తరపాటులోకి మారింది. ఆ తత్తరపాటులోంచి వచ్చిందే లూల డసిల్వాకు విజయసాయిరెడ్డి అభినందనలు చెప్పారనే మోకాలు – బోడిగుండు సంబంధిత ఆరోపణ.

ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సకల దేశాధినేతలు, లక్షలాది మంది రాజకీయ ప్రముఖులు, కోట్లాదిమంది అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు. అందులో విజయ సాయిరెడ్డి ట్వీట్ ఒకటి. ఒక ప్రముఖ దేశానికి అధ్యక్షునిగా, జి–20 దేశాల కూటమికి ప్రస్తుత అధ్యక్షునిగా ఉన్న వ్యక్తిపైనే బురద చల్లడానికి వెనుకాడలేదంటే యెల్లో మీడియా బరితెగింపు ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

నారా అండ్ సన్స్‌తో పాటు యెల్లో మీడియా కూడా ఈ విషయంలో అతిగా స్పందించింది. రాజకీయ ప్రత్యర్థుల తలకు చుట్టడానికి వారు వేగిరపడ్డారు. సీబీఐ విచారణ పూర్తయ్యే వరకు ఎందుకు ఉగ్గబట్టలేకపోయారో తెలియదు. వారి తొందరపాటుకు తగినట్టుగానే కంపెనీ బాంధవ్యాలు, భాగస్వామ్యాలు తెలుగుదేశం కుటుంబాలనే వేలెత్తి చూపుతున్నాయి. విచారణ పూర్తయితే గానీ జరిగిందేమిటనే సంగతి నిర్ధారణ కాదు. అయితే కొత్త రాజకీయ పొత్తుల నేపథ్యంలో దర్యాప్తు సంస్థపై ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు ఉండవని విశ్వసించవచ్చునా అనే ప్రశ్న తలెత్తుతున్నది.

ఈ ప్రశ్నతో పాటు మరికొన్ని సందేహాలకు కూడా సమాధానాలు రావలసి ఉన్నది. దాణా ఉత్పత్తి ప్రారంభం కాకముందే సంధ్యా సంస్థ 25 వేల కిలోల యీస్ట్‌కు ఎందుకు ఇండెంట్ పెట్టింది? యీస్ట్ దిగుమతికి ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉండగా అది బ్రెజిల్‌నే ఎందుకు ఎంపిక చేసుకున్నది? బ్రెజిల్ నుంచి బయల్దేరిన ఓడ విశాఖ రావడానికి ఎక్కువ సమయం తీసుకున్నదన్న పాయింట్‌ను సీబీఐ ముందు కంపెనీ ప్రతినిధులు ఎందుకు నొక్కి చెబుతున్నారు? మధ్యలో తమకు తెలియకుండా ఎవరో ఈ డ్రగ్స్‌ను బాక్సుల్లో పెట్టి ఉంటారని బుకాయించడం కోసమా? అలా మధ్యలో దూర్చడం సాంకేతికంగా సాధ్యమవుతుందా? విచారణ తర్వాత డ్రగ్స్‌ను తెప్పించడం వెనుక బాధ్యత సంధ్య కంపెనీదే అని తేలితే ఆ కంపెనీ ఎందుకు ఆ పని చేసినట్టు? స్వయంగా డ్రగ్స్ వ్యాపారంలోకి దిగిందా? లేక ఎవరైనా కమీషన్ మీద ఈ పని అప్పగించారా?

రెగ్యులర్‌గా దిగుమతులు చేసుకునే కంపెనీలతో డ్రగ్స్ వ్యాపారులు కమీషన్ ఒప్పందాలు చేసుకునే అవకాశం ఉన్నది. కానీ, సంధ్యా కంపెనీ దాణా ఉత్పత్తిని ఇంకా ప్రారంభించనే లేదు. అటువంటి ఉత్పత్తిని ప్రారంభించే ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఆక్వా అథారిటీకి ఇప్పటి వరకు ఎటువంటి సమాచారం ఇవ్వనేలేదు. అప్పుడే యీస్ట్ దిగుమతికి ఎందుకు తొందరపడినట్టు? డ్రగ్స్ వ్యాపారంలో ఉన్న వారు కాకుండా మరేదో బలమైన శక్తి ప్రోద్బలం మేరకే ఈ కంపెనీ యీస్ట్ దిగుమతికి ఆర్డర్ చేసిందా? బ్రెజిల్ నుంచే దిగుమతి చేసుకోవాలని ఆ శక్తి నిర్దేశించిందా? తెలుగుదేశం, జనసేనలకు బీజేపీతో పొత్తు కుదురుతుందనే నమ్మకం కలిగిన తర్వాత బ్రెజిల్‌లో బయల్దేరిన ఓడ... పొత్తుకు తుదిరూపం వచ్చిన తర్వాతనే విశాఖ తీరం చేరుకోవడం కాకతాళీయమేనా?

డ్రగ్స్ సరఫరా, పంపిణీ వ్యాపారులతో ఒప్పందాలు చేసుకోవడం మనీ లాండరింగ్‌లో కొత్త పద్ధతిగా మారిందా? ఒకేసారి వందలు, వేలకోట్ల రూపాయలను చేతులు మార్చడంలో సంప్రదాయ హవాలా పద్ధతుల కన్నా ఇది మెరుగైన పద్ధతిగా భావిస్తున్నారా? ఎందుకంటే ఇండియాలో డ్రగ్స్ దందా టర్నోవర్ లక్ష కోట్లు దాటిందని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2022 జూన్ నుంచి 2023 జూలై 15 వరకు నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో, రాష్ట్రాల బృందాలు కలిసి సుమారు 12 వేల కోట్ల రూపాయల విలువైన మాదక ద్రవ్యాలను ధ్వంసం చేశాయి. ఇంతకు కనీసం పది రెట్లు ఎక్కువ వినిమయం దేశంలో ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద మొత్తంలో మనీ లాండరింగ్‌కు ఇదో మార్గంగా పరిగణిస్తూ ఉండవచ్చు. అయితే బలమైన నెట్‌వర్క్ కలిగి ఉన్నవారే ఈ పద్ధతిని అనుసరించే అవకాశం ఉన్నది.

బ్రెజిల్ సరిహద్దు దేశాల్లో కొలంబియా ఒకటి. ప్రపంచంలో అతిపెద్ద మాదక ద్రవ్యాల సరఫరా కేంద్రం ఆ దేశం. అయితే కొలంబియా నుంచి రవాణా అయ్యే సరుకుల కన్‌సైన్‌మెంట్లపై దాదాపు అన్ని దేశాల్లో నిఘా తీవ్రంగా ఉంటుంది. నఖశిఖ పర్యంతం పరిశీలిస్తారు. కనుక కొలంబియా డ్రగ్ లార్డ్స్ పక్క దేశాల నుంచి సరుకుల రవాణాలో డ్రగ్స్‌ను కలిపి పంపుతారు. లాటిన్ అమెరికాలో అతిపెద్ద దేశమైన బ్రెజిల్ సహజంగానే వారి ఫస్ట్ ఛాయిస్‌గా ఉంటుంది. అమెజాన్ అడవులు రెండు దేశాల

డ్రగ్స్ సరఫరా, పంపిణీ వ్యాపారులతో ఒప్పందాలు చేసుకోవడం మనీ లాండరింగ్‌లో కొత్త పద్ధతిగా మారిందా? ఒకేసారి వందలు, వేలకోట్ల రూపాయలను చేతులు మార్చడంలో సంప్రదాయ హవాలా పద్ధతుల కన్నా ఇది మెరుగైన పద్ధతిగా భావిస్తున్నారా? ఎందుకంటే ఇండియాలో డ్రగ్స్ దందా టర్నోవర్ లక్ష కోట్లు దాటిందని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2022 జూన్ నుంచి 2023 జూలై 15 వరకు నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో, రాష్ట్రాల బృందాలు కలిసి సుమారు 12 వేల కోట్ల రూపాయల విలువైన మాదక ద్రవ్యాలను ధ్వంసం చేశాయి. ఇంతకు కనీసం పది రెట్లు ఎక్కువ వినిమయం దేశంలో ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద మొత్తంలో మనీ లాండరింగ్‌కు ఇదో మార్గంగా పరిగణిస్తూ ఉండవచ్చు. అయితే బలమైన నెట్‌వర్క్ కలిగి ఉన్నవారే ఈ పద్ధతిని అనుసరించే అవకాశం ఉన్నది.

బ్రెజిల్ సరిహద్దు దేశాల్లో కొలంబియా ఒకటి. ప్రపంచంలో అతిపెద్ద మాదక ద్రవ్యాల సరఫరా కేంద్రం ఆ దేశం. అయితే కొలంబియా నుంచి రవాణా అయ్యే సరుకుల కన్‌సైన్‌మెంట్లపై దాదాపు అన్ని దేశాల్లో నిఘా తీవ్రంగా ఉంటుంది. నఖశిఖ పర్యంతం పరిశీలిస్తారు. కనుక కొలంబియా డ్రగ్ లార్డ్స్ పక్క దేశాల నుంచి సరుకుల రవాణాలో డ్రగ్స్‌ను కలిపి పంపుతారు. లాటిన్ అమెరికాలో అతిపెద్ద దేశమైన బ్రెజిల్ సహజంగానే వారి ఫస్ట్ ఛాయిస్‌గా ఉంటుంది. అమెజాన్ అడవులు రెండు దేశాల సరిహద్దులను కలిపేస్తుండటంతో డ్రగ్స్‌ను బ్రెజిల్ రేవుల దాకా చేర్చడం వారికి సులువు.

సరిహద్దులను కలిపేస్తుండటంతో డ్రగ్స్‌ను బ్రెజిల్ రేవుల దాకా చేర్చడం వారికి సులువు. అమెరికా, ఇండియాల మధ్య ప్రైవేట్ ఆర్థిక సంబంధాలు చాలా ఎక్కువ. విరాళాల దందాలూ ఎక్కువే. 'ఏపీ జన్మభూమి' పేరుతో తెలుగుదేశం అభిమానులు ఓ కొత్త సంస్థను ప్రారంభించి పెద్ద ఎత్తున విరాళాలు వసూలు చేయడం ఈ మధ్య వివాదాస్పదంగా మారింది. వసూలు చేసిన విరాళాలకు సరైన లెక్కలు లేవని విరాళాలిచ్చినవారు వాపోతున్నారు. ఇదేకాకుండా ఎన్నికల పేరుతోనూ విరాళాలు సేకరించడం ఇక్కడ మామూలే. టెక్సాస్ లోని హ్యూస్టన్ నగరం నుంచి కొలంబియా తీరం 1500 మైళ్ల దూరమే!

మనీలాండరింగ్ కోసం మాదక ద్రవ్యాల రూట్‌ను ఎంచుకోవడం నిజమేనని నిర్ధారణ అయితే దేశం ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవలసి ఉంటుంది. సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్టు కంపెనీ చెబుతున్న విషయాలు అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. జనవరి 14న బయల్దేరిన కంటెయినర్ చాలా ఆలస్యంగా చేరిందని కంపెనీ ప్రతినిధి కూనం హరికృష్ణ వివరణ ఇచ్చారు. అంటే మధ్యలో ఎవరో ఈ పనిచేసి ఉండొచ్చని బుకాయించడానికి వీలుగా ఆయన ఈ పాయింట్‌ను ముందుకు తోస్తున్నారు. సంధ్యా కంపెనీ బ్రెజిల్ సంస్థ నుంచి పొడి యీస్ట్‌ను ఖరీదు చేసింది. దాన్ని ఆ సంస్థ కంటైనర్‌లో పెట్టి, సీల్ వేసి ఓడలోకి ఎక్కిస్తుంది. ఈ కంటెయినర్ ఎన్ని దేశాలు తిరిగివచ్చినా ఎవరికీ కంటెయినర్ తెరిచే అవకాశం ఉండదు. ఎక్స్‌పోర్ట్ చేసిన కంపెనీ కంటెయినర్ సీల్ నెంబర్లను ఇంపోర్ట్ చేసుకునే కంపెనీకి పంపిస్తుంది. ఈ నెంబర్లు చూపెడితేనే ఇంపోర్ట్ చేసుకున్న కంపెనీ సరుకును క్లెయిమ్ చేసుకోగలుగుతుంది. ఇది ప్రొటోకాల్. అందుకే సీబీఐ వారు తమంత తాము కంటెయినర్‌ను తెరవలేదు. కంపెనీ ప్రతినిధులను పిలిపించుకొని వారి సమక్షంలోనే తెరిపించారు. కనుక మధ్యలో ఎవరో డ్రగ్స్‌ను సరుకులో కలిపేయడం అబద్ధం. అనుమానాస్పద శాంపుల్స్‌ను పరీక్షకు పంపించారు. అవి మాదకద్రవ్యాలుగా రుజువై బాధ్యులను శిక్షించగలిగితే పెనుప్రమాదాన్ని నివారించినట్లవుతుంది. రాజకీయ ఒత్తిళ్లు పైచేయి సాధిస్తే భవిత అంధకారమవుతుంది.

vardhelli1959@gmail.com

జీవ మనుగడకు జలం కీలకం

భూగర్భ జలాలు క్షీణించే దిశగా భారత్ వేగంగా పురోగమిస్తుందని ఐక్యరాజ్యసమితి నివేదిక హెచ్చరించింది. 'ఇంటర్ కనెక్టెడ్ డిజాస్టర్ రిస్క్ రిపోర్ట్ 2023' నివేదిక ప్రకారం, ప్రపంచంలోని 31 ప్రధాన జలాశయాల్లో 27 తిరిగి నింపగలిగే స్థాయి కంటే వేగంగా క్షీణిస్తున్నాయి. భారత దేశం భూగర్భజలాలు క్షీణ దశకు చేరుకున్నాయని 'యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎన్విరాన్మెంట్ అండ్ హ్యూమన్ సెక్యూరిటీ' (యూఎన్ఐ ఈహెచ్ఎస్) ప్రచురించిన కొత్త నివేదిక కూడా హెచ్చరించింది. ఇంటర్ కనెక్టెడ్ డిజాస్టర్ రిస్క్ రిపోర్ట్ –2023 నివేదిక ఆరు పర్యావరణ పాయింట్లను పరిశీలిస్తుంది. అవి 1. వేగవంతమయిన విలుప్తాలు 2. భూగర్భ జలాల క్షీణత. 3. పర్వత హిమానీనదం. 4 ద్రవీభవనం. 5. అంతరిక్ష శిథిలాలు 6. భరించలేని వేడి– బీమా చేయలేని భవిష్యత్తు.

నివేదిక ప్రకారం పంజాబ్‌లోని 78 శాతం బావులను అతిగా ఉపయోగించినట్లు పరిగణిస్తున్నారు. మొత్తం వాయవ్య ప్రాంతంలో 2025 నాటికి భూగర్భజలాల లభ్యత బాగా తగ్గిపోతుందని నివేదిక అంచనావేసింది. 'జలాశయాలు' అని పిలువబడే భూగర్భ జలాశయాలలో నిల్వ చేయబడిన ముఖ్యమయిన వనరు మంచినీరు. ఈ జలాశయాలు 200 కోట్లకు పైగా ప్రజలకు తాగునీటి సరఫరా చేస్తాయి. ఇందులో దాదాపు 70 శాతం వ్యవసాయం కోసం ఉపయోగిస్తారు. భూగర్భజలాలు వేలాది సంవత్సరాలుగా 'పునరుత్పాదక వనరుగా' ఉంటున్నాయి అని నివేదిక పేర్కొంది. కానీ ఇప్పటికే ఉన్న బావుల్లో నీటిని అందించగల స్థాయికంటే నిల్వలు కిందికి పడిపోతే విపత్తులు ప్రారంభమైనట్లే. వ్యవసాయానికి నీరు అందక ఆహార కొరత ఏర్పడుతుంది.

భూగర్భ జలాల క్షీణత అత్యంత తీవ్రంగా ఉన్న ప్రాంతాలలో భారతదేశం, ఈశాన్య చైనా, పశ్చిమ యునైటెడ్ స్టేట్స్, మెక్సికో, ఇరాక్, సౌదీ అరేబియా, ఉత్తర ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. ఎక్కువ నీరు అవసరమైన వరి,



గోధుమలను పండించడం వల్ల జలవనరులు తొందరగా అడుగంటుతున్నాయని నివేదిక తెలిపింది. గోధుమ, వరి పంటలకు భారత్ అధికంగా భూగర్భ జలాలను వినియోగిస్తోంది. పంజాబ్, హరియాణా రాష్ట్రాలు దేశం బియ్యం సరఫరాలో 60 శాతం, గోధుమల ఉత్పత్తిలో 85 శాతం ఉత్పత్తి చేస్తున్నాయి. అందుకే పంజాబ్‌లో 78 శాతం బావులు అతిగా వాడకానికి గురవుతున్నాయనేది నివేదిక సారాంశం.

'2023 అంచనా నివేదిక' ప్రకారం దేశం మొత్తం వార్షిక భూగర్భ జలాల రీచార్జ్ 4,49,087 బిలియన్ క్యూబిక్ మీటర్లుగా ఉంది. ఇది మునుపటి సంవత్సరంతో పోలిస్తే 11.48 బిలియన్ క్యూబిక్ మీటర్ల పెరుగుదలను సూచిస్తుంది. దేశం మొత్తం వార్షిక భూగర్భజలాల వెలికితీత 241.34 బిలియన్ క్యూబిక్ మీటర్లుగా ఉంది.

భూగర్భ జలాలు అడుగంటిపోతే తాగునీటి సమస్య మరింత పెరుగుతుంది. ఇప్పటికే ప్రపంచంలోని 220 కోట్ల మంది ప్రజలు సురక్షితమయిన నీరు అందుబాటులో లేకుండా జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2030 నాటికి ప్రతీ ఒక్కరికీ పరిశుభ్రమయిన నీటిని అందజేయాలని ఐక్యరాజ్యసమితి లక్ష్యం నిర్దేశిస్తోంది. భూగోళం మీద ఉన్న నీటిలో 97 శాతం ఉప్పు నీరే. తాగడానికి ఉపయోగపడే జలాలు కేవలం 1 శాతం మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అందులో 0.86 శాతం చెరువులు, 0.02 శాతం నదులలో, మిగతా 0.12 శాతం భూగర్భజలాల రూపంలో ఉంది. ఈ వనరులే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 760 కోట్ల మందికి పైగా ఆహారాన్నీ, ఇతర అవసరాలనూ తీరుస్తున్నాయి. '2050 నాటికి ఈ భూమ్మీద తాగడానికి పుష్కలమయిన జలం ఉండనే వుండదు. జనం స్నానాలు చేయడం మానేసి శరీరానికి లేపనాలు పూసుకోవలసి ఉంటుంది. సరిహద్దులో వుండాల్సిన సైన్యం నీటి వనరుల చుట్టూ కాపలా కాస్తుంది...' అంటూ దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్యానించారంటే పరిస్థితి ఎలా ఉంటుందో అంచనా వేయవచ్చు!

– ప్రొ॥ గనబోయిన మచ్చేందర్, జియాలజీ విభాగ అధిపతి, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, నల్లగొండ

ఇన్ బాక్స్

శాసనాధారాలను పరిశీలించాలి!

పవిత్ర గోదావరి సాగర సంగమం అంతర్వేది వద్ద వశిష్ఠుడు చేసిన యాగంలో ఉద్భవించిన పరమార(కాలు)' రాజవంశం, పల్నాటి సీమ నేలిన పల్లవ (పల్లి) రాజవంశం, ఆర్బుద (నేటి మౌంట్ అబూ) పర్వతం వద్ద ఉద్భవించిన అగ్నికుల క్షత్రియ తదితర రాజ వంశాలన్నిటికీ మూల పురుషుడు రుద్ర వన్నియ మహారాజు. ఆయన 'ఫాల్గుణ మాసం, ఉత్తరా నక్షత్రం రోజున' జన్మించాడు. పరిమళ కాళిదాసు రచించిన నవ– సాహసాంక–చరిత మొదట ఈ విషయాన్ని పేర్కొంటే... తర్వాత కాలంలో చాంద్ బర్దాయి రచన 'పృథ్వీరాజ్–రాసో' అగ్నికుల క్షత్రియుల ఆవిర్భావం గురించి మరింత వివరిస్తుంది. ఆయన జన్మించిన రోజునే అగ్ని(వన్ని)కుల క్షత్రియ జాతి ఆవిర్భావ దినోత్సవంగా నిర్వహించుకుంటారు.

కల్నల్ మెకంజీ భద్రపరచిన 'పల్లికులం – బల్లి చోడులు' కైఫీయత్ పల్లవ (పల్లి) కులం అగ్నికుల క్షత్రియుల ప్రాచీన చరిత్ర గురించి మరింత సమాచారాన్ని అందిస్తుంది. పల్లవ (పల్లి) కులం ప్రాచీన చరిత్రను పరిశీలించిన బ్రిటిష్ కాలంలో ఉమ్మడి మద్రాస్ ప్రెసిడెన్సీ ప్రభుత్వం జారీ చేసిన జీవో. నం. 271/13-06-1929, తెలుగు ప్రాంతాలలో నివసిస్తున్న పల్లి, వన్నియర్స్‌ను అగ్నికుల క్షత్రియులు అనీ, తమిళనాడు ప్రాంతాలలో నివసిస్తున్న పల్లి, వన్నియర్స్‌ను వన్నికుల క్షత్రియులు అనీ అధికారికంగా పేర్కొంది.

సంస్కృత పదమైన పల్లవకు పల్లి ప్రాకృత పదమని విదేశీ, స్వదేశీ చరిత్రకారులెందరో తమ పరిశోధనలలో ఆధారాలతో నిరూపించారు. కానీ, కొందరు కుహనా చరిత్రకారులు పల్లి అంటే అదేదో హేళనాపదంగా వక్రీకరిస్తుంటే... తమ జాతి మూలాలను తామే తెలుసుకోలేని నిస్సహాయ స్థితిలోకి అగ్ని (వన్ని) కుల క్షత్రియులు నెట్టివేయబడుతున్నారు. రుద్ర వన్నియ మహారాజు జయంతిని తమిళనాడులోని అగ్ని (వన్ని) కుల క్షత్రియులు నేటికీ ఘనంగా నిర్వహిస్తున్నారు.

తెలుగులో శాసనాలు వేయడం, మహాభారతాన్ని తెలుగులోకి అనువదింపజేయడం ద్వారా సామాన్యులకు సైతం తెలుగు భాషను చేరువ చేసిన అగ్నికుల క్షత్రియ చక్రవర్తుల చరిత్ర చిక్కటి చీకటి కోణంలో నిక్షిప్తమైపోయింది. శాసన ఆధారాలను పరిశీలించి వీరి చరిత్రను బయటకు తీయవలసి ఉంది.

– చింతా శ్రీకృష్ణ బాబు, ఇబ్రహీంపట్నం, కృష్ణా జిల్లా
(నేడు రుద్ర వన్నియ మహారాజు జయంతి: అగ్ని(వన్ని)కుల క్షత్రియ జాతి ఆవిర్భావ దినోత్సవం)

క్లుప్తంగా...

బీసీల సమగ్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

- అగ్నికుల క్షత్రియ జాతీయ అధ్యక్షుడు నాగిడి సాంబశివరావు



కంకిపాడు: అన్ని రంగాల్లోనూ బీసీలు అభివృద్ధి చెందాలంటే.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమని అగ్నికుల క్షత్రియ జాతీయ అధ్యక్షుడు నాగిడి సాంబశివరావు అన్నారు. తనను వైఎస్సార్ సీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించడంతో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్‌ను శనివారం కృష్ణాజిల్లా గంగూరులోని పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకుని ఘనంగా సన్మానించారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణ, మంత్రి జోగి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామన్నారు.

చేనేతలను గుర్తించని టీడీపీకి బుద్ధి చెప్పాలి

- జాతీయ చేనేత ఐక్య వేదిక



మంగళగిరి: రాష్ట్రంలో 40 లక్షలు జనాభా ఉన్న చేనేతలను గుర్తించకుండా అన్యాయం చేసి అవమానించిన టీడీపీకి రానున్న ఎన్నికల్లో చేనేతలంతా బుద్ధి చెప్పాలని జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ నారాయణ, ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ చేనేతలకు ఒక్క సీటు కూడా కేటాయించకుండా మోసం చేసిందన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ ఘోరపరాజయానికి చేనేతలంతా కృషి చేస్తారని చెప్పారు. మంగళగిరి సీటును వైఎస్సార్‌సీపీ చేనేత సామాజిక వర్గానికి చెందిన మురుగుడు లావణ్యకు కేటాయించిన నేపథ్యంలో ఆమె గెలుపునకు కృషి చేసి లోకేశ్‌ను ఓడించి తీరుతామన్నారు. మంగళగిరి, చీరాల సీట్లు కేటాయిస్తామని చెప్పి చేనేతలను టీడీపీ మోసం చేసిందన్నారు.

దేవినేని ఉమాపై కేసు నమోదు



చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించడమే కాకుండా ఎన్నికల నిబంధన నియమావళిని ఉల్లంఘించారని మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు దేవినేని ఉమామహేశ్వరరావుపై ఎన్నికల అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విజయవాడ కొత్తపేట సీఐ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మైలవరం నియోజకవర్గం పరిధిలోని జక్కంపూడి కాలనీలో శుక్రవారం సాయంత్రం దేవినేని ఉమా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నేతలు, అభిమానులు కాలనీలోని పోలీస్ అవుట్ పోస్టు నుంచి గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఒక రథం ఏర్పాటు చేసుకుని దానికి టీడీపీ, జనసేన జెండాలు కట్టుకుని పార్టీ ప్రచారం చేశారు. దీంతో సాధారణ ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. ఈ ర్యాలీ గురించి సమాచారం అందుకున్న మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్(ఎంసీసీ) పరిశీలన బృందం కాలనీకి వెళ్లగా, అప్పటికే ర్యాలీ ముగిసింది. దీంతో స్థానికుల నుంచి ఫొటోలు, వీడియోలను ఎంసీసీ సిబ్బంది సేకరించారు. అనుమతి లేకుండా దేవినేని ఉమా ర్యాలీ నిర్వహించడమే కాకుండా పార్టీ ప్రచారం చేసినందుకు కొత్తపేట పోలీసులకు ఎంసీసీ టీం ఫిర్యాదు చేయగా, సెక్షన్ 188, 143, రెడ్ విత్ 149 ఐపీసీ సెక్షన్‌ల కింద శనివారం కేసు నమోదు చేశారు.

కోడ్ అమల్లో ఉన్నా టీడీపీ నేతల తాయిలాలు



ప్రత్తిపాడు : గుంటూరు జిల్లా ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు ఓటర్లను, ముస్లిం మత పెద్దలను ప్రలోభపరిచేందుకు ఎన్నికల తాయిలాలు పంచుతున్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను, గుంటూరు రూరల్ మండలాల్లో ఉన్న మసీదులకు రంజాన్ తోఫా పేరుతో ముస్లిం మత పెద్దలకు నూతన వస్త్రాలు, డబ్బుల కవర్లను పంపారు. పంపిన వస్త్రాల బాక్సులపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ఫొటోలు ముద్రించి ఉన్నాయి. ఒక్కో కవర్లో ఐదు వేల వరకూ నగదు పెట్టినట్లు సమాచారం. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా నగదు కవర్లు, నూతన వస్త్రాలను నిర్భయంగా, యథేచ్ఛగా మత పెద్దలకు పంపిణీ చేస్తున్నారు. శుక్రవారం పెదనందిపాడు మసీదులో అందించారు.

తల్లి త్యాగాలను వెలకట్టలేం

పురుషుల కన్నా మహిళలే మానసికంగా దృఢమైనవారు



జస్టిస్ భట్టీ దంపతులను ఘనంగా సన్మానించిన హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రతినిధులు. చిత్రంలో సంఘం అధ్యక్షుడు జానకిరామిరెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ యర్రంరెడ్డి నాగిరెడ్డి తదితరులు

- నేనీస్థాయిలో ఉండటానికి తల్లి, సోదరి, భార్యే కారణం
- ఏపీకి చెందిన వాడిని కావడం వల్లే సుప్రీంకోర్టు జడ్జినయ్యా
- హైకోర్టులో సన్మాన కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భట్టీ
- మహిళా న్యాయమూర్తులు, సీనియర్ మహిళా న్యాయవాదులకు ఘన సన్మానం

సాక్షి, అమరావతి: పురుషులు కన్నా మహిళలు మానసికంగా దృఢవంతులని, తన బిడ్డలను ప్రయోజకులుగా చేసేందుకు తల్లి ఎన్నో త్యాగాలు చేస్తుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరసి వెంకట నారాయణ భట్టీ అన్నారు. తల్లి త్యాగాలను వేటితోనూ వెలకట్టలేమన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైకోర్టు న్యాయవాదుల సంఘం, మహిళా న్యాయవాదుల సమాఖ్య సంయుక్తంగా శనివారం హైకోర్టు మహిళా న్యాయమూర్తులను, మహిళా సీనియర్ న్యాయవాదులను సన్మానించింది. హైకోర్టులో జరిగిన ఈ కార్యక్రమానికి జస్టిస్ భట్టీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయిలతో కలిసి హైకోర్టు మహిళా న్యాయమూర్తులయిన జస్టిస్ బి.శ్రీభానుమతి, జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, ఉపలోకాయుక్త పి.రజనీరెడ్డి, సీనియర్ న్యాయవాదులు కేఎస్ విజయలక్ష్మి, ప్రేమలత, అచ్చెమ్మలను జస్టిస్ భట్టీ శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు బహూకరించారు. అనంతరం జస్టిస్ భట్టీ, ఆయన సతీమణి అనుపమలను హైకోర్టు న్యాయవాదుల సంఘం, మహిళా న్యాయవాదుల సమాఖ్య, ఇతర న్యాయవాదులు గజమాలతో, శాలువాలతో వేదమంత్రోచ్ఛరణ మధ్య ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. అలాగే హైకోర్టు ఉద్యోగుల సంఘం, న్యాయవాద పరిషత్ తదితర సంఘాలు కూడా జస్టిస్ భట్టీని సన్మానించాయి.

మదనపల్లి మాణిక్యం..

జస్టిస్ శేషసాయి మాట్లాడుతూ, జస్టిస్ భట్టీని 'మదనపల్లి మాణిక్యం'గా అభివర్ణించారు. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కుటుంబంలో తల్లి పాత్ర కీలకంగా మారిందన్నారు. విజయవాడ రామవరప్పాడు రైల్వేస్టేషన్ గతంలో అసాంఘిక శక్తులకు చిరునామాగా ఉండేదని, ఆ స్టేషన్ బాధ్యతలను మహిళలకు అప్పగించిన తరువాత దేశంలోనే అత్యుత్తమ స్టేషన్‌గా మారిందన్నారు. మహిళా శక్తికి ఇదో నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.జానకిరామిరెడ్డి, మహిళా న్యాయవాదుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షురాలు భాస్కరలక్ష్మి, అధ్యక్షురాలు కె.అరుణ, బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ యర్రంరెడ్డి నాగిరెడ్డి ప్రసంగించారు. హైకోర్టు న్యాయమూర్తులు, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు, రిజిస్ట్రార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమర్థత వల్లే జస్టిస్ భట్టీ సుప్రీంకోర్టు జడ్జి అయ్యారు

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ, వృత్తిపట్ల నిబద్ధత, నిజాయితీ, సమర్థత, కష్టపడేతత్వం వల్లే జస్టిస్ భట్టీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి కాగలిగారని తెలిపారు. మహిళలు ఎదుర్కొంటున్న అసమానత్వాన్ని రూపుమాపేందుకు నిర్మాణాత్మక చర్యలు అవసరమన్నారు. మహిళల రక్షణ కోసం రాజ్యాంగంలో పలు అధికరణలున్నాయని, అవి సమర్థవంతంగా అమలయ్యేందుకు న్యాయస్థానాలు ఎప్పటికప్పుడు ఉత్తర్వులిస్తున్నాయన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళలది కీలకపాత్ర

ఈ సందర్భంగా జస్టిస్ భట్టీ మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో మహిళలదే కీలక పాత్ర అని చెప్పారు. తాను ఈ రోజు ఈ స్థాయిలో ఉండటానికి తన తల్లి, సోదరి, భార్యే కారణమన్నారు. తన తల్లి ఇచ్చిన ధైర్యం, తన సోదరి ఇచ్చిన సలహాలు, తన సతీమణి ఇచ్చిన మద్దతు కారణంగానే తాను ఈ స్థాయిలో ఉన్నానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాడిని కావడం వల్లే తాను సుప్రీంకోర్టు న్యాయమూర్తిని అయ్యానని చెప్పారు. ఏపీ హైకోర్టుకు సదా రుణపడి ఉంటానని, ఎల్లవేళలా ఈ హైకోర్టుకు అండగా ఉంటానని చెప్పారు. ఉద్యోగాల పేరుతో అమాయక యువతులను మానవ అక్రమ రవాణా ఉచ్చులో దించుతున్నారని, ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు ప్రజలను చైతన్యపరిచే దిశగా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన మహిళా న్యాయవాదుల సమాఖ్య, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థలను కోరారు. ఇందుకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.

దుర్గమ్మ సేవలో సుప్రీం, పాట్నా హైకోర్టు న్యాయమూర్తులు

ఇంద్రకీలాద్రి/వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వెంకట నారాయణ భట్టీ, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి కుటుంబ సమేతంగా వేర్వేరుగా శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వీరికి ఈవో కేఎస్ రామారావు సాదరంగా స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. జస్టిస్ ఎస్.వెంకట నారాయణ భట్టీ, జస్టిస్ అనుపమ చక్రవర్తి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం పలుకగా, ఈవో అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టు వస్త్రాలను న్యాయమూర్తులకు అందజేశారు. ఆ తర్వాత ఇంద్రకీలాద్రిపై ఉన్న మల్లేశ్వర స్వామి వారిని జస్టిస్ ఎస్.వెంకట నారాయణ భట్టీ దర్శించుకుని అభిషేకాలు జరిపించుకున్నారు. అలాగే శని త్రయోదశిన పురస్కరించుకొని వెంకటనారాయణ భట్టీ శనీశ్వరాలయంలో పూజలు నిర్వహించారు.



జస్టిస్ వెంకటనారాయణ భట్టీకి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు



జస్టిస్ అనుపమ చక్రవర్తి దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

కృత్రిమ మేధ వృత్తికి దోహదం

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మధరావు



పెనమలూరు: కృత్రిమ మేధ వృత్తిలో దోహదపడుతుందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.మన్మధరావు తెలిపారు. కృష్ణాజిల్లా కానూరులోని వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ న్యాయ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ)పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మన్మధరావు మాట్లాడుతూ ఏఐతో ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ న్యాయ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ దివాకర్‌బాబు, కన్వీనర్ పర్వతనేని ప్రభాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టు.. ఏమిటో లోగుట్టు?

డ్రైఈస్ట్‌ను ప్రకాశం యూనిట్‌కు పంపించేందుకు తీసుకొచ్చిన సంధ్యా ఆక్వా సంస్థ



సాక్షి, విశాఖపట్నం : విశాఖలో బట్టబయలైన డ్రగ్స్ రాకెట్ కేసు.. రోజుకో మలుపు తిరుగుతోంది. విశాఖలో ఫీడ్ యూనిట్ లేకపోయినా.. ప్రకాశం జిల్లాకు తరలించేందుకు ఇక్కడికి డ్రై ఈస్ట్ తీసుకురావడంపై సీబీఐ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. కస్టమ్స్ విభాగంలో దిగువ స్థాయి సిబ్బంది కొందరు ఈ తరహా వ్యవహారాలకు సహకారం అందిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అందుకే.. దూరమైనా సరే కొందరు విశాఖ పోర్టును ఎంపిక చేసుకుంటున్నారన్న కోణంలోనూ సీబీఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. మరోవైపు.. డ్రై ఈస్ట్‌లోకి డ్రగ్స్ ఎలా వచ్చాయన్న అంశంపై సంధ్యా ఆక్వా సంస్థ యజమానుల్ని దర్యాప్తు బృందం శనివారం విచారించింది. 25 వేల కిలోల డ్రై ఈస్ట్‌లో కొకైన్, హెరాయిన్, ఓపియం, కొడైన్, మెథక్వెలాన్ మొదలైన డ్రగ్స్ అవశేషాలు బయట పడటంతో రాష్ట్రం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ వ్యవహారంలో సంధ్యా ఆక్వా పాత్ర, ఇంకా ఎవరెవరి పాత్ర ఎంత అన్నదానిపై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ ఆరా తీస్తుంటే.. అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. వాస్తవానికి సంధ్య ఆక్వా సంస్థకు విశాఖలో ఫీడ్ యూనిట్ లేదు. ప్రకాశంలో దీనికి సంబంధించిన యూనిట్ ఉంది. అంటే.. విశాఖకు వచ్చిన డ్రైఈస్ట్‌ని ప్రకాశం యూనిట్‌కు తరలించేందుకు సంధ్య ఆక్వా ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. అలాంటప్పుడు.. నౌకని నేరుగా విశాఖ పోర్టుకు కాకుండా కృష్ణపట్నం పోర్టుకు తరలించవచ్చు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కంటైనర్ హ్యాండ్లింగ్‌ని కృష్ణపట్నం పోర్టులో నిలిపివేశారు. తమిళనాడులోని కట్టుపల్లి పోర్టుని కంటైనర్ టెర్మినల్‌గా అభివృద్ధి చేస్తున్నారు. ఒకవేళ.. ప్రకాశంకు తరలించాల్సి వస్తే.. కట్టుపల్లికి ఈ నౌకని బెర్తింగ్ కోసం పర్మిషన్ పెట్టుకోవాలి. దీని వల్ల.. సమయం, వ్యయం కూడా సదరు సంస్థకు ఆదా అవుతుంది. కానీ.. విశాఖకు ఎందుకు తరలించారన్న విషయంపై సదరు సంస్థ స్పందించకపోవడంపై సీబీఐ అనేక అనుమానాల్ని వ్యక్తం చేస్తోంది.

పోర్టు సిబ్బంది సహకారంపై సీబీఐ కన్ను


విశాఖ కంటైనర్ టెర్మినల్‌లో కస్టమ్స్ వ్యవహారశైలిపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇంటర్ పోల్ సమాచారంతో సీబీఐ తనిఖీలు చేపట్టేందుకు ప్రయత్నించగా.. కస్టమ్స్ విభాగం వారు అడ్డుకున్నారని తెలుస్తోంది. తమ పరిధిలో హడావిడి చెయ్యడం తగదంటూ సీబీఐతో వాదోపవాదాలు జరిగినట్లు సమాచారం. ఉన్నతాధికారులు ఫోన్‌లో జోక్యం చేసుకోవడంతో.. డ్రగ్స్ వ్యవహారంపై సీబీఐ ముందుకు వెళ్లగలిగింది. దీనిపై సీబీఐ గుర్రుగా ఉంది. కస్టమ్స్ విభాగం వ్యవహారంపైనా సీబీఐ కన్నేసింది. కస్టమ్స్‌లో దిగువ స్థాయి సిబ్బంది కొంత మంది.. కంటైనర్స్ తీసుకొస్తున్న సంస్థలతో లాలూచీ పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ఆ కోణంలోనూ దర్యాప్తు చేపడుతోంది. ఇటీవల విశాఖలో 600కు పైగా ఈ–సిగరెట్ బాక్సుల్ని నగర పోలీసులు పట్టుకున్నారు. ఇవి కూడా కంటైనర్ ద్వారా విశాఖ చేరినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ–సిగరెట్స్‌ని భారత్‌లో నిషేధించారు. అలాంటప్పుడు విశాఖ ఎలా చేరాయని ఆరాతీస్తే.. కంటైనర్ టెర్మినల్‌లో కస్టమ్స్‌ని దాటుకొని నగరానికి వచ్చాయని తెలిసింది. ఇలా.. పలు అంశాల్లో కస్టమ్స్ విభాగానికి చెందిన కొందరు దిగువ స్థాయి సిబ్బందిని మేనేజ్ చేస్తూ.. ఈ తరహా నిషేధిత సరుకు బయటకి వచ్చేలా చేస్తున్నారనే విమర్శలు నిజమేనని ఇలాంటి ఘటనలు స్పష్టం చేస్తున్నాయి.

'సంధ్యా' యాజమాన్యంపై ప్రశ్నల వర్షం

తమ సంస్థ తీసుకొచ్చిన డ్రైఈస్ట్‌లో డ్రగ్స్ ఎలా వచ్చాయో తమకు తెలియదని సంధ్యా ఆక్వా సంస్థ చెబుతోంది. ఈ వ్యవహారంపై నిగ్గు తేల్చేందుకు సీబీఐ విచారణ వేగవంతం చేసింది. శనివారం కూడా మరికొన్ని బ్యాగుల్ని పరీక్షించగా.. 70 శాతం డ్రైఈస్ట్ బ్యాగుల్లో డ్రగ్స్ ఆనవాళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ తరుణంలో.. సంధ్యా ఆక్వా యాజమాన్యాన్ని సీబీఐ విచారిస్తోంది. శనివారం మధ్యాహ్నం నుంచి సంస్థ ఎండీ, డైరెక్టర్లను విచారించింది. ఎప్పటి నుంచి వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నారు.. బ్రెజిల్ నుంచి ఫీడ్‌ని ఎప్పుడు బుక్ చేశారు.. అక్కడి నుంచి తెప్పించుకోడానికి గల కారణాలేంటి.. విశాఖ పోర్ట్‌నే ఎందుకు ఎంచుకున్నారు.. ఇంత భారీగా తెప్పించుకున్న సరుకును నిర్ణీత వ్యవధిలో ఎలా విక్రయిస్తారు? తదితర విషయాలపై ప్రశ్నించినట్లు సమాచారం. ఆదివారం కూడా వారు మరోమారు విచారణకు హాజరు కావాలని సీబీఐ ఆదేశించిందని తెలిసింది.

షెల్ కంపెనీతో సీఎం రమేశ్ టోకరా..

బోగస్ సబ్ కాంట్రాక్టుతో రూ.450 కోట్లు స్వాహా



సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు, ఆయన నమ్మిన బంటు.. ఆ పార్టీ మాజీ ఎంపీ, ప్రస్తుతం బీజేపీలో టీడీపీ కోటరీకి నాయకుడు సీఎం రమేశ్ అక్రమాల బాగోతం మరొకటి బయటపడింది. ఫోర్జరీ సంతకాలు చేసి షెల్ కంపెనీ ముసుగులో ఏకంగా రూ.450 కోట్లు కొట్టేసిన వ్యవహారం ఆధారాలతో సహా వెలుగుచూసింది. సీఎం రమేశ్, ఆయన సన్నిహితుడు పి. నాగేశ్వరరావు పక్కా స్కెచ్‌తో పాల్పడిన ఈ ఘరానా మోసంపై హైదరాబాద్‌లో కేసు నమోదైంది. సంతకాలు ఫోర్జరీ చేసి రిత్విక్ స్వాతి అనే బోగస్ కంపెనీ పేరిట సబ్‌కాంట్రాక్టు ఒప్పంద పత్రాలు సృష్టించి మరీ ఈ మోసానికి తెగబడ్డారు. ఈ మేరకు ప్రముఖ సినీ నటుడు, పీసీఎల్ ఇంటర్‌టెక్ లెన్‌హైడ్రో కాన్సార్షియం జాయింట్ వెంచర్ ఆథరైజ్డ్ సిగ్నేచరీగా ఉన్న తొట్టెంపూడి వేణు, కేంద్ర మాజీమంత్రి కావూరి సాంబశివరావు కుమారుడు కావూరి భాస్కర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు గత ఏడాదే ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వారిపై ఐపీసీ సెక్షన్లు 420, 468, 471 కింద కేసు నమోదు చేశారు. ఫోర్జరీ సంతకాలతో సీఎం రమేశ్ పాల్పడిన ఈ మోసానికి సంబంధించిన మరిన్ని కీలక ఆధారాలను తొట్టెంపూడి వేణు, కావూరి భాస్కర్‌రావు హైదరాబాద్ పోలీసులకు శనివారం అందించారు. కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని కోరారు. ఈ ఘరానా మోసం వివరాలిలా ఉన్నాయి..

పీసీఎల్ కన్సార్షియంకు తెహ్రీ హైడ్రో ప్రాజెక్టు..

ఉత్తరాఖండ్‌లో తెహ్రీ హైడ్రో ప్రాజెక్టు వద్ద సివిల్ ప్రాజెక్టు కాంట్రాక్టును పీసీఎల్ ఇంటర్‌టెక్ కన్సార్షియం దక్కించుకుంది. ఈ మేరకు తెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీహెచ్‌డీసీ)తో 2002లో ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం ఆ ప్రాజెక్టు వ్యవహారాలను నిర్వహించేందుకు పీసీఎల్ కన్సార్షియం తమ ప్రతినిధిగా కావూరి భాస్కర్‌రావును జనరల్ పవర్ ఆఫ్ అటర్నీ (జీపీఏ) ద్వారా నియమించింది. కొంతకాలం ప్రాజెక్టు పనులు చేపట్టిన తరువాత పీసీఎల్ కన్సార్షియంకు టీహెచ్‌డీసీతో విభేదాలు తలెత్తాయి. దీంతో ఆ వ్యవహారం న్యాయస్థానం ఆర్బిట్రేషన్‌కే చేరింది. ఢిల్లీ కోర్టులో ప్రస్తుతం వ్యాజ్యం కొనసాగుతోంది. పీసీఎల్ కన్సార్షియంకు చెల్లించాల్సిన బిల్లుల మొత్తాన్ని టీహెచ్‌డీసీ న్యాయస్థానంలో డిపాజిట్ చేసింది.

ఫోర్జరీ సంతకాలతో సీఎం రమేశ్ మోసం..

ఇలా ఓ వైపు ఈ న్యాయ వివాదం కొనసాగుతుండగా.. సీఎం రమేశ్ గుట్టుచప్పుడు కాకుండా ఓ కథ నడిపించారు. పి. నాగేశ్వరరావు అనే వ్యక్తి తమ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని పీసీఎల్ కన్సార్షియం 2011లో గుర్తించింది. ఆ మేరకు ఆయన ఓ జీపీఏను కూడా సృష్టించారని తెలుసుకుని షాక్‌కు గురైంది. అంతేకాదు.. తమ కన్సార్షియం ప్రతినిధిగా చెప్పుకుంటూ ఆయన సీఎం రమేశ్‌కు చెందిన బోగస్ కంపెనీ రిత్విక్ స్వాతికి టీహెచ్‌డీపీ ప్రాజెక్టు సబ్ కాంట్రాక్టును ఇచ్చినట్లు పత్రాలు సృష్టించారు. వాటిని చూపిస్తూ టీహెచ్‌డీపీ ప్రాజెక్టు బిల్లులు పొందేందుకు సీఎం రమేశ్‌కు చెందిన రిత్విక్ స్వాతి కంపెనీ వ్యవహారం నడిపింది. పి. నాగేశ్వరరావు అనే వ్యక్తి కేవలం పరిమిత కాల జీపీఏతో పీసీఎల్ కన్సార్షియం ప్రతినిధిగా టీహెచ్‌డీపీ ప్రాజెక్టు పనులను పర్యవేక్షించారు. కానీ, ఆయన వ్యవహారశైలి నచ్చక ఆ జీపీఏ కాలపరిమితి ముగియగానే ఆయన్ని తొలగించారు. అయినాసరే.. తమ సంతకాలు ఫోర్జరీ చేసి మరోజీపీఏ సృష్టించుకోవడంతో పాటు.. సీఎం రమేశ్‌కు చెందిన బోగస్ కంపెనీ రిత్విక్ స్వాతితో తమ కంపెనీ పేరుతో సబ్ కాంట్రాక్టు ఒప్పందం చేసుకున్నట్లుగా పీసీఎల్ కన్సార్షియం గుర్తించింది. ఈ ఒప్పందంలో పి.నాగేశ్వరరావు తన చిరునామాలో ఆంధ్రప్రదేశ్‌లోని చిలకలూరిపేటను పేర్కొన్నారు. దీనిపై పీసీఎల్ కన్సార్షియం చిలకలూరిపేట పోలీసులను ఆశ్రయించగా ఆయన తప్పుడు చిరునామా ఇచ్చారని గుర్తించారు. అసలు చిరునామాను కూడా గుర్తించి వెల్లడించారు. షెల్ కంపెనీ ద్వారా నిధులు కొల్లగొట్టేందుకు ఉద్దేశించిన ఆ బోగస్ సబ్ కాంట్రాక్టు ఒప్పందం ద్వారా సీఎం రమేశ్, పి.నాగేశ్వరరావు ఈ మోసానికి పాల్పడ్డట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో పీసీఎల్ కన్సార్షియం ఈ విషయాన్ని ఈ–మెయిల్ ద్వారా టీహెచ్‌డీపీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందిందని టీహెచ్‌డీపీ ఉన్నతాధికారులు నిర్ధారించారు.

ఫోరెన్సిక్ పరీక్షల్లో ఫోర్జరీ నిర్ధారణ..

మరోవైపు.. ఆ సబ్ కాంట్రాక్టు ఒప్పంద పత్రాలను కావూరి భాస్కర్‌రావు ట్రూత్‌ల్యాబ్ అనే ప్రైవేటు సంస్థ ద్వారా ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించారు. పి. నాగేశ్వరరావు, రిత్విక్ స్వాతి కంపెనీ ఉద్దేశపూర్వకంగా సంతకాలు ఫోర్జరీ చేసినట్లు ఆ పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. ఈ అంశాన్ని పీసీఎల్ కన్సార్షియం ప్రతినిధులైన తొట్టెంపూడి వేణు, కావూరి భాస్కర్‌రావు హైదరాబాద్ పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం రమేశ్‌కు చెందిన రిత్విక్ స్వాతి కంపెనీ ప్రధాన కార్యాలయంలోనే ఫోర్జరీ సంతకాలతో బోగస్ సబ్ కాంట్రాక్టు ఒప్పందం చేసుకున్నారని తేలింది. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులకు గత ఏడాది నవంబరు 4న ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించి ఫోర్జరీ సంతకాల విషయాన్ని నిర్ధారించాలని కోరారు. తప్పుడు ఒప్పందంతో తమ కంపెనీని మోసం చేసిన సీఎం రమేశ్, పి. నాగేశ్వరరావులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీరి మోసానికి సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉండటంతో వారిపై హైదరాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ నేపథ్యంలో.. తొట్టెంపూడి వేణు, కావూరి భాస్కర్‌రావు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాసరెడ్డిని శనివారం కలిసి ఈ కేసు దర్యాప్తు వేగవంతం చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కేసుకు సంబంధించి తాము సేకరించిన మరిన్ని కీలక పత్రాలను కూడా పోలీసులకు అందించారు.

సీఎం రమేశ్ రూ.450 కోట్లు కొల్లగొట్టారు : కావూరి భాస్కర్‌రావు

'పీసీఎల్ జాయింట్ వెంచర్ కంపెనీకి సంబంధించి సీఎం రమేశ్ ఫోర్జరీకి పాల్పడ్డారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ఏసీపీ ఎదుట హాజరై వాంగ్మూలం ఇచ్చాను. దాదాపు అరగంట పాటు నా స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. ఈ ఫోర్జరీ ద్వారా సీఎం రమేశ్ దాదాపు రూ.450 కోట్లు స్వాహా చేశారు. దీనికి సంబంధించి కోర్టులోనూ ఓ కేసు నడుస్తోంది. సీఎం రమేశ్‌పై సీబీఐ దర్యాప్తు జరిగితే రూ.వేల కోట్ల స్కాంలకు సంబంధించిన విషయాలు బయటకొస్తాయి'.. అని కావూరి భాస్కర్‌రావు మీడియాకు చెప్పారు.

డ్రగ్స్ దిగుమతిదారులతో బాబుకు సంబంధాలు

అదే కంపెనీలో పురందేశ్వరి కుమారుడు పార్టనర్ • ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: విశాఖ పోర్టులో పట్టుబడిన డ్రగ్స్ విషయంలో దొంగే దొంగ అన్నట్లుగా చంద్రబాబు, బీజేపీ, జనసేన నేతల తీరు ఉందని, డ్రగ్స్ దిగుమతి చేసుకున్న కంపెనీ ప్రతినిధులతో చంద్రబాబుకు సంబంధాలున్నాయని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. అదే కంపెనీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కుమారుడు పార్ట్‌నర్‌గా ఉన్నారని తెలిపారు. అనంతపురంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. డ్రగ్స్ విషయంలో టీడీపీ నేతల బంధాలు, సంబంధాలు నేరుగా కన్పిస్తోంటే.. ఈనాడు మాత్రం పతాక శీర్షికన కథనాలు రాస్తూ వైఎస్సార్‌సీపీకి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. డ్రగ్స్ వ్యవహారంపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక మాధ్యమాలను అడ్డంపెట్టుకుని సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం శోచనీయమన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. టీడీపీ నేతలు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని అసత్య వార్తలు రాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

డ్రగ్స్ కేసులో పురందేశ్వరి కుమారుడున్నాడు: కేఏ పాల్

నల్లగొండ: విశాఖ డ్రగ్స్ దందాలో ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి కుమారుడు కూడా ఉన్నాడని ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ ఆరోపించారు. చంద్రబాబును, లోకేష్‌ను డిస్క్వాలిఫై చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పాల్ శనివారం నల్లగొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను పవన్ కళ్యాణ్‌లా ప్యాకేజీ స్టార్ ను కాదని వ్యాఖ్యానించారు. తప్పు చేసిన ఎవరినీ తాను వదలబోనన్నారు. మెగా కృష్ణారెడ్డి, మాజీ మంత్రి మల్లారెడ్డిలు అక్రమంగా సంపాదించింది ప్రజలకు పంచితే క్షమిస్తా.. లేదంటే శపిస్తానని అన్నారు. తాను గతంలో బీఆర్ఎస్, బీజేపీలను శపించానని, అవి భూస్థాపిత అయిపోయాయన్నారు.

మాస్కోలో మారణహోమం

క్రాకస్ హాల్ కాల్పుల్లో 133కు చేరిన మృతులు

- మరో 120 మంది చావుబతుకుల్లో
- తమ పనేనని ప్రకటించిన ఐసిస్(ఖోరసాన్)
- ఉక్రెయిన్ హస్తం ఉందన్న రష్యా
- 11 మంది అనుమానితుల అరెస్టు
- ఉక్రెయిన్‌కు పారిపోతూ పట్టుబడిన నలుగురు



మాస్కోలోని క్రాకస్ సిటీ హాల్ నుంచి ఎగసి పడుతున్న అగ్ని కీలలు

మాస్కో/న్యూఢిల్లీ: రష్యా రాజధాని మాస్కోలో క్రాకస్ సిటీ హాల్‌లో చోటుచేసుకున్న మారణహోమంలో మృతుల సంఖ్య శనివారం 133కు పెరిగింది. శుక్రవారం అర్ధరాత్రి సంగీత కచేరి జరుగుతుండగా ముష్కరులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి అమాయక ప్రజల ప్రాణాలను బలి తీసుకోవడం తెలిసిందే. ఈ దారుణంలో 120 మందికి పైగా గాయపడ్డారు. వారిలో చాలామంది తీవ్ర గాయాలతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి 11 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో నలుగురు దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్నారని రష్యా ఇన్వెస్టిగేటివ్ కమిటీ వెల్లడించింది. వారిని పారిపోతుండగా పశ్చిమ రష్యాలోని బ్రియాన్స్క్‌లో ఉక్రెయిన్ సరిహద్దు సమీపంలోనే బంధించినట్లు తెలిపింది. సరిహద్దు దాటి ఉక్రెయిన్ చేరాలన్న పన్నాగాన్ని భగ్నం చేసినట్లు స్పష్టం చేసింది. ఈ దాడికి పాల్పడింది తామేనని అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐసిస్(ఖోరసాన్) ప్రకటించిన సంగతి తెలిసిందే. రష్యా అధికారులు మాత్రం ఇది ముమ్మాటికీ ఉక్రెయిన్ ముష్కరుల పనేనని ఆరోపిస్తున్నారు. కాల్పులకు తెగబడింది ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులేనని అమెరికా నిఘా వర్గాలు ధ్రువీకరిస్తున్నాయి. తాజా పరిణామాలపై రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీసెస్ చీఫ్ శనివారం రష్యా అధినేత పుతిన్‌తో సమావేశమయ్యారు. అనుమానితుల అరెస్టు తదితరాల గురించి తెలియజేశారు. రష్యాలో ఇటీవల జరిగిన జాతీయ ఎన్నికల్లో పుతిన్ మరోసారి ఘన విజయం సాధించి ఆరేళ్లపాటు అధికారం దక్కించుకున్నారు. కొన్ని రోజులకే మాస్కోలో భీకర దాడి జరగడం, 133 మంది మరణించడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయంగా మారింది.

మోదీ దిగ్భ్రాంతి

మాస్కో ఘోరకలిపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ అమానుష దాడిని భారత్ ఖండిస్తోందని పేర్కొన్నారు. విపత్కర సమయంలో రష్యా ప్రజలకు అండగా ఉంటామంటూ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ఉక్రెయిన్‌కు సంబంధం ఉంది: పుతిన్

కాల్పుల ఘటనతో ఉక్రెయిన్‌కు సంబంధం ఉందని పుతిన్ ఆరోపించారు. దేశవ్యాప్తంగా భద్రతను పటిష్టం చేసినట్లు తెలిపారు. పట్టుబడిన దుండగుల్లో నలుగురు వ్యక్తులు ఈ దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్నారని చెప్పారు. కాల్పుల తర్వాత వారు ఉక్రెయిన్‌కు పారిపోయేందుకు ప్రయత్నించారని అన్నారు.

మా పని కాదు: ఉక్రెయిన్

రష్యా కాల్పులపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సలహాదారుడైన మైఖైలో పొడొలాయిక్ స్పందించారు. మాస్కో మారణహోమంతో తమకు సంబంధం లేదని తేల్చిచెప్పారు. ఉగ్రవాద పద్ధతులను పాటించే అలవాటు ఉక్రెయిన్‌కు లేదన్నారు.



క్రాకస్ హాల్‌లో సాయుధ దుండగులు



క్రాకస్ సిటీ హాల్‌లో కాల్పులు జరుపుతున్న దుండగులు

- కాల్పులు జరిగిన క్రాకస్ సిటీ హాల్ చాలా విశాలమైన కాంప్లెక్స్. ఇందులో మ్యూజిక్ హాల్‌తోపాటు షాపింగ్ సెంటర్ ఉంది.
- శుక్రవారం రాత్రి సంగీత కచేరి ప్రారంభం కావడానికి ముందు జనం సీట్లలో కూర్చున్నారు. మొత్తం 6,200 సీట్లూ నిండిపోయాయి.
- సంగీత కార్యక్రమం ప్రారంభం కాకముందే కాల్పుల మోత మొదలైనట్లు వీడియో ఫుటేజీని బట్టి తెలుస్తోంది.
- సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు ఆటోమేటిక్ రైఫిళ్లతో విరుచుకుపడ్డారు. ఉన్మాదుల్లాగా చెలరేగిపోయారు. జనంపై పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో గురిపెట్టి కాల్పులు జరిపారు. తూటా నుంచి రక్షణ కోసం పలువురు సీట్ల వెనుక దాక్కున్న దృశ్యాలు రికార్డయ్యాయి.
- అరుపులు కేకలతో గందరగోళం నెలకొంది. చాలామంది బయటకు పరుగులు తీసేందుకు ప్రయత్నించారు. తొక్కిసలాట జరిగింది. హాల్ కిక్కిరిసి ఉండడంతో తప్పించుకునే వీల్లేకుండా పోయింది. మృతుల సంఖ్య భారీగా పెరిగింది. లోపలంతా పొగ అలుముకుంది.
- ముష్కరులు గ్రెనేడ్లు, బాంబులు కూడా వేసినట్టు రష్యా మీడియా వెల్లడించింది. కాల్పులు, పేలుళ్ల ధాటికి హాల్‌లో మంటలు రేగాయి. పైకప్పు కూలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు.

పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చేశారు

సిరియాలో జోక్యం ముస్లింల అణచివేత

అందుకే రష్యాపై ఐసిస్ విద్వేషాగ్ని

రష్యా రాజధాని మాస్కోలో తాజాగా ఇస్లామిక్ స్టేట్ ఉగ్ర సంస్థ (ఐసిస్) చేసిన అమానవీయ దాడి ప్రపంచాన్ని నిర్ఘాంతపరిచింది. రష్యాపై దాడులు ఐసిస్‌కు కొత్తేమీ కాదు. కొన్నేళ్ల కింద రష్యా పౌరులే లక్ష్యంగా విమానాన్నే బాంబుతో పేల్చేసి 244 మందిని బలి తీసుకున్న చరిత్ర దానిది! కాబూల్‌లోని రష్యా రాయబార కార్యాలయంపైనా దాడులకు తెగబడింది. సిరియా అంతర్యుద్ధంలో తమకు వ్యతిరేకంగా పుతిన్ జోక్యం రష్యాపై ఐసిస్ ఆగ్రహానికి ప్రధాన కారణం. రష్యాలోని ముస్లింలు తీవ్ర అణచివేతకు గురవుతున్నారన్న వార్తలు దాని విద్వేషాన్ని మరింతగా పెంచి పోషించాయి. ఫలితంగా రష్యాకు, ఐసిస్‌కు మధ్య నెలకొన్న ఘర్షణ వాతావరణం నిత్యం నిప్పుల కుంపటి రాజేస్తూనే ఉంది...

అలా మొదలైంది...

ఐసిస్ అరాచకం 2015లో సిరియాలో అంతర్యుద్ధానికి దారితీసింది. ఐసిస్‌ను అణిచే ప్రయత్నాల్లో అధ్యక్షుడు బషీర్ అల్ అసద్‌కు పుతిన్ దన్నుగా నిలిచారు. దాంతో రష్యాపై ఐసిస్ తీవ్ర ద్వేషం పెంచుకుంది. మాస్కోలో తాజా మారణహోమానికి తెగబడింది ఐసిస్ ఖోరసాన్ (ఐసిస్–కె). ఇది అఫ్గానిస్తాన్‌లో ఐసిస్ అనుబంధ సంస్థ. 2022లో అఫ్గాన్ రాజధాని కాబూల్‌లోని రష్యా రాయబార కార్యాలయంపై ఆత్మాహుతి దాడి చేసి ఇద్దరు ఉద్యోగులతో పాటు ఎనిమిది మందిని పొట్టన పెట్టుకుంది ఐసిస్–కెనే. దీన్ని పాకిస్థానీ తాలిబాన్ ముఠా సభ్యులు 2015లో ప్రారంభించారు. అఫ్గాన్‌లో భద్రతా దళాలతో పాటు మంత్రులపై, మైనారిటీలపై వరుస దాడులతో ప్రాచుర్యంలోకి వచ్చింది. 2018కల్లా ప్రపంచంలోని నాలుగు అత్యంత ప్రమాదకరమైన ఉగ్ర సంస్థల్లో ఒకటిగా ఎదిగింది. ఉగ్ర శిక్షణ నిమిత్తం ఇరాక్, సిరియాల్లోని అగ్ర నాయకత్వం నుంచి కోట్లది డాలర్లు అందుకుంటూ వచ్చింది. తర్వాత అమెరికా సైన్యం, అఫ్గాన్ కమెండోలు, అఫ్గాన్ తాలిబన్ల ముప్పేట దాడితో ఐసిస్–కె ఆగడాలకు కళ్లెం పడింది. అమెరికా వైమానిక దాడులు దాని అగ్ర నాయకత్వాన్ని దాదాపుగా తుడిచిపెట్టేశాయి. 2021లో అమెరికా సైన్యం అఫ్గాన్ నుంచి వైదొలగడంతో ఐసిస్–కె మళ్లీ పుంజుకుంది. అదే ఏడాది కాబూల్ విమానాశ్రయంపై దాడి చేసి 13 మంది అమెరికా సైనికులతో పాటు ఏకంగా 170 మంది పౌరులను బలి తీసుకుంది. కొన్నేళ్లుగా అఫ్గాన్ ఆవల కూడా విస్తరిస్తోంది. గత జనవరిలో ఇరాన్‌లో దివంగత మేజర్ జనరల్ ఖాసీం సులేమానీ స్మారక ర్యాలీపై ఆత్మాహుతి దాడికి తెగబడి 84 మందిని పొట్టన పెట్టుకుంది. ఇస్తాంబుల్‌లో ఓ చర్చిపైనా దాడి చేసింది. పుతిన్‌ను, ఆయన విధానాలను ఐసిస్–కె తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తెగలపరంగా తమ ప్రబల శత్రువులైన తాలిబన్లతో పుతిన్ సాన్నిహిత్యం రష్యాపై విద్వేషాన్ని మరింత ఎగదోసింది. దీనికి తోడు రష్యాలో ముస్లింలపై అణచివేత పెరుగుతోందని ఆమ్నెస్టీతో పాటు పలు హక్కుల సంస్థలు ఆరోపిస్తున్నాయి. రష్యాలో ముస్లింలు 2 కోట్ల దాకా ఉంటారని అంచనా. మతపరమైన ప్రార్థనలు కూడా చేసుకోలేనంతగా వారిపై తీవ్ర అణచివేత చర్యలు కొనసాగుతున్నాయని, విద్య, ఉపాధి తదితరాల్లోనూ వివక్ష కొనసాగుతోందని వార్తలొస్తున్నాయి. ఉక్రెయిన్ నుంచి ఆక్రమించుకున్న క్రిమియాలో కూడా ముస్లింలపై రష్యా తీవ్ర ఆంక్షలు అమలు చేస్తోందని చెబుతున్నారు. ఇవన్నీ ఐసిస్–కెకు మరింత కంటగింపుగా మారాయి. హిజాబ్ ముస్లిం సంప్రదాయం కాదంటూ పుతిన్ చేసిన వ్యాఖ్యలు రష్యాపై దాని ద్వేషాన్ని మరింతగా పెంచాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఒకే ఒక్కరు!

- చరిత్రలో తొలిసారిగా ఓ మహిళ విజయకేతనం
- 100 మైళ్ల మారథాన్ రేసులో అరుదైన ఘనత సాధించిన జాస్మిన్ ప్యారిస్



మారథాన్ ఫినిషింగ్ లైన్‌ను తాకాక అక్కడే అలసి పడిపోయిన జాస్మిన్

100 మైళ్ల దూరం.. 60 గంటల వ్యవధి. మధ్యలో ఎవ్వరూ మనకు సాయపడరు. పరుగెత్తుతూనే ఉండాలి. ట్రెజర్ హంట్ తరహాలో అక్కడక్కడా ఉన్న పుస్తకాలను వెతికి పట్టుకుంటూ పరుగు ఆపకుండా గమ్యం దిశగా దూసుకెళ్లాల్సిందే. మారథాన్‌లో భాగంగా పార్క్ చుట్టూతా మొత్తంగా దాదాపు 60,000 అడుగుల ఎత్తును ఎక్కి దిగాలి. అలసటతో ఆగితే ఔటే ఇక. ధృఢ శరీరం మాత్రమే కాదు అంతకుమించిన మనో సంకల్పం తోడుంటేనే మారథాన్‌లో జయకేతనం ఎగరేయగలం. ప్రపంచంలోనే అత్యంత కఠోరమైన మారథాన్‌లలో ఒకటిగా పేరొందిన ప్రతిష్టాత్మక బాక్లీ మారథాన్స్‌లో పురుషులకు దీటుగా మొట్టమొదటిసారిగా ఒక అతివ ఈ రేసులో గెలిచి అబ్బురపరిచింది. అమెరికాలోని టెన్నిస్సీ రాష్ట్రంలోని ఫ్రెజెస్ హెడ్ స్టేట్ పార్క్ ఈ మారథాన్‌కు వేదికైంది. బ్రిటన్‌కు చెందిన జాస్మిన్ ప్యారిస్ అనే 40 ఏళ్ల వెటర్నరీ వైద్యురాలు ఈ ఫీట్ సాధించి చరిత్రలో నిలిచిపోయారు. 55 మైళ్లుగా ఉన్న మారథాన్‌ను 1989 సంవత్సరంలో 100 మైళ్లకు పెంచాక ఇన్నేళ్లలో నిర్ణీత గడువులోగా మారథాన్‌ను కేవలం 20 మంది మాత్రమే పూర్తిచేయగలిగారు. వీరిలో జాస్మిన్ ప్యారిస్ ఒక్కరే మహిళ కావడం విశేషం. మారథాన్‌ను 60 గంటల్లోపు పూర్తిచేయాల్సి ఉండగా ఇంకా 99 సెకన్లు ఉండగానే ఆమె విజయతీరాన్ని తాకారు. 59 గంటల 58 నిమిషాల 21 సెకన్లలో జాస్మిన్ ఈ రేసును శుక్రవారం పూర్తిచేశారు. రాత్రంతా సరైన దారీతెన్నూ లేకున్నా ముళ్లు, పొదల గుండా పరుగెడుతూ ఫినిషింగ్ లైన్‌ను చేరుకున్న జాస్మిన్‌ను వేలాది మంది ఔత్సాహికులు తమ హర్షధ్వానాలతో ఉత్సాహపరిచారు. ఈ సంవత్సరం 20 మంది బరిలో దిగగా జాస్మిన్‌తో కలిపి మొత్తంగా కేవలం ఐదుగురే మారథాన్‌ను పూర్తిచేయగలిగారు. ' ఈ రేసు ఉత్సాహం, ఆందోళనల కలబోత. దాదాపు అసాధ్యమైన రేసు అని తెలుసు. ఆ అసాధ్యమనే భావనే నన్ను ఈ రేసులో పరుగెత్తేలా చేసింది' అని జాస్మిన్ అన్నారు. అథ్లెట్ గాయాలపాలైనా మధ్యలో ఎవరూ ఎలాంటి సాయం చేయరు. ఫోన్లు ఉండవు, జీపీఎస్ ట్రాకింగ్ ఉండదు. ఎలాంటి నావిగేషన్ వ్యవస్థలు ఉండవు. రెండు చోట్ల మాత్రం తాగు నీరు సదుపాయం ఉంటుంది. ఇద్దరు పిల్లల తల్లి అయిన జాస్మిన్ వృత్తిరీత్యా పశువైద్యురాలు. బ్రిటన్‌లోని మిడ్లోటియన్‌లో ఉండే జాస్మిన్ వైద్యవృత్తిని కొనసాగిస్తూనే ఎడిన్‌బర్గ్‌లో పరిశోధనా శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. ఆఫ్రికన్–అమెరికన్ పౌరహక్కుల ఉద్యమకారుడు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హత్యకేసులో దోషి అయిన జేమ్స్ ఎర్ల్ రే అనే ఖైదీ 1977 ఏడాదిలో అమెరికా జైలు నుంచి పారిపోతూ ఆగకుండా 12 మైళ్లు పరుగెత్తిన ఘటన నుంచి స్ఫూర్తి పొంది ఈ మారథాన్‌ను గ్యారీ క్యాంట్రెల్, కార్ల్ హెన్‌లు 1986లో ప్రారంభించారు.

కేట్ మిడిల్టన్‌కు క్యాన్సర్

కీమోథెరపీ చేయించుకుంటున్నట్లు వెల్లడించిన కేట్



లండన్: బ్రిటన్ యువరాణి కేట్ మిడిల్టన్ (42) క్యాన్సర్ బారిన పడ్డారు. ఈ విషయాన్ని ఆమే స్వయంగా వెల్లడించారు. పొత్తికడుపు ఆపరేషన్ తర్వాత జనవరి నుంచి మీడియా ముందుకు రాని మిడిల్టన్ ఆరోగ్య పరిస్థితిపై పుకార్లు షికార్లు చేస్తుండటం తెలిసిందే. క్యాన్సర్‌కు కీమోథెరపీ చేయించుకుంటున్నట్లు కేట్ శుక్రవారం ఒక వీడియో ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె ఏప్రిల్ దాకా విధులకు దూరంగా ఉండనున్నారు. బ్రిటన్ రాజు చార్లెస్–3 కూడా ప్రొస్టేట్ క్యాన్సర్ బారిన పడటం తెలిసిందే.

అమెరికాలో నరమాంస భక్షకుడు!

మనిషి కాలు తింటూ రోడ్లపై కలకలం

వాషింగ్టన్: అమెరికాలోని కాలిఫోర్నియాలో ఓ వ్యక్తి తెగిపోయిన మనిషి కాలు చేతబట్టుకుని రోడ్డుపై తిరుగుతూ కలకలం రేపాడు. దీనికి సంబంధించిన వీడియో శుక్రవారం సోషల్ మీడియాలో వైరలైంది. అందులో కాలిని అటూ ఇటూ ఊపుతూ, వీడియో తీస్తున్న వ్యక్తివైపు చూస్తూ ఉన్మాదిలా విరగబడి నవ్వుతూ కన్పించాడతను. అప్పుడప్పుడు దాన్ని వాసన చూస్తూ, నోట్లో పెట్టుకుంటూ అందరినీ భయభ్రాంతులను చేశాడు. 'దేవుడా! అతడా కాలిని తినేస్తున్నాడు' అంటూ నేపథ్యంలో కొందరు హాహాకారాలు చేయడం కూడా వీడియోలో విన్పించింది. పట్టాలు దాటబోతూ రైలు ఢీకొని మరణించిన మహిళ తాలూకు తెగిపడిన కాలిని అలా చేతపట్టుకుని తిరిగినట్టు స్థానిక మీడియా వివరించింది. విషయం తెలిసి పోలీసులొచ్చినా అతను ఏమాత్రమూ బెదరకుండా కులాసాగా కన్పించాడు. అతన్ని 27 ఏళ్ల రెసెండో టెలెజ్‌గా గుర్తించారు. మృతదేహపు కాలిని ఎత్తుకెళ్లి రైలు ప్రమాదం తాలూకు సాక్ష్యాధారాలను మాయం చేశాడన్న అభియోగాలపై అరెస్టు చేశారు. పోలీసులు తరలిస్తుండగా కూడా కెమెరాల వైపు చూస్తూ ఉత్సాహంగా చేతులూపుతూ కన్పించాడు!

45 మందితో కాంగ్రెస్ నాలుగో జాబితా

వారణాసిలో మోదీ ప్రత్యర్థి అజయ్ రాయ్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో యూపీలోని వారణాసి నుంచి ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ నుంచి పీసీసీ చీఫ్ అజయ్ రాయ్ బరిలో దిగుతున్నారు. ఆయనతో పాటు మొత్తం 45 మంది అభ్యర్థులతో నాలుగో జాబితాను కాంగ్రెస్ శనివారం విడుదల చేసింది. మధ్యప్రదేశ్‌లో సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ రాజ్‌గఢ్ నుంచి పోటీ చేస్తున్నారు. తమిళనాడులో శివగంగ నుంచి కార్తీ చిదంబరం, విరుధ్‌నగర్ నుంచి మాణిక్కం ఠాగూర్ బరిలో దిగుతున్నారు. కాంగ్రెస్ ఇప్పటి దాకా 183 మంది అభ్యర్థులను ప్రకటించింది.

బీజేపీలోకి ఆ 9 మంది

న్యూఢిల్లీ: హిమాచల్ ప్రదేశ్‌లో రాజకీయ సంక్షోభం కొనసాగుతోంది. అనర్హత వేటుపడిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, శాసనసభ సభ్యత్వాలకు శుక్రవారం రాజీనామా చేసిన ముగ్గురు స్వతంత్రులు శనివారం బీజేపీలో చేరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ఈ సందర్భంగా విమర్శించారు. ఈ తొమ్మిది మందీ ఇటీవలి రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయడం తెలిసిందే.

తప్పుకున్న ఇద్దరు బీజేపీ అభ్యర్థులు

అహ్మదాబాద్: లోక్‌సభ ఎన్నికల వేళ గుజరాత్ బీజేపీలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. వడోదర టికెట్ దక్కిన సిట్టింగ్ ఎంపీ రంజన్ బెన్ ధనంజయ్, సబర్‌కాంత అభ్యర్థి భికాజీ ఠాకూర్ వ్యక్తిగత కారణాలతో పోటీనుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. రంజన్ బెన్ అభ్యర్థిత్వంపై స్థానిక బీజేపీ నేతలు అసంతృప్తితో ఉన్నారు. ఆమెకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి.

మహువా మొయిత్రా ఇళ్లలో సీబీఐ సోదాలు

న్యూఢిల్లీ/కోల్‌కతా: లంచం తీసుకుని లోక్‌సభలో ప్రశ్నలడిగిన కేసు దర్యాప్తులో భాగంగా తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎంపీ మహువా మొయిత్రా నివాసాల్లో సీబీఐ సోదాలు జరిపింది. కోల్‌కతాలోని నివాసం, నాదియా జిల్లా కృష్ణనగర్‌లోని అపార్టుమెంట్ సహా పలు ప్రాంతాల్లో భారీ బందోబస్తు నడుమ శనివారం ఉదయం నుంచి సాయంత్రం దాకా తనిఖీలు జరిగాయని అధికారులు వెల్లడించారు. అనైతిక ప్రవర్తన కారణంగా గత డిసెంబర్‌లో మహువా లోక్‌సభ నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఈ కేసులో ఆర్నెల్లల్లోగా నివేదిక అందజేయాలన్న లోక్‌పాల్ ఆదేశాల మేరకు సీబీఐ విచారణ జరుపుతోంది.



విమానం డోర్ దాకా వచ్చి మరీ మోదీకి వీడ్కోలు పలుకుతున్న భూటాన్ రాజు జిగ్మే ఖేసర్

భూటాన్‌లో ఆస్పత్రిని ప్రారంభించిన మోదీ

థింపు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం భూటాన్ రాజధాని థింపూలో అత్యాధునిక వసతులతో నిర్మించిన ఆస్పత్రిని ఆ దేశ ప్రధాని త్సెరింగ్ టోబ్‌గేతో కలిసి ప్రారంభించారు. వివిధ విభాగాలకు చెందిన మొత్తం 150 పడకలతో కూడిన గ్యాల్ట్సుయెన్ జెట్సున్ పెమా వాంగ్చుక్ మాతా శిశు హాస్పిటల్‌ను భారత ప్రభుత్వ సహకారంతో నిర్మించారు. నాణ్యతతో కూడిన ఆరోగ్య సేవలను అందించే ఈ ఆస్పత్రి ఎన్నో కుటుంబాలకు ఆశా కిరణం వంటిదని అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. భారత్–టిబెట్‌ల ఆర్థిక సహకారానికి ఒక గొప్ప ఉదాహరణ ఈ ఆస్పత్రి అని తెలిపారు. భారత్ సాయంతో మొదటి దశలో రూ.22 కోట్లతో నిర్మించిన ఈ ఆస్పత్రి 2019 నుంచి సేవలందిస్తోంది. భారత్ అందించిన మరో రూ.119 కోట్లతో చేపట్టిన ఆస్పత్రి రెండో దశ నిర్మాణం తాజాగా పూర్తయిందని విదేశాంగ శాఖ తెలిపింది.

ఎయిర్‌పోర్టులో వీడ్కోలు పలికిన రాజు

రెండు రోజుల పర్యటనకు గాను ప్రధాని మోదీ శుక్రవారం భూటాన్ చేరుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనకు అక్కడి ప్రజలు ఘన స్వాగతం పలికారు. రాజు జిగ్మే ఖేసర్ వాంగ్చుక్ ప్రధాని మోదీకి అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ డ్రుక్ గ్యాల్పో'ను అందజేశారు. మోదీతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పర్యటన ముగించుకుని తిరిగి శనివారం మధ్యాహ్నం మోదీ తిరుగు పయనమయ్యారు. ఆయన వెంట ప్రధాని త్సెరింగ్ టోబ్‌గేతోపాటు రాజు జింగ్మే ఖేసర్ వాంగ్చుక్ స్వయంగా పారో విమానాశ్రయానికి వచ్చారు. వీరిద్దరూ ప్రధాని మోదీకి ఘనంగా వీడ్కోలు పలికారు.

త్వరలో వస్తా..

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సయిజ్ విధానంలో అక్రమాలు జరిగాయంటూ ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్ట్‌చేసిన నేపథ్యంలో ఈడీ కస్టడీ నుంచి ఆయన వీడియో సందేశం ఇచ్చారు. దాన్ని ఆయన భార్య సునీత ప్రత్యక్షప్రసారంలో చదివి వినిపించారు. ''జైల్లో ఉన్నా, బయటున్నా నా జీవితంలో ప్రతి క్షణం దేశ సేవకే అంకితం. నా ప్రతి రక్తపుబొట్టు దేశం కోసమే ధారపోస్తా. మీ సోదరుడు, కుమారుడినైన నన్ను ఏ జైలూ ఎక్కువ రోజులు బంధించలేదు. త్వరలోనే బయటికొస్తా. మీకిచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తా. కష్టాల్లోనే పెరిగా. సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధపడ్డా. అందుకే ఈ అరెస్ట్‌తో ఆశ్చర్యపోలేదు. దేశాన్ని బలహీనపరిచే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండండి. వాటిని ఓడించండి'' అని బీజేపీని పరోక్షంగా ప్రస్తావించారు. ''గత జన్మలో ఎంతో పుణ్యం చేసుకొని ఉంటా. అందుకే ఈ పుణ్యభూమిలో పుట్టా. కోట్లాదిగా మీరు చూపిస్తున్న ఈ ప్రేమే నాకు కొండంత అండ' అని అందులో కేజ్రీవాల్ అన్నారు.

బీజేపీ వాళ్లంతా నా సోదరసోదరీమణులు

''ఆప్ వాలంటీర్లకు నాదో సూచన. నేను కస్టడీలో ఉన్నా సామాజిక, సేవ కార్యక్రమాలు ఆగకూడదు. ఢిల్లీ మహిళలకు నెలకు రూ.1,000 వాగ్దానం నేనొచ్చాక నెరవేరుస్తా. నన్ను అరెస్ట్ చేశారని బీజేపీపై ద్వేషం పెంచుకోకండి. వాళ్లంతా నా సోదరసోదరీమణులు. ప్రజల ఆశీర్వాదాలతో మూడుసార్లు సీఎం అయిన నన్ను అధికార అహంకారంతో మోదీ జైల్లో పడేశారు. ఇది ఢిల్లీ ప్రజలను వంచించడమే. ఎక్కడున్నా ప్రజాసేవలకే అంకితమవుతా. వాళ్లే నిర్దాయక శక్తులు. జై హింద్' అన్నారు.

ఆప్ ఢిల్లీ ఆఫీస్‌కు తాళం

ఆప్ ఢిల్లీ కార్యాలయానికి సీలు వేశారని మంత్రి అతిషి ఆరోపించారు. ''లోక్‌సభ ఎన్నికల వేళ జాతీయ పార్టీ ఆఫీస్‌కు వెళ్లకుండా మా నేతలను ఎందుకు అడ్డుకుంటున్నారు? దీనిపై ఈసీకి ఫిర్యాదు చేస్తాం'' అని చెప్పారు. ఈ వార్తలను పోలీసులు ఖండించారు. ''ఆఫీస్‌కు సీల్ వేయలేదు. కేజ్రీవాల్ అరెస్ట్ నేపథ్యంలో పార్టీ ఆఫీస్ ఉన్న ప్రాంతంలో 144 సెక్షన్ అమల్లో ఉంది. అందుకే వందల సంఖ్యలో వస్తున్న ఆప్ కార్యకర్తలను ఆఫీస్ వైపు వెళ్లనివ్వట్లేదు. గుమిగూడనివ్వట్లేదు'' అని వివరించారు. ఆప్ ఎమ్మెల్యే గులాబ్ సింగ్ ఇంటిపై ఆదాయపన్ను శాఖ అధికారులు దాడులు చేశారని ఆతిశీ 'ఎక్స్'లో వెల్లడించారు.

జైలులో సీఎం ఆఫీస్‌కు అనుమతి కోరతాం: భగవంత్ మాన్

ఈడీ కేసులో కోర్టు కేజ్రీవాల్‌ను జైలుకు పంపితే అక్కడి నుంచి ఆయన ప్రభుత్వాన్ని నడిపేలా సీఎం తాత్కాలిక ఆఫీస్‌ను ఏర్పాటుచేసేందుకు అనుమతి కోరతామని ఆప్ నేత, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ చెప్పారు. 'ఆప్‌లో కేజ్రీవాల్ స్థానాన్ని ఎవరూ భర్తీచేయ లేరు. జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపకూడదనే నిబంధన ఏదీ లేదు. జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా కోర్టు కేజ్రీవాల్‌ను జైలుకు తరలిస్తే అక్కడి నుంచే సీఎంగా బాధ్యతలు నిర్వహి స్తారు. దోషిగా తేలనంత వరకూ చట్ట ప్రకారం ఆయన జైలు నుంచి కూడా పనిచేయవచ్చు. అందుకే ఆఫీస్ కోసం సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టుల అనుమతి కోరతాం' అని మాన్ అన్నారు.

వీడియో సందేశంలో కేజ్రీవాల్



సోదరా, తీహార్‌కు వెల్‌కం!

కేజ్రీవాల్‌కు సుఖేశ్ లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: ''ప్రియ సోదరా, కేజ్రీవాల్! నెమ్మదిగా అయినా నిజమే గెలుస్తుంది. సరికొత్త భారత్ శక్తికి ఇదో క్లాసిక్ ఉదాహరణ. వెల్ కం టూ తీహార్ క్లబ్. బాస్ ఆఫ్ తీహార్ క్లబ్‌గా ఆహ్వానిస్తున్నా. మీ డ్రామాలకు ముగింపు పడింది'' అంటూ మనీ లాండరింగ్ కేసులో జైల్లో ఉన్న సుఖేశ్ చంద్రశేఖర్ శనివారం ఆయకు లేఖ రాశాడు. ''మీ అవినీతంతా బయటపడుతుంది. ఢిల్లీ సీఎంగా 10 కుంభకోణాలు చేశారు. నాలుగింటికి నేనే ప్రత్యక్ష సాక్షిని. లిక్కర్ స్కాం కేవలం ఆరంభమే. అప్రూవర్‌గా మారి నిజాలన్నీ బయట పెడతా. నేను ఛైర్మన్‌గా, కేజ్రీ బిగ్‌బాస్‌గా, సిసోడియా సీఈఓగా, సత్యేంద్ర జైన్ సీఓఓగా తిహార్ క్లబ్ నడుపుతా'' అన్నాడు.

విరాళాల్లేకుండా పార్టీలు మనలేవు

సదుద్దేశంతోనే బాండ్లు: గడ్కరీ

అహ్మదాబాద్: ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టు రద్దుచేశాక ఈ పథకంపై ప్రజాక్షేత్రంలో చర్చోపచర్చలు జరుగుతున్న వేళ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తన మనసులో మాట చెప్పారు. '' అసలు విరాళాలు తీసుకోకుండా ఏ రాజకీయ పార్టీ కూడా మనుగడ సాధించలేదు. సదుద్దేశంతోనే ఎలక్టోరల్ బాండ్ల పథకం తెచ్చాం. పథకాన్ని సుప్రీంకోర్టు రద్దుచేయకుండా అందులోని లోటుపాట్లను సరిచేయాలని సూచనలు చేస్తే బాగుండేది. సూచనల మేరకు అప్పుడు అన్ని రాజకీయ పార్టీలు కూర్చుని చర్చించుకునే అవకాశం దొరికేది. ఏకాభిప్రాయంతో సవరణలు చేసేవాళ్లం' అని అన్నారు. శుక్రవారం గాంధీనగర్‌లోని 'గిఫ్ట్ సిటీ'లో జరిగిన ఒక కార్యక్రమంలో గడ్కరీ మాట్లాడారు. 'గతంలో అరుణ్ జైట్లీ కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఇలాంటి పథకం ఒకటి ఉంటే మంచిదని చర్చ జరిగినప్పుడు నేను అందులో పాల్గొన్నా. వనరులు లేకుండా రాజకీయ పార్టీల మనుగడ అసాధ్యం. కొన్ని దేశాల్లో ప్రభుత్వాలే పార్టీలకు నిర్వహణ నిధులిస్తాయి. భారత్‌లో అలాంటి పద్ధతి లేదు. అందుకే పార్టీలకు ఆర్థిక అండగా నిలబడే ఇలాంటి పథకాలను రూపొందించుకున్నాం. నేరుగా పార్టీలకు విరాళాలు చేరేలా చూడటమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. విరాళాల అందజేతకు ముందు, తర్వాత అధికారంలో ఉన్న పార్టీ మారిపోతే దాతలకు సమస్యలు వస్తాయి. అందుకే దాతల వివరాలు రహస్యంగా ఉండేలా పథకంలో నిబంధనలు పెట్టాం. ఏదైనా మీడియా సంస్థ తన ఒక కార్యక్రమానికి నిధులు అవసరమైతే స్పాన్సర్‌ను చూసుకుంటుంది. పార్టీ నిర్వహణ, కార్యకలాపాలకు నిధులు అవసరమే కదా' అని గడ్కరీ ఉదహరించారు. ప్రతిదీ పారదర్శకంగా ఉండాలనే పార్టీలకు విరాళాలు పారదర్శకంగా వచ్చేలా చూశామన్నారు.

కేజ్రీకి ఢిల్లీ హైకోర్టులో దక్కని ఊరట

న్యూఢిల్లీ: కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన పిటిషన్‌పై అత్యవసర విచారణకు కోర్టు నిరాకరించింది. తనను ఈడీ అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ ఆయన శనివారం పిటిషన్ దాఖలు చేశారు. తన అరెస్టు, రిమాండ్ చట్టవిరుద్ధమని, వెంటనే విడుదల చేసేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. పిటిషన్‌ను అత్యవసరంగా, వీలైతే ఆదివారమే విచారించాలని కోరారు. అయితే బుధవారం విచారణ చేపడతామని కోర్టు తెలిపింది.

జర్మనీ ప్రకటన, రాయబారికి భారత్ సమన్లు

కేజ్రీవాల్ అరెస్ట్‌పై జర్మనీ సంచలన వ్యాఖ్యలు చేసింది. ''ఈ అరెస్ట్‌ను మేం గమనిస్తున్నాం. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రమాణాలు, ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రాలు ఈ కేసుకు వర్తిస్తాయని ఆశిస్తున్నాం. కేజ్రీవాల్ న్యాయమైన, నిష్పక్షపాత విచారణకు అర్హులు. చట్టపరమైన పరిష్కారాలను పరిమితుల్లేకుండా ఉపయోగించుకునే హక్కు ఆయనకుండాలి'' అని జర్మనీ విదేశాంగ మంత్రి పేర్కొంది. దీనిపై విదేశాంగ శాఖ తీవ్ర నిరసన తెలిపింది. ఇది తమ అంతర్గత వ్యవహారాల్లో, న్యాయ ప్రక్రియలో జోక్యం చేసుకోవడమేనని ఆక్షేపించింది. జర్మనీ వ్యాఖ్యలను అసమంజసం, పక్షపాతపూరితమని పేర్కొంటూ ఢిల్లీలోని జర్మనీ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ జార్జి ఎన్జ్‌వీలర్‌కు సమన్లు జారీ చేసినట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ చెప్పారు.

బీజేపీ ఖాతాలోకే మద్యం ముడుపులు

- మద్యం వ్యాపారి శరత్ నుంచి రూ.59.5 కోట్ల బాండ్లు
- బీజేపీ చీఫ్ నడ్డాను ఈడీ తక్షణం అరెస్టు చేయాలి: ఆప్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం తాలూకు ముడుపులు ఎన్నికల బాండ్ల రూపంలో మద్యం వ్యాపారుల నుంచి నేరుగా బీజేపీకే అందాయని ఆప్ నేతలు, ఢిల్లీ మంత్రులు ఆతిషి, సౌరభ్ భరద్వాజ్ శనివారం సంచలన ఆరోపణలు చేశారు. ఈ ఉదంతంలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాను ఈడీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ''ఈ కుంభకోణంపై సీబీఐ, ఈడీ రెండేళ్లుగా దర్యాప్తు చేస్తున్నా ఆప్ నేతల నుంచి గానీ, మంత్రుల నుంచి గానీ రూపాయి కూడా రికవరీ కాలేదు. మద్యం దుకాణాలు దక్కించుకున్న శరత్‌చంద్ర రెడ్డి వాగ్మూలం ఆధారంగా ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. కేజ్రీవాల్‌ను తానెన్నడూ కలవలేదని, మాట్లాడలేదని, ఆప్‌తో ఏ సంబంధమూ లేదని విచారణలో చెప్పిన మర్నాడే శరత్‌ను ఈడీ అరెస్టు చేసింది. కేజ్రీవాల్‌ను కలిసి మద్యం కుంభకోణంపై మాట్లాడానంటూ మాట మార్చగానే బెయిల్ పొందారు!'' అని ఆరోపించారు. ''శరత్ కంపెనీల ద్వారా బీజేపీకి ఎన్నికల బాండ్ల రూపంలో రూ.4.5 కోట్లు అందాయి. అరెస్టు అనంతరం బీజేపీకి ఆయన ఏకంగా మరో రూ.55 కోట్ల ఎన్నికల బాండ్లు ఇచ్చారు'' అంటూ సంబంధిత వివరాలను మీడియాకు చూపించారు.



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

సొంత బిడ్డలా మా బతుకులు చక్కదిద్దారు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మా జీవితాల్లో వెలుగులు నింపింది. సంక్షేమ పథకాల లబ్ధితో మా జీవనం సాఫీగా సాగుతోంది. మాది పేద కుటుంబం. నేను నా భర్త గోవింద రెడ్డితో కలిసి పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం శ్రీనగర్‌లో నివసిస్తున్నాం. గతంలో భర్తతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లేదానిని. నాకు ముగ్గురు కుమారులు. ఒకబ్బాయి చనిపోయాడు. మిగిలిన ఇద్దరు కుమారులు కూడా వ్యవసాయ పనులకు వెళ్తుంటారు. వారిద్దరికీ పెళ్లిళ్లు అవ్వడంతో వేరే కాపురాలు పెట్టారు. ఇక మేమిద్దరమే కావడంతో వ్యవసాయ పనులు కూడా సక్రమంగా ఉండకపోవడంతో ఐదేళ్ల క్రితం కొంత అప్పు చేసి కారప్పొడి తయారుచేసే యంత్రం కొనుగోలు చేసి దానిద్వారా జీవనం కొనసాగిస్తున్నాం. అయితే అరకొర ఆదాయంతో ఇల్లు గడవడం గగనంగా మారేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక నాకు వైఎస్సార్ ఆసరా పథకం కింద ఏడాదికి రూ.16,500 చొప్పున నాలుగేళ్లపాటు వచ్చాయి. ఈ డబ్బులతో కారంపొడి యంత్రానికి అదనంగా పిండిమర కూడా కొనుగోలు చేసి వ్యాపారాన్ని విస్తరించాను. ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రస్తుతం రోజూ 300 నుంచి 400 రూపాయల ఆదాయం లభిస్తోంది. మా ఆయనకు వృద్ధాప్య పింఛన్ ఈ ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో ఇద్దరం ప్రశాంతమైన జీవితం గడుపుతున్నాం. మాకు ఏవైనా అనారోగ్య సమస్య వస్తే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అండగా నిలుస్తోంది. వైఎస్సార్ రైతు భరోసా కింద ఏడాదికి రూ. 13,500లు వంతున అందింది. మా సొంత బిడ్డలా జగన్ మమ్మల్ని చూసుకుంటున్నారు. వృద్ధాప్యంలో మాకు ఆసరా ఇచ్చిన ఈ ప్రభుత్వానికి మేము రుణపడి ఉంటాం.

– కొండసాని మంగమ్మ, శ్రీనగర్
(వినుకొండ అజయ్‌కుమార్, విలేకరి, దాచేపల్లి)

ఉన్నత విద్య ఈ ప్రభుత్వం చలవే...



మా నాన్న గుంటూరు జిల్లా తెనాలిలో పంపులు, మోటార్లు తయారు చేసే కంపెనీలో పనిచేస్తుంటారు. ఆయనకొచ్చే అరకొర జీతంతో మా చదువులు ప్రశ్నార్థకంగా మారాయి. మేము సిరిపురంలో ఉంటాం. మా అమ్మ గృహిణి. అయితే నాకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత జగనన్న విద్యాదీవెన పథకం వర్తించడంతో నేను తెనాలి ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో బీఎస్సీ స్టాటిస్టిక్స్ ఫైనలియర్ చదువుతున్నాను. ప్రముఖ ఐటీ కంపెనీ టీసీఎస్, ఉద్యోగాల భర్తీ నిమిత్తం ఇటీవల దేశవ్యాప్తంగా డిగ్రీ విద్యార్థుల కోసం రాతపరీక్ష నిర్వహించింది. అందులో విజయం సాధించినవారికి హైదరాబాద్‌లో టెక్నికల్, హెచ్ఆర్ ఇంటర్వ్యూలను చేసింది. ఆ రెండింటిలోనూ రాణించిన నాకు టీసీఎస్‌లో ఉద్యోగం లభించింది. డిగ్రీ ఫైనలియర్‌లో ఉన్న నాకు టీసీఎస్ వంటి కంపెనీలో ఉద్యోగం రావడంతో మా కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేవు. జీవితంపై భరోసా ఏర్పడింది. జగనన్న విద్యాదీవెన పథకం వల్లే నేను ఉన్నత విద్యను అభ్యసించగలిగాను. మా అమ్మకు వైఎస్సార్ ఆసరా కింద ఇప్పటివరకూ రూ. 59,200లు వచ్చింది. మా ఆర్థిక పరిస్థితి మెరుగుపడటానికి కారణమైన సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం. – అత్తోట గీత, సిరిపురం

(బి.ఎల్.నారాయణ, విలేకరి, తెనాలి)

ఆర్థిక బాధల నుంచి బయటపడ్డాం



మాది వ్యవసాయ కుటుంబం. మా ఆయన జీవనోపాధి కోసం మోటారు సైకిల్‌పై తిరుగుతూ కోడిగుడ్లు అమ్ముతారు. ఆయన సంపాదన మా కుటుంబ పోషణకు సరిపోయేది కాదు. పిల్లల భవిష్యత్తుపై ఎప్పుడు బెంగగా ఉండేది. గత ప్రభుత్వాలు మమ్మలను ఆదుకోలేదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురుకు చెందిన మాకు జగనన్న ప్రభుత్వంలో ఎంతో మేలు జరిగింది.మా ఆయనకు వైఎస్సార్ పింఛన్ కానుక అందుతోంది. మా వ్యాపారం కోసం జగనన్న తోడు ద్వారా రూ.20 వేలు (రుణం)తీసుకున్నాం. జగనన్న కాలనీలో మాకు స్థలం మంజూరుచేయడమే గాకుండా ఇల్లు నిర్మాణానికి రూ. 1.80లక్షల ఆర్థిక సహాయం అందింది. వైఎస్సార్ ఆసరా ద్వారా ఇప్పటివరకూ రూ.45,373లు, వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ. 18,750లు వంతున అందింది. జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల మా ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. అందుకు కారణమైన జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– పితాని కళావతి, మామిడికుదురు
(యేడిద బాలకృష్ణ, విలేకరి, మామిడికుదురు)



తెప్పపై మలయప్పస్వామి అభయం

వైభవంగా శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు

తిరుమల: తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. నాలుగో రోజు శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి వారు తెప్పపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై రాత్రి ఏడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు ఆశీనులై పుష్కరిణిలో ఐదు చుట్లు విహరించి భక్తులను అనుగ్రహించారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, ఎస్ఈ–2 జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాపికొండల్లో అరుదైన మిత్రుడు

- రంపచోడవరం జలపాతం వద్ద 'డయార్డ్స్ స్నేక్'
- ఇది సంచరిస్తే పర్యావరణం పరిఢవిల్లుతున్నట్టు లెక్క
- 1839లో జావా దీవుల్లో తొలిసారిగా గుర్తింపు
- 2022 సెప్టెంబర్‌లో రంపచోడవరం జలపాతం వద్ద లభ్యం
- డీఎన్‌ఏ పరీక్షల ద్వారా ఇది డయార్డ్స్ స్నేక్ అని తేల్చిన శాస్త్రవేత్తలు



రంపచోడవరం జలపాతం. (ఇన్‌సెట్‌లో) అక్కడ గుర్తించిన డయార్డ్స్ బ్లైండ్ స్నేక్ (ఫైల్)

కైకలూరు: పర్యావరణ మిత్రునిగా పిలిచే అరుదైన డయార్డ్స్ బ్లైండ్ స్నేక్ (గుడ్డి పాము) జాడ నిజమేనని మంచినీటి జీవశాస్త్ర ప్రాంతీయ కేంద్రమైన హైదరాబాద్‌లోని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు నిర్ధారించారు. గుంటూరులోని బయోడైవర్సిటీ బోర్డు పాపికొండలు సమీపంలోని రంపచోడవరం జలపాతం వద్ద 2022 సెప్టెంబర్ 8న చనిపోయిన డయార్డ్స్ బ్లైండ్ స్నేక్ మృతదేహాన్ని కనుగొన్నారు. జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన శాస్త్రవేత్తలు దీపా జైస్వాల్, బి.భరత్, ఎం.కరుతాపాండి, శ్రీకాంత్ జాదవ్, కల్యాణి, కుంటేలు గుడ్డిపాము కళేబరాన్ని రసాయనాలతో హైదరాబాద్ జూలాజికల్ మ్యూజియంలో భద్రపరిచారు. అప్పటినుంచి పరిశోధనలు చేసి చివరకు డీఎన్‌ఏ పరీక్ష ద్వారా దీనిని అరుదైన డయార్డ్స్ బ్లైండ్ స్నేక్‌గా నిర్ధారించారు.

1839లో జావా దీవుల్లో గుర్తింపు

డయార్డ్స్ బ్లైండ్ స్నేక్‌ను 1839లో ఇండోనేషియాలోని జావా దీవుల్లో తొలిసారిగా గుర్తించారు. ఫ్రెంచ్ ప్రకృతి శాస్త్రవేత్త పియరి మోడర్డ్ డియార్డ్ గౌరవార్థం దీనికి డయార్డ్స్ అని నామకరణం చేశారు. అర్గిరోఫిస్ డయార్డి శాస్త్రీయ నామం కలిగిన ఇది టైఫ్లోపిడే కుటుంబంలో విషపూరితం కాని పాము జాతికి చెందినది. ఇవి అడుగు వరకు పొడవు పెరుగుతాయి. భారతదేశంలో ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్, అసోం, హరియాణా, బిహార్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, త్రిపుర ప్రాంతాల్లో వీటి జాతి ఉంది. మొదటిసారి ఏపీలోని పాపికొండలు అభయారణ్య ప్రాంతమైన రంపచోడవరం జలపాతం వద్ద దీనిని కనుగొన్నారు. వానపాములు భూసారాన్ని పెంపొందించడంలో ఏ విధంగా సాయపడతాయో అంతకంటే ఎక్కువగా పర్యావరణాన్ని కాపాడటంలో గుడ్డిపాములు దోహదపడతాయి.

ఐయూసీఎన్ ఆందోళన

ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) తగ్గుతున్న జీవుల జాబితా అయిన రెడ్ లిస్ట్‌లో డయార్డ్స్ బ్లైండ్ స్నేక్‌ను చేర్చింది. భారతీయ వన్యప్రాణి (రక్షణ) సవరణ చట్టంలో దీనిని చేర్చారు. చిత్తడిగా ఉండే అటవీ ప్రాంతం, పొదలు, గడ్డి భూముల్లో ఇవి నివసిస్తాయి. వీటితో పర్యావరణం పరిఢవిల్లుతుందని శాస్త్రవేత్తలు భావిస్తారు. తూర్పు కనుమల ప్రాంతమైన తమిళనాడు, ఏపీ, ఒడిశా ప్రాంతాల్లో కేవలం పాపికొండలు వద్ద ఈ జాతిని గుర్తించడంతో ఈ ప్రాంతాల్లో మరింతగా వీటి జాడ ఉండే అవకాశం ఉంది.

విషపూరితమైనవి కావు



డయార్డ్స్ బ్లైండ్ స్నేక్ విషపూరితమైనవి కావు. క్రిమికీటకాలను ఆహారంగా తీసుకుంటాయి. వానపాములు ఏ విధంగా సంతానోత్పత్తి చేస్తాయో అదేవిధంగా వీటి సంతతిని వృద్ధి చేసుకుంటాయి. పంట పొలాల్లో రసాయనాలు అధిక వినియోగం వల్ల వీటి సంతతి నశిస్తోంది. పర్యావరణ పరిరక్షణలో వీటి పాత్ర గణనీయంగా ఉంటుంది. వీటిని పరిరక్షించుకోవాలి.

– బి.భరత్, జూనియర్ రీసెర్చ్ ఫెలో, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హైదరాబాద్

ఓటర్ గుర్తింపు కార్డు లేకపోయినా ఓటేయవచ్చు

- 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించాలి
- లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల గుర్తింపు కార్డులను నోటిపై చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

సాక్షి, అమరావతి: నూటికి నూరుశాతం ఓటర్లకు ఫొటో గుర్తింపు కార్డు జారీ చేసినట్లు కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. అయితే ఓటర్ గుర్తింపు కార్డు లేని కారణంగా రాష్ట్రంలో లోక్‌సభకు, అసెంబ్లీకి త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటు వేసే హక్కును నిరాకరించకుండా చూసేందుకు ప్రత్యామ్నాయంగా 12 రకాల గుర్తింపు కార్డులతో ఓటు వేసేందుకు కేంద్ర ఎన్నిలక సంఘం నోటిపై చేసింది.

- ఆధార్ కార్డ్
- మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ కార్డు
- బ్యాంక్, పోస్టాఫీసు జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్‌లు
- కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేయబడిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్
- డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్
- ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐ జారీచేసిన స్మార్ట్ కార్డ్
- భారతీయ పాస్‌పోర్ట్
- ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్,
- కేంద్ర, రాష్ట్రం ద్వారా ఉద్యోగులకు జారీ చేసిన ఫొటోతో కూడిన సేవా గుర్తింపు కార్డులు
- ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డు
- ప్రత్యేక వైకల్యం గుర్తింపు కార్డు

ముగిసిన హెచ్‌ఆర్‌సీ చైర్మన్, సభ్యుల పదవీకాలం

కొత్త చైర్మన్, సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల



హెచ్‌ఆర్‌సీలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బందితో చైర్మన్ ఎం.సీతారామమూర్తి, సభ్యులు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(హెచ్‌ఆర్‌సీ) చైర్మన్, సభ్యుల పదవీకాలం శనివారం ముగిసింది. హెచ్‌ఆర్‌సీ చైర్మన్‌గా జస్టిస్ మంధాతా సీతారామమూర్తి, జ్యుడిషియల్ సభ్యుడిగా దండే సుబ్రహ్మణ్యం, నాన్ జ్యుడిషియల్ సభ్యుడిగా జి.శ్రీనివాసరావులను 2022, మార్చి 24వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వీరి మూడేళ్ల పదవీకాలం శనివారంతో ముగిసింది. చివరి రోజు హెచ్‌ఆర్‌సీ చైర్మన్, సభ్యులను కలెక్టర్ డాక్టర్ జి.సృజన మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్, సభ్యుల ఎంపికకు ప్రభుత్వం ఈ నెల 15వ తేదీన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు.

ఎంపికపై ప్రతిష్టంభన

ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత, సీనియర్ రాష్ట్ర మంత్రి, శాసనసభ స్పీకర్, శాసనమండలి చైర్మన్ ఆధ్వర్యంలో స్క్రీనింగ్ కమిటీ హెచ్‌ఆర్‌సీ చైర్మన్, సభ్యులను ఎంపిక చేస్తుంది. దరఖాస్తులను హోంశాఖ పరిశీలించి స్క్రీనింగ్ కమిటీకి పంపుతుంది. అందులో సభ్యుల అభిప్రాయం మేరకు నూతన చైర్మన్, సభ్యులను ఎంపిక చేస్తారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో స్క్రీనింగ్ కమిటీ సమావేశంపై ప్రతిష్టంభన నెలకొంది.

యథావిధిగా ఫిర్యాదుల స్వీకరణ

హెచ్‌ఆర్‌సీ చైర్మన్, సభ్యులు లేకపోయినా కమిషన్ కార్యాలయంలో యథావిధిగా ఫిర్యాదులను స్వీకరిస్తారు. ఇందుకోసం కమిషన్ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. కమిషన్ పని వేళల్లో 08518248248 నంబర్‌కు ఫోన్ చేసినా ఫిర్యాదులను స్వీకరిస్తారు. అయితే, ప్రస్తుతం విచారణలో ఉన్న ఫిర్యాదులు, కొత్త ఫిర్యాదులను నూతన చైర్మన్, సభ్యులు వచ్చిన తర్వాతే విచారణ చేపడతారు.

■ తెలంగాణ

మరో 3 రోజులు ఈడీ కస్టడీకి కవిత

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కస్టడీని మరో మూడు రోజులు పొడిగిస్తున్నట్లు ఈడీ ట్రయల్ కోర్టు పేర్కొంది. ఐదు రోజుల కస్టడీ ముగియడంతో కవితను ఈడీ అధికారులు శనివారం మధ్యాహ్నం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో న్యాయమూర్తి కావేరీ బవేజా ముందు హాజరుపరిచారు. మరో ఐదు రోజులపాటు ఆమె కస్టడీ పొడిగించాలని కోరుతూ ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దరఖాస్తు సమర్పించింది. అందులో పలు ఆరోపణలు చేసింది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రధాన కుట్రదారు అని ఈడీ ఆరోపించింది. ఇప్పటివరకు జరిగిన విచారణ ప్రకారం ఈ కుంభకోణం సూత్రధారుల్లో కవిత ఒకరుగా తేలిందని పేర్కొంది. కోర్టులో ఈడీ తరఫున న్యాయవాది జోహెబ్ హుస్సేన్ వాదనలు వినిపిస్తూ.. లైసెన్సుల్లో భారీ వాటాను చేజిక్కించుకొనేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి 'సౌత్ గ్రూప్' చెల్లించిన రూ. 100 కోట్ల ముడుపుల్లో కవిత పాత్ర ఉందన్నారు. కవిత ఫోన్ డేటాలో కొంత డిలీట్ అయినట్లు గుర్తించారని తెలిపారు. కవిత ఆడపడుచు అఖిల అల్లుడు మేక శరణ్ ఫోన్‌ను కూడా జప్తు చేశామని, స్కాంలో అతని ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించామన్నారు. కవితను మరో ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరారు. కవిత తరఫు న్యాయవాది నితీష్ రాణా వాదనలు వినిపిస్తూ.. కస్టడీలో ఉన్న కవిత ఈడీ అడుగుతున్న డాక్యుమెంట్లు ఎలా ఇవ్వగలరని ప్రశ్నించారు. వాదనలు విన్న అనంతరం కవితను మూడు రోజుల ఈడీ కస్టడీకి న్యాయమూర్తి అనుమతించారు.

కవిత బంధువుల ఇళ్లలో ఈడీ సోదాలు

శనివారం మాదాపూర్‌లో ఉన్న డీఎస్ఆర్ అపార్ట్‌మెంట్స్‌లోని కవిత ఆడపడుచు అఖిల ఫ్లాట్‌తో పాటు ఇతర బంధువుల ఇళ్లలో ఏకకాలంలో ఈడీ బృందం తనిఖీలు చేసింది. ఈ సోదాల్లో కవిత, ఆమె భర్త అనిల్, కవిత ఆడపడుచు అల్లుడు శరణ్‌తో పాటు కవిత పీఏల ఫోన్లను సీజ్ చేశారు.

క్లుప్తంగా...

శ్రీశైలంలో శాస్త్రోక్తంగా కామదహనం



కామదహనం చేస్తున్న ఆలయ ఏఈవో

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఫాల్గుణ శుద్ధ చతుర్దశిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం ఆలయం ముందు భాగంలోని గంగాధర మండపం వద్ద శాస్త్రోక్తంగా కామ దహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహించారు. ఆ తర్వాత గడ్డితో చేసిన మన్మథ రూపాన్ని దహనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో హరిదాసు, పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

25న పౌర్ణమి గరుడ సేవ

తిరుమల: పౌర్ణమి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 25న గరుడసేవ జరుగనుంది. ఇందులో భాగంగా రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామి వారు గరుడు వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరించనున్నారు.

సర్వీసు నుంచి ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ తొలగింపు

ఏసీబీ కోర్టు తీర్పుతో వేటు

మదనపల్లె: ఏపీఎస్పీడీసీఎల్ మదనపల్లె డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.యుగంధర్‌ను సర్వీస్ నుంచి తొలగిస్తూ విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 2015లో విజయవాడ డివిజన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సమయంలో యుగంధర్ ఏసీబీ అధికారులకు చిక్కాడు. కేసు విచారణలో భాగంగా యుగంధర్ నేరం చేసినట్లు ఏసీబీ కోర్టు నిర్ధారిస్తూ, విధుల నుంచి తొలగించాల్సిందిగా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించింది. దీంతో యుగంధర్‌ను విధుల నుంచి తొలగించారు. మదనపల్లె ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఈఈగా పుంగనూరు ఈఈ శ్రీనివాసమూర్తికి బాధ్యతలు కేటాయించినట్లు సమాచారం.

తుంగభద్ర బోర్డు చైర్మన్‌గా వీరేంద్రశర్మ

సాక్షి, అమరావతి: తుంగభద్ర బోర్డు చైర్మన్‌గా వీరేంద్ర శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర జల్‌శక్తి శాఖ అదనపు కార్యదర్శి కేపీ నారాయణన్ ఉత్తర్వులు జారీ చేశారు. బెంగుళూరులోని కేంద్ర జల సంఘం కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న వీరేంద్ర శర్మకు తుంగభద్ర బోర్డు చైర్మన్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం తుంగభద్ర బోర్డు చైర్మన్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న డీఎం రాయ్‌పురేను తప్పించింది. కృష్ణాబోర్డు సభ్య కార్యదర్శిగా డీఎం రాయ్‌పురే కొనసాగనున్నారు.

మావోయిస్టు పార్టీ డిప్యూటీ కమాండర్ లొంగుబాటు



వివరాలు వెల్లడిస్తున్న ఓఎస్డీ మహేశ్వరరెడ్డి

ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా): సీపీఐ మావోయిస్టు పార్టీ కిష్టారం ఏరియా కమిటీ ఎల్‌వోఎస్ డిప్యూటీ కమాండర్ మడివి ఊరలు అలియాస్ ఊర పోలీసుల ఎదుట లొంగిపోయాడు. స్థానిక పోలీసు స్టేషన్లో శనివారం ఓఎస్డీ కె.మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ రాహుల్ మీనా వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోటక్‌పల్లి పంచాయతీ సాకిలేరు గ్రామానికి చెందిన ఊర ఎల్‌వోఎస్ డిప్యూటీ కమాండర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు విసిగిపోయిన ఊర జనజీవన స్రవంతిలో కలవాలని ఎస్పీ తుహిన్‌సిన్హా ఎదుట లొంగిపోయినట్లు ఓఎస్డీ తెలిపారు. పలు హింసాత్మక ఘటనల్లో ఊర పాల్గొన్నాడని వారు వివరించారు. పోలీసులు చేపడుతున్న పరివర్తన, ఆత్మీయ సమ్మేళన, స్ఫూర్తి కార్యక్రమాలకు ఆకర్షితుడై లొంగిపోయాడని తెలిపారు.

నిర్బంధానికి సరైన కారణం ఉండాలి

- జీఎస్టీ చట్టంకింద విచక్షణా రహితంగా అరెస్టులు సరికాదు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్



సాక్షి, హైదరాబాద్: జీఎస్టీ చట్టం కింద విచక్షణారహితంగా వ్యాపారులను అరెస్టులు చేయడం మంచిది కాదని, నిర్బంధానికి సరైన కారణాలు అధికారుల వద్ద ఉండాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అభిప్రాయపడ్డారు. అనుమానాలు ఉన్నాయన్న కారణంతో జీఎస్టీ చట్టంలోని సెక్షన్ 69 కింద నిర్బంధం సరికాదని వ్యాఖ్యానించారు. జీఎస్టీ అంశంలో వ్యాపారులను అరెస్టు చేయడానికి అనుమతించే ముందు అందుకు కారణాలను లిఖితపూర్వకంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. శనివారం ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ (సౌత్‌జోన్), తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సంయుక్తంగా హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ పన్నుల సదస్సుకు జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ.. 'పన్ను వసూలు అనేది సమాజానికి నాడు, నేడు కీలకమైన అంశాల్లో ఒకటి. ఇది ఏ దేశంలో అయినా ప్రభుత్వాన్ని నడపడానికి ఎంతో అవసరం. శతాబ్దాల నుంచి పన్ను విధింపు చట్టాలు మారుతూ వస్తున్నాయి. ఒక తేనెటీగ పువ్వు నుంచి మకరందాన్ని ఎలా సేకరిస్తుందో పన్ను వసూలు కూడా అంతే సున్నితంగా జరగాలని కౌటిల్యుడు వందేళ్ల క్రితమే చెప్పాడు. భారత్‌లో కొత్త పన్ను విధానాలతో దేశం పురోగతిలో పయనిస్తోంది' అని అన్నారు.

యువకుడికి 60 ఏళ్ల జైలు శిక్ష

- ముగ్గురు బాలికలను వంచించిన ఫలితం
- ఒక్కో కేసులో 20 ఏళ్ల చొప్పున..
- మూడు కేసుల్లో జగిత్యాల జిల్లా సెషన్స్ జడ్జి సంచలన తీర్పు

జగిత్యాలరూరల్: చిన్నారులకు మాయ మాటలు చెప్పి.. అశ్లీల చిత్రాలు చూపించి వంచించిన ఓ యువకుడికి మూడు కేసుల్లో ఒక్కో కేసుకు 20 ఏళ్ల చొప్పున 60 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా సెషన్స్ జడ్జి నీలిమ శనివారం సంచలన తీర్పునిచ్చారు. అలాగే బాధిత బాలికలకు రూ.3 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ఆదేశించారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం దట్నూరు గ్రామానికి చెందిన కొడిమ్యాల హరికృష్ణ అలియాస్ హరీశ్ (27) గ్రామంలో కిరాణంషాపు నిర్వహిస్తున్నాడు. ఆయన షాపునకు వచ్చే ముగ్గురు బాలికలకు సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుకోమని ఇచ్చి వారి పక్కన కూర్చుని బూతు వీడియోలు, ఫొటోలు చూపిస్తూ వారిపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న బాలికల తల్లిదండ్రులు హరీశ్‌పై గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మూడు పోక్సో కేసులు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ ప్రకాశ్, సీఐ బిల్లా కోటేశ్వర్, ఎస్సై శ్రీధర్‌రెడ్డి ఆధారాలు సేకరించి.. కోర్టుకు సమర్పించారు. నేరం రుజువుకావడంతో నిందితుడికి ఒక్కో కేసులో 20 ఏళ్ల జైలుశిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. అలాగే ఒక్కో బాలికకు రూ.3 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. మూడు కేసుల్లో శిక్షను ఏకకాలంలో అమలు చేయాలని తీర్పులో పేర్కొన్నారు.

'ఆటోమేటిక్' హిట్


సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వేలో ఆటోమేటిక్, యూటీఎస్ యాప్ టిక్కెట్ విక్రయాలకు అనూహ్యమైన ఆదరణ లభిస్తోంది. ప్రతి రోజు లక్షలాది మంది ప్రయాణికులు ఈ సదుపాయాలను వినియోగించుకుంటున్నారు. సాధారణ టిక్కెట్ విక్రయాల కోసం దక్షిణమధ్య రైల్వే అన్‌రిజర్వ్‌డ్ టిక్కెట్ సిస్టమ్‌తో పాటు, ఆటోమేటిక్ టిక్కెట్ వెండింగ్ యంత్రాలను అందుబాటులోకి తెచ్చింది. రైల్వేస్టేషన్‌లలో టిక్కెట్ కౌంటర్ల వద్ద గంటల తరబడి పడిగాపులు కాయవలసిన అవసరం లేకుండా డిజిటల్ చెల్లింపుల ద్వారా టిక్కెట్‌లను కొనుగోలు చేసేందుకు యూటీఎస్ దోహదం చేస్తుంది. ఆటోమేటిక్ టిక్కెట్ వెండింగ్ (ఏటీవీఎం) యంత్రాల వద్ద కూడా సాధారణ టిక్కెట్‌లను కొనుగోలు చేయవచ్చు. దక్షిణమధ్య రైల్వేలో ప్రతి రోజు 44 శాతం టిక్కెట్‌లు ఈ రెండు విధానాల్లోనే కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. మొబైల్ ఫోన్‌లలో యూటీఎస్ యాప్‌ను కలిగిన ప్రయాణికులు తమ ప్రయాణానికి అరగంట ముందు కూడా టిక్కెట్‌లను కొనుగోలు చేయవచ్చు. రిజర్వేషన్ టిక్కెట్‌లు మినహా అన్ని జనరల్ టిక్కెట్‌లను కొనుగోలు చేయవచ్చు.అలాగే ప్లాట్‌ఫాం టిక్కెట్‌లు, ఎంఎంటీఎస్ టిక్కెట్‌లు కూడా యూటీఎస్, ఏటీవీఎంల ద్వారా కొనుగోలు చేసే సదుపాయం ఉంది. అలాగే ప్రయాణికుల సేవలపైన చెల్లింపులపైన దక్షిణ మధ్య రైల్వే దశల వారీగా డిజిటలైజేషన్ చేపట్టింది. అన్ని ప్రధాన స్టేషన్‌లలో ఏటీవీఎంలు, యూటీఎస్ యాప్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. నగరంలోని సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, లింగంపల్లి, బేగంపేట్, హైటెక్‌సిటీ, తదితర స్టేషన్‌ల నుంచి ప్రతి రోజూ 3 లక్షల మందికి పైగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు.రిజర్వేషన్‌లపై దూరప్రాంతాలకు బయలుదేరే సుమారు లక్ష మంది ప్రయాణికులను మినహాయిస్తే 2 లక్షల మంది సాధారణ ప్రయాణికుల్లో 75 శాతం వరకు డిజిటల్ సేవలను వినియోగించుకుంటున్నట్లు అంచనా.

బాబు ఇచ్చిందే జనసేనకు ప్రాప్తం

ఇచ్చిన 21 సీట్లలోనూ ఇష్టానుసారం మార్పులు

- కొత్తగా పి. గన్నవరం జనసేనకు కేటాయించిన చంద్రబాబు
- అక్కడ టీడీపీ అభ్యర్థిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో జనసేనకు కేటాయింపు
- కూటమిలో ఇప్పటికీ 19 స్థానాల్లో అభ్యర్థుల ఖరారుపై అస్పష్టతే
- అందులో రెండింటిలో జనసేన – టీడీపీ మధ్య అటూ ఇటూ మార్పులు
- బీజేపీకి కేటాయించిన పది స్థానాల్లోనూ రెండింటిలో ఇదే పరిస్థితి

సాక్షి, అమరావతి: టీడీపీతో పొత్తు పెట్టుకున్న జనసేనకు చంద్రబాబు ఇచ్చిందే ప్రాప్తం అన్నట్లుగా పరిస్థితి తయారైంది. చంద్రబాబు ఎన్ని సీట్లు ఇస్తానంటే అవే మహా ప్రసాదంగా, ఏ సీటు ఇస్తానంటే దానినే పవన్‌కళ్యాణ్ స్వీకరించే పరిస్థితి కొనసాగుతోంది. నెల కిత్రం టీడీపీ అభ్యర్థిని అధికారికంగా ప్రకటించిన పి. గన్నవరం అసెంబ్లీ స్థానాన్ని ఇప్పుడు చంద్రబాబు వద్దనుకొని, జనసేనకు కేటాయించారు. ఆ స్థానంలో ప్రకటించిన టీడీపీ అభ్యర్థి మహాసేన రాజేష్ అభ్యర్థిత్వంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో అక్కడ తప్పనిసరిగా పార్టీ అభ్యర్థిని మార్చాల్సి వచ్చింది. దీంతో చంద్రబాబు పి.గన్నవరం సీటును జనసేనకు ఇచ్చేశారు. అదీ అదనంగా కాదు.. అంతకు ముందు కేటాయించిన 21లో దీనినీ ఒకటిగా చేశారు. మరోవైపు.. క్షేత్రస్థాయిలో జనసేన నాయకులు బలంగా కోరుకుంటున్న స్థానాలను మాత్రం ఆ పార్టీకి కేటాయించేందుకు చంద్రబాబు ఇష్టపడటం లేదు. వాటిపై ఎటూ తేల్చడంలేదు. టీడీపీ – జనసేన – బీజేపీ కూటమిలో ఇప్పటికీ అభ్యర్థులు ఖరారు కాని భీమిలి, విజయవాడ వెస్ట్ వంటి స్థానాల కోసం జనసేన నాయకులు ఆందోళనలు చేస్తున్నారు. ఇప్పుడు అక్కడ జనసేన టికెట్టు కోరుకుంటున్న నాయకులే గత ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేశారు. పొత్తులో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం కావాలని బీజేపీ కోరితే, చంద్రబాబు అది కాకుండా వెస్ట్ నియోజకవర్గం బీజేపీకి ఇచ్చి, ఇప్పుడు ఆ నియోజకవర్గంలో బీజేపీ, జనసేన నాయకుల మధ్య చిచ్చు పెట్టారు. భీమిలి స్థానాన్ని జనసేన గట్టిగా కోరుకుంటున్నా, చంద్రబాబు తేల్చడంలేదు. ఇలా జనసేన గానీ, పవన్ గానీ కోరుతున్న సీట్లను కాకుండా కేవలం టీడీపీ వద్దనుకునే సీట్లను మాత్రమే మిత్ర పక్షాలకు కేటాయిస్తున్నారని కూటమి నేతల్లో చర్చ జరుగుతోంది.



ఇంకా తేల్చని స్థానాలు 19

బీజేపీకి ఇచ్చిన 10 స్థానాలతో కలిపి కూటమిలో ఇప్పటికీ 19 స్థానాలపై అస్పష్టత నెలకొంది. బీజేపీకి ఏ స్థానాలన్నది ఇప్పటికీ తేలలేదు. పాలకొండ, ఎచ్చెర్ల, పాడేరు, విశాఖ నార్త్, కైకలూరు, విజయవాడ వెస్ట్, జమ్మలమడుగు, బద్వేలు, ఆదోని, ధర్మవరం స్థానాలు బీజేపీకి కేటాయించారన్న ప్రచారం సాగుతోంది. అయితే, ఈ స్థానాల్లో కనీసం రెండింటిలో మార్పులు ఉండే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు అంటున్నాయి. ఇంకా.. చీపురుపల్లి, భీమిలి, అవనిగడ్డ, దర్శి, అలూరు, గుంతకల్లు, రైల్వే కోడూరు, రాజంపేట, అనంతపురం అర్బన్ స్థానాల్లో ఎక్కడ ఏ పార్టీ పోటీ చేస్తుందన్నదీ తేలాల్సి ఉంది. వీటిలో చీపురుపల్లిలో టీడీపీనే పోటీ చేస్తుందని ఖాయంగా పార్టీ వర్గాలు చెబుతుంటే.. అవనిగడ్డలో జనసేనే పోటీ చేస్తుందని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

కూటమిలో ఎవరికేమిటో తేలింది 156 సీట్లే..

రాష్ట్రంలో మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ 144, జనసేన 21, బీజేపీ 10 స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించాయి. టీడీపీ మొదటి జాబితాలో 94, రెండో జాబితాలో 34, మూడో జాబితాలో మరో 11 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. అయితే, మొదట ప్రకటించిన పి. గన్నవరం స్థానాన్ని ఇప్పుడు జనసేనకు కేటాయించింది. జనసేన 21 స్థానాల్లో ఏడింటికి అభ్యర్థులను అధికారికంగా ఖరారు చేసింది. అనధికారికంగా మరో 11 స్థానాల అభ్యర్థులను ఖరారు చేసింది. గత నెల 24న చంద్రబాబుతో కలిసి నెల్లిమర్ల, తెనాలి, అనకాపల్లి, రాజానగరం, కాకినాడ రూరల్‌కు జనసేన అభ్యర్థులను పవన్ అధికారికంగా ప్రకటించారు. తర్వాత నిడదవోలుకు అభ్యర్థిని ప్రకటించారు. పిఠాపురం నుంచి తానే పోటీ చేస్తున్నట్లు పవన్ ప్రకటించారు. విశాఖ దక్షిణ, భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, పెందుర్తి, యలమంచిలి, ఉంగుటూరు, తిరుపతి, రాజోలు స్థానాల్లో అభ్యర్థులను అనధికారికంగా నిర్ణయించి, వారికి మంగళగిరిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ లెటర్ హెడ్‌పై పవన్ సంతకం చేసిన లెటర్లు అందజేశారు. కొత్తగా జనసేనకు వచ్చిన పి. గన్నవరానికి అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణను ఖరారు చేసి, ఆయన్ని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా నియమించారు. పోలవరం స్థానంలోనూ జనసేనే పోటీ చేస్తుందని చెప్పి, అక్కడ చిర్రి బాలరాజును ఖరారు చేసి, ఆయనకూ ఎన్నికల నియమావళి, నిబంధనల పత్రాలను పవన్ శనివారం అందజేశారు. దీంతో జనసేనకు కేటాయించిన 21 స్థానాల్లో ఇంకా మూడు స్థానాలు, వాటిలో అభ్యర్థులు ఖరారు కావాల్సి ఉంది. టీడీపీ ప్రకటించిన 138 స్థానాలకు, జనసేన అధికారికంగా, అనధికారికంగా ఖరారు చేసిన 18 స్థానాలు కలిపి మొత్తం 156 స్థానాల్లో కూటమి పార్టీల అభ్యర్థులు ఖరారయ్యారు.

ఏపీ బీజేపీ అభ్యర్థుల జాబితా ఖరారు

- ఆరు లోక్‌సభ.. 10 అసెంబ్లీ స్థానాలు కొలిక్కి
- కేంద్ర ఎన్నికల కమిటీలో జాబితాపై నిర్ణయం
- హాజరైన ప్రధాని మోదీ, అమిత్ షా, నడ్డా
- ఒకట్రెండు రోజుల్లో అధికారిక ప్రకటన

సాక్షి, న్యూఢిల్లీ: పొత్తులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులను బీజేపీ అధిష్టానం ఖరారు చేసింది. టీడీపీ, జనసేనలతో పొత్తు ఒప్పందంలో బీజేపీకి కేటాయించిన ఆరు లోక్‌సభ స్థానాలు, 10 అసెంబ్లీ స్థానాలకు సిద్ధం చేసిన జాబితాకు ఆమోదముద్ర పడింది. ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశంలో గత కొన్నిరోజులుగా రాష్ట్ర నాయకత్వం కసరత్తు చేసి సిద్ధంచేసిన అభ్యర్థుల జాబితాపై కూలంకషంగా చర్చించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, ఎంపీ డా. కె.లక్ష్మణ్, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సహా కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభ్యర్థుల జాబితాపై ఉత్కంఠ..

సీఈసీ భేటీలో ఏపీతో పాటు ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, ఒడిశా, రాజస్థాన్, పశ్చిమబెంగాల్ సహా మొత్తం 11 రాష్ట్రాల నాయకత్వాలు సిద్ధంచేసిన లోక్‌సభ అభ్యర్థులు, అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలపై వారితో విడివిడిగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజులు ఈ భేటీలో పాల్గొన్నారు. పొత్తులో భాగంగా బీజేపీకి టీడీపీ కేటాయించిన ఆరు స్థానాల విషయంలో రాష్ట్ర సీనియర్ నాయకుల్లో నెలకొన్న అసంతృప్తి నేపథ్యంలో ఎవరి అభ్యర్థిత్వానికి అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందనే అంశంపై ఆసక్తి నెలకొంది. పార్టీలో జరుగుతున్న చర్చ ప్రకారం.. రాజమండ్రి, రాజంపేట, అమలాపురం, తిరుపతి, అరకు, నరసాపురం, విజయనగరం స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశారన్న ఊహాగానాల నేపథ్యంలో ఏ ఆరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తారన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఇక టీడీపీ గెలిచే స్థానాలను తమ వద్ద ఉంచుకుని మిగిలిన స్థానాలను తమకు కేటాయించిందని అసంతృప్తి వ్యక్తంచేస్తూ రాష్ట్ర సీనియర్ నాయకులు ఇటీవల రాసిన లేఖను అధిష్టానం ఏ మేరకు సీరియస్‌గా తీసుకుందనేది ఒకట్రెండు రోజుల్లో అధికారికంగా విడుదలయ్యే జాబితాతో వెల్లడవుతుందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

టోటల్ డర్టీ పాలిటిక్స్!

- టీడీపీ కార్యకర్తలకే కండువాలు వేసి ఫొటోలకు ఫోజులు
- పార్టీలో చేరినట్లు అసత్య కథనాలు



ఈ చిత్రం పుట్టపర్తి నియోజకవర్గం బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లిలో రెండు రోజుల క్రితం తీసింది. ఇక్కడ ఒకరో ఇద్దరో టీడీపీలోకి వెళ్లారు. కానీ మొత్తం 250 కుటుంబాలు చేరినట్లు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రచారం చేసుకున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఆదినారాయణ. పుట్టపర్తి నియోజకవర్గం కొత్తచెరువు నివాసి. ఎన్నో ఏళ్లుగా టీడీపీలో ఉన్నారు. అయితే రెండు రోజుల క్రితం టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి కండువా వేసి పార్టీలో చేరినట్లు ప్రచారం చేశారు.



ఇక్కడ ఫొటోలో కనిపిస్తున్న వారిలో ఒక్కరు మాత్రమే వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లారు. మిగతా అందరూ టీడీపీలో కొన్నేళ్లుగా కొనసాగుతున్న వారే. కొత్తగా అందరికీ కండువాలు వేసి.. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారని ఎల్లో మీడియా ద్వారా మాజీ మంత్రి పరిటాల సునీత ప్రచారం చేసుకున్నారు.

సాక్షి, పుట్టపర్తి: అధికారం కోసం 'తమ్ముళ్లు' నానా తంటాలు పడుతున్నారు. అధినేత ఆదేశాల మేరకే తప్పుదోవ పడుతున్నారు. ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని టీడీపీ కార్యకర్తలు అసత్య కథనాలను ప్రచారం చేస్తున్నారు. రోజురోజుకూ టీడీపీని వీడుతున్న వారి సంఖ్య పెరుగుతున్న క్రమంలో దిక్కుతోచని స్థితిలో టీడీపీ నేతలు అసత్య వార్తలను ఎల్లో మీడియా ద్వారా జనాల్లోకి తీసుకెళ్తున్నారు. టీడీపీలో ఉన్న వారికే కండువాలు వేసి ఫొటోలకు ఫోజులు ఇచ్చి.. కొత్తగా పార్టీలో చేరినట్లు వార్తలు రాయిస్తున్నారు. ఒకరిద్దరికి కండువాలు వేసి వందల కుటుంబాలు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరినట్లు ఉత్తి ప్రచారం చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఇటీవల పుట్టపర్తి, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో ఇలాంటి ఘటనలు వెలుగు చూశాయి. అయితే వాస్తవాలు తెలుసుకున్న ప్రజలు, చివరకు టీడీపీ కార్యకర్తలు కూడా నేతల తీరుపై మండిపడుతున్నారు. పార్టీ క్రెడిబులిటీ పోతుందని వాపోతున్నారు.

ఓటర్లను మభ్య పెట్టేందుకే..

టీడీపీ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతోంది. పార్టీ వీడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. ధర్మవరంలో వార్డుల వారీగా ఆ పార్టీ ఖాళీ అవుతోంది. పరిటాల ఇలాకాలోని గ్రామాల్లో సైతం వైఎస్సార్‌సీపీలోకి వెల్లువలా చేరుతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్న వారిని కాపాడుకునే క్రమంలో టీడీపీ నేతలు వాళ్లకే మళ్లీ మళ్లీ కండువాలు వేసి పార్టీలో చేరినట్లు ప్రకటిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనే సత్తా లేకే..

శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ హవా కొనసాగుతోంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచారానికి అనూహ్య స్పందన వస్తోంది. ప్రజాదరణను చూసి ఓర్వలేని టీడీపీ నేతలు తప్పుడు ప్రచారాలకు పూనుకున్నారు. అందుకు ఎల్లో, సోషల్ మీడియాలను ఉపయోగించుకుంటున్నారు. ఫలితంగా ప్రజల్లో మరింత చులకన అవుతున్నారు.

మహిళా నేతలనూ వంచించిన బాబు

- మాజీ మంత్రి పీతల సుజాతకు సీటు ఇవ్వకపోగా అవమానం
- ఓడిపోయే తిరుపతి ఉప ఎన్నికలో పనబాకను పోటీ చేయించిన బాబు
- ఈ ఎన్నికల్లో ఎంపీ సీటు, ఆమె భర్తకు ఎమ్మెల్యే సీటిస్తానని హామీ
- ఎన్నికలు వచ్చేసరికి ఒక్క సీటూ ఇవ్వకుండా మోసం
- మాజీ స్పీకర్ ప్రతిభా భారతికీ మొండిచేయి
- మహానాడులో తొడగొట్టిన ఆమె కుమార్తె గ్రీష్మకు సీటు నిరాకరణ
- ఆది నుంచి అండగా ఉన్న గుండా లక్ష్మీదేవికీ నో టికెట్టు
- గిడ్డి ఈశ్వరి, వంతల రాజేశ్వరి, ఉప్పులేటి కల్పనలకూ టికెట్లు లేవు
- ఫిరాయింపు ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవికి మొండిచేయి


ప్రతిభా భారతి


పీతల సుజాత


పనబాక లక్ష్మి


ఉండవల్లి శ్రీదేవి


గుండా లక్ష్మీదేవి


ఉప్పులేటి కల్పన


గిడ్డి ఈశ్వరి


వంతల రాజేశ్వరి

సాక్షి, అమరావతి : చంద్రబాబు అంటేనే మోసం అన్న విషయం తెలుగుదేశం పార్టీలోని మహిళా నేతలకూ అనుభవపూర్వకంగా తెలిసివచ్చింది. రాజకీయాల్లో మహిళలను ప్రోత్సహిస్తానని, వారి పట్ల తనకు ఎనలేని గౌరవం ఉందంటూ చంద్రబాబు చెప్పే మాటలన్నీ వంచనపూరితమేనని స్పష్టమైంది. టీడీపీ కోసం సుదీర్ఘకాలం పనిచేసిన పలువురు మహిళలకు ఆయన అవమానకర రీతిలో సీట్లు నిరాకరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మాజీ మంత్రి పీతల సుజాతను అవమానకర రీతిలో పక్కన పెట్టారు. పార్టీ కోసం ఆమె సేవలను ఉపయోగించుకుని చింతలపూడి సీటు ఇవ్వకపోగా, ఆమె వల్ల ఎలాంటి ఉపయోగం లేదంటూ అవమానించారు. చింతమనేని ప్రభాకర్, మాగంటి బాబు వంటి నేతల అహంకారానికి దళిత మహిళనైన తాను బలైనట్లు ఆమె వాపోతున్నారు. వారు చెప్పినట్టు నడుచుకోలేదనే కారణంతోనే చంద్రబా బు సీటు తిరస్కరించారన్న వాదన పార్టీలో ఉంది.

పనబాకను మోసం చేసిన బాబు

టీడీపీలో మరో కీలక నేత, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మికి చంద్రబాబు మొండిచేయి చూపారు. గత ఎన్నికల్లో తిరుపతి ఎంపీ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయిన ఆమెను తిరుపతి ఉప ఎన్నికల్లోనూ పోటీ చేయించారు. వైఎస్సార్‌సీపీ బలంగా ఉన్నప్పటికీ, చంద్రబాబు మాట విని పార్టీ కోసం ఓటమికి సిద్ధమయ్యే పోటీకి దిగారు. వాస్తవంగా తిరుపతి ఉప ఎన్నికలో పోటీ చేయడానికి టీడీపీ నేతలెవరూ ముందుకు రాలేదు. ఉప ఎన్నికలో పోటీ చేస్తే వచ్చే ఎన్నికల్లో తిరుపతి ఎంపీ సీటుతోపాటు ఆమె భర్త కృష్ణయ్యకు ఎమ్మెల్యే సీటు కూడా ఇస్తానని చంద్రబాబు మభ్యపెట్టి పనబాకను పోటీకి దింపారు. అసలు ఎన్నికలు వచ్చేసరికి చంద్రబాబు ఆమెను వంచించారు. ఈ ఎన్నికల్లో పూర్తిగా పక్కనపెట్టేశారు. బాపట్ల, తిరుపతి ఎంపీ స్థానాల్లో ఏదో ఒక చోట అవకాశమివ్వాలని కోరినా పట్టించుకోలేదు. కష్టకాలంలో పార్టీ వెంట నిలబడ్డ తనను చంద్రబాబు మోసం చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిభా భారతికి మొండిచేయి

టీడీపీలో సీనియర్ నేత, మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతికీ బాబు సీటు నిరాకరించారు. ఆమె తన కుమార్తె గ్రీష్మకు శ్రీకాకుళం జిల్లా రాజాం సీటు ఇవ్వాలని కోరినా చంద్రబాబు పట్టించుకోలేదు. గ్రీష్మ టీడీపీ మహానాడులో తొడకొట్టి మరీ వైఎస్సార్‌సీపీ నేతలపై విరుచుకుపడడం చర్చనీయాంశమైంది. అలాంటి నేతలకు పార్టీలో అవకాశాలు ఇస్తామని చంద్రబాబు చెప్పారు. కానీ చివరికి రాజాం సీటును కొండ్రు మురళీమోహన్‌కి ఇచ్చారు. తన తండ్రి హయాం నుంచి టీడీపీని నమ్ముకున్న ఆమె కుటుంబానికి టీడీపీలో న్యాయం జరగలేదని ఆమె అనుచరులు చెబుతున్నారు. శ్రీకాకుళంలోనూ ఆది నుంచి పార్టీకి దన్నుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే గుండా లక్ష్మీదేవి స్థానంలో ధనబలం ఉన్న గొండు శంకర్‌కు సీటిచ్చారు.

అప్పుడు మభ్యపెట్టారు.. ఇప్పుడు మోసగించారు

2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పాడేరు, రంపచోడవరం, పామర్రు అసెంబ్లీ స్థానాల్లో గెలిచిన గిడ్డి ఈశ్వరి, వంతల రాజేశ్వరి, ఉప్పులేటి కల్పనలను మభ్యపెట్టి చంద్రబాబు టీడీపీలో చేర్చుకున్నారు. గత ఎన్నికల్లో ఆ ముగ్గురూ ఓడిపోయినా నియోజకవర్గాల్లో తిరుగుతూ పనిచేశారు. కానీ సమీకరణలు, ధన బలం లేదనే కారణంతో ఈ ఎన్నికల్లో వారికి సీట్లు ఇవ్వకుండా అవమానించారు. చంద్రబాబు తమను నమ్మించి మోసం చేశారని గిడ్డి ఈశ్వరి, వంతల రాజేశ్వరి ఆందోళన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిని కూడా మభ్యపెట్టి టీడీపీలో చేర్చుకుని ఇప్పుడు సీటు లేకుండా చేశారు. చంద్రబాబు మోసం చేశారనే ఉద్దేశంతో రాజకీయాలు ఎలా ఉంటాయో తనకు ఇప్పుడు అర్థమైందంటూ ఆమె ఎక్స్(ట్విటర్)లో వాపోయారు. గత ఎన్నికల్లో టీడీపీ తరఫున రాజమండ్రి నుంచి గెలిచిన ఒకే ఒక ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీకి ఈసారి సీటు లేకుండా చేశారు. భవానీ బదులు ఆమె భర్తకు అవకాశం ఇచ్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ఆలూరులో కోట్ల సుజాతమ్మకు కూడా హ్యాండిచ్చేందుకు చంద్రబాబు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

పోడూరు/నరసాపురం రూరల్/కొత్తపేట/భీమవరం: పశ్చిమ గోదావరి జిల్లాలో వైఎస్సార్‌సీపీలో టీడీపీ, జనసేన కార్యకర్తల చేరికలు శనివారం కొనసాగాయి. పోడూరు మండలం వద్దిపర్రుకి చెందిన 50 మందికి పైగా టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ పాలకొల్లు అభ్యర్థి గుడాల గోపి సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సొసైటీ మాజీ డైరెక్టర్, టీడీపీ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు గెద్దాడ ప్రసాద్ తదితరులున్నారు. నరసాపురం మండలం మల్లవరంలో జనసేన, టీడీపీల నుంచి 50 మంది నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. భీమవరం 29వ వార్డుకు చెందిన 50 మంది జనసేన కార్యకర్తలు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో తలారి హనుమంతరావు, వర్ధనపు సురేష్‌బాబు, వెలిగట్ల గంగరాజు, కొండేటి నాగభూషణం, బుడ్డిగ శ్రీనివాస్, బొంగా సూరిబాబు, కొల్లి క్రాంతి కుమార్, గంధం లక్ష్మీసాయి, సన్నబల మణికంఠ తదితరులున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట శివారు పెదగూళ్లపాలేనికి చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలు ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.



భీమవరంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన శ్రేణులతో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



ఎమ్మెల్యే ముదునూరి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి

జగన్ మళ్లీ సీఎం కావాలంటూ మోకాళ్లపై కోటప్పకొండకు..

- అభిమానం చాటుకున్న ఎంపీటీసీ సభ్యుడు పెదకోటేశ్వరరావు
- 175 స్థానాల్లో విజయం సాధించాలంటూ పూజలు



నరసరావుపేట రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని కోటప్పకొండ మెట్ల మార్గాన్ని మోకాళ్లపై ఎక్కి తన అభిమానాన్ని చాటుకున్నారు మృత్యుంజయపురం ఎంపీటీసీ సభ్యుడు పెదకోటేశ్వరరావు. పల్నాడు జిల్లా, నూజెండ్ల మండలం, మృత్యుంజయపురం గ్రామానికి చెందిన మువ్వా పెదకోటేశ్వరరావు ఎంపీటీసీగా పనిచేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున 3 గంటలకు కొండ దిగువున వినాయకుని ఆలయం నుంచి బయలుదేరి 703 మెట్లను మోకాళ్లపై ఎక్కుతూ ఉదయం 7 గంటలకు కొండపైకి చేరుకున్నారు. పేదల సంక్షేమ కోసం కృషి చేస్తున్న సీఎం జగన్ వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని, 175 స్థానాల్లో పార్టీ విజయకేతనం ఎగురవేయాలని స్వామి వారిని వేడుకున్నట్లు చెప్పారు. 2019 ఎన్నికల సమయంలో ఇదే విధంగా మెట్లమార్గాన్ని మోకాళ్లపై ఎక్కి స్వామి వారిని దర్శించుకున్నట్టు కోటేశ్వరరావు తెలిపారు.

క్లుప్తంగా...

భువనేశ్వరి నగదు పంపకంపై చర్యలు

సీఈవో మీనా ఆదేశాలు

సాక్షి, అమరావతి: రాయచోటి నియోజకవర్గంలో నారా భువనేశ్వరి నగదు (చెక్కులు) అందించడంపై విచారించి కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుని ఆ నివేదికను 24 గంటల్లో తనకు పంపాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు సీఈవో ముఖేష్ కుమార్‌మీనా ఆదేశాలు జారీ చేశారు. భువనేశ్వరి నిజం గెలవాలి పేరుతో నిర్వహిస్తున్న యాత్రలో కొన్ని కుటుంబాలకు నగదు అందించడం ఎన్నికల కోడ్‌కు విరుద్ధమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ఈ నెల 21న ఆధారాలతో సహా ఇచ్చిన ఫిర్యాదుపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పందించి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది.

అనుమతి లేకుండా భువనేశ్వరి సభ

చిల్లకూరు: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న వేళ చంద్రబాబు సతీమణి భువనేశ్వరి అధికారుల అనుమతిలేకుండా ఓ సభలో పాల్గొని ప్రసంగించారు. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం బూదనం సమీపంలోని ఓ హోటల్‌లో శనివారం 'మహిళా గ్రామిక శక్తి భువనమ్మ మాట' అనే కార్యక్రమాన్ని టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న భువనేశ్వరి తాను రాజకీయాలు మాట్లాడేందుకు రాలేదంటూనే.. రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో రాక్షసపాలన నడుస్తోందని, వైజాగ్‌ను డ్రగ్స్‌కు కేంద్రంగా మార్చారని విమర్శించారు. ఆ తర్వాత టీడీపీ ఎన్నికల హామీలను సభికులకు వివరించారు. చంద్రబాబు జైలుకు వెళ్లినప్పుడు జీర్ణించుకోలేక మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి, వారికి అండగా ఉండేలా ఆర్థికంగా ఆదుకునేందుకు తాను పర్యటిస్తున్నట్లు తెలిపారు. సుమారు వెయ్యి మంది పాల్గొన్న ఈ సమావేశానికి అనుమతులు లేవని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ భానుమూర్తి తెలిపారు. ఇక్కడ జరిగిన కార్యక్రమాన్ని వీడియో తీసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని వెల్లడించారు. అయితే మీడియా రాకుండా భువనేశ్వరి భద్రతా సిబ్బంది తొలుత అడ్డుకున్నారు. నిరసన తెలపడంతో తర్వాత అనుమతించారు. జనసేన, బీజేపీలకు చెందిన మహిళలు సభలో పాల్గొనకపోవడం విశేషం.

ఎన్నికల వ్యయ పరిమితి హద్దు దాటితే వేటుపడాలి

ఈసీఐ మాజీ డైరెక్టర్ జనరల్ పీకే దాష్

కృష్ణలంక (విజయవాడ తూర్పు): ఎన్నికల కమిషన్ నిర్దేశించిన వ్యయ పరిమితికి మించి అభ్యర్థులు వ్యయం చేస్తే వారిపై వేటు పడే విధంగా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలని ఈసీఐ మాజీ డైరెక్టర్ జనరల్ పీకే దాష్ పేర్కొన్నారు. గతంలో మధుకుడ (జార్ఖండ్), అశోక్ చౌహాన్ (మహారాష్ట్ర), నరోత్తం మిశ్రా (మధ్యప్రదేశ్), ఊర్మిళ జాదేబ్‌లను ఎన్నికల సంఘం నిర్దేశించిన వ్యయ పరిమితి కన్నా అధికంగా ఖర్చు చేసినట్లు రుజువు కావడంతో వారి సభ్యత్వాలను రద్దు చేసిందని గుర్తు చేశారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో 'స్వేచ్ఛాయుత ఎన్నికలు–అవినీతికి అడ్డుకట్ట' అనే అంశంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ పేర్కొన్న వ్యయానికి కన్నా 100 రెట్లు ఖర్చు పెడుతున్నా ఏ ఒక్కరిని తొలగించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పౌర సంస్థలు ముందుకు వచ్చి అభ్యర్థుల వ్యయాలపై కన్నేసి రుజువులతో ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు. సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్ కుమార్ మాట్లాడుతూ.. ఏపీలో ఎన్నికలు పూర్తయ్యేవరకు వలంటీర్లకు పెన్షన్, రేషన్ బియ్యం లాంటి పథకాలకు దూరంగా ఉంచాలని కోరారు. సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ సభలో హైస్కూల్ రికార్డ్ అసిస్టెంట్



టీడీపీ ఎన్నికల ప్రచార సభలో రుత్తల అజయ్

నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా): టీడీపీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న జెడ్పీ హైస్కూల్ రికార్డ్ అసిస్టెంట్ రుత్తల అజయ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ శనివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో), ఆర్డీవో హెచ్‌వీ జయరామ్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు భార్య పద్మావతి ఈ నెల 19వ తేదీన నర్సీపట్నం 26వ వార్డులో ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. ఈ సభలో నర్సీపట్నం మండలం వేములపూడి జెడ్పీ హైస్కూల్లో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రుత్తల అజయ్ పాల్గొన్నారని వైఎస్సార్‌సీపీ నేతలు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ రికార్డ్ అసిస్టెంట్ ఏమాత్రం పట్టించుకోలేదని, తగిన ఆధారాలను అందించారు. దీనిపై ఆర్వో స్పందిస్తూ విచారణ చేపట్టి తక్షణమే చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల ప్రవర్తన నియమావళి అధికారి లింకన్‌ను ఆదేశించారు.

క్లుప్తంగా...

ఐదేళ్లలో పెరిగిన తలసరి ఆదాయం

నెల్లూరు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి



కోవూరు : రాష్ట్రంలో 14 ఏళ్ల చంద్రబాబు పరిపాలన, ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన పోల్చి చూసుకుంటే ఎన్నోరెట్లు తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తి పెరిగిందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణంబాక విజయసాయిరెడ్డి చెప్పారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పంచేడులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం అప్పుల పాలైందంటూ చంద్రబాబు చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మాల్సిన అవసరం లేదని, పరిమితికి మించి అప్పు చేయలేదన్నారు. 2024 ఎన్నికల తర్వాత చంద్రబాబుకు రాజకీయ జీవితం పరిసమాప్తం అవుతుందని స్పష్టం చేశారు. లోకేశ్ రాజకీయాలకు పనికి రాడన్నారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

పేదల జీవితాల్లో మార్పే అభివృద్ధికి కొలమానం

వైఎస్సార్‌సీపీ మచిలీపట్నం లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖరరావు



అవనిగడ్డ : పేదల జీవితాల్లో వచ్చిన మార్పే నిజమైన అభివృద్ధికి కొలమానమని వైఎస్సార్‌సీపీ మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు చెప్పారు. కృష్ణా జిల్లా అవనిగడ్డలోని ఆయన స్వగృహంలో శనివారం మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ వారి జీవితాల్లో పెను మార్పులు తెచ్చారని ప్రశంసించారు. సముద్ర, నదీ తీరప్రాంతం ఎక్కువగా ఉన్న మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలో పేదలు వైద్యసేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా మచిలీపట్నం వైద్య కళాశాలలో అన్ని వైద్య సదుపాయాలూ అందేలా కృషి చేస్తానని చెప్పారు. నీతి నిజాయితీతో ప్రజలకు సేవలందించేందుకే రాజకీయాల్లో కొచ్చానని.. ఆదరిస్తే తన తండ్రి సత్యనారాయణరావులా మరింత సేవ చేస్తానని చంద్రశేఖరరావు చెప్పారు. ఆయన తనయుడు రామ్ చరణ్, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

ఓటర్ల ఆధార్ నంబర్లు సేకరిస్తున్న టీడీపీ

- ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు




విజయవాడలో ప్రజల ఆధార్ నంబర్లను తమ యాప్‌లలో ఎక్కిస్తున్న టీడీపీ నేతలు

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడసెంట్రల్): ఎన్నికల్లో ఓటర్లను మభ్య పెట్టేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. బాబు ష్యూరిటీ పేరుతో తెస్తున్న పథకాలు అందాలంటే ఆధార్ కార్డులను లింక్ చేయాల్సి ఉంటుందంటూ ప్రజలను నమ్మించి వారి ఆధార్ కార్డులను, ఫోన్ నంబర్లను సేకరిస్తున్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా విజయవాడలోని 57వ డివిజన్ అరుణోదయనగర్‌లో టీడీపీ నేతలు ఓటర్ల వివరాలను సేకరిస్తుండగా వైఎస్సార్‌సీపీ నేతలు వాటిని వీడియోలను తీసి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఫ్లయింగ్ స్క్వాడ్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. ఎవరైనా ఇటువంటివి గుర్తించినట్లయితే అక్కడి నుంచే నేరుగా తమకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

అభ్యర్థులపై మళ్లీ సర్వే చేయిస్తా

కూటమి అభ్యర్థుల వర్క్‌షాప్‌లో చంద్రబాబు



సాక్షి, అమరావతి : రాజకీయాల్లో కొత్తగా పొలిటికల్ రీ ఇంజినీరింగ్ చేయాల్సి వస్తోందని, అందుకే సోషల్ రీ ఇంజనీరింగ్ చేసి, వెతికి మరీ అభ్యర్థులకు సీట్లిచ్చానని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో ఆయన శనివారం విజయవాడలో వర్క్‌షాప్ నిర్వహించారు. బాబు మాట్లాడుతూ వ్యక్తిగత ప్రయోజనాల కోసం బీజేపీతో పొత్తు పెట్టుకోలేదని చెప్పారు. అభ్యర్థులు ఈ నెల రోజులూ జాగ్రత్తగా ఉండాలని, అందరిపైనా మళ్లీ సర్వేలు చేయిస్తామని చెప్పారు. ఏ మాత్రం తేడా వచ్చినా ఫోన్లు వస్తాయని హెచ్చరించారు. సీట్లు రాని అభ్యర్థులు మూడు పార్టీల్లో ఉన్నారని, అధికారంలోకి రాగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వారికి మంచి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. పవన్ కళ్యాణ్ పద్ధతైన వ్యక్తి అని కొనియాడారు. పురందేశ్వరి తమ కుటుంబ సభ్యురాలే అయినా ఆమె 30 ఏళ్లుగా వేరే పార్టీలో ఉన్నారని, దాన్నీ రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఏపీని జగన్ డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని ఆరోపించారు. తనకు, పురందేశ్వరికి పూర్ణచంద్రరావు బంధువు అని విజయసాయిరెడ్డి స్టేట్‌మెంట్ ఇస్తున్నాడని విమర్శించారు. 160కి పైగా స్థానాలతో ఏపీలో అధికారంలోకి రాబోతున్నామని, 24 లోక్‌సభ స్థానాలు గెలవబోతున్నామన్నారు. త్వరలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తామన్నారు.

ఎన్నికల వేళ బరితెగిస్తున్న కేటుగాళ్లు

విజయవాడలోని గుణదలకు చెందిన ఓ వ్యక్తికి ఇటీవల ఓ టెక్స్ట్ మెసేజ్ వచ్చింది. 'ఎన్నికల సర్వేలో చురుగ్గా పాల్గొంటున్నందున మా పార్టీ నుంచి కొన్ని రీడిమ్ పాయింట్లు ఇస్తున్నాం. ఈ పాయింట్ల కోసం ఈ కింది లింక్‌ను క్లిక్ చేయండి' అని అందులో ఉంది. పాయింట్లు వస్తాయనే ఆశతో సదరు వ్యక్తి లింక్‌ను క్లిక్ చేసి గూగుల్ ఫామ్‌లో వివరాలు నమోదు చేశాడు. ఆ వివరాల ఆధారంగా బ్యాంక్ ఖాతాలోని నగదును సైబర్ నేరగాళ్లు ఖాళీ చేయడంతో లబోదిబోమన్న బాధితుడు సైబర్ పోలీసులను ఆశ్రయించాడు.



- రాజకీయ పార్టీలు, ఎలక్షన్ కమిషన్ పేరిట మోసాలకు తెగబడుతున్న మోసగాళ్లు
- ఓటర్ కార్డు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని.. సరిచేయాలని నమ్మిస్తున్న సైబర్ చీటర్లు
- బహుమతులు ఎరగా చూపి బ్యాంక్ ఖాతాలు లూటీ
- అప్రమత్తంగా ఉండాలంటున్న సైబర్ క్రైమ్ పోలీసులు

విజయవాడ (స్పోర్ట్స్): కాలానికి అనుగుణంగా మోసాలకు పాల్పడటంలో ఆరితేరిన సైబర్ నేరగాళ్లు ఎన్నికల సీజన్ కావడంతో రాజకీయ పార్టీలు, ఎలక్షన్ కమిషన్ పేరుతో మోసాలకు తెగబడుతున్నారు. సర్వే అంటూ, ఓటరు కార్డు సరి చేయాలంటూ ఫోన్లు చేసి ప్రజల బ్యాంక్ ఖాతాలను లూటీ చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ తరహా మోసాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజయవాడ సైబర్ క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఎన్నికల సంఘం నుంచి నేరుగా ఎవరికీ ఫోన్ కాల్ రాదనే విషయాన్ని గ్రహించాలని సూచించారు.

సర్వే పేరుతో వివరాలు సేకరించి మోసాలు

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పలు రాజకీయ పార్టీలు సర్వేల పేరుతో ప్రజలకు ఫోన్లు చేస్తున్న విషయం తెలిసిందే. ఆయా పార్టీల ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల స్వభావం తెలుసుకునేందుకు, ఓట్లు అభ్యర్థించేందుకు పార్టీలు రికార్డింగ్ కాల్స్ మాత్రమే చేస్తున్నాయి. దీనినే కొందరు నేరగాళ్లు సైబర్ మోసాలకు వాడుకుంటున్నారు. ఫోన్ చేసిన ఆగంతకుడు ఏదో ఒక పార్టీ సర్వే పేరుతో తియ్యని మాటలతో ముగ్గులోకి దించుతున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థి స్వభావంపై తాము అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్తే ఆన్‌లైన్‌లో ఆకర్షణీయమైన గిఫ్ట్ పంపుతామని ఆశ పెడతారు. కొన్ని ప్రశ్నలు అడిగిన తరువాత మీరు గిఫ్ట్ పొందేందుకు అర్హత సాధించారని నమ్మిస్తారు. గిఫ్ట్ మీ ఇంటికి రావాలంటే మీ ఓటర్ కార్డ్, బ్యాంక్, ఆధార్, పాన్ వివరాలు చెప్పాలని అభ్యర్థిస్తారు. ఈ వివరాలన్నీ సేకరించిన తరువాత ఆయా బ్యాంక్ ఖాతాలో ఉన్న నగదును ఏఈపీఎస్ (ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్) ద్వారా ఖాళీ చేస్తారు. ఏఈపీఎస్ మోసాల్లో ఖాతాదారుడికి డబ్బులు వేరే ఖాతాకు డెబిట్ అయినట్టు కనీసం మెసేజ్ కూడా రాదు. ఖాతాలో నగదు లేకుండా అదే వ్యక్తి పేరున ఓ సిమ్ తీసుకుని సోషల్ మీడియా ఖాతాలతో పాటు బ్యాంక్ ఖాతా తెరుస్తున్నారు. వేరే వ్యక్తుల బ్యాంకు ఖాతాల నుంచి నేరగాళ్లు నగదును ముందుగా ఈ బ్యాంక్ ఖాతా, యూపీఐ యాప్‌లకు బదిలీ చేస్తారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే బాధితుడినే నేరగాడిగా మార్చేస్తున్నారు. సామాన్య ప్రజల పేరునే ఎక్కువగా బ్యాంకు ఖాతాలు తెరిచి నగదును ఆయా ఖాతాలకు నేరగాళ్లు బదిలీ చేస్తున్నారు. ఏదైనా ఫిర్యాదు రాగానే దాని ఆధారంగా ఆయా బ్యాంక్ ఖాతాను వెతుక్కుంటూ వెళ్లిన పోలీసులకు ముందుగా స్మార్ట్ ఫోన్ సరిగ్గా వాడటం తెలియని వ్యక్తులే తారసపడుతున్నారు.

రీడీమ్ పాయింట్లు ఎరగా చూపి..

సర్వే పేరుతో నేరగాళ్లు పలు రకాల ప్రశ్నలు వేసిన అనంతరం.. సర్వేలో చురుగ్గా పాల్గొన్న మీకు కొన్ని ఎస్‌బీఐ రీడిమ్ పాయింట్లు ఇచ్చామని, తాము పంపే లింక్ క్లిక్ చేసి గూగుల్ ఫామ్‌లో మీ వివరాలు నింపాలని సూచిస్తారు. ఫామ్‌లో నమోదు చేసిన వివరాల ఆధారంగా బ్యాంక్ ఖాతాలోని నగదును మొత్తం ఖాళీ చేస్తున్నారు.

ఓటర్ కార్డు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదంటూ..

ఓటర్ కార్డు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, వచ్చే ఎన్నికల్లో మీరు ఓటు హక్కును వినియోగించుకోలేరని ఫోన్ ద్వారా ప్రజలను నేరగాళ్లు ఆందోళనకు గురి చేస్తారు. ఎన్నికల సంఘం నుంచి మాట్లాడుతున్నామని నమ్మిస్తారు. వివరాలు చెప్తే సరి చేస్తామని, ఎనేబుల్డ్ అయిన కొత్త ఓటరు కార్డుతో నిర్భయంగా ఓటు వేయవచ్చని భరోసా ఇస్తారు. వాట్సాప్‌కు పంపే లింక్ క్లిక్ చేసి గూగుల్ ఫామ్‌లో వివరాలు నమోదు చేయాలని సూచిస్తారు. పాన్, ఆధార్‌తో పాటు అదనంగా బ్యాంక్ ఖాతా వివరాలు సేకరించి ఖాతాలోని నగదును లూటీ చేస్తారు.


అప్రమత్తంగా ఉండండి



ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ఫోన్లు రావని ప్రజలు గ్రహించాలి. ఓటరు కార్డు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని వచ్చే ఫోన్లకు స్పందించవద్దు. సర్వే పేరుతోరాజకీయ పార్టీలు రికార్డింగ్ కాల్స్ మాత్రమే చేస్తున్నాయి. అవతలి వ్యక్తి మాట్లాడే సర్వేలకు స్పందించాల్సిన అవసరం లేదు. గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు చెప్పొద్దు.గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే గూగుల్ ఫామ్‌లో వివరాలు నమోదు చేయొద్దు. రానున్న రోజుల్లో ఈ తరహా మోసాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండండి. – ఎస్‌డీ తేజేశ్వరరావు, ఏసీపీ, సైబర్ క్రైం, విజయవాడ

తాగునీటి పథకాలకు సమృద్ధిగా నిధులు

- కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మంచినీటి సరఫరా పథకాలకు సమృద్ధిగా నిధులున్నాయని.. వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చూడాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. మంచినీటి పథకాల నిర్వహణ కోసం ఇప్పటికే రూ.1,000 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. జూన్ నెలాఖరు వరకు వేసవి కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి 15 రోజులకొకసారి మండల, జిల్లా స్థాయిల్లో భూగర్భ జల మట్టాల స్థాయిని పర్యవేక్షించాలని ఆదేశించారు. బోరు బావుల పరిస్థితిని నిరంతరం పరిశీలించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు తగిన పనులు కల్పించాలని సీఎస్ ఆదేశించారు. ఎండ వేడి దృష్ట్యా ఉపాధి హామీ పనులను ఉదయం 5.30 గంటల నుంచి ఉదయం 10.30 గంటల వరకు నిర్వహించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా, ఉపాధి పనుల విధులు నిర్వర్తించే అధికారులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని స్పష్టం చేశారు. జలవనరులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మాట్లాడుతూ.. తాగునీటి సరఫరా కోసం జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీలకు మొత్తం రూ.1,000 కోట్లు విడుదల చేశామన్నారు. ఇంకా అవసరమైన నిధులు కూడా విడుదల చేస్తామని చెప్పారు. ఉన్నతాధికారులు కె.కన్నబాబు, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమంతా సిద్ధం..



మేమంతా సిద్ధం.. పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు

- 27 నుంచి సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్ర
- పోస్టర్ల ఆవిష్కరణ
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వచ్చే నెల 3, 4 తేదీల్లో బస్సు యాత్ర
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, తిరుపతి : ఎన్నికలకు 'మేమంతా సిద్ధం' అంటూ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రకటించారు. తిరుపతిలో శనివారం రీజనల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, భరత్, ఎంపీ గురుమూర్తి, రెడ్డెప్ప, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వెంకటేగౌడ, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, నియోజకవర్గ సమన్వయకర్తలు విజయానందరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి, రాజేష్, కృపాలక్ష్మి తదితరులు.. మేమంతా సిద్ధం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సిద్ధం పేరుతో ఇప్పటికే రాష్ట్రంలో నాలుగు చోట్ల భారీగా సభలు నిర్వహించామని, ఆ నాలుగు ప్రాంతాలు మినహాయించి మిగిలిన 21 జిల్లాల్లో మేమంతా సిద్ధం సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 27 నుంచి సీఎం జగన్ బస్సు యాత్ర ప్రారంభమవుతుందని.. అదే రోజు ప్రొద్దుటూరులో, 28న నంద్యాలలో, 29న ఎమ్మిగనూరులో సభలుంటాయని చెప్పారు. వచ్చే నెల 2న పీలేరు, 3, 4 తేదీల్లో చిత్తూరు, తిరుపతి జిల్లాలో సిద్ధం సభలు జరుగుతాయని వెల్లడించారు. అందులో చిత్తూరు లేదా పూతలపట్టులో ఒక సభ, నాయుడుపేట లేదా శ్రీకాళహస్తిలో మరో సభ నిర్వహిస్తామని వివరించారు.

సినిమా హీరో కన్నా సీఎం జగన్‌కే క్రేజ్ : మంత్రి ఆర్కే రోజా

ఏ సినిమా హీరోకు లేనంత క్రేజ్ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఉందని మంత్రి ఆర్కే రోజా అభిప్రాయపడ్డారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా? సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని ఎప్పుడు చేద్దామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని ఆమె తెలిపారు. 2014లో ప్రత్యేక హోదా తెస్తాం, బాబు వస్తే జాబు వస్తుందని మూడు పార్టీలు కలిసి ఇచ్చిన హామీలను పక్కన పెట్టి, రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టేశారని ధ్వజమెత్తారు. ప్రజల్ని మళ్లీ మోసం చేసేందుకు మళ్లీ కూటమిగా ముందుకొస్తున్నారని అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. సీఎం జగన్ త్వరలో మేనిఫెస్టోతో ప్రజల ముందుకు వస్తున్నారని చెప్పారు. జనసేన కూడా టీడీపీ నేతలకే టికెట్లు ఇచ్చిందని ఎద్దేవా చేశారు.

టీడీపీలో ఆరని మంటలు

▶ మొదటి పేజీ తరువాయి

గారపాటిని కాదని స్థానికేతరుడైన పుట్టాను ఖరారు చేయడం అన్యాయమని ఆ పార్టీ నేతలు ఏలూరు జిల్లా భీమడోలులో వాపోయారు. మరోవైపు ఇదే పార్లమెంట్ నుంచి టీడీపీ టికెట్ ఆశించిన గొర్రుముచ్చు గోపాల్ యాదవ్ చంద్రబాబు తీరుపై మండిపడ్డారు. సింగపూర్‌లో ఉన్నతస్థితిలో ఉన్న తనను ఏలూరు టికెట్ ఆశ చూపి ఇక్కడికి తీసుకొచ్చారని నిలదీశారు. తనతో కోట్లు ఖర్చు చేయించారని, చివరికి మొండిచేయి చూపారని వీడియో విడుదల చేశారు.ఆదివారం కామవరపుకోటలో ఏర్పాటు చేయబోయే ఆత్మీయ సమావేశంలో తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని అల్టిమేటం జారీచేశారు.

శ్రీకాకుళం టీడీపీలో అసమ్మతి మంటలు

శ్రీకాకుళం జిల్లా పాతపట్నం సీటు రాకపోవడంతో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ కార్యకర్తలతో శనివారం సమావేశం ఏర్పాటు చేసి అభ్యర్థి మామిడి గోవిందరావుపై దుమ్మెత్తిపోశారు. అవసరమైతేనే ఇక్కడి నుంచి ఇండిపెండెంట్‌గానైనా పోటీ చేస్తామని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ స్పష్టం చేశారు. మరోవైపు కాకినాడ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రచారం చేసుకున్న సానా సతీష్‌కు చుక్కెదురైంది. జనసేన నుంచి టీటైమ్ అధినేత తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు ఈ సీటు ఖరారు చేయడంతో టిక్కెట్టు ఆశించిన సతీష్ వర్గీయులు మండిపడుతున్నారు. అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలో టీడీపీ టికెట్ మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుకు కేటాయించాలని ఆయన వర్గీయులు నిరసనలు కొనసాగిస్తున్నారు. పైలా ప్రసాదరావుకు టీడీపీ టికెట్ కేటాయించడంపై మాడుగుల మండలం కె.జె.పురంలో తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు కర్రి నాగమణి ఆధ్వర్యంలో మహిళా కార్యకర్తలు నిరసన ప్రదర్శన చేశారు. నాన్ లోకల్ వద్దు, లోకల్ ముద్దు అంటూ గవిరెడ్డి అనుచరులు దేవరాపల్లిలో ర్యాలీ నిర్వహించారు.



అనకాపల్లి జిల్లా కె.జె.పురంలో నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

టీడీపీ ప్రతిసారీ మోసం: దేవినేని స్మిత

టీడీపీ తమను ప్రతిసారీ మోసం చేస్తోందని ఆ పార్టీ పెనమలూరు నియోజకవర్గ నాయకురాలు దేవినేని స్మిత ఆరోపించారు. పెనమలూరు టికెట్ తమకెందుకు ఇవ్వలేదని, తమ కుటుంబానికి ఎందుకు అన్యాయం చేస్తున్నారని అధిష్టానాన్ని ఆమె నిలదీశారు. ఆడవాళ్లమైనా నియోజకవర్గం మొత్తం తిరిగి పార్టీ కోసం పని చేస్తే లాబీయింగ్ చేసుకున్న బోడె ప్రసాద్‌కు టికెట్ ఇచ్చారన్నారు. ముందు బోడెకు ఇవ్వబోమని ప్రకటించిన చంద్రబాబు తర్వాత ఎందుకు మొత్తబడ్డారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ ప్రలోభాలకు తలొగ్గారో ఆయన చెప్పాలని నిలదీశారు. తమకు టికెట్ కేటాయిస్తేనే తన తండ్రి ఆత్మ శాంతిస్తుందన్నారు. త్వరలోనే కార్యకర్తలతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. నమ్ముకున్న ప్రజలను, నమ్మి పదవి కట్టబెట్టిన పార్టీని వెన్నుపోటు పొడిచి, పార్టీ మారి టీడీపీ నుంచి మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యేగా పోటీలో ఉన్న వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను ఓడించడమే లక్ష్యంగా ఇండిపెండెంట్‌గా పోటీ చేయనున్నట్లు జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గ నాయకులు పులిపాక ప్రకాష్ తెలిపారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. తాను వసంతను ఓడించడానికే పని చేస్తానని స్పష్టం చేశారు.

డ్రగ్స్ దందాలోనూ మనోళ్లేనా చంద్రబాబూ?


- యూకేలోని ప్రవాసాంధ్రుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ యాదవ్

సాక్షి, అమరావతి: అన్ని అక్రమ వ్యాపారాల్లో చంద్రబాబు, ఆయన వర్గానికి సంబంధాలుంటాయని, చివరికి డ్రగ్స్ దందాలోనూ మనోళ్లేనా బాబూ అని ఏలూరు లోక్‌సభ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఎప్పుడు, ఎక్కడ ఏ తప్పు జరిగినా, ఆఖరికి వాళ్ల ఇళ్లల్లో తప్పు చేస్తూ ఎవరైనా పట్టుబడినా దానిని సీఎం వైఎస్ జగన్‌కు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఆపాదించటం చంద్రబాబు, లోకేశ్ జాతి లక్షణంగా మారిందన్నారు. విశాఖ డ్రగ్స్ కేసుతో బాబు, లోకేశ్ జాతి బండారం బయటపడిందని చెప్పారు. శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ యూకే కన్వీనర్ డాక్టర్ ప్రదీప్ చింతా, ఓబుళరెడ్డి పాతకోట ఆధ్వర్యంలో యూకేలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, సీఎం జగన్ అభిమానులతో జరిగిన జూమ్ మీటింగ్‌లో సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విశాఖలో పట్టుబడిన కోట్లు విలువ చేసే డ్రగ్స్ ఉన్న కంటైనర్ తెప్పించిన సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ సంస్థ కమ్మోళ్లది కాబట్టి ఈనాడు, ఆంధ్రజ్యోతి పేపర్లు ఈ ప్రస్తావన తీసుకురాలేదన్నారు. ఈ డ్రగ్స్ వెనుక చంద్రబాబు, పురందేశ్వరి గ్యాంగులు ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారంపై సీబీఐ, ఇతర సంస్థలతో లోతైన విచారణ జరిపించాలన్నారు. ఎల్లో మీడియా ఎన్ని తప్పుడు రాతలు రాసినా ఈ ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ సింగిల్ డిజిట్‌కి పరిమితమవుతారని చెప్పారు. ఈ దేశంలో పదవిని అడ్డుపెట్టుకుని పెద్దమొత్తంలో డబ్బు కొట్టేసిన వ్యక్తి చంద్రబాబు అయితే, రాజ్యాధికారాన్ని చవిచూడకుండా రాజకీయాన్ని అడ్డుపెట్టుకుని ఎలా సంపాదించాలో టెక్నిక్ కనిపెట్టిన వ్యక్తి పవన్ అని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమానికి క్రాంతి పాలెం సమన్వయకర్తగా వ్యవహరించగా, యూకే సోషల్ మీడియా సభ్యులు భూమిరెడ్డి కార్తీక్ రెడ్డి, భూమిరెడ్డి ప్రతాప్, వెంకట సాయి గంద్లా తదితరులు పాల్గొన్నారు.

డీలాపడే.. ఇళ్లపై రంకెలు..

- పేదలకు మేలు జరుగుతుంటే ఎందుకు తట్టుకోలేకపోతున్నారు?
- ఈసీ అనుమతితో త్వరలో మిగిలిన రిజిస్ట్రేషన్లు కూడా ప్రారంభం
- ఇందులో లెక్కలు ఎక్కువచేసి చూపడం ఎక్కడుంది?
- వైఎస్సార్‌సీపీ నేతలు అక్రమంగా ఇళ్లు రాయించుకుంటున్నారంటూ ఎందుకా కుట్రపూరిత రాతలు

సాక్షి, అమరావతి : అధికారంలో చంద్రబాబు తప్ప వేరెవరైనా ఉంటే అ ప్రభుత్వం చేసే మంచి పనులేవీ రామోజీరావుకు కనిపించవు. ఒకవేళ కనిపించినా కనిపించనట్లు జీవిస్తారు. అదే చంద్రబాబు అధికారంలో ఉంటే ఆయనెంత దుర్మార్గం చేసినా ఆహా ఓహో అంటూ భజనలు. ఇది తన సహజ లక్షణమని ఆయన నిత్యం నిరూపించుకుంటున్నారు. తాజాగా.. పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల చరిత్రలో ఏ ప్రభుత్వం తీసుకురాని సంస్కరణను వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకొచ్చి విజయవంతంగా అమలుచేయడాన్ని ఈ పచ్చకళ్ల రామోజీరావు సహించలేకపోతున్నారు. జగన్‌ను, ఆయన సర్కారును ఎలాగైనా అభాసుపాల్జేయాలన్న కసి ఆయనను దహించేస్తోంది. దీంతో.. దేశంలో పేదల ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేసిన ఏకైక ప్రభుత్వంగా నిలిచినా దాన్ని తక్కువచేసి చూపేందుకు, లబ్ధిదారుల్లో అపోహలు సృష్టించేందుకు తన క్షుద్ర పత్రికలో చేతికొచ్చింది రాసిపారేస్తున్నారు. 'అంకెలు భళా.. అమలు డీలా' అంటూ నిజాలకు పాతరేసి తన పెత్తందారీ భావజాలాన్ని అక్షరం అక్షరంలో ప్రదర్శించారు. 45 రోజుల వ్యవధిలో పేదలకిచ్చిన 15.59 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్లు చేయడం డీలాపడడం ఎలా అవుతుందో రామోజీరావుకే తెలియాలి. పేదలకు జగన్ సర్కారు చేస్తున్న మేలుతో చంద్రబాబుకు ఇక జన్మలో అధికారం దక్కదన్న దుగ్ధతో రామోజీనే డీలాపడి ఇష్టమొచ్చినట్లు రంకెలు వేస్తున్నారు. అసలు..



రిజిస్ట్రేషన్ల శాఖ సంవత్సరం మొత్తం మీద చేసే రిజిస్ట్రేషన్ల సంఖ్య 20 లక్షలు. మామూలుగా అయితే ఈ రిజిస్ట్రేషన్లు చేయడానికి దాదాపు ఏడాది పడుతుంది. కానీ, పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలపై వారికి వెనువెంటనే హక్కు కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఆఘమేఘాల మీద ఈ రిజిస్ట్రేషన్లు చేసింది. ఫిబ్రవరి 4న మొదలుపెట్టి మార్చి 15 వరకు రికార్డు స్థాయిలో 15.59 లక్షల రిజిస్ట్రేషన్లను చేసింది. ఎన్నికల పనులు, రీసర్వే వంటి కార్యక్రమాలున్నా జిల్లా కలెక్టర్లు, అధికార యంత్రాంగం అత్యంత వేగంగా రిజిస్ట్రేషన్లు చేసి చరిత్ర సృష్టించడాన్ని డీలాపడడం అని రామోజీ పదకోశంలో ఈనాడు అనుకుంటే దానిని కడుపుమంట కాక ఇంకేమనాలి? నిజానికి.. చంద్రబాబు తన హయాంలో పేదలకు చెప్పుకోదగ్గ మేలు చేసింది ఏమీలేదు. కానీ రామోజీరావు ఎప్పుడూ దీన్ని ప్రశ్నించలేదు. ఎందుకంటే అప్పుడు డీపీటీ (దోచుకో–పంచుకో–తినుకో) పద్ధతిలో పచ్చముఠా రాష్ట్ర ఖజానాను పూర్తిగా నాకేసింది. కానీ, ఇప్పుడు అలాంటిదేమీలేదు. ఖర్చుపెట్టే ప్రతి పైసాకూ తగ్గ ప్రతిఫలం పేదలకు దక్కాలన్నదే సీఎం జగన్ తపన. దీనిని చంద్రబాబే కాదు.. ఎల్లోగ్యాంగ్‌లో ఎవ్వరూ జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే ఈ రాతలు.. ఈ రోత కథనాలు.

రిజిస్ట్రేషన్లకు తాత్కాలిక విరామం..

ఇక ఎన్నికల కోడ్ మార్చి 16న రావడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను తాత్కాలికంగా నిలుపుదల చేయడాన్ని వక్రీకరించి ఇక అక్కడితో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆగిపోయినట్లు చిత్రీకరించడం రామోజీ దివాళాకోరుతనం. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంవల్ల రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్న కన్వేయన్స్ డీడ్లపై సీఎం ఫొటో ఉండకూడదనే నిబంధనవల్లే ప్రస్తుతానికి రిజిస్ట్రేషన్లకు విరామం ఇచ్చారు. ఎన్నికల కమిషన్ అనుమతితో సీఎం ఫొటోలేకుండా రిజిస్ట్రేషన్లు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని కమిటీ ఆధ్వర్యంలో దీనిపై కసరత్తు జరుగుతోంది. త్వరలో మిగిలిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు.

లెక్క ఎక్కువ కాదు. అసలు లెక్కే రామోజీ..

ఇళ్ల స్థలాల లెక్కను ఎక్కువచేసి ప్రచారం చేసుకుంటున్నారని, కాలనీలు కాదు ఊళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పుకుంటున్నారని ఈనాడు తన అక్కసు వెళ్లగక్కింది. 31.19 లక్షల మంది ఇళ్ల స్థలాలులేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలివ్వగా అందులో 22 లక్షల ఇళ్లు మంజూరయ్యాయి. మరో 7 లక్షల మంది పొజిషన్‌లో ఉండడంతో వీరికి గతంలోనే పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చారు. మిగిలినవి టిడ్కో, ఇతర ఇళ్లు. ఇందులో లెక్క ఎక్కువచేసి చూపింది ఎక్కడ? 22 లక్షల మంది జగనన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకుంటున్న విషయం నిజంకాదా? 17 వేలకుపైగా జగనన్న కాలనీలు ఏర్పడడం రామోజీకి కనిపించడంలేదా? 22 లక్షల ఇళ్ల స్థలాలకు సంబంధించి ఇప్పటికే 15.50 ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. త్వరలో మిగిలిన స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. ఇవి కాగితాల్లో లెక్కలు కాదు. వాస్తవంగా కనిపించే లెక్కలే.

వైఎస్సార్‌సీపీ నేతలు ఎక్కడ రాయించుకున్నారు?

ఇళ్ల స్థలాలు తీసుకున్న వారిలో కొందరు చనిపోవడంతో వారి వారసులను (లీగల్ హైర్స్) గుర్తించడం ఆలస్యమవడంవల్ల కొన్ని రిజిస్ట్రేషన్లు ఆలస్యమయ్యాయి. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అర్హులను గుర్తించి వారికి రిజిస్ట్రేషన్లు చేసేందుకు చేసే ప్రయత్నాన్ని కూడా ఈనాడు రామోజీ తట్టుకోలేకపోతున్నారు. ఇలాంటి స్థలాలను వైఎస్సార్‌సీపీ నేతలు తమ పేరుతో ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్లు ఆధారాల్లేకుండా కుట్రపూరిత రాతలు రాస్తోంది. అలాగే, ఈ కథనంలోనే అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న వారికి మొదట రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే తప్పుడు ఆరోపణను అచ్చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ఇచ్చిన ఇళ్లన్నింటికీ రిజిస్ట్రేషన్లు చేస్తుంటే దానిపైనా నిందలు మోపి తన వక్రబుద్ధిని ఆ క్షుద్ర పత్రిక చాటుకుంది. పదేళ్ల తర్వాత ఇళ్ల స్థలాలపై యాజమాన్య హక్కులు ఆటోమేటిక్‌గా వస్తాయని, వాటికి కన్వేయన్స్ డీడ్ల పేరుతో రిజిస్ట్రేషన్లు చేయడం అవసరంలేదనే వింత వాదన లేవనెత్తింది. రెవెన్యూ శాఖ ఎన్‌ఓసీ లేకుండా యాజమాన్య హక్కులు ఎలా వస్తాయో మహా మేధావి రామోజీకే తెలియాలి.

రిజిస్ట్రేషన్లు చేయకుండా టీడీపీ అడ్డంకులు..

పేదలకిచ్చిన ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామనే మాటకు కట్టుబడి వైఎస్ జగన్ ప్రభుత్వం 2020లోనే జీఓ ఇచ్చినా టీడీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేసి దానికి అడ్డుపడ్డారు. రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేలోపు పేదలు నష్టపోకూడదనే ఉద్దేశంతో ఏకంగా 71,811 ఎకరాల భూమిని సేకరించి, పేదలకు అప్పటికి డీకేటీ పట్టాలిచ్చింది. టీడీపీ అడ్డుకున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగించేందుకు ఏపీ అసైన్డ్ ల్యాండ్స్ (పీఓటీ) చట్టాన్ని 2021లో సవరించి పదేళ్ల తర్వాత ఇంటి పట్టాను అమ్ముకునే అవకాశం లబ్ధిదారులకు కల్పించింది. రిజిస్ట్రేషన్ చేస్తుంటే ఉపయోగంలేని రిజిస్ట్రేషన్ అంటూ వక్రభాష్యం చెబుతూ పేదలను మోసం చేస్తోంది. వాస్తవానికి.. ఈ రిజిస్ట్రేషన్ చేయడంవల్ల బ్యాంకుల్లో తక్కువ వడ్డీకి రుణం తెచ్చుకునే సౌలభ్యం ఏర్పడుతుంది. ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేస్తుంది కాబట్టి బ్యాంకులు రుణాలిస్తాయి. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ కాబట్టి డేటాబేస్‌లో ఆ వివరాలన్నీ పదిలంగా ఉంటాయి. ఎప్పుడంటే అప్పుడు సర్టిఫైడ్ కాపీ పొందే దానికి వీలుంటుంది. ఫోర్జరీ, ట్యాంపరింగ్ భయం ఉండదు. ఇన్ని ఉపయోగాలుండగా రిజిస్ట్రేషన్ అవసరంలేదని బుకాయించడం రామోజీ ఏడుపు కాక మరేమిటి?

వెర్‌స్టాపెన్‌కు పోల్

ఫార్ములా వన్ సీజన్‌లో మూడో రేసు ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రిలో మ్యాక్స్ వెర్‌స్టాపెన్ పోల్ పొజిషన్‌ను సాధించాడు. మెల్‌బోర్న్‌లో శనివారం జరిగిన ప్రధాన క్వాలిఫయింగ్ రేస్‌ను రెడ్‌బుల్ డ్రైవర్ వెర్‌స్టాపెన్ 1 నిమిషం 15.915 సెకన్లలో పూర్తి చేశాడు. ఫెరారీ డ్రైవర్ కార్లోస్ సెయింజ్ రెండో స్థానంలో (1 నిమిషం 16.185 సె.) రెండో స్థానంలో నిలవగా...ల్యాండో నోరిస్ (మెక్‌లారెన్ – 1 నిమిషం 16.315 సె.)కు మూడో స్థానం దక్కింది. తొలి రెండు క్వాలిఫయింగ్‌లలో ముందంజలో నిలిచిన సెయింజ్‌నుంచి గట్టి పోటీ ఎదురైనా ఆ తర్వాత వెర్‌స్టాపెన్ దూసుకుపోయాడు. వెర్‌స్టాపెన్ ఎఫ్1 కెరీర్‌లో ఇది 35వ పోల్ పొజిషన్ కావడం విశేషం. గత సౌదీ అరేబియా రేసుకు ముందు అపెండిసైటిస్ బారిన పడి శస్త్ర చికిత్స చేయించుకున్న సెయింజ్ సత్తా చాటాడు. పేలవ ప్రదర్శన కనబర్చిన లూయిస్ హామిల్టన్ (మెర్సిడెజ్) 11వ స్థానంతో సరిపెట్టుకున్నాడు.



చెన్నైలో ఐపీఎల్ ఫైనల్

ఐపీఎల్ తాజా సీజన్ తుది పోరుకు చెన్నైని వేదికగా నిర్ణయించారు. ప్లే ఆఫ్స్‌లో ఒక క్వాలిఫయర్, ఎలిమినేటర్ మ్యాచ్‌లకు అహ్మదాబాద్ ఆతిథ్యం ఇవ్వనుండగా మరో క్వాలిఫయర్ మ్యాచ్ కూడా చెన్నైలోనే జరుగుతుంది.

జాతీయ మహిళల హాకీ విజేత హరియాణా



పుణే: జాతీయ సీనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్‌ను హరియాణా సొంతం చేసుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో షూటౌట్ ద్వారా హరియాణా 3–0తో ఆతిథ్య మహారాష్ట్రను ఓడించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 1–1 గోల్స్‌తో సమంగా నిలిచాయి. హరియాణా తరఫున దీపిక పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ సాధించగా...మహారాష్ట్ర తరఫున అక్షత గోల్‌తో స్కోరు సమం చేసింది. షూటౌట్‌లో హరియాణా ప్లేయర్లలో నవనీత్ కౌర్, ఉష, సోనిక స్కోర్ చేయగా... మహారాష్ట్ర ప్లేయర్లలో ప్రియాంక, ఆకాంక్ష, రుతుజ గోల్ చేయడంలో విఫలమయ్యారు.

బంగ్లాదేశ్ 188 ఆలౌట్


విశ్వ ఫెర్నాండో

సిల్హెట్: ఆతిథ్య బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో రెండో రోజే శ్రీలంక పట్టు బిగించింది. శనివారం రెండో రోజు 32/3 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 51.3 ఓవర్లలో 188 పరుగులకే ఆలౌటైంది. తైజుల్ ఇస్లామ్ (47; 6 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. విశ్వ ఫెర్నాండో 4, కసున్ రజిత, లహిరు కుమార చెరో 3 వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో లంకకు 92 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంక ఆట నిలిచే సమయానికి 36 ఓవర్లలో 5 వికెట్లకు 119 పరుగులు చేసింది. ఓపెనర్ దిముత్ కరుణరత్నే (52; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. కెప్టెన్ ధనంజయ డిసిల్వా (23 బ్యాటింగ్, 3 ఫోర్లు), విశ్వ ఫెర్నాండో (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. బంగ్లా బౌలర్ నహిద్ రాణాకు 2 వికెట్లు దక్కాయి.


కోల్‌కతా జట్టు గెలుపు సంబరం

ఆఖరి బంతికి...

4 పరుగులతో ఓడిన హైదరాబాద్

కోల్‌కతా: సన్‌రైజర్స్ హైదరాబాద్ బోణీ కొట్టాలంటే కొండంత లక్ష్యాన్ని కరిగించాలి. ఒక దశలో గెలవడానికి 24 బంతుల్లో 76 పరుగులు కావాలి. దీంతో కోల్‌కతా విజయం లాంఛనమే అనిపించింది. కానీ హెన్రిచ్ క్లాసెన్ (29 బంతుల్లో 63; 8 సిక్స్‌లు) భారీ సిక్సర్లు ఒక్కసారిగా హైదరాబాద్ విజయానికి ఊపిరిపోశాయి. 17, 18, 19వ ఓవర్లలో వరుసగా 16, 21, 26 పరుగులు వచ్చాయి. వరుణ్ 3 సిక్సర్లు ఇవ్వగా...స్టార్క్ ఓవర్లో క్లాసెన్ 3, షహబాజ్ ఒక సిక్సర్ బాదారు! అంతే ఆఖరి 6 బంతులకు 13 పరుగులు సన్‌రైజర్స్ వైపు మొగ్గేలా చేసింది. హర్షిత్ రాణా వేసిన ఈ ఓవర్లో తొలి బంతికే క్లాసెన్ సిక్స్ బాదడంతో 5 బంతుల్లో 7 పరుగులు హైదరాబాద్‌ను సంబరాల్లో ముంచింది. కానీ హర్షిత్ (3/33) వైవిధ్యమైన బంతులతో రెండే పరుగులిచ్చి షహబాజ్ (16; 1 ఫోర్, 2 సిక్స్‌లు), క్లాసెన్‌లను అవుట్ చేశాడు. చివరి బంతికి గెలవాలంటే 5 పరుగులు కావాల్సి ఉండగా కమిన్స్ సింగిల్ కూడా తీయలేకపోయాడు. దాంతో కోల్‌కతా 4 పరుగులతో అనూహ్య విజయం సాధించింది. దీంతో గెలుపుదారిలో పడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓటమితో ఈ ఐపీఎల్ సీజన్‌ను ప్రారంభించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా రెండో ఓవర్ నుంచే కష్టాల్లో పడింది. నరైన్ (2), వెంకటేశ్ అయ్యర్ (7), శ్రేయస్ అయ్యర్ (0), నితీశ్ రాణా (9) చేతులెత్తేశారు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (40 బంతుల్లో 54; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించగా... 14వ ఓవర్లో అతనూ అవుటయ్యాడు. కోల్‌కతా స్కోరు 119/6. అప్పుడు క్రీజులోకి వచ్చిన రసెల్ (25 బంతుల్లో 64 నాటౌట్; 3 ఫోర్లు, 7 సిక్సర్లు) చాన్నాళ్ల తర్వాత విధ్వంసరచన చేశాడు. దీంతో కోల్‌కతా 20 ఓవర్లలో 7 వికెట్లకు 208 పరుగుల భారీస్కోరు చేసింది. మిగిలిన 6.1 ఓవర్లలోనే జట్టు 89 పరుగులు చేస్తే అందులో రసెల్ ఒక్కడివే 64 పరుగులంటే... హైదరాబాద్ బౌలర్లు కూడా ప్రేక్షకులు కావాల్సివచ్చింది. రసెల్ 20 బంతుల్లో అర్ధసెంచరీ చేశాడు. నటరాజన్ 3, మయాంక్ మార్కండే 2 వికెట్లు తీశారు. అనంతరం సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 204 పరుగులు చేసి ఓడింది. మయాంక్ (21 బంతుల్లో 32; 4 ఫోర్లు, 1 సిక్స్), అభిషేక్ (19 బంతుల్లో 32; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మంచి ఆరంభాన్నిచ్చారు. అయితే స్వల్ప వ్యవధిలో మార్క్‌రమ్ (18), రాహుల్ త్రిపాఠి (20) వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) జాన్సెన్ (బి) మార్కండే 54; నరైన్ రనౌట్ 2; వెంకటేశ్ (సి) జాన్సెన్ (బి) నటరాజన్ 7; శ్రేయస్ (సి) కమిన్స్ (బి) నటరాజన్ 0; నితీశ్ (సి) త్రిపాఠి (బి) మార్కండే 9; రమణ్‌దీప్ (సి) మార్కండే (బి) కమిన్స్ 35; రింకూ సింగ్ (సి) మార్కండే (బి) నటరాజన్ 23; రసెల్ నాటౌట్ 64; స్టార్క్ నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 208. వికెట్ల పతనం:** 1–23, 2–32, 3–32, 4–51, 5–105, 6–119, 7–200. **బౌలింగ్:** భువనేశ్వర్ 4–0–51–0, జాన్సెన్ 3–0–40–0, నటరాజన్ 4–0–32–3, కమిన్స్ 4–0–32–1, మార్కండే 4–0–39–2, షహబాజ్ 1–0–14–0.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: మయాంక్ (సి) రింకూ (బి) హర్షిత్ 32; అభిషేక్ (సి) వరుణ్ (బి) రసెల్ 32; త్రిపాఠి (సి) హర్షిత్ (బి) నరైన్ 20; మార్క్‌రమ్ (సి) రింకూ (బి) వరుణ్ 18; క్లాసెన్ (సి) సుయశ్ (బి) హర్షిత్ 63; సమద్ (సి) వెంకటేశ్ (బి) రసెల్ 15; షహబాజ్ (సి) శ్రేయస్ (బి) హర్షిత్ 16; జాన్సెన్ నాటౌట్ 1; కమిన్స్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 204. వికెట్ల పతనం:** 1–60, 2–71, 3–107, 4–111, 5–145, 6–203, 7–204. **బౌలింగ్:** స్టార్క్ 4–0–53–0, హర్షిత్ రాణా 4–0–33–3, వరుణ్ 4–0–55–1, నరైన్ 4–0–19–1, రసెల్ 2–0–25–2, సుయశ్ 2–0–18–0.

పంజాబ్ గెలుపు బోణీ

- రాణించిన స్యామ్ కరన్
- 4 వికెట్లతో ఓడిన ఢిల్లీ క్యాపిటల్స్


స్యామ్ కరన్

ముల్లన్‌పూర్: కొత్త సీజన్‌లో, కొత్త మైదానంలో పంజాబ్ కింగ్స్ భాంగ్రా ఆడుకుంది. తొలి పోరులో చక్కటి విజయంతో బోణీ చేసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 4 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. షై హోప్ (25 బంతుల్లో 33; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), అభిషేక్ పొరేల్ (10 బంతుల్లో 32 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం పంజాబ్ 19.2 ఓవర్లలో 6 వికెట్లకు 177 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్యామ్ కరన్ (47 బంతుల్లో 63; 6 ఫోర్లు, 1 సిక్స్), లయమ్ లివింగ్‌స్టోన్ (21 బంతుల్లో 38 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఐదో వికెట్‌కు 42 బంతుల్లో 67 పరుగులు జోడించి గెలిపించారు.

అంతా అంతంతమాత్రంగా...

ఢిల్లీ ఇన్నింగ్స్‌ను ఓపెనర్లు డేవిడ్ వార్నర్ (21 బంతుల్లో 29; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), మిచెల్ మార్ష్ (12 బంతుల్లో 20; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) వేగంగా ప్రారంభించారు. తొలి 3 ఓవర్లలో వీరిద్దరు 33 పరుగులు రాబట్టారు. మార్ష్ వెనుదిరిగినా...కెరీర్‌లో తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్న హోప్ కూడా కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. 10.3 ఓవర్లలో స్కోరు 94/3తో మెరుగ్గా అనిపించింది. అయితే ఈ దశలో బ్యాటింగ్ తడబడింది. పంత్ (18) ప్రభావం చూపలేకపోగా... భుయ్ (3), స్టబ్స్ (5) విఫలమయ్యారు. అక్షర్ పటేల్ (13 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) కొన్ని పరుగులు జోడించగలిగాడు. అయితే చివర్లో పొరేల్ దూకుడు ఢిల్లీకి చెప్పుకోదగ్గ స్కోరు అందించింది. స్కోరు 137/7 వద్ద క్రీజ్‌లోకి వచ్చిన అతను హర్షల్ వేసిన ఆఖరి ఓవర్లో చెలరేగిపోయాడు. ఈ ఓవర్లో అతను వరుసగా 4, 6, 4, 4, 6 బాదడంతో మొత్తం 25 పరుగులు వచ్చాయి.

రాణించిన లివింగ్‌స్టోన్...

ఖలీల్ అహ్మద్ వేసిన తొలి ఓవర్లోనే 4 ఫోర్లతో శిఖర్ ధావన్ (16 బంతుల్లో 22; 4 ఫోర్లు) జోరు ప్రదర్శించాడు. అయితే అతనితో పాటు బెయిర్‌స్టో (9) ఐదు బంతుల వ్యవధిలో వెనుదిరగ్గా...ప్రభ్‌సిమ్రన్ సింగ్ (17 బంతుల్లో 26; 5 ఫోర్లు) జట్టును ఆదుకున్నాడు. కానీ ప్రభ్‌సిమ్రన్‌తో పాటు జితేశ్ శర్మ (9) తన వరుస ఓవర్లలో అవుట్ చేసి కుల్దీప్ ఆశలు పెంచాడు. గెలుపు కోసం 51 బంతుల్లో 75 పరుగులు చేయాల్సిన దశలో కరన్, లివింగ్‌స్టోన్ జత కలిశారు. 33 పరుగుల వద్ద కరన్ ఇచ్చిన క్యాచ్‌ను స్టబ్స్ వదిలేయడం కలిసొచ్చింది. వీరిద్దరిని కొద్ది సేపు ఢిల్లీ బౌలర్లు నిలువరించగలిగారు. అయితే మార్ష్ వేసిన 15వ, 17వ ఓవర్లలో కలిపి మొత్తం 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో పంజాబ్ 36 పరుగులు రాబట్టడంతో ఆట స్వరూపం మారిపోయింది. విజయానికి పది పరుగుల దూరంలో కరన్ అవుటైనా...లివింగ్‌స్టోన్ మిగతా పనిని పూర్తి చేశాడు. మిడ్‌వికెట్ వద్ద ఫీల్డింగ్ చేస్తూ ఆరో ఓవర్లోనే ఇషాంత్ గాయపడటం కూడా ఢిల్లీని దెబ్బ తీసింది. ప్రధాన బౌలర్ దూరం కావడంతో ప్రత్యామ్నాయం లేక పరుగులు ఇస్తున్నా సరే మార్ష్‌తో బౌలింగ్ చేయించాల్సి వచ్చింది.

స్కోరు వివరాలు:

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (సి) జితేశ్ (బి) హర్షల్ 29; మార్ష్ (సి) చహర్ (బి) అర్ష్‌దీప్ 20; హోప్ (సి) బ్రార్ (బి) రబాడ 33; పంత్ (సి) బెయిర్‌స్టో (బి) హర్షల్ 18; భుయ్ (సి) జితేశ్ (బి) బ్రార్ 3; స్టబ్స్ (సి) శశాంక్ (బి) చహర్ 5; అక్షర్ (రనౌట్) 21; సుమీత్ (సి) జితేశ్ (బి) అర్ష్‌దీప్ 2; పొరేల్ (నాటౌట్) 32; కుల్దీప్ (రనౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 174. వికెట్ల పతనం** : 1–39, 2–74, 3–94, 4–111, 5–111, 6–128, 7–138, 8–147, 9–174. **బౌలింగ్:** స్యామ్ కరన్ 1–0–10–0, అర్ష్‌దీప్ 4–0–28–2, రబాడ 4–0–36–1, హర్‌ప్రీత్ బ్రార్ 3–0–14–1, రాహుల్ చహర్ 4–0–33–1, హర్షల్ 4–0–47–2.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ధావన్ (బి) ఇషాంత్ 22; బెయిర్‌స్టో (రనౌట్) 9; ప్రభ్‌సిమ్రన్ (సి) వార్నర్ (బి) కుల్దీప్ 26; స్యామ్ కరన్ (బి) అహ్మద్ 63; జితేశ్ (స్టంప్డ్) పంత్ (బి) కుల్దీప్ 9; లివింగ్‌స్టోన్ (నాటౌట్) 38; శశాంక్ (సి) పంత్ (బి) అహ్మద్ 0; బ్రార్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (19.2 ఓవర్లలో 6 వికెట్లకు) 177. వికెట్ల పతనం:** 1–34, 2–42, 3–84, 4–100, 5–167, 6–167. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4–0–43–2, ఇషాంత్ 2–0–16–1, మార్ష్ 4–0–52–0, అక్షర్ 4–0–25–0, కుల్దీప్ 4–0–20–2, సుమీత్ 1.2–0–19–0.

వెల్‌కమ్‌బ్యాక్ పంత్...



ఢిల్లీ ఇన్నింగ్స్ ఎనిమిదో ఓవర్ చివరి బంతికి వార్నర్ అవుటయ్యాడు. ఆ తర్వాత అందరి దృష్టీ డగౌట్‌పై పడింది. రిషభ్ పంత్ హెల్మెట్ సరి చేసుకుంటూ మైదానంలోకి అడుగు పెట్టాడు. దాంతో ఒక్కసారిగా ముల్లన్‌పూర్ స్టేడియం మొత్తం మార్మోగిపోయింది. అభిమానులంతా నిలబడి స్టాండింగ్ ఒవేషన్‌తో స్వాగతం పలికారు. దాదాపు 15 నెలల విరామం తర్వాత క్రికెట్‌లోకి అడుగు పెట్టిన పంత్‌లో కూడా భావోద్వేగాలు కనిపించాయి. బ్రార్ ఓవర్లో తన రెండో బంతికి సింగిల్ తీసి అతను పరుగుల ఖాతా తెరవడంతో అంతా చప్పట్లతో అభినందించారు. స్కోరుపరంగా పంత్ గొప్పగా ఆడకపోయినా...దాదాపు చావుకు చేరువైన కారు ప్రమాదం నుంచి కోలుకున్న తర్వాత ఇప్పుడు పూర్తి ఫిట్‌గా, కీపింగ్‌లోనూ చురుగ్గా కనిపించడం సానుకూలాంశం.

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ X లక్నో
వేదిక: జైపూర్
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

గుజరాత్ X ముంబై
వేదిక: అహ్మదాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

సినిమా


శివ... శివా...

భక్తి కలిసిన చిత్రాల్లో స్టార్స్ కనిపించడం చాలా తక్కువ. అయితే ఇప్పుడు ట్రెండ్ మారింది. డివోషన్ ప్లస్ కమర్షియల్ మిక్స్ అయిన కథలకు డిమాండ్ పెరుగుతోంది. ఈ తరహా చిత్రాల్లో నటించడానికి స్టార్ హీరోలు ముందుకొస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న చిత్రాల్లో 'శివుడు' నేపథ్యంలో సాగే కథలు, శివుడి ప్రస్తావన కాసేపు ఉండే కథలు ఉన్నాయి. 'శివ... శివా...' అంటూ శివుడి నేపథ్యంలో భక్తి భావంతో రానున్న ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.


• 'కన్నప్ప'లో విష్ణు మంచు


కన్నప్ప

విష్ణు మంచు హీరోగా రూపొందుతోన్న పాన్ ఇండియన్ చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ఈ మూవీలో మోహన్‌బాబు, ప్రభాస్, మోహన్ లాల్, శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శివ భక్తుడైన భక్త కన్నప్ప కథను 'కన్నప్ప' ద్వారా వెండితెరకు తీసుకొస్తున్నారు. ఈ చిత్రంలో శివుడి పాత్రలో ప్రభాస్ నటించనున్నారని సమాచారం. ఈ వార్తలు ఆ మధ్య హల్ చల్ చేయగా 'హర హర మహాదేవా' అంటూ రిప్లై ఇస్తూ పరోక్షంగా హింట్ ఇచ్చారు విష్ణు మంచు. ఈ విషయం గురించి మేలో అధికారిక ప్రకటన రావొచ్చని కూడా తాజాగా విష్ణు మంచు స్పందించారు. దీంతో 'కన్నప్ప'లో శివుడి పాత్రలో ప్రభాస్ నటించడం ఖాయమని తెలుస్తోంది. ఇప్పటి వరకు మాస్ యాక్షన్ హీరోగా, లవర్ బాయ్‌గా నటించిన ప్రభాస్ ఇటీవలే 'ఆదిపురుష్' సినిమాలో రాముడిగా కనిపించారు. ఇప్పుడు 'కన్నప్ప' చిత్రంలో శివుడిగా కనిపించనున్నారు. ఇక శివుడి పాత్రలో ప్రభాస్ ఎలా ఉంటారో అంటూ ఏఐ టెక్నాలజీ సాయంతో శివుడి రూపంలో ఉన్న ప్రభాస్ పోస్టర్లను డిజైన్ చేసి, నెట్టింట షేర్ చేస్తున్నారు ఆయన అభిమానులు. ఈ ఫొటోలు చూసిన నెటిజన్స్ శివుడి రూపంలో ప్రభాస్ లుక్ సూపర్‌గా ఉందంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఈ చిత్రంలో పార్వతీదేవి పాత్రలో నయనతార కనిపిస్తారట. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో 'కన్నప్ప' విడుదల కానుంది.


• 'కుబేర'లో ధనుష్

కుబేర

ధనుష్, నాగార్జున అక్కినేని లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మల్టీస్టారర్ ఫిల్మ్ 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్న కథానాయికగా నటిస్తున్నారు. నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీస్సులతో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మహా శివరాత్రి కానుకగా ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. అయితే ఫస్ట్ లుక్ మాత్రం టైటిల్‌కు భిన్నంగా ఉండటంతో పాటు ఆశ్చర్య పరిచేలా ఉంది. కుబేరుడు డబ్బులు ప్రసాదించే దేవుడు. కాగా ఫస్ట్ లుక్‌లో ధనుష్ సరైన కాస్ట్యూమ్ లేని పేదవాడిలా కనిపిస్తారు, ఆహార దేవత అన్నపూర్ణాదేవి నుంచి శివుడు భిక్ష తీసుకుంటున్న ఫొటో కూడా పోస్టర్‌లో ఉంది. అంటే ఈ కథలో శివుడి గురించి ఏదో ఒక లైన్ టచ్ చేసి ఉంటారని ఊహించవచ్చు. పైగా మహా శివరాత్రి కానుకగా ప్రత్యేకించి ఆ పోస్టర్ విడుదల చేయడం కూడా శివుడి నేపథ్యం ఉంటుందనుకోవచ్చు.


• 'హరోం హర'లో సుధీర్‌బాబు

హరోం హర

ఎప్పటికప్పుడు వైవిధ్యమైన సినిమాలు చేసుకుంటూ వెళ్తున్నారు హీరో సుధీర్ బాబు. తాజాగా ఆయన నటించిన పాన్ ఇండియన్ చిత్రం 'హరోం హర'. 'ది రివోల్ట్' అనేది ట్యాగ్‌లైన్. 'సెహరి' ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మాళవికా శర్మ హీరోయిన్‌గా నటించారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ పతాకంపై సుమంత్ జి. నాయుడు నిర్మించిన ఈ సినిమా కథనం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నేపథ్యంలో సాగుతుంది. పైగా ఈ మూవీలో హీరో పేరు కూడా సుబ్రహ్మణ్యమే కావడం విశేషం. ఈ చిత్రానికి 'హరోం హర' టైటిల్ ఫిక్స్ చేశారంటే శివుడి నేపథ్యం ఎంతో కొంత ఉంటుందని ఊహించవచ్చు. ఎందుకంటే.. పరమశివుడి తనయుడే సుబ్రహ్మణ్యేశ్వర స్వామి. పుత్రుడి కథ చెప్పే క్రమంలో తండ్రి కథని టచ్ చేసుంటారనుకోవచ్చు. చిత్తూరు జిల్లా కుప్పంలో 1989 నాటి నేపథ్యంలో సాగే 'హరోం హర'లో సుధీర్ బాబు చిత్తూరు యాసలోనే మాట్లాడతారు. ఈ వేసవిలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.


• 'ఓదెల 2'లో తమన్నా

ఓదెల 2

తమన్నా పేరు చెప్పగానే గ్లామరస్ హీరోయిన్ గుర్తొస్తారు. తన నటన.. ప్రత్యేకించి తన అద్భుతమైన డ్యాన్సుతో ప్రేక్షకుల మనసుల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు తమన్నా. ప్రస్తుతం ఆమె శివుడి నేపథ్యంలో రూపొందుతున్న 'ఓదెల 2' మూవీలో లీడ్ రోల్ చేస్తున్నారు. 'ఓదెల రైల్వేస్టేషన్' వంటి హిట్ సినిమాకి సీక్వెల్‌గా 'ఓదెల 2' తెరకెక్కుతోంది. అశోక్ తేజ దర్శకత్వంలో డైరెక్టర్ సంపత్ నంది క్రియేటర్‌గా ఈ మూవీ రూపొందుతోంది. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ బ్యానర్లపై డి. మధు ఈ మూవీ నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ కాశీలో మొదలైంది. ఈ చిత్రంలో శివశక్తిగా తమన్నా నటిస్తున్నారు. శివరాత్రి కానుకగా 'ఓదెల 2' నుంచి శివశక్తిగా తమన్నా ఫస్ట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. ఒక చేతిలో దండకం, మరో చేతిలో డమరుకంతో నాగసాధువు వేషంలో కనిపించారు తమన్నా. తన గ్రామాన్ని దుష్ట శక్తుల నుండి ఓదెల మల్లన్న స్వామి ఎలా కాపాడాడు? అనే అంశంతో 'ఓదెల 2' తెరకెక్కుతోంది. మల్లన్న స్వామి అంటే శివుడే అని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఈ సినిమాని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నారు మేకర్స్. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహ, గగన్ విహారి, సురేందర్ రెడ్డి, పూజా రెడ్డి తదితరులు కీలక పాత్రల్లో ఈ చిత్రం రూపొందుతోంది.

హ్యాపీ హాలిడేస్


• మహేశ్‌బాబు

వీలైనప్పుడల్లా ఫ్యామిలీతో కలిసి వెకేషన్‌కు వెళుతుంటారు మహేశ్ బాబు. ఈ వేసవి వెకేషన్ కోసం కుటుంబంతో కలిసి మహేశ్‌బాబు ఫారిన్ వెళ్లారు. 'హ్యాపీ హాలిడేస్.. ఫ్యామిలీ టైమ్' అంటూ జర్నీ ఫొటోలను ఇన్‌స్టా స్టోరీలో షేర్ చేశారు మహేశ్ సతీమణి నమ్రత. ఈ వెకేషన్ పూర్తి చేసుకుని వచ్చిన తర్వాత రాజమౌళితో చేయనున్న సినిమా షూటింగ్‌లో పాల్గొంటారట మహేశ్‌బాబు. షూటింగ్ గురించిన వివరాలను త్వరలోనే రాజమౌళి వెల్లడించనున్నట్లుగా తెలిసింది.

ఆరంభం అప్పట్నుంచేనా..?


• వెంకటేశ్

'ఎఫ్ 2', 'ఎఫ్ 3' (వరుణ్ తేజ్ మరో హీరో) చిత్రాల తర్వాత హీరో వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుందనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో హీరోయిన్‌గా త్రిష, మృణాల్ ఠాకూర్ వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. ఈ సినిమాకు 'సంక్రాంతికి వస్తున్నాం' టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను మే చివర్లో లేదా జూన్ మొదటి వారంలో ప్రారంభించాలని చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోందని తెలిసింది. అలాగే ఈ సినిమాను 'దిల్' రాజు నిర్మించనున్నారని, సంక్రాంతికి రిలీజ్ చేయాలన్నది చిత్ర యూనిట్ టార్గెట్ అని సమాచారం.

మా కోసం మలేసియాలో ఉత్సవం


• విష్ణు మంచు

"ప్రస్తుతం తెలుగు చిత్రపరిశ్రమలో స్వర్ణ యుగం నడుస్తోంది. మెగాస్టార్ చిరంజీవిగారికి పద్మవిభూషణ్ రావడం గొప్ప విషయం. దేశంలోనే అత్యధిక పారితోషికం తీసుకుంటున్న నటుడు ప్రభాస్.. నా బ్రదర్ అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు వచ్చింది. కీరవాణిగారికి ఆస్కార్ అవార్డు వచ్చింది. దేశంలోనే అత్యధిక బడ్జెట్‌తో మహేశ్‌బాబు–రాజమౌళి సినిమా రాబోతోంది. ఇలా ఎన్నో సాధిస్తున్నాం. తెలుగు సినిమా 90 సంవత్స రాలు పూర్తి చేసుకుంటోంది. ఇలాంటి తరుణంలో 'మా' నిధుల సేకరణ కోసం మలే సియాలో 'నవతిహి ఉత్సవం'కు ఏర్పాట్లు జరుగుతుండటం సంతోషంగా ఉంది'' అని 'మా' అధ్యక్షుడు విష్ణు మంచు అన్నారు. తెలుగు సినిమా 90 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా తెలుగు సినిమా చరిత్రను తెలియజేసేలా మలేసియాలో 'నవతిహి ఉత్సవం' పేరిట ఓ ఫండ్ రైజింగ్ ఈవెంట్‌ను జూలైలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో విష్ణు మంచు మాట్లాడారు.

యాక్షన్‌తో స్టార్ట్


• సల్మాన్‌ఖాన్

మేలో యాక్షన్ స్టార్ట్ చేయనున్నారు సల్మాన్ ఖాన్. తమిళ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ తెరకెక్కించనున్న సినిమాలో సల్మాన్ ఖాన్ హీరోగా నటించనున్న సంగతి తెలిసిందే. ఈ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ చిత్రీకరణ మేలో ముంబైలో ప్రారంభం కానుందని బాలీవుడ్ సమాచారం. ముందుగా ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించాలని ప్లాన్ చేస్తున్నారట మురుగదాస్. ఈ సినిమాలోఅదిరిపోయే యాక్షన్ సీక్వెన్స్‌లతో పాటు ఓ సామాజిక సందేశం కూడా ఉందని ఇటీవల మురుగదాస్ వెల్లడించిన సంగతి తెలిసిందే. సాజిద్ నడియాద్‌వాలా నిర్మించనున్న ఈ చిత్రం 2025 రంజాన్ సందర్భంగా విడుదల కానుంది.

ఫైట్ చేశా!


• అప్సర

అప్సరా రాణి ప్రధాన పాత్రలో అశోక్ కుమార్, అజయ్ ఘోష్, విజయ కరణ్ కీలక పాత్రల్లో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ ఫిల్మ్ 'తలకోన'. నగేష్ నారదాసి దర్శకత్వంలో దేవర శ్రీధర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా అప్సరా రాణి మాట్లాడుతూ –''నేను ఇప్పటివరకూ చేయని ఫైట్ సీక్వెన్స్‌లు ఈ సినిమా కోసం చేశాను'' అన్నారు. ''ఫారెస్ట్ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో పొలిటిక్స్, మీడియా అంశాలను మిక్స్ చేశాం'' అన్నారు శ్రీధర్. ''విభిన్నమైన చిత్రం ఇది'' అన్నారు నగేష్.

మ్యూజికల్ జోకర్


• జోకర్–2 పోస్టర్

హాలీవుడ్ సైకలాజికల్ థ్రిల్లర్ 'జోకర్' 2019లో విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. జోక్విన్ ఫీనిక్స్ లీడ్ రోల్ చేసిన ఈ సినిమాకు టాడ్ ఫిలిప్స్ దర్శకత్వం వహించారు. ప్రస్తుతం జోక్విన్, ఫిలిప్స్ కాంబినేషన్‌లోనే 'జోకర్: ఫోలీ ఏ డ్యూక్స్' (జోకర్ 2) చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో ఆర్థర్ ఫ్లెక్ అలియాస్ జోకర్ పాత్రలో జోక్విన్, హార్లే క్విన్‌గా లేడీ గగా కనిపిస్తారు. ఈ ఏడాది అక్టోబరులో 'జోకర్ 2' చిత్రం విడుదల కానుంది. కాగా ఈ సినిమాలో దాదాపు 15 కవర్ సాంగ్స్ (రీమిక్స్ తరహాలో) ఉంటాయని హాలీవుడ్ సమాచారం. 'ది బ్యాండ్ వాగన్' (1953) సినిమా నుంచి 'దట్స్ ఎంటర్‌టైన్‌మెంట్' పాట, 'మమ్మా మియా' (2008) చిత్రంలోని ఓ పాట.. ఇలా పలు పాటలు 'జోకర్ 2'లో కవర్ సాంగ్స్‌గా వినిపిస్తాయట. అంతే కాదు.. ఈ కవర్ సాంగ్స్‌లో కొన్నింటిని జోక్విన్, లేడీ గగా పాడనున్నారని హాలీవుడ్ టాక్. 'జోకర్ 2' సినిమాకు ఐజీ హిల్డర్ స్వరకర్త.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

గ్రీన్‌చానల్‌తో వ్యక్తికి అత్యవసర చికిత్స



గుండెపోటుకు గురైన వ్యక్తిని గ్రీన్ చానల్ ద్వారా బొల్లినేని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇప్పటి వరకూ కేవలం అవయవదానాలకు మాత్రమే ఉపయోగించే గ్రీన్ చానల్‌ను తొలిసారిగా ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడేందుకు ఉపయోగించడంతో అతని ప్రాణాలు దక్కాయి. వివరాల్లోకి వెళితే... కాకినాడ సముద్ర తీరానికి 25 నాటికల్ మైళ్ల దూరంలో స్టెర్లింగ్ అర్మదా–5 రిగ్గులో మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రతాప్‌సింగ్ (43) విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు శనివారం ఉదయం 10 గంటలకు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. వెంటనే ఆ రిగ్ కంపెనీ రాజమహేంద్రవరంలోని కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిని సంప్రదించింది. దీంతో ప్రతాప్‌సింగ్‌ను ఆసుపత్రికి తరలించేందుకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేశారు. నడి సంద్రం నుంచి హెలికాప్టర్‌లో రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి ఆసుపత్రికి తరలించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం గ్రీన్ చానల్ ఏర్పాటు చేసింది. పోలీస్ ఎస్కార్ట్ నడుమ రోడ్డుపై ట్రాఫిక్ క్లియర్ చేసి, ప్రతాప్‌సింగ్‌ను అత్యంత వేగంగా ఆసుపత్రికి తీసుకుని వచ్చారు. అప్పటికే సిద్ధంగా ఉన్న వైద్యులు ఆయనకు తక్షణ చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. దీనికి పూర్తి సహాయ సహకారాలు అందించిన బొల్లినేని ఆసుపత్రి డైరెక్టర్ స్వర్ణ రామ్మోహన్, సీఈవో, చీఫ్ కార్డియాలజిస్ట్ రామరాజు, పోలీసు అధికారులకు ప్రతాప్‌సింగ్ కుటుంబ సభ్యులు, కంపెనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

220 మంది ఏపీఎస్పీఎఫ్ సిబ్బందికి కంటి పరీక్షలు

సాక్షి, అమరావతి: ఏపీ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏపీఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బందికి సచివాలయం ప్రాంగణంలో కంటి వైద్య పరీక్షలు చేసినట్లు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కృష్ణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ సిబ్బంది శిబిరంలో 220 మంది ఎస్పీఎఫ్ సిబ్బందికి పరీక్షలు నిర్వహించినట్టు పేర్కొన్నారు.

సౌర విద్యుత్‌లో ఏపీ ముందడుగు

2022-23లో సుమారు 100 కిలో టన్నుల సౌర వ్యర్థాల ఉత్పత్తి

దేశంలో 2030 నాటికి 600 కిలో టన్నులకు చేరుకునే అవకాశం

ఈ వ్యర్థాల్లో 67 శాతం ఐదు రాష్ట్రాల్లోనే ఉత్పత్తి

కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్ నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: మన రాష్ట్రం సౌర విద్యుత్ ఉత్పత్తిలో ఏపీ టాప్ 5 రాష్ట్రాల్లో స్థానం సంపాదించే దిశగా సాగుతోంది. సోలార్ వ్యర్థాలపై విడుదల చేసిన తాజా నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. కేంద్ర న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్ ఈ నివేదిక రూపొందించింది. దేశంలో గతేడాది (2022–23లో) సుమారు 100 కిలో టన్నుల సౌర వ్యర్థాల ఉత్పత్తి జరిగిందని, 2030 నాటికి వీటి ఉత్పత్తి 600 కిలో టన్నులకు చేరుతుందని వెల్లడించింది. సౌర వ్యర్థాల్లో దాదాపు 67 శాతం రాజస్థాన్, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచే వస్తున్నట్లు పేర్కొంది. ఈ ఐదు రాష్ట్రాల్లోనే సౌర విద్యుత్ ప్రాజెక్టులు భారీగా పెరుగుతుండటమే ఇందుకు కారణమని తెలిపింది. మన దేశంలో 2070 నాటికి కాలుష్య పూరితమైన కర్బన ఉద్గారాలను పూర్తిగా సున్నా స్థాయికి తేవాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. 2030 నాటికి ఒక మిలియన్ టన్నుల కాలుష్యాన్ని వాతావరణం నుంచి పారద్రోలాలని రాష్ట్రాలకు చెప్పింది. ఇందులో భాగంగా పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని పెంచుతోంది. మన దేశం 2040 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం లక్ష్యంగా పెట్టుకొంది. దీనికి తోడ్పాటు నందిస్తున్న మొదటి పది రాష్ట్రాల్లో ఏపీ ఇప్పటికే స్థానం సంపాదించింది. ఇప్పటికే 4.76 మిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలు తగ్గించి ఆదర్శంగా నిలిచింది. విశాఖ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో రాష్ట్రం 42 ఇంధన అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది. వీటి ద్వారా రాష్ట్రానికి దాదాపు రూ.9.57 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సౌర విద్యుత్ ఉత్పత్తి కూడా పెంచుతూ రాష్ట్రం టాప్ 5 రాష్ట్రాల్లో నిలిచిందని తాజా నివేదిక వెల్లడించింది.

రీసైక్లింగ్ చేస్తే సరి

వాతావరణంలో పెరుగుతున్న కాలుష్యం, తరిగిపోతున్న శిలాజ ఇంధన వనరుల కారణంగా ప్రపంచం మొత్తం పునరుత్పాదక ఇంధనం వైపు దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా పదేళ్లలో సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 23 రెట్లు పెరిగింది. రానున్న ఆరేళ్లలో (2030 నాటికి) 292 గిగావాట్ల స్థాపిత సౌర సామర్థ్యాన్ని పెంచాలనేది లక్ష్యం. అయితే సోలార్ మాడ్యూల్స్, ఫీల్డ్ నుండి వచ్చే వ్యర్థాలు ఓ సవాలుగా మారనున్నాయి. నిజానికి ఫోటో వాల్టాయిస్ (పీవీ)ల జీవిత కాలం 25 ఏళ్లు. ఆ తర్వాత అవి వ్యర్థాలుగా మారతాయి. కాకపోతే సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నప్పుడు కొన్ని పీవీలు పగిలిపోవచ్చు. కొంత కాలం తరువాత కొన్ని పనిచేయకపోవచ్చు. కొన్ని నాణ్యత పరీక్షల్లో విఫలమై పక్కన పడవచ్చు. రవాణా సమయంలో కొన్ని దెబ్బతింటాయి. అలాంటివి వ్యర్థాలుగా మారుతుంటాయి. ఈ మాడ్యూల్స్‌లో సిలికాన్, కాపర్, టెల్లూరియం, కాడ్మియం వంటి ఖనిజాలు కూడా ఉంటాయి. దేశంలో ఇప్పుడున్న సౌర విద్యుత్ ప్రాజెక్టుల నుంచే 2030 నాటికి సుమారు 340 కిలోటన్నుల వ్యర్థాలు రావచ్చని అంచనా. ఈ వ్యర్థాల్లో 10 టన్నుల సిలికాన్, 18 టన్నుల వెండి, 16 టన్నుల కాడ్మియం, టెల్లూరియం ఉంటాయి. కొత్తగా వచ్చే ప్రాజెక్టులతో కలిపి వ్యర్థాలు 600 కిలోటన్నులకి చేరుకోవచ్చు. 2050 నాటికి దాదాపు 19,000 కిలో టన్నులకి పెరుగుతాయని అంచనా. వ్యర్థాలను తొలగించడం కోసం రీసైక్లింగ్ వ్యవస్థలను ప్రోత్సహించడమే సరైన మార్గం. అంతేకాదు రసాయన ప్రక్రియల సహాయంతో రీసైక్లింగ్ చేస్తే వెండి, సిలికాన్‌ను కూడా తిరిగి పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

• తెలంగాణ

కొత్త జడ్జీల ప్రమాణం వచ్చే వారం..

జస్టిస్ సుజోయ్ పాల్ 26న, జస్టిస్ మౌషుమి భట్టాచార్య 28న



జస్టిస్ సుజోయ్ పాల్ | జస్టిస్ మౌషుమి భట్టాచార్య

సాక్షి, హైదరాబాద్ : తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నియుక్తులైన న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం ఖరారైంది. జస్టిస్ సుజోయ్ పాల్ 26న, జస్టిస్ మౌషుమి భట్టాచార్య 28న.. మొదటి కోర్టు హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, ఇతర న్యాయమూర్తుల సమక్షంలో బాధ్యతలు చేపట్టనున్నారు. కలకత్తా హైకోర్టు నుంచి జస్టిస్ మౌషుమి భట్టాచార్య, మధ్యప్రదేశ్ హైకోర్టు నుంచి జస్టిస్ సుజోయ్ పాల్‌ను తెలంగాణకు హైకోర్టుకు బదిలీ చేస్తూ రాష్ట్రపతి 18న ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే.

డబ్బు కొట్టు... టికెట్ పట్టు!

- రూ.15 కోట్లు చెల్లించినవారికే కొవ్వూరు టీడీపీ సీటు
- సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న ఫోన్ కాల్ వాయిస్



మండిపడుతున్న పార్టీ శ్రేణులు

కొవ్వూరు:తెలుగుదేశం పార్టీలో టికెట్లు అమ్ముకున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో టికెట్టు ఖరారు విషయంలో జరిగిన బేరసారాల సంభాషణ ఇప్పుడు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది.'రూ.10 కోట్లు చూసుకోండి.. టికెట్టు ఇప్పిస్తాం' అంటూ జిల్లాలోని నిడదవోలుకు చెందిన ఓ ఎన్ఆర్ఐ మహిళకు స్థానిక నాయకులు వర్తమానం పంపారు. ఆమె సొమ్ము రెడీ చేసుకుంటున్న తరుణంలోనే ముప్పిడి వెంకటేశ్వరరావుకు టికెట్ ఖరారు చేశారు. దీనిపై ఆమె ఆ ముఖ్య నాయకుడికి ఫోన్ చేసి 'రూ.10 కోట్లు తెస్తే నాకు టిక్కెట్టు ఇప్పిస్తామంటే సరే అన్నాను. ఇప్పుడిలా చేశారేమిటి?' అని ప్రశ్నించారు. ఆ నాయకుడు 'డబ్బు లేకుండా రాజకీయం లేదు. అంతా కోట్ల మీదే పని' అని ఆమెకు బదులిచ్చారు. 'రూ.10 కోట్లు తెచ్చుకోమ్మా. మేం మాట్లాడతామని నాతో అన్నారు. టికెట్టు వచ్చిన వ్యక్తి ఎంత ఇచ్చారు?' అని ఆ మహిళ ప్రశ్నిస్తే 'రూ.15 కోట్లు ఇస్తేనే టికెట్టు ఇచ్చారు' అని ఆయన చెప్పారు. 'అంటే నాకంటే మరో రూ.5 కోట్లు పెంచారన్న మాట. ఇంత మాత్రం దానికి రూ.10 కోట్లు తెచ్చుకోమనడం దేనికి' అంటూ ఆమె వాపోయింది.

నియోజకవర్గ ప్రముఖ నాయకుడికి సన్నిహితుడైన చాగల్లుకు చెందిన ఓ నాయకుడు ఆ మహిళతో మాట్లాడిన ఈ ఫోన్ సంభాషణలు టీడీపీలోనూ దుమారం రేపుతున్నాయి. రూ.15 కోట్లిచ్చినవారికే టికెట్టిచ్చినట్టు గుప్పుమనడంతో పార్టీ శ్రేణులు తలలు పట్టుకుంటున్నాయి. గెలుపు గుర్రాలను పక్కన పెట్టి డబ్బు సంచులకే చంద్రబాబు ప్రాధాన్యమిచ్చారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవైపు అతి సామాన్య కుటుంబాలకు చెందిన వ్యక్తులకు వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు కేటాయిస్తుంటే టీడీపీ మాత్రం డబ్బుకే ప్రాధాన్యం ఇవ్వడాన్ని ఆ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. కేవలం సర్వేలను ప్రామాణికంగా తీసుకునే తమ పార్టీ అభ్యర్థులను ఖరారు చేస్తున్నట్లు చంద్రబాబు పదేపదే చెబుతున్న మాటలు వాస్తవం కాదని ఆ పార్టీ నాయకులే బాహాటంగా విమర్శిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో తొలుత ముగ్గురు వ్యక్తులపై ఐవీఆర్ఎస్ విధానంలో సర్వే నిర్వహించి చివరకు ఆ ముగ్గురిని కాదని ముప్పిడికి టికెట్టు కేటాయించడం వారి ఆరోపణలకు బలం చేకూరుస్తోంది.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్‌పై టీడీపీ మూకల దాడి



గాయపడిన గోపిరాజు యాదవ్

బల్లికురవ: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా బాపట్ల జిల్లా బల్లికురవ మండల కన్వీనర్ కొండవర్రు గోపిరాజు యాదవ్‌పై టీడీపీ నేతలు మారణాయుధాలతో శనివారం దాడిచేశారు. దీంతో గోపిరాజు యాదవ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు, గ్రామస్తుల కథనం ప్రకారం... ఉప్పుమాగులూరు పంచాయతీలోని సోమవరప్పాడు గ్రామానికి చెందిన గోపిరాజు యాదవ్ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా ఉన్నాడు. ఈ నెల 10న మేదరమెట్ల సమీపంలోని పి.గుడిపాడు వద్ద జరిగిన 'సిద్ధం' సభకు సంబంధించిన పోస్టులను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఉప్పుమాగులూరు గ్రామ టీడీపీ నేతలు పిన్నెంటి నాగరాజు, నరేష్, అమర్నేని వినోద్‌లు సోషల్ మీడియాలో వైఎస్సార్‌సీపీ పోస్టులు పెట్టవద్దని, టీడీపీలో చేరాలని గోపిరాజు యాదవ్‌ను బెదిరించారు. తాను వైఎస్సార్‌సీపీని వీడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టంచేశాడు. దీంతో అతనిపై కక్ష పెంచుకున్నారు. గోపిరాజు యాదవ్ శనివారం వేమవరం జంక్షన్ నుంచి తమ గ్రామంలోకి వెళుతుండగా పిన్నెంటి నాగరాజు, నరేష్, అమర్నేని వినోద్, సుబ్బారావు, కొల్లా చౌదరి మారణాయుధాలతో దాడిచేశారు. గోపిరాజు యాదవ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు బల్లికురవ పోలీస్ స్టేషన్‌కు, అక్కడి నుంచి గుంటుపల్లి పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. మెరుగైన చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

క్లుప్తంగా...

నేటి నుంచి ఐపీఎల్ టికెట్ల విక్రయాలు

విశాఖ స్పోర్ట్స్: విశాఖ వేదికగా జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌లకు ఆన్‌లైన్‌లో ఆదివారం నుంచి టికెట్లను విక్రయించనున్నారు. వైఎస్సార్ స్టేడియంలో 31న చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)తోనూ... 3న కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్)తోనూ హోమ్ గ్రౌండ్ మ్యాచ్‌లను ఢిల్లీ క్యాపిటల్స్ ఆడనుంది. కేకేఆర్‌తో జరిగే మ్యాచ్‌కు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి, సీఎస్‌కేతో జరిగే మ్యాచ్‌కు 27వ తేదీ నుంచి పేటీఎం, పేటీఎం ఇన్‌సైడర్‌లతో పాటు ఢిల్లీ క్యాపిటల్స్ వెబ్‌సైట్లలో టికెట్లను కొనుగోలు చేయవచ్చు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన టికెట్లను పీఎం పాలెంలోని వైఎస్సార్ స్టేడియం బి గ్రౌండ్‌లోనూ, స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రవేశ (రీడీమ్) టికెట్లుగా మార్చుకోవచ్చు. కేకేఆర్ మ్యాచ్‌కు పొందిన ఆన్‌లైన్ టికెట్లను 26వ తేదీ నుంచి, సీఎస్‌కే మ్యాచ్‌కు పొందిన ఆన్‌లైన్ టికెట్లను 27వ తేదీ నుంచి ప్రవేశ టికెట్లు పొందవచ్చు. రూ.1,000 నుంచి రూ.7,500వరకు విలువ చేసే టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి.

ఎలుగుబంటి దాడిలో ఇద్దరు జీడి రైతులు మృతి


కూర్మారావు (ఫైల్)


లోకనాథం (ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: పొట్టకూటికోసం జీడి మామిడితోటలో పనిచేస్తున్న ఇద్దరు రైతులపై ఓ ఎలుగుబంటి దాడి చేయడంతో ఘటనాస్థలంలోనే మృతిచెందిన విషాదకర ఘటన శ్రీకాకుళం జిల్లా ఉద్దాన ప్రాంతంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. గాయపడిన మరో మహిళ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం.. వజ్రపుకొత్తూరు మండలం చీపురుపల్లి పంచాయతీ పరిధిలోని అనకాపల్లి గ్రామానికి చెందిన జీడి రైతులు శనివారం తోటలోకి పనులకు వెళ్లారు. అకస్మాత్తుగా ఎలుగుబంటి వచ్చి దాడికి తెగబడడంతో చిడిపల్లి లోకనాథం (47), అప్పికొండ కూర్మారావు (49) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. లోకనాథం భార్య సావిత్రిపైనా ఎలు గు దాడి చేయగా ఆమె తీవ్రంగా గాయపడడంతో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల్లో ఒకడైన కూర్మారావు పంచాయతీ వార్డు మెంబర్ కూడా. దాడి చేసిన ఎలుగుబంటిని గ్రామస్తులు వెంటాడి హతమార్చారు.

విజయవంతంగా ఇంటర్ పరీక్షలు పూర్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలను అధికారులు విజయవంతంగా పూర్తిచేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సమర్థంగా నిర్వహించారు. మార్చి 1 నుంచి 20 వరకు జరిగిన పరీక్షల్లో కేవలం 75 మాల్‌ప్రాక్టీస్ కేసులు మాత్రమే నమోదు కావడం గమనార్హం. ఇంటర్ బోర్డు చరిత్రలో ఇంత తక్కువ నమోదవ్వడం ఇదే తొలిసారి. 2023–24కు రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులు కలిపి మొదటి సంవత్సరం 5,17,617 మంది, రెండో సంవత్సరం 5,35,056 మంది.. మొత్తం 10,52,673 మంది పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో పరీక్షలకు 9,99,698 మంది హాజరు కాగా, 52,900 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలకు హాజరైన వారిలో 75 మందిపై మాల్‌ప్రాక్టీస్ కింద కేసులు నమోదు చేశారు. కాగా ఇప్పటికే పరీక్ష పత్రాల మూల్యాంకనం ప్రారంభించిన అధికారులు ఏప్రిల్ 4 నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత రెండో వారంలో ఫలితాలు విడుదల చేసే యోచనలో ఉన్నారు.



ఆన్‌లైన్ విధానంతో తొలగిపోయిన ఇబ్బందులు..

ఈ ఏడాది పరీక్షల నిర్వహణకు ఇంటర్మీడియెట్ కమిషనరేట్ అనేక జాగ్రత్తలు తీసుకుంది. ఫీజు చెల్లింపు, నామినల్ రోల్స్ నమోదు నుంచి పరీక్ష కేంద్రాల వరకు అన్ని దశల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించింది. విద్యార్థులకు తలెత్తే సమస్యల పరిష్కారానికి ఆయా కళాశాలల్లోనే చర్యలు తీసుకుంది. గతంలో పరీక్ష ఫీజును చలాన్ రూపంలో చెల్లిస్తే, వాటిని పరిశీలించి మదింపు చేసేందుకు బోర్డుకు చాలా సమయం పట్టేది. ఈ ఏడాది ఆన్‌లైన్ విధానంతో గత ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. అలాగే ప్రాక్టికల్స్ పరీక్షలు పూర్తయిన వెంటనే అక్కడికక్కడే మార్కులను బోర్డు వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. మార్కుల విషయంలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా ఎగ్జామినర్ రెండుసార్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా జాగ్రత్తలు తీసుకున్నారు.

పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు..

ప్రధాన పరీక్షలు జరిగిన 1,559 సెంటర్లలో ప్రతి గదిలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 22 వేల కెమెరాలను వినియోగించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని బోర్డు కార్యాలయం నుంచి పరీక్షల సరళిని పర్యవేక్షించేందుకు జిల్లాకో అధికారిని కమిషనర్ సౌరబ్ గౌర్ నియమించారు. కేంద్రాల నుంచి పరీక్ష పత్రాలు బయటకు రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ప్రశ్నపత్రాలకు మూడు స్థాయిల్లో 'క్యూఆర్' కోడ్‌ను జోడించారు.

చేనేతలను ఆదుకుంది సీఎం జగనే..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వారి కోసం చేసిన ఖర్చు రూ.3,706 కోట్లు

- వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు తోడుగా నిలుద్దాం
- పద్మశాలి ఆత్మీయ సమావేశంలో పలువురు నేతలు

సాక్షి, అమరావతి: చేనేతలను అన్ని విధాలా ఆదుకుని, వారి అభ్యున్నతికి పాటుబడిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్ మాత్రమేనని పలువురు నేతలు కొనియాడారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం పద్మశాలి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతన్నలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తన పుట్టిన రోజు నాడు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని తీసుకొచ్చారని, అప్పటి నుంచి నేతన్నలకు తోడుగా నిలబడ్డారని కొనియాడారు. నేతన్నలకు సామాజిక పింఛన్ల రూపంలో రూ.1,396 కోట్లు, నవరత్నాల్లోని ఇతర పథకాల ద్వారా మరో రూ.871 కోట్లను ఖర్చు చేసినట్టు చెప్పారు. ఆప్కో బకాయిలు రూ.468 కోట్లు, నేతన్న నేస్తం ద్వారా రూ.970 కోట్లు.. వెరసి మొత్తం రూ.3,706 కోట్లను నేతన్నల సంక్షేమం కోసం వెచ్చించారని వివరించారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఐదేళ్లకు కలిపి చేనేతల కోసం ఇచ్చింది కేవలం రూ.450 కోట్లేనని దుయ్యబట్టారు. చేనేతలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నత స్థితికి తీసుకొచ్చేందుకు సీఎం జగన్ చేస్తున్న యజ్ఞానికి అందరం చేయూతనిద్దామని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథి, శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ చేనేత కుటుంబానికి సీఎం జగన్ చేస్తున్న మేలును ప్రతి చేనేత కార్మికుడు రాష్ట్రంలోని చేనేత కుటుంబాలకు వివరించి, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, పార్టీ నేతలు మూర్తి, చిల్లపల్లి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ తీరానికి అమెరికా భారీ యుద్ధనౌక

- విశిష్టమైన నిర్మాణం.. ఉభయచరిగా ప్రఖ్యాతి
- యుద్ధట్యాంకర్లను, హెలికాప్టర్లను మోసుకెళ్లే సామర్థ్యం

సాక్షి, విశాఖపట్నం: భారీ యుద్ధ నౌకలు ఒడ్డుకు రాగలవా..? ఎప్పుడూ చూడలేదు కదా? ఒడ్డుకు రాగల సామర్థ్యంగలది అమెరికాకు చెందిన యూఎస్ఎస్ సోమర్‌సెట్. ఈ యుద్ధ నౌకను ఉభయచర నౌక అని పిలుస్తారు. ఎందుకంటే.. ఇది సముద్ర జలాల్లోంచి ఒడ్డుకు చేరుకుని యుద్ధం జరిగే ప్రాంతానికి ట్రూప్స్‌ను తరలించే సామర్థ్యం సొంతం చేసుకొంది. ఇలా యాంఫిబియాస్(ఉభయచర) యుద్ధ నౌకల్లో అమెరికాలో ఉన్న అతి పెద్ద ల్యాండింగ్ క్రాఫ్ట్‌లలో ఇది ఒకటి. విశాఖ నగరంలో నిర్వహిస్తున్న భారత్–అమెరికా యుద్ధ విన్యాసాలు టైగర్ ట్రయాంఫ్–2024లో అమెరికా తరఫున వచ్చిన సోమర్‌సెట్ యుద్ధ నౌక అనేక విశిష్టతల్ని సొంతం చేసుకుంది.

ఆ పేరెలా వచ్చింది?

2001 సెప్టెంబర్ 11న తీవ్రవాదులు దాడి ఘటనలో యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ఫ్లయిట్–93 హైజాక్‌కు గురైంది. ఈ ఘటనలో సోమర్‌సెట్ కౌంటీకి చెందిన 43 మంది ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. వారి గౌరవార్థం సోమర్‌సెట్ పేరుతో ఈ నౌకని నిర్మించారు. విమానంలోని 22 టన్నుల ఉక్కునితీసి.. ఈ షిప్ కీల్‌ని నిర్మించారు.

నౌక స్పెషాలిటీ..

నినాదం-	కరేజ్ థ్రూ యాడ్వర్సిటీ
షిప్ పొడవు-	684 అడుగులు
షిప్ బీమ్-	105 అడుగులు
యుద్ధ నౌక మొత్తం అంతస్తులు-	06
వేగం-	గంటకు 22 నాటికల్ మైళ్లు
బోట్స్, ఎల్‌సీసీలు-	05
క్రేన్లు-	02
ట్రూప్స్-	28 మంది అధికారులు, 333 మంది సెయిలర్స్, ఇతర సిబ్బంది



భారీ యుద్ధ ట్యాంకులతో..

సోమర్‌సెట్ షిప్‌లోని సుదీర్ఘ వెల్‌డెక్‌లో యుద్ధ ట్యాంకులు తీసుకెళ్లవచ్చు. నేలపైనుంచి వచ్చే దాడులను ఎదుర్కోవడానికి రెండు 30 ఎంఎం బుష్‌మాస్టర్–2 యుద్ధ ట్యాంకులు, ఆకాశం నుంచి వచ్చే దాడులు ఎదుర్కోవడానికి రెండు రోలింగ్ ఎయిర్‌ఫ్రేమ్ మిస్సైల్ లాంచర్లు ఉంటాయి. బుష్ మాస్టర్–2ను మానవ రహితంగానూ ఉపయోగించుకోవచ్చు. వెల్‌డెక్‌లోని యుద్ధ ట్యాంకర్లుతో పాటు విపత్తుల సమయంలో సహాయక చర్యలు చేపట్టేందుకు భారీ వాహనాల్ని తీసుకెళ్లగల సామర్థ్యం దీని సొంతం. వీటితో పాటు రెండు సీహెచ్–46 సీనైట్ హెలికాప్టర్లు, రెండు ఎంవీ22 రోటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు కూడా ఉంటాయి.

యూఎస్ఎస్ సోమర్‌సెట్ (ఎల్‌పీడీ25) స్వరూపమిదీ...

- 2014 మార్చి 14 నుంచి సోమర్‌సెట్ సేవలు ప్రారంభమయ్యాయి.
- లోతు జలాల్లోంచి నేరుగా ఒడ్డుకు వచ్చేలా డిజైన్ చేశారు.. యుద్ధ సామగ్రితో 25,000 టన్నుల బరువు ఉంటుంది.

త్వరలో పాలిటెక్నిక్ కాలేజీల్లో 'గ్రీన్ స్కిల్స్ పాస్‌పోర్ట్ ప్రోగ్రామ్'

సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి

సాక్షి, అమరావతి: పాలిటెక్నిక్ విద్యార్థుల్లో స్థిరత్వం, ఉపాధి కల్పన, వ్యవస్థాపకత రంగాల్లో మెరుగైన అవకాశాలు అందించడమే లక్ష్యంగా 'ఈవై గ్రీన్ స్కిల్స్ పాస్‌పోర్ట్ ప్రోగ్రామ్' అమల్లోకి తెచ్చినట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గ్రీన్ ఎకానమీ రంగంలో విజయం సాధించేందుకు అవసరమైన విజ్ఞానం, నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంచేందుకు ఇది ఉపకరిస్తుందని పేర్కొన్నారు. ఇందుకోసం సాంకేతిక విద్యాశాఖ, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నట్టు ఆమె 'సాక్షి'కి తెలిపారు. ఈవై (ఎర్నెస్ట్ అండ్ యంగ్) గ్రీన్ స్కిల్స్ పాస్‌పోర్ట్ ప్రోగ్రామ్‌ను పాలిటెక్నిక్ రెండు, చివరి సంవత్సరం విద్యార్థులకు ఉచితంగా అందిస్తామని, సామాజిక బాధ్యతలో భాగంగా తమ వంతు సహకారం అందించేందుకు లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ ముందుకు వచ్చినట్టు ఆమె వివరించారు. ఈ కోర్సులో శిక్షణ పొందిన విద్యార్థులకు ఎర్నెస్ట్ అండ్ యంగ్ (ఈవై), మైక్రోసాఫ్ట్ సంయుక్తంగా ధ్రువపత్రం ప్రదానం చేస్తాయని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని తొలుత విశాఖపట్నంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో అమలు చేసి, తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్టు కమిషనర్ వివరించారు. లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ వందన చౌదరి, సాంకేతిక విద్యాశాఖ ఉప సంచాలకులు (ట్రైనింగ్, ఉపాధి) డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ ప్రదీప్ కుమార్ ఈ ప్రోగ్రామ్‌లో పనిచేస్తారని ఆమె వివరించారు.

ఏపీ పీజీఈసెట్ పరీక్షల షెడ్యూల్ విడుదల

- మే 29 నుంచి ప్రవేశ పరీక్షలు
- ఎస్వీ వర్సిటీ వీసీ, సెట్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి సిటీ: ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీ నిర్వహిస్తున్న ఏపీ ఇంజినీరింగ్, ఫార్మసీ పీజీ సెట్–2024 పరీక్షల షెడ్యూల్‌ను వీసీ, సెట్ చైర్మన్ వి.శ్రీకాంత్‌రెడ్డి శనివారం విడుదల చేశారు. ఈ నెల 17న ఏపీ పీజీఈసెట్ నోటిఫికేషన్ విడుదలైందని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఏప్రిల్ 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షలు మే 29 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు.


షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న వీసీ, అధికారులు

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
ఆదివారం । 24 । మార్చి । 2024



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో జరిగే నిత్యాన్నదానానికి హైదరాబాద్ కల్యాణ్‌నగర్‌కు చెందిన వి.జ్యోత్స్న పేరిట ఆమె కుటుంబ సభ్యులు శనివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



ఉరుసుకు పోటెత్తిన భక్తజనం

కోడూరు: పెదగుడుమోటులో బెంగాలీషా బాబావలి ఉరుసును శనివారం వైభవంగా నిర్వహించారు. భక్తులతో దర్గా ప్రాంగణం పోటెత్తింది.

బాధ్యతల స్వీకరణ



చిలకలపూడి(మచిలీపట్నం): జీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కె.శంకర రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.



	ఇఫ్తార్ (ఆది)	సహరి (సోమ)
విజయవాడ	6.24	4.50
జగ్గయ్యపేట	6.26	4.58
మచిలీపట్నం	6.23	4.48
గుడివాడ	6.24	4.50

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

నేడు జాతీయ స్థాయి పోటీలకు బాడీబిల్డర్ల ఎంపిక

పెనమలూరు: త్వరలో జరిగే 13వ ఫెడరేషన్ జాతీయ స్థాయి బాడీబిల్డింగ్ పోటీలకు ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించేందుకు ఆసక్తి చూపే క్రీడాకారులు తమను సంప్రదించాలని జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్ శనివారం కోరారు. ఏప్రిల్ 6,7 తేదీల్లో గోవాలో జాతీయ బాడీబిల్డింగ్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం పది గంటలకు భీమవరంలో ఏపీ బాడీబిల్డర్లను ఎంపిక చేయనున్నారని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు కానూరు అశోక్‌జిమ్‌లో జిల్లా అసోసియేషన్ నుంచి లెటర్ తీసుకొని భీమవరంలో జరిగే సెలక్షన్లకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 91775 75917 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు.

టెన్త్ పరీక్షలకు 353 మంది గైర్హాజరు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జిల్లాలో జరిగిన పదో తరగతి రెగ్యులర్ పరీక్షకు శనివారం 353 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఫిజికల్ సైన్స్ పరీక్షను 28,307 మంది విద్యార్థులు రాయాల్సి ఉంది. 27,954 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. హాజరు శాతం 98.75గా నమోదైందని అధికారులు ప్రకటించారు. ప్రైవేట్ విద్యార్థులకు సంబంధించి 2,831 మందికి 1,745 మంది మాత్రమే హాజరయ్యారు. 1,086 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యు.వి. సుబ్బారావు పాత బస్తీలోని పలు విద్యాసంస్థల్లో జరుగుతున్న పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

సీ-విజిల్‌లో 118 ఫిర్యాదులు

విజయవాడస్పోర్ట్స్: ఎన్నికల ప్రవర్తన నియమావళి(ఎంసీసీ) అమలులోకి వచ్చిన నేపథ్యంలో సీ-విజిల్ యాప్‌లో 118 మంది ఫిర్యాదులు చేసినట్లు విజయవాడ సైబర్ క్రైం ఏసీపీ ఎస్.డి.తేజేశ్వరరావు తెలిపారు. ఈ నెల 16 నుంచి 22వ తేదీ రాత్రి వరకు ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 118 మంది యాప్‌లో ఫిర్యాదులు అప్‌లోడ్ చేసినట్లు చెప్పారు. రిటర్నింగ్ అధికారి విచారణలో భాగంగా 43 నకిలీ ఫిర్యాదులని తేలిందన్నారు. 75 ఫిర్యాదులను ఎన్నికల సంఘం నిర్దేశించిన 100 నిమిషాల (గంటా 40 నిమిషాల) వ్యవధిలో పరిష్కరించామన్నారు. పబ్లిక్ స్థలాల్లో పలు రాజకీయ పార్టీల జెండాలు, రంగులు తొలగించాలని అత్యధికంగా ఫిర్యాదులు అందినట్లు చెప్పారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ఇబ్రహీంపట్నం(మైలవరం): ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డబ్బు, అక్రమ మద్యం తదితరాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఇబ్రహీంపట్నం ఫారెస్ట్ చెక్‌పోస్టుతో పాటు వివిధ చెక్‌పోస్టులు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను సీపీ టి.కె.రాణాతో కలసి శనివారం ఆయన పరిశీలించారు. జిల్లాలో 21 చెక్‌పోస్టులు, 42 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాయని పేర్కొన్నారు. నగదు, మద్యం, మత్తు పదార్థాలు, విలువైన వస్తువుల అక్రమ రవాణాపై పోలీస్, ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, సీఆర్‌పీఎఫ్ పర్యవేక్షణ నిరంతరం ఉంటుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు నగదు రూ.కోటి, 2.50 కిలోల బంగారం సీజ్ చేశామని తెలిపారు. సీ విజిల్, 1950 ఓటర్ హెల్ప్‌లైన్ నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్, జిల్లా స్థాయి కాల్ సెంటర్‌కు వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని వివరించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో వస్తున్న ప్రతికూల వార్తల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ అనూరాధ, సీఐ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ ఫ్రం హోం



85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు సౌలభ్యం

- వారు తమ ఇంటి వద్ద నుంచే ఓటు వేసేలా ఏర్పాట్లు
- పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అమల్లోకి నూతన విధానం
- మొబైల్ వాహనం సాయంతో ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగం
- ఉమ్మడి కృష్ణా జిల్లాలో 85 ఏళ్లు పైబడిన వారు 18,732 మంది
- నడవలేని దివ్యాంగుల సంఖ్య 37,203



2019 ఎన్నికల్లో ఓటు వేయటానికి వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి తీసుకొస్తున్న కుటుంబీకులు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఓటు ప్రతి ఒక్కరి హక్కు. ఓటు వేయాలంటే పోలింగ్ కేంద్రానికి వెళ్లక తప్పదు. బూత్ వద్ద వరుసలో నిలబడి ఓటు వేయాల్సి ఉంటుంది. వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ బూత్‌కు వెళ్లి క్యూలో నిలబడి ఓటు వేయాలంటే ఇబ్బందులు తప్పవు. వారి సౌలభ్యం కోసం ఇంటి వద్ద నుంచే 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, నడవలేని దివ్యాంగులు ఓటు వేసేలా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది. వారి వద్దకే మొబైల్ వాహనాన్ని పంపి ఓటు వేసేలా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా చూడటంతో పాటు, ఓటింగ్ శాతాన్ని పెంచొచ్చని ఎన్నికల సంఘం భావిస్తోంది. దానికోసం ఇప్పటికే ఉమ్మడి కృష్ణా జిల్లాలో దరఖాస్తుల స్వీకరణ మొదలైంది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడడం ఎన్నికల కమిషన్ లక్ష్యం. 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించేందుకు స్పెషల్ సమ్మరి రివిజన్‌ను పలుమార్లు పొడిగిస్తూ వచ్చింది. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. పోలింగ్ శాతం పెంచేలా ఈ ఎన్నికల నుంచి హోమ్ ఓటింగ్ విధానాన్ని అమలుచేస్తోంది.

తొలగనున్న ఇబ్బందులు

సాధారణంగా ఎన్నికల సమయంలో వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కుటుంబ సభ్యులు మోసుకుంటూ పోలింగ్ కేంద్రాలకు తీసుకువస్తుంటారు. కేంద్రాల వద్ద వీల్‌చైర్ సదుపాయం కల్పించినప్పటికీ ఇంటి నుంచి కేంద్రానికి తీసుకొచ్చేందుకు వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తీసుకురాలేని పరిస్థితుల్లో చాలామంది ఓటుహక్కు వినియోగించు కోలేకపోతున్నారు. పోలింగ్ శాతం పెంచే లక్ష్యంతో నడవలేని స్థితిలో ఉన్న వారు తమ ఇంటి వద్దే ఓటు వేసేందుకు ఈసీ చర్యలు చేపట్టింది. దీంతో వారి వెతలు తీరనున్నాయి. 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతానికి మించి వైకల్యం ఉన్న వారు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు నూతన మొబైల్ ఓటింగ్ వాహనం వారి ఇంటి వద్దకే వెళ్తుంది. పోస్టల్ బ్యాలెట్ తరహాలోనే హోం ఓటింగ్‌కు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి.

తొలిగా బీఎల్వోలు గుర్తిస్తారు

ఓటరు జాబితా ప్రకారం ఎన్టీఆర్ జిల్లాలో 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు 9,572 మంది ఉండగా

ఎన్టీఆర్ జిల్లాలో వయోవృద్ధులు, దివ్యాంగ ఓటర్లు

నియోజకవర్గం	85 ఏళ్లు పైబడిన వృద్ధుల సంఖ్య	దివ్యాంగుల సంఖ్య
తిరువూరు	1,285	2,922
విజయవాడ వెస్ట్	1,321	1,161
విజయవాడ సెంట్రల్	1,557	2,069
విజయవాడ ఈస్ట్	2,016	1,902
మైలవరం	1,336	1,702
నందిగామ	1,122	2,858
జగ్గయ్యపేట	935	2,224
మొత్తం	9,572	14,838

వీరిలో పురుషులు 4,250 మంది, మహిళలు 5,321 మంది, ఒకరు థర్డ్‌జండర్. దివ్యాంగులు 14,838 మంది ఉండగా వారిలో పురుషులు 8,519, మహిళలు 6,318, థర్డ్‌జండర్ ఒకరు ఉన్నారు. కృష్ణా జిల్లాలో 85 ఏళ్ల పైబడినవారు 9,160 మంది, దివ్యాంగులు 22,365 మంది ఉన్నారు. ఈసీ మార్గదర్శకాల ప్రకారం నడవలేని స్థితిలో కేంద్రానికి రాలేని ఓటర్లను బీఎల్‌ఓలు గుర్తించి ఫారం-12డీ ద్వారా ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్‌ఓ)కి దరఖాస్తు చేయిస్తున్నారు. వాటిని పరిశీలించిన అనంతరం హోం ఓటింగ్‌కు అర్హులైన వారి జాబితాను ఈఆర్ స్థాయిలో రూపొందిస్తారు. ఏ రోజు ఓటు వేయాలో ముందుగానే వారికి అధికారులు సమాచారం ఇస్తారు. బ్యాలెట్ పేపర్‌పై రహస్యంగా ఓటు వేసేలా ఏర్పాటు చేస్తారు. ఆ ఓటును సీల్ చేసిన అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ద్వారా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తరలిస్తారు. ఈ ప్రక్రియ అంతా వీడియో తీస్తారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు ఆదేశాల మేరకు హోం ఓటింగ్ కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లాలో ఈ ప్రక్రియ విజయవంతానికి అధికార యంత్రాంగం నిర్దిష్టమైన ఏర్పాట్లు చేస్తోంది.

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఎన్నికల కమిషన్ నూతనంగా తీసుకున్న హోం ఓటింగ్ నిర్ణయంతో ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. ప్రధానంగా వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేయాలని ఉన్న వారిని తీసుకొని వెళ్లి తీసుకురావటం వంటివి కుటుంబీకులు భారంగా భావిస్తుంటారు. అంతేకాకుండా వృద్ధులు ఇబ్బందులు పడి ఓటు వేయాలా? అనే భావనలోనూ వారు ఉంటారు. తాజా చర్యలతో అటువంటి ఆలోచనలకు తెర పడతాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విధమైన నిర్ణయంతో ఓటింగ్ శాతం పెరగటం ఖాయమని పలువురు విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

శనైశ్చరుని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శని త్రయోదశిని పురస్కరించుకొని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరస వెంకటనారాయణ భట్టి కుటుంబ సభ్యులు ప్రకాశం బ్యారేజీ సమీపంలో ఉన్న శనైశ్చరాలయంలో శనివారం పూజలు చేశారు. కుటుంబ సమేతంగా హాజరైన జస్టిస్ వెంకటనారాయణ భట్టికి ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. ఆలయ అర్చకుడు తూటుపల్లి శ్రీమన్నారాయణమూర్తి పూజలు చేయించారు. పలువురు స్థానిక కోర్టుల జడ్జిలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



రామవరప్పాడు(గన్నవరం): సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, విజయవాడ డీసీపీ అధిరాజ్ సింగ్ రానా శనివారం రూరల్ మండలంలోని ప్రసాదంపాడు, ఎనికేపాడులోని సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ అధిరాజ్ సింగ్ మాట్లాడుతూ పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరగడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలంతా శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరప్రవృత్తిగల వ్యక్తులను బైండోవర్ చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని స్థానిక పోలీసులకు సూచించారు. ఈ పరిశీలనలో ఏసీపీ భాస్కర్‌రావు, సీఐ మోహన్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కునుకు రాక ఆరోగ్యం కుదేలు

- నగర వాసికి నిద్రలేమి
- పెరుగుతున్న నైట్ కల్చర్ కూడా ఓ కారణమే
- అర్ధరాత్రి వరకూ స్మార్ట్‌ఫోన్‌లతో కాలక్షేపం చేస్తున్న యువత
- ఫలితంగా శారీరక, మానసిక సమస్యలు
- విజయవాడలో అందుబాటులో స్లీప్‌ల్యాబ్స్



లబ్బీపేట(విజయవాడతూర్పు): పగలంతా శ్రమించిన శరీరానికి విశ్రాంతి అవసరం. శరీరానికే కాదు మెదడుకూ విశ్రాంతి అవసరమే. మనిషికి రోజుకు ఆరు నుంచి ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరి. ప్రస్తుతం మనిషికి అవసరమైన నిద్ర లభించడం లేదు. అర్ధరాత్రి దాటే వరకూ స్మార్ట్ ఫోన్లతో కాలక్షేపం చేయడం, ఉదయాన్నే లేచి పనుల్లో నిమగ్నం కావడంతో నగర జనాభాలో 50 శాతం మంది నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారు. మరోవైపు నగరంలో నైట్ కల్చర్ బాగా పెరిగింది. అర్ధరాత్రి దాటే వరకూ యువత రోడ్ల పైనే ఉంటోంది. ఫలితంగా వారు నిద్రకరువై శారీరక, మానసిక రుగ్మతలకు గురవుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు.

గుర్తిస్తున్న సమస్యలు ఇవీ..

- అర్ధరాత్రి వరకూ స్మార్ట్‌ఫోన్‌తో కాలక్షేపం చేసే వారిలో మెలకొనిన్ అనే పదార్థం ఉత్పత్తి కాదు. దీంతో వారికి సరిగా నిద్రపట్టదు. కాలక్రమేణా దీర్ఘకాలిక సమస్యగా మారుతుంది. ఇలాంటి వారు ఒత్తిడికి లోనయ్యే ప్రమాదం ఉంది. కోపం, చిరాకు పెరిగిపోతాయి. నిస్సత్తువ ఆవహించి, తెల్లారి లేచిన తర్వాత పనిపై దృష్టి పెట్టలేరు. వాహనాలు నడిపే సమయంలో ఎదురుగా ఏమైనా వస్తుంటే తుళ్లిపాటుకు గురవుతారు. వేగంగా నిర్ణయాలు తీసుకునే శక్తిని కోల్పోతారు.
- స్మార్ట్‌ఫోన్‌లు, నైట్ కల్చర్‌లే కాకుండా మరి కొందరిలో గురకతో రాత్రి వేళల్లో తరచూ తుళ్లిపడి లేస్తుంటారు. శ్వాసనాళాలు మూసుకుపోవడంతో గురకతో పాటు, ఒక్కోసారి గుండెపోటు, మెదడుపోటుకు కూడా గురయ్యే ప్రమాదం ఉంది. ఇలాంటి వారి ఆరోగ్య పరిస్థితిని స్లీప్ ల్యాబ్‌లో అధ్యయనం చేస్తారు.
- ప్రతి ఒక్కరూ నిద్రలో నాన్ రాపిడ్ ఐ మూమెంట్ (ఎన్ఆర్ఈఎం), రాపిడ్ ఐ మూమెంట్ (ఆర్ఈఐ) అనే రెండు రకాల నిద్ర ఉంటుంది. ఇది గంటన్నరకు ఒకసారి సైకిల్ మారుతుంటుంది. కానీ కొందరికి రెండు కలిసి పోవడంతో సమస్య ఉత్పన్నమవుతోంది. దీంతో నిద్రలోనే లేచి నడవడం వంటివి చేస్తుంటారు.

సుఖనిద్రకు సూచనలు ఇవీ.

- ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు శరీరతత్వాన్ని బట్టి రోజుకు ఆరు నుంచి ఎనిమిది గంటల నిద్ర అవసరం. వయస్సు పెరిగే కొద్దీ నిద్ర అవసరం తగ్గుతుంది.
- ఒకేసారి ఏకకాలంలో నిద్రపోవాలి. నాలుగు గంటలు ఒకసారి, రెండు గంటలు మరోసారి కాదు.
- గాఢ నిద్రకోసం బెడ్‌రూమ్‌ను చీకటిగా ఉంచుకోవడంతో పాటు, శబ్దాలు లేకుండా చూసుకోవాలి.
- రోజూ ఒకే సమయంలో నిద్రపోవడం, మేల్కొనడం చేయాలి.
- నిద్రలోనే మెదడులోని వ్యర్థాలు బయటకు వెళ్లి ఆరోగ్యంగా ఉండగలుగుతారు.
- విద్యార్థులకు సరిగా నిద్రలేక పోతే, రాత్రి చదివినవి ఉదయానికి గుర్తుండవు.

నిద్రలేమికి అనేక కారణాలు



నిద్ర పట్టక పోవడానికి పది రకాల కారణాలు ఉన్నాయి. రోజూ ఒకే సమయానికి పడుకోకపోవడం, సాయంత్రం ఆరు గంటల తర్వాత టీవీలు, స్మార్ట్‌ఫోన్‌లు చూడటం, ఖాళీ కడుపుతో పడుకోవడం, నిద్రలో గురక రావడం, నైట్‌షిఫ్ట్ డిజార్డర్, రక్తహీనతలు కారణాలు. నిద్రలేమి ఉన్న వారిని స్లీప్ ల్యాబ్‌లో స్టడీ చేస్తాం. ఆక్సిజన్ శాచురేషన్, బ్రెయిన్ యాక్టివిటీ, బాడీ యాక్టివిటీ, ఏ సైకిల్‌లో ఉన్నారో తెలుసుకుంటాం. అలా నిద్రలేమికి కారణాలను అంచనా వేసి అవసరమైన వైద్యం చేస్తాం. అవసరమైన సూచనలు ఇస్తాం. వైద్యుల సూచన లేకుండా నిద్రమాత్రలు వాడటం సరికాదు.

– డి.అనీల్‌కుమార్, న్యూరాలజిస్ట్

మామిడి సీజన్ ప్రారంభం

విజయవాడరూరల్: ఈ ఏడాది మామిడి సీజన్ ప్రారంభమైంది. విజయవాడ రూరల్ మండలంలోని నున్న మ్యాంగో మార్కెట్లో శనివారం సాయంత్రం క్రయవిక్రయాలు మొదలయ్యాయి. అడవినెక్కలం గ్రామానికి చెందిన రైతు కొరివి శ్రీనివాసరావు ముందుగా పూజా కార్యక్రమాలు నిర్వహించి వ్యాపార లావాదేవీలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మ్యాంగో గ్రోయర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఐ.శ్రీనివాసరెడ్డి, వ్యాపారులు విరూప్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహారాష్ట్రకు బంగినపల్లి మామిడి కాయలను ఎగుమతి చేశారు. టన్ను ధర రూ.70 వేలుగా ఖరారైందని వ్యాపారులు తెలిపారు.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

రాష్ట్రంలోనే అతిపెద్ద మామిడికాయల మార్కెట్‌గా నున్న మ్యాంగో మార్కెట్‌కు పేరు. ఈ మార్కెట్ నుంచి దేశంలోని ఇతర రాష్ట్రాలకు మామిడిలో రారాజైన బంగినపల్లి రకం కాయలు ఎగుమతవుతాయి. సుమారు మూడు నెలల పాటు వ్యాపార లావాదేవీలు కొనసాగుతాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి రైతులు మామిడి కాయలను విక్రయించేందుకు ఇక్కడకు తీసుకొస్తారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వ్యాపారులు ఈ మామిడి మార్కెట్లో కాయలను కొనుగోలు చేసి తమ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు.



నున్న మ్యాంగో మార్కెట్లో బంగినపల్లి మామిడి కాయలు

ఈ ఏడాది దిగుబడులు తగ్గుముఖం

వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఈ ఏడాది మామిడి దిగుబడులు తగ్గాయని మ్యాంగో గ్రోయర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 30 నుంచి 40 శాతం మాత్రమే దిగుబడులు ఉన్నాయన్నారు. ఇప్పటికీ మంచు కురుస్తున్న నేపథ్యంలో మామిడి కాయల్లో మంగు ప్రభావం ఉందన్నారు. రైతులు పురుగుమందులను ఎక్కువ సార్లు పిచికారీ చేయడంతో ఖర్చు పెరిగిందన్నారు.

వాహనాల తనిఖీల్లో రూ.37లక్షల స్వాధీనం

పాయకాపురం(విజయవాడరూరల్): పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.37 లక్షల నగదు పట్టుబడింది. ఈ ఘటన శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నున్న రూరల్ పోలీసులు, స్పెషల్ టీమ్ పోలీసులు శనివారం రాత్రి పైపులరోడ్డు జంక్షన్‌లో వాహనాలు తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన పెద్దాడ రాఘవేంద్రరావు ఓ కారులో తరలిస్తున్న రూ.37 లక్షలకు సంబంధించి ఎటువంటి ఆధారాలూ చూపకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నాణ్యత ఫుల్లు.. చెదకు చెల్లు

- పర్యావరణ హితంగా కప్‌బోర్డుల తయారీ
- లాభాల బాటలో యువ పారిశ్రామికవేత్త
- ఆర్థిక సాయంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం

పెనుగంచిప్రోలు: సాధారణంగా ఇళ్లలో లేదా దుకాణాల్లో అవసరమైన కప్ బోర్డులను వివిధ రకాల కలపతో తయారు చేయిస్తుంటాం. కలపతో చేయించిన కప్ బోర్డులను చెదలు సమస్య తప్పడంలేదు. కలప కోసం చెట్లను నరికివేస్తుండటంతో పర్యావరణానికి హాని కలుగుతోంది. చెదలు సమస్యకు స్వస్తి చెబుతూ పర్యావరణానికి కీడు చేయని విధంగా జీపీఎస్‌పీ షీట్లతో అవసరాలకు తగిన విధంగా కప్ బోర్డుల తయారీ పరిశ్రమను లాభాల బాటలో నడుపుతున్నారు యువ పారిశ్రామిక వేత్త అనుమోలు శివ రాజేష్. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహంతో అతడికి అండగా నిలిచింది. బిజినెస్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన శివరాజేష్ జగ్గయ్యపేట సమీపంలోని ఏపీఐఐసీ పార్క్‌లో 2020లో రూ.4.50 కోట్లతో పర్యావరణానికి ఎటువంటి హాని కలిగించకుండా ఉండేలా అనూస్ ఇంజినీరింగ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్‌ను స్థాపించారు.



తయారైన కప్‌బోర్డులు



జీపీఎస్‌పీ షీట్స్‌పై కంప్యూటర్ ద్వారా డిజైనింగ్ చేస్తున్న యంత్రం

రసాయనాలు లేకుండా...

ఎటువంటి రసాయనాలు లేకుండా ఎకో ఫ్రెండ్లీ ప్రొడక్ట్ తయారు చేయటం ఈ యూనిట్ ప్రాముఖ్యత. మనకు కావాల్సిన కప్‌బోర్డ్‌ల సైజులు తీసుకుని పూర్తిగా యూనిట్‌లోనే తయారు చేసుకుని వచ్చి బిగిస్తారు. ముందుగా కంప్యూటర్‌లో సైజులు సెట్ చేసి డిజైనింగ్ యంత్రానికి పంపుతారు. అక్కడ ఎటువంటి రసాయనాలు లేకుండా గాలి ద్వారా జీపీఎస్‌పీ షీట్లుపై డిజైన్లు కట్ చేస్తారు. అక్కడ నుంచి మరో యంత్రంపై బెండింగ్ చేస్తారు. తరువాత మనకు అవసరమైన సైజుల్లో కప్‌బోర్డ్స్ వెల్డింగ్ లేదా ఫ్యాబ్రికేటింగ్ చేస్తారు. వాటికి రంగులు కూడా రసాయనాలు లేకుండా పౌడర్‌తో స్ప్రే చేస్తారు. ఇవి ఎటువంటి సౌండ్ రాకుండా కలపతో చేసిన విధంగా ఉండేందుకు జీపీఎస్‌పీ రెండు లేయర్ల మధ్య అట్టలాంటి హనీకోంబ్ ఉంచుతారు. కలపతో తయారు చేసిన కప్‌బోర్డులకు చెదలు పట్టే ఆస్కారం ఉంటుంది. జీపీఎస్‌పీ షీట్లతో తయారు చేసిన వీటికి చెదలు పట్టదు.

ప్రభుత్వ ప్రోత్సాహం భేష్



కప్ బోర్డుల తయారీకి కలప బదులు జీపీఎస్‌పీ షీటువాడతాం. కలప అవసరం లేకపోవడంతో పర్యావరణానికి ఎటువంటి నష్టం ఉండదు. పర్యావరణ పరిరక్షణకు ప్రాముఖ్యత ఇచ్చేందుకు ఈ యూనిట్‌ను స్థాపించాను. దీనిని ఉద్యోగ ఆధార యూనిట్‌గా రిజిస్ట్రేషన్ చేయించాను. కరోనా సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.35 లక్షల రుణం ఇప్పించి ప్రోత్సహించింది. ప్రస్తుతం యువ పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో, ముఖ్యంగా హైదరాబాద్‌లో ఈ తరహా కప్‌బోర్డులపై ఆసక్తి పెరిగింది.

– అనుమోలు శివరాజేష్, అనూస్ ఇంజినీరింగ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ నిర్వాహకుడు

క్లుప్తంగా

కార్తికేయుని దర్శించుకున్న అదనపు న్యాయ కార్యదర్శి



మోపిదేవి: కృష్ణాజిల్లా మోపిదేవిలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని రాష్ట్ర ప్రభుత్వ అదనపు న్యాయ కార్యదర్శి వడ్డాది సునీత శనివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆమె నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నా రు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వరరావు స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఆమెకు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్క రించారు.వారి వెంట ఏజీపీ నరహరశెట్టి ఈశ్వర రావు, స్థానిక ఎస్ఐ సత్యనారాయణ, అవనిగడ్డ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామ ప్రసాద్ ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కి'లేడీ' బ్యాంకు మేనేజర్ అరెస్టు

పెనమలూరు: కస్టమర్ తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు సొంత అవసరాలకు వాడుకుని బ్యాంకును మోసం చేసిన గంగూరు యూనియన్ బ్యాంకు మేనేజర్ దావులూరి ప్రభావతిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం నూజివీడు మండలం మర్రిబంధం గ్రామానికి చెందిన కపులూరి యోగేశ్వర రావుకు అదే గ్రామానికి చెందిన గంగూరు యూనియన్ బ్యాంకు మేనేజర్ దావు లూరి ప్రభావతితో ఉన్న పరిచయంతో తనకు చెందిన బంగారు ఆభరణాలు 380 గ్రాములు బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.2 లక్షలు రుణం తీసుకున్నాడు. రుణా నికి సంబంధించిన మొత్తాన్ని గత నెల నవంబర్‌లో చెల్లించాడు. బంగారం విడిపించుకోవడం కోసం బ్యాంకుకు వెళ్లగా అక్కడ బంగారం లేదు. మేనేజర్ ప్రభావతి దొంగ సంతకాలతో బంగారు ఆభరణాలు కాజేసినట్టు గ్రహించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు నమో దు చేసి విచారణ చేపట్టారు. ఈ కేసులో గత నాలుగు నెలలుగా పరారీలో ఉన్న బ్యాంకు మేనేజర్ ప్రభావతిని శనివారం కామయ్యతోపు వద్ద అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. నిందితురాలిని విజయవాడ నార్త్ తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు చెప్పారు.

చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా

- ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవు
- అక్రమ మద్యం, డబ్బు గుర్తిస్తే తక్షణమే చర్యలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



చెక్ పోస్టు వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సాధారణ ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు, విలువైన వస్తువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా ఉంటుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు స్పష్టం చేశారు. కలెక్టర్ ఢిల్లీరావు, కమిషనర్ ఆఫ్ పోలీస్ టీకే రాణా శనివారం జిల్లాలోని వివిధ చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద వాహనాల తనిఖీ ప్రక్రియను పరిశీలించారు. ఇబ్రహీంపట్నం అటవీ చెక్‌పోస్టుతో పాటు తిరువూరు అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. చెక్‌పోస్టుల వద్ద కార్యకలాపాలను పరిశీలించి పటిష్ట నిఘాకు అనుసరించాల్సిన వ్యూహాలపై సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. తిరువూరు, మైలవరం పరిధిలోని డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను, వివిధ ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో 21 చెక్‌పోస్టుల కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. లోపాలు ఏవైనా ఉంటే వెంటనే చక్కదిద్దుతున్నామన్నారు. అధిక మొత్తంలో నగదు, మద్యం, మత్తు పదార్థాలు, విలువైన వస్తువుల అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. పోలీస్, ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సిబ్బందితో పాటు సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని కూడా మోహరించినట్లు వివరించారు. ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలుచేయడం జరుగుతోందన్నారు. జిల్లాలో 42 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సమర్థంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లకూడదని.. తప్పనిసరైతే అందుకు సంబంధించి సరైన ఆధారాలు ఉండాలని.. లేకుంటే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. నగదు సీజర్స్‌ను పరిశీలనకు జిల్లాస్థాయి కమిటీ పనిచేస్తోంద, రూ.10 లక్షలకు మించితే ఐటీకి సమాచారం ఇస్తారని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.కోటి వరకు నగదును, రెండున్నర కిలోల వరకు బంగారాన్ని సీజ్ చేసినట్టు వివరించారు. రాష్ట్రంలోనే అత్యధిక సీజర్స్ జిల్లాలో జరిగినట్లు వివరించారు.

ఫిర్యాదులపై సత్వర విచారణ, పరిష్కారం

సీ విజిల్‌తో పాటు, 1950 ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ), జిల్లా స్థాయి కాల్ సెంటర్ తదితరాలకు వస్తున్న ఫిర్యాదులపై ప్రత్యేక బృందాలు సత్వరం స్పందించి, నాణ్యతతో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. పరిష్కారానికి సంబంధించిన వివరాలను ఫిర్యాదుదారునికి తెలియజేస్తున్నట్లు వివరించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో వస్తున్న ప్రతికూల వార్తల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నట్లు వివరించారు. సీజర్స్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ, నివేదికల నిర్వహణ వ్యవస్థ (ఆర్ఎంఎస్) కూడా పకడ్బందీగా పనిచేస్తున్నట్లు తెలిపారు. వలంటీర్లు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది తదితరులు రాజకీయ సభలు, ర్యాలీలు తదితరాల్లో పాల్గొనకూడదని.. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని కలెక్టర్ ఢిల్లీరావు స్పష్టం చేశారు. కలెక్టర్ ఢిల్లీరావు వెంట తిరువూరు ఆర్డీఓ కె.మాధవి, ఏసీపీ మురళీ మోహన్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు



కిలేశపురం(ఇబ్రహీంపట్నం): ఆగిఉన్న లారీని బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని కిలేశపురం వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం ఈ ప్రమాదం జరిగింది. సేకరించిన వివరాల మేరకు.. విజయవాడ పాయకాపురానికి చెందిన వెంకటేష్, కృష్ణలంక ప్రాంతానికి చెందిన హర్షవర్ధన్ కంచికచర్ల మిక్ కళాశాలలో డిప్లమో సెకండ్ ఇయర్ చదువుతున్నారు. కళాశాల వదిలిన అనంతరం వెంకటేష్ బైక్‌పై ఇద్దరూ కలిసి ఇళ్లకు బయలు దేరారు. కిలేశపురం చేరుకునే సమయానికి బైక్ అదుపుతప్పి ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి ఢీకొట్టారు. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వీరిని స్థానిక నిమ్రా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ ఎంపీ అభ్యర్థి చార్లెస్ శోభరాజు కంటే పెద్ద చీటర్

ఎంపీ కేశినేని నాని



విజయవాడస్పోర్ట్స్: మోస్ట్ ఇంటెలిజెంట్ క్రిమినల్ చార్లెస్ శోభరాజు కంటే విజయవాడ టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని పది రెట్లు ఎక్కువ క్రిమినల్ అని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంపై టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్ని చేసిన వ్యాఖ్యలను నాని ఖండించారు. శనివారం రాత్రి ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్నికి ఎంతో నేరచరిత్ర ఉందని, ఎన్నో ఆర్థిక నేరాలకు పాల్పడ్డాడని, అవన్నీ త్వరలోనే బయటకు వస్తాయన్నారు. అతని మోసాలపై త్వరలో ఓ వ్యక్తి పుస్తకం విడుదల కానుందని, ఎంతో మందిని మోసం చేసి సంపాదించిన డబ్బులతో చంద్రబాబు వద్ద టీడీపీ టికెట్ కొనుక్కున్నాడని ఘాటైన విమర్శ చేశారు. అతని ఫోన్‌ను తాము ట్యాపింగ్ చేస్తున్నామనే ఆరోపణ వాస్తవ విరుద్ధమన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వాళ్ల చేతుల్లో ఉందని, ఒక్క లెటర్ పెడితే ఎవరు ట్యాపింగ్ చేస్తున్నారో మొత్తం బయట పడుతుందన్నారు. అయినా తప్పు చేయని వాళ్లు ట్యాపింగ్‌కు భయపడటం ఎందుకని ప్రశ్నించారు. ఐబీ, రా ఏజెన్సీ, మరో నాలుగు నిఘా సంస్థలు 2018 నుంచి తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నాయని, ఈ విషయం తెలిసినా తాను భయపడటం లేదన్నారు. తప్పు చేసిన వ్యక్తులే ట్యాపింగ్‌కు భయపడతారన్నారు. ఫోన్లు ట్యాపింగ్ చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని, హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో, మాదాపూర్‌లోని ఓ బంగ్లాలో 300 మంది సిబ్బందిని పెట్టి ప్రత్యేక ట్యాపింగ్ సాఫ్ట్‌వేర్‌ను టీడీపీ నడుపుతోందని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏబీ వెంకటేశ్వరరావు టీడీపీ కార్యకర్తగా పని చేశారని, ఇప్పుడు అతని ద్వారానే హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్, మాదాపూర్‌లలో ట్యాపింగ్ చేస్తున్నారని వెల్లడించారు. 2018లో మోదీని టెర్రరిస్ట్ అని తిట్టిన చంద్రబాబు ఇప్పుడు మోడీయే గొప్పోడని చెప్పడం అతని లేకి రాజకీయాన్ని మరో మారు ప్రస్ఫుటం చేసిందన్నారు. చంద్రబాబు రాష్ట్రం కోసం పని చేస్తున్నట్లు బిల్డప్ ఇస్తాడని, వాస్తవానికి అతని కష్టం మొత్తం కొడుకు, మనుమడు కోసమేనన్నారు. విశాఖపట్నం డ్రగ్స్ ముఠా వ్యవహారంలో చంద్రబాబు, అతని అనుచరుల పాత్ర మొత్తం బయటపడినా, బీఆర్ నాయుడు, రాధాకృష్ణ, రామోజీరావు ద్వారా ఈ నిందను వైఎస్సార్‌సీపీపై నెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. అయితే చంద్రబాబు దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మరన్నారు. కాల్‌మనీ కేటుగాళ్లను, రియల్ ఎస్టేట్ బ్రోకర్లను, లోఫర్‌లను, చీటర్లను, ఆర్థిక నేరగాళ్లను టీడీపీ అభ్యర్థులుగా చంద్రబాబు ప్రకటించుకున్నారన్నారు. దేవినేని ఉమా రాజకీయ జీవితం ముగిసిపోయిందని, అతన్ని చూస్తుంటే జాలేస్తుందన్నారు. మైలవరం టీడీపీ సీటును రూ.100 కోట్లకు వసంత కృష్ణ ప్రసాద్‌కు చంద్రబాబు అమ్ముకున్నాడని దేవినేని ఉమా ఇటీవల ఓ సభలో వెల్లడించిన విషయాన్ని గుర్తు చేశారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి

- పెళ్లి బృందాన్ని తీసుకుని పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా ఘటన
- ముందుగానే గుర్తించి బస్సును పక్కకు తీసిన డ్రైవర్
- డ్రైవర్ సమయ స్ఫూర్తితో బస్సులో ప్రయాణికులంతా క్షేమం



మృతిచెందిన డ్రైవర్ భద్రయ్య

గట్టుభీమవరం(వత్సవాయి): మరణంలోనూ తన వల్ల ఎదుటి వారు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సమయస్ఫూర్తితో బస్సును ఓ పక్కన నిలిపివేసి ప్రయాణికులను సురక్షితంగా కాపాడాడు ఆర్టీసీ డ్రైవర్ వేముల భద్రయ్య(60). భద్రయ్య చూపిన సమయస్ఫూర్తికి ప్రయాణికులు చేతులెత్తి దండం పెడుతున్నారు. ప్రయాణికుల క్షేమమే ఆర్టీసీ లక్ష్యమని రుజువు చేశాడు. ఎస్ఐ బి.అభిమన్యు తెలిపిన వివరాల మేరకు సూర్యాపేట జిల్లా మిర్యాలగూడ ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ భద్రయ్య విజయవాడలో జరిగే ఒక పెళ్లికి మిర్యాలగూడ నుంచి బస్సులో పెళ్లి వారిని ఎక్కించుకుని శుక్రవారం సాయంత్రం బయలుదేరాడు. విజయవాడలో పెళ్లి కార్యక్రమం ముగి శాక తెల్లవారుజామున విజయవాడ నుంచి తిరిగి మిర్యాలగూడకు బయలుదేరాడు. చిల్లకల్లు టోల్‌ప్లాజా సమీపంలోనికి వచ్చేసరికి డ్రైవర్ భద్రయ్యకు గుండెల్లో నొప్పి వస్తుందని గుర్తించాడు. ఆ సమయంలో బస్సులో ఉన్న పెళ్లి వారందరూ నిద్రలో ఉన్నారు. భద్రయ్య బస్సు వేగాన్ని తగ్గించి చిన్నగా రహదారి పక్కన నిలిపివేశాడు. బస్సులో ఉన్న కొందరు బస్సు ఆగిందని గుర్తించి చూడగా డ్రైవర్ గుండెల్లో నొప్పి అంటూ సైగచేశాడు. వెంటనే బస్సులో ఉన్న కొందరు తేరుకుని డ్రైవర్‌ను కిందకు దించి 108 వాహనంలో జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించా రు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించేలోగానే మరణించాడు. జరిగే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి బస్సు ను రహదారి పక్కనే నిలిపి ఎటువంటి ప్రమాదం జరగకుండా తమను కాపాడాడని ప్రయాణికులు తెలిపారు.

గరికపాడు చెక్‌పోస్టు వద్ద రూ.1.80 లక్షలు సీజ్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఏపీ, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు గరికపాడు చెక్‌పోస్టు వద్ద రూ.1.80 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ సతీష్ శనివారం తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శుక్రవారం అర్ధరాత్రి వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణ నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సును తనిఖీ చేశామని, ఈ తనిఖీలో విజయవాడకు చెందిన వ్యక్తి వద్ద రూ.1.80 లక్షలు గుర్తించామన్నారు. నగదుకు సంబంధించి ఆధారాలు లేకపోవటంతో సీజ్ చేసినట్లు చెప్పారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యుత్‌లైన్లు మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం లబ్బీపేట ఉపకేంద్రం పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా లబ్బీపేట పిచ్చయ్యవీధి, మసీదు వీధి, దుర్గారైస్‌మిల్ ఏరియా, పైడియ్య వీధి, టెంపుల్ స్ట్రీట్, లబ్బీపేట పశువుల ఆస్పత్రి రోడ్డు, ఎంజీరోడ్డు తదితర ప్రాంతాల్లో ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్థానిక స్క్రూబ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11 కేవీ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. పకీర్‌గూడెం, ప్రగతినగర్, శ్రీరాంనగర్, చంద్రమౌళీపురం, ఎంజీ రోడ్డు బెంజిసర్కిల్‌ప్రాంతంతో పాటు మైత్రేయ వీధుల్లో కరెంట్ నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎంసీఎంసీ, సోషల్ మీడియా విభాగాలను సందర్శించిన కలెక్టర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించే క్రమంలో తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను కలెక్టర్ ఢిల్లీరావు శనివారం సందర్శించారు. జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ), సోషల్ మీడియా సెల్, గ్రీవెన్సుల పరిష్కార కమిటీ తదితర విభాగాల అధికారులు, సిబ్బందితో ఆయన మాట్లాడారు. నియమ నిబంధనలపై పూర్తిస్థాయిలో అవగాహనతో అప్రమత్తత, నిబద్ధతతో పని చేయడం ద్వారా ఎన్నికలను విజయవంతం చేయడంలో కీలక భాగస్వాములు కావచ్చని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని వివరించారు.

ద్విచక్ర వాహనాలు పాక్షిక ధ్వంసం

కృష్ణలంక(విజయవాడతూర్పు): మెకానిక్ షాపు ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు పాక్షికంగా ధ్వంసం చేశారు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో రాణిగారితోటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు 18వ డివిజన్‌కు చెందిన యాసిన్ అనే వ్యక్తి ఆదే డివిజన్‌లోని పార్కు పక్కన ద్విచక్ర వాహనాల మెకానిక్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మరమ్మతుల కోసం వచ్చిన వాహనాలను షాపు ముందు పార్కింగ్ చేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం షాపు వద్దకు వచ్చి చూడగా నాలుగు వాహనాలకు హెడ్‌లైట్స్, పెట్రోల్ ట్యాంక్ పాక్షికంగా ధ్వంసమై కనిపించాయి. షాపు ముందు మరమ్మతుల కోసం పార్కింగ్ చేసిన కస్టమర్ వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, వారిని గుర్తించి తనకు న్యాయం చేయాలని యాసిన్ పోలీసులు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్

పెనమలూరు: గంజాయి కేసులో తప్పించుకోని తిరుగుతున్న నిందితుడిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు శనివారం వివరాలు తెలుపుతూ గంజాయి కేసులో తప్పించుకోని తిరుగుతున్న మచిలీపట్నం ఈడేపల్లికి చెందిన తంగెళ్ల నవీన్ కుమార్‌ను అరెస్ట్ చేశామన్నారు. అతడిని కోర్టులో హాజరుపర్చగా కోర్టు 14 రోజులు రిమాండ్ విధించిందని తెలిపారు. గంజాయి సేవించినా, విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రామారావు హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కృష్ణా-ఏలూరు జిల్లాల సరిహద్దులో 16వ నంబర్ జాతీయ రహదారిపై బాపులపాడు మండలం బొమ్ములూరు వద్ద పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో పారా మిలటరీ సాయుధ దళాలు జాతీయ రహదారిపై శనివారం కవాతు నిర్వహించాయి. అనంతరం చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు.

చేసిందే చెబుతూ ప్రజల్లోకి అవినాష్

- అన్ని వర్గాల నుంచి ఆదరణ
- అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన అజెండా
- దశాబ్దాల సమస్యలు పరిష్కరించిన వైనం



దేవినేని అవినాష్‌కు నీరాజనాలు పలుకుతున్న రాణిగారితోట ప్రజలు (ఫైల్)

లబ్బీపేట(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గంలో అవినాష్ జోష్ నడుస్తోంది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకూ ఎవరినోట విన్నా అవినాష్ అనే అంటున్నారు. అందుకు కారణం నాలుగున్నరేళ్లకుపైగా నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ, ప్రజా సమస్యలను పరిష్కరించడమే. తాను పర్యటిస్తున్న సమయంలో ఎవరు ఏ సమస్య చెప్పినా, వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ముందున్నారు. అంతేకాదు నియోజకవర్గంలో ఎన్నడూ లేని అభివృద్ధిని చేసి చూపించారు. దీంతో తూర్పులో అన్ని వర్గాల ప్రజలు ఈసారి అవినాష్‌కే జై కొట్టేందుకు సిద్ధమయ్యారు. వివక్షకు తావులేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందరికీ అందించడంలో తన వంతు కృషి చేశారు.

దశాబ్దాల సమస్యలకు పరిష్కారం....

నియోజకవర్గంలో ఏ నాయకుడు పట్టించుకోని దశాబ్దాల సమస్యలు పరిష్కరించారు. అందులో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను ప్రముఖంగా చెప్పవచ్చు. ఐదు దశాబ్దాలుగా ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు ఎదురు చూశారు. కృష్ణలంక భ్రమరాంబపురం, పటమట రెల్లికాలనీతో పాటు, ఉడ్‌పేట, బాడవపేట లాంటి పలు ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలు క్రమబద్ధీకరించారు. అంతేకాదు లబ్బీపేటలో షాదీఖానా నిర్మాణం, కొండ ప్రాంతాల్లో చిట్టచివరి వరకూ విద్యుత్, మంచి నీటి పైప్‌లైన్ ఏర్పాటు వంటి అనేక పనులు చేశారు. ముఖ్యంగా కృష్ణానది కరకట్ట ప్రాంత వాసులు ముంపునకు గురికాకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేయడంతో ఆ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విస్తృతంగా పథకాలపై ప్రచారం...

ప్రజలకు ఏమి చేశారో చెబుతూ దేవినేని అవినాష్ ప్రజల్లోకి వెళ్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ మంచి చేశాం కాబట్టి ఆదరించాలని కోరుతున్నారు. రానున్న రోజుల్లో ఏమి చేస్తామో కూడా ప్రతి డివిజన్‌కు మీ అవినాష్ అన్న హామీ పేరుతో కరపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తున్నారు. ఇలా అవినాష్‌తో పాటు, సోదరి దేవినేని క్రాంతి, భార్య దేవినేని సుధీర, బావ వై.సిద్దార్థ్‌లు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో తిరుగుతుంటే ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుంది.

పదేళ్లలో ఏమీ చేయని గద్దె....

తూర్పు నియోజకవర్గానికి గద్దే రామ్మోహన్ పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నారు. అయినప్పటికీ ఆయన నియోజకవర్గంలో ఏమి చేశారో చెప్పుకోవడానికి లేదు. అభివృద్ధి, సంక్షేమంపై ఆయన ఏనాడూ దృష్టి పెట్టలేదు. నిత్యం అసత్య ప్రచారంతో ప్రజల్లోకి వెళ్తున్నారు. గద్దే రామ్మోహన్‌తో పాటు, ఆయన భార్య అనునాధ కాలనీల్లో తిరుగుతూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. పదేళ్ల ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి ఏమి చేశాడో చెప్పుకోలేని దయనీయ స్థితిలో ఉన్నారు. ఇదేమి ప్రచారం అంటూ ప్రజలు చీదరించుకుంటున్నారు. ఏమీ చేయకుండా షో చేస్తే ఓట్లు ఎలా వేస్తామంటూ ప్రజలు అంటున్నారు.

ముంపు సమస్య తొలగింది



ఇప్పటి వరకూ ఎందరో నాయకులు వచ్చారు. కానీ ఎవరూ కృష్ణలంక ముంపు ప్రాంతాల గురించి పట్టించుకోలేదు. కానీ యువకుడు అవినాష్ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వందల కోట్లు వెచ్చించి రిటైనింగ్ వాల్ నిర్మాణం చేశారు. ఇప్పుడు ముంపు సమస్య తొలగిపోయింది. ఏదైనా చెబితే చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. అలాంటి నాయకుడే నియోజకవర్గానికి కావాలి.

మద్దెల మల్లిక, కృష్ణలంక


దమ్మున్న నేత అవినాష్



పదేళ్ల ఎమ్మెల్యేగా ఉన్న గద్దే రామ్మోహన్ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ సమస్యను ఏనాడూ పట్టించుకోలేదు. ఏదో షో రాజకీయాలు చేయడమే కానీ ప్రజలకు మంచి చేసిందేమీ లేదు. కానీ దేవినేని అవినాష్ స్వయంగా ముఖ్యమంత్రి వద్దకు సమస్యను తీసుకెళ్లి పరిష్కరించారు. దమ్మున్న నేతగా నిరూపించుకున్నారు. కోవిడ్ సమయంలో ఎమ్మెల్యే ఎక్కడున్నాడు.

రెంటపల్లి కొండ, బాడవపేట

నగరం నడిబొడ్డున ఠీవిగా..



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా బెజవాడ నగరం నడిబొడ్డున ఏర్పాటుచేసిన చారిత్రక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం అత్యంత అద్భుతంగా, ఠీవిగా ఉందని ప్రజలు అంటున్నారు. నగరాన్ని ఎత్తు నుంచి ఎటువైపు చూసినా అంబేడ్కర్ విగ్రహం ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. విజయవాడ నగర అందాల మధ్య కన్పిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రమిది.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఆకర్షణీయంగా ఏపీటీఎఫ్ భవనం



విజయవాడ ఏలూరు రోడ్డులోని ఇండ్ల రామసుబ్బారెడ్డి హాస్పటల్ సమీపంలో పుస్తక ఆకారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ బిల్డింగ్ ఆకర్షణీయంగా ఉంది. చూపరులను ఆకట్టుకుంటుంది. భిన్నమైన ఆకారంలో నిర్మించిన భవనాన్ని అందరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

భక్తులకు భోజనాలు



ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదాన పథకంలో భాగంగా రోజూ భక్తులకు భోజనాలు పెడుతున్నారు. గాలిగోపురం వద్ద రాత్రి వేళ కూడా భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్న చిత్రమిది.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



గాయపడిన వ్యక్తి మృతి

విస్సన్నపేట: విస్సన్నపేటకు చెందిన మేకల సత్యనారాయణ (54) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. శుక్రవారం స్కూటీపై వెలుతుండగా స్థానిక శ్రీరామ్‌థియేటర్ సమీపంలో కారు ఢీ కొట్టడంతో 108 సిబ్బంది నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

నగర మార్కెట్‌లోకి మహీంద్ర ఎలక్ట్రిక్ కారు


కారును ఆవిష్కరిస్తున్న సంతోష్ కుమార్

రామవరప్పాడు: ప్రసాదంపాడులోని మహీంద్ర షోరూంలో సరికొత్త ఎక్స్‌యూవీ 400 ఎలక్ట్రిక్ కారును మహీంద్ర ఆటోమోటివ్ మాన్యుఫాక్చరర్స్ సీఈఓ సంతోష్‌కుమార్ శనివారం నగర మార్కెట్‌లోకి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ సరికొత్త ఎలక్ట్రిక్ కారు మరింత పవర్‌తో, సమర్థవంతమైన బ్యాటరీ కెపాసిటీతో రూపొందించామన్నారు. మార్కెట్‌లో లభించే ఎలక్ట్రిక్ కార్ల కన్నా ఈ కారు తక్కువ ధరలో లభిస్తుందని చెప్పారు. వినియోగదారుల సౌకర్యార్థం డెమో కార్లు షోరూమ్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెల 31వ తేదీ లోగా కారును బుక్ చేసుకున్న వారికి ప్రత్యేక ధరతో పాటు మరిన్ని బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వినియోగదారులు, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నడూ లేనంతగా నగరం అభివృద్ధి


10వ డివిజన్ మారుతీ కో ఆపరేటివ్ కాలనీలో పర్యటిస్తున్న దేవినేని క్రాంతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో ఎన్నడూ లేనంత అభివృద్ధి జరిగిందని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి అన్నారు. గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమంలో భాగంగా శనివారం 10వ డివిజన్‌లోని మారుతీ కో ఆపరేటివ్ కాలనీ, ఫన్‌టైమ్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లుగా ఆ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. మంచి చేస్తున్న వారిని ఆదరించాలని ఆమె సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాల వారు మేలు పొందారని చెప్పారు. మళ్లీ అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలన్నారు. తూర్పులో దేవినేని అవినాష్‌ను గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ ఇన్‌ఛార్జి కరుటూరి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపు

సాక్షి, అమరావతి: యువత మేల్కొని విప్లవ యోధుడు భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశాన్ని కార్పొరేట్ శక్తుల నుంచి కాపాడాలని, డ్రగ్ మహమ్మారిని తరిమికొట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. విజయవాడలోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో శనివారం భగత్‌సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ విముక్తి కోసం ఆనాడు భగత్‌సింగ్ అనన్యసామాన్యమైన పోరాటం నిర్వహించారని తెలిపారు. భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ త్యాగంతో దేశానికి విముక్తి లభించిందని చెప్పారు. నేడు సామ్రాజ్యవాదుల చేతుల్లో దేశం దోపిడీకి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు డ్రగ్స్ మాఫీయా విచ్చలవిడి విస్తరిస్తోందన్నారు. దీనివల్ల రాబోయే తరాలు నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. విశాఖ పోర్టులో దొరికిన డ్రగ్స్ మార్కెట్లోకి వెళితే మరో పదేళ్లలో యువత పూర్తిగా పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. దీన్ని అడ్డుకునేందుకు యువత ముందుకు రావాలని, కార్పొరేట్‌శక్తుల దోపిడీని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారామ్, బి.తులసీదాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్, జె.జయరాం, కె.హరికిషోర్, ఆంధ్ర మాల్యాద్రి, రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ మాట్లాడారు.

నాయకత్వ లక్షణాలపై విద్యార్థులకు అవగాహన


వీఆర్ స్వామిని సత్కరిస్తున్న లయోల అధ్యాపకులు

గుణదల (విజయవాడ తూర్పు): విద్యార్థి దశలో ఉన్నప్పుడే యువకులు ప్రతిభావంతులుగా ఎదగాలని ప్రముఖ వ్యాపార వేత్త హయత్ ప్లేస్ హోటల్ చైర్మన్ వీఆర్ స్వామి అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న నాయకత్వ లక్షణాలపై అవగాహన సదస్సు శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ అలవరుచుకుని నిబద్ధతగా నడుచుకోవాలని పేర్కొన్నారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం, ఇలా ఏ రంగంలో ఎదగాలన్నా నిబద్ధతగా ఉండాలని చెప్పారు. విద్యార్థి దశ నుంచే మంచి నడవడికను అలవరుచుకోవాలని, మనిషి ఉన్నత స్థితికి ఎదగాలంటే సమాజంలో గుర్తింపు సాధించాలని కోరారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఆంధ్ర లయోల కళాశాల చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులను ప్రతిభావంతులుగా రూపొందించేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయని తెలిపారు. అనంతరం కళాశాల సిబ్బంది ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ కిరణ్ కుమార్, బీబీఏ విభాగాధిపతి శ్రావణ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నెమలిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం


పెండ్లికుమారుడైన నెమలి కృష్ణుడు

నెమలి(గంపలగూడెం): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గంపలగూడెం మండలం నెమలి శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ఆరురోజులపాటు జరుగనున్న వార్షిక బ్రహ్మోవాలను శనివారం వైభవంగా ప్రారంభించారు. ఆలయ సహాయ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు, ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖల పర్యవేక్షణలో సుప్రభాతసేవతో ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, అర్చకబృందం ప్రారంభించారు. ముందుగా శ్రీవేణుగోపాల స్వామి మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు పంచామృతాల, నవఫలరసాలతో అభిషేకం చేశారు. పెండ్లికుమారుని చేసే ఘట్టం వైభవంగా జరిగింది. ఆలయ సహాయ కమిషనర్, చైర్మన్‌లు స్వామి వారికి నూతన వస్త్రాలు సమర్పించారు. స్వామికి నూతన వస్త్రాలు, సువర్ణాభరణాలు, వివిధ రకాల పూలమాలలతో అలంకరించగా భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

కళాకారుల ప్రతిభను ప్రోత్సహించాలి

విజయవాడ కల్చరల్: కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని విశ్వమాత చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. డ్రీమ్ ఆడియో, మహానటి సావిత్రి కళాపీఠం ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సంగీత విద్వాంసురాలు సుధాశ్రీనివాస్‌కు ఆత్మీయ సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాసత్యనారాయణ మాట్లాడుతూ కళాకారులకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంటుందన్నారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ సుధారాణి దేశ విదేశాల్లో వందలాది సంగీత కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. డ్రీమ్ ఆడియో అధినేత నరసింహారావు సంస్థ లక్ష్యాలను వివరించారు.



సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
ఆదివారం ॥ 24-3-2024

వైరల్





నా స్టూడెంట్ టీచర్ అయింది!

'ఎక్స్'లో రేవ్ అనే టీచర్ తన స్టూడెంట్ ఆలిషా గురించి చేసిన పోస్ట్ వైరల్ అయింది. స్కూల్ రోజుల్లో ఆలీషా అల్లరిపిల్ల. రేవ్ మాటల్లోనే చెప్పాలంటే రెబెల్. 'ఈ అమ్మాయి భవిష్యత్ ఎలా ఉండబోతుందో' అంటూ అలీషా గురించి బెంగపడేది రేవ్. కట్ చేస్తే... ఆలిషా ఇప్పుడు ముంబైలోని ఒక స్కూల్‌లో స్పెషల్ నీడ్స్ చిల్డ్రన్స్‌కు టీచర్. 'మొండిఘటం. ఏ పనీ చేయలేదు... అని నా గురించి రేవ్ టీచర్‌కు చెప్పేవారు. అయితే టీచర్ మాత్రం నన్ను ఎప్పుడూ ప్రేమగా చూసుకునేది. అలాంటి ప్రేమను స్పెషల్ నీడ్స్ చిల్డ్రన్స్‌కు పంచాలనుకుంటున్నాను' అంటుంది అలీషా.





ఈ హోలీ రంగులను హాయిగా తినవచ్చు!

ముంబైకి చెందిన ఇద్దరు సోదరుల ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ నెటిజనులను ఆకట్టుకుంటోంది. గౌరంగ్, సౌరభ్ అనే సోదరులు 'మాంక్స్ బూఫీ' బ్రాండ్‌పై 'అబీర్ హోలి కలర్స్' పేరుతో సహజ రంగులను మార్కెట్‌లోకి తీసుకువచ్చారు. పువ్వులు, మొక్కజొన్న పిండి... మొదలైన వాటితో భిల్ తెగ గిరిజనులు తయారు చేసిన ఈ రంగులను తినవచ్చు కూడా!





లియాండర్ పేస్... ప్రముఖ డ్యాన్సర్!

'ఎక్స్'యూజర్ పృథ్వీ తన చిన్నారి మేనకోడలు వర్క్‌బుక్ నుంచి పోస్ట్ చేసిన స్నాప్‌చాట్ నెట్‌లోకంలో నవ్వులు పూయిస్తోంది. ఈ వర్క్‌బుక్‌లో'మ్యాచ్ ది ఫాలోయింగ్' శీర్షిక కింద ఎడమవైపు ప్రముఖుల పేరు, కుడివైపు ఆయా రంగాలకు సంబంధించిన బొమ్మలు ఇచ్చారు. ఏ వ్యక్తి ఏ రంగానికి చెందిన వారో జత చేయాలి. విరాట్ కోహ్లీ-క్రికెటర్, లతా మంగేష్కర్-సింగర్... ఇలా అన్నిటికీ కరెక్ట్‌గానే జత చేసింది ఆరు సంవత్సరాల చిన్నారి. అయితే లియాండర్ పేస్ దగ్గరే వచ్చింది పేచీ. ప్రభుదేవాతో పాటు లియాండర్ పేస్‌ను కూడా డ్యాన్సర్‌ని చేసింది. ఇది చూసి సరదాకారులు ఊరుకుంటారా ఏమిటి? మీమ్సే మీమ్స్!

వేడి వేడి ప్రెషర్ కుకర్ ఉండగా... ఐరన్ బాక్స్ దండగా

'లిమిటెడ్ రీసోర్స్ నుంచే కొత్త ఐడియాలు జనించునోయి' అని మరోసారి చెప్పడానికి ఈ వైరల్ వీడియో క్లిప్ సాక్ష్యం. కోల్‌కతాకు చెందిన మౌమితా చక్రవర్తి వేడి వేడి ప్రెషర్ కుక్కర్‌ను ఉపయోగించి షర్ట్‌ను ఐరన్ చేస్తున్న వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ట్విట్టర్‌లో రీపోస్ట్ చేసిన ఈ వీడియో రెండు లక్షల యాభై వేల వ్యూస్‌ను దాటింది.





లవ్ స్కానింగ్

ముంబైలోని మహాలక్ష్మి రేస్‌కోర్స్ ప్రాంతంలో జరిగిన మ్యూజిక్ ప్రోగ్రామ్‌కు హాజరైన ఒక యువకుడి టీ షర్ట్ అందరి దృష్టిని ఆకర్షించింది. 22 సంవత్సరాల హార్దిక్ టీ షర్ట్ వెనకాల ఐ-క్యాచింగ్ మెసేజ్ 'ఫర్ సింగిల్ పీపుల్ వోన్లీ'తోపాటు క్యూ ఆర్ కూడా ఉంది. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే నేరుగా అతడి టిండర్ ప్రొఫైల్‌లోకి తీసుకువెళుతుంది. హార్దిక్ డిజిటల్ ఫ్లర్టింగ్ అనేది టాకింగ్ పాయింట్ కావడమే కాదు సోషల్ మీడియాలో వైరల్ అయింది

బయోపిక్

సినిమాలు పాత కథలను తవ్వి పోస్తున్నాయి.
చరిత్ర గతిని వెండి తెర మీద పునఃసృష్టిస్తున్నాయి.
స్వాతంత్ర్య పోరాటంలో ఎన్నో ఘట్టాలు. ఎందరో త్యాగమూర్తులు.
కాని పురుషుల బయోపిక్‌లు వచ్చినట్టుగా స్త్రీలవి రాలేదు.
తాజాగా విడుదలైన 'అయ్ వతన్ మేరే వతన్' సినిమా
నాటి వీర వనిత ఉషా మెహతా జీవితాన్ని చూపింది.
బ్రిటిష్‌కు వ్యతిరేకంగా సీక్రెట్ రేడియో నడిపిన ఉషా మెహతా ఎవరు?

వెండి తెర మీద రహస్య రేడియో


ఉషా మెహతా

'దీసీజ్ కాంగ్రెస్ రేడియో కాలింగ్ ఆన్ 42.34 మీటర్స్ సమ్‌వేర్ ఇన్ ఇండియా'... ఈ అనౌన్స్‌మెంట్ బ్రిటిష్ వారిని గడగడలాడించింది. మునికాళ్ల మీద పరిగెత్తిచ్చింది. ఒక బుల్లి రహస్య రేడియో స్టేషన్‌ని, దాని నిర్వాహకులను అరెస్ట్ చేయడానికి పిచ్చెక్కినట్టు తిరిగేలా చేసింది. మూడు నెలల పాటు బ్రిటిష్‌వారిని ముప్పుతిప్పలు పెట్టిన ఆ రేడియో నిర్వాహకురాలి పేరు ఉషా మెహతా.

గాంధీ పిలుపు విని...

ఉషా మెహతా గుజరాత్‌లోని సూరత్ సమీపంలో ఉన్న సారస్ అనే ఊళ్లో 1920లో జన్మించింది. ఐదేళ్ల వయసులో గాంధీజీని అహ్మదాబాద్‌లో చూసింది. 8 ఏళ్ల వయసులో వాళ్ల ఊరి దగ్గర గాంధీజీ చరఖా కార్యక్రమం నిర్వహిస్తే ఉషా పాల్గొని కొద్దిసేపు చరఖా తిప్పింది. బాల్యంలోనే గాంధీజీ మీద గొప్ప భక్తి పెంచుకున్న ఉషా 12 ఏళ్ల వయసులో తండ్రి వృత్తిరీత్యా బొంబాయికి మారడంతో తన దేశభక్తిని చాటుకునే అవకాశం పొందింది.

డూ ఆర్ డై

1942 ఆగస్టు 8న బొంబాయిలో గాంధీజీ క్విట్ ఇండియా పిలుపునిచ్చారు. 'డూ ఆర్ డై' లేదా 'కరో యా మరో' నినాదాలు మిన్నంటాయి. 'ఇక భారత ప్రజలు నాయకుల కోసం ఎదురు చూడొద్దు. ప్రజలే నాయకులు' అని గాంధీజీ పిలుపునిచ్చారు. 22 ఏళ్ల ఉషా మెహతా తన స్నేహితులైన విఠల్ దాస్ ఖాకడ్, చంద్రకాంత్ ఝావేరీ, బాబూభాయ్ ఠక్కర్‌లతో కలిసి ఆ మీటింగ్‌కు వెళ్లింది. ఉత్తేజితురాలైంది. అప్పటికే స్వతంత్రోద్యమ వార్తల మీద బ్రిటిష్ ప్రభుత్వం నిషేధం విధించింది. ఉద్యమం ఉధృతం కావాలంటే రేడియో మాధ్యమం ద్వారా వార్తలు అందించాల్సిన అవసరం ఉందని ఉషా మెహతా తన స్నేహితులతో చెప్పింది. దేశం కోసం ఏ త్యాగానికైనా సిద్ధపడాలని పిలుపునిచ్చింది.


'అయ్ వతన్ మేరే వతన్'లో సారా అలీఖాన్

రహస్య కాంగ్రెస్ రేడియో

బ్రిటిష్ ప్రభుత్వంలో జడ్జిగా పని చేస్తున్న తండ్రి నివారించినా వినకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిన ఉషా బొంబాయిలో షికాగో రేడియో ట్రాన్స్‌మిషన్‌ను చూస్తున్న మరో మిత్రుడు మోత్వాని సహాయంతో సొంత ట్రాన్స్‌మిటర్‌ను సంపాదించింది. మిత్రులతో ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకుని రేడియో స్టేషన్‌గా మలిచింది. ఆగస్టు 27, 1942న మొదటి చరిత్రాత్మక ప్రసారాన్ని సొంత గొంతుతో చేసింది. 'దిసీజ్ కాంగ్రెస్ రేడియో 42.34 మీటర్స్ సమ్‌వేర్ ఇన్ ఇండియా'... అంటూ స్వాతంత్రోద్యమ వార్తలు వినిపించింది. ఆ క్షణం నుంచి ఆ రహస్య రేడియో కోసం బ్రిటిష్ అధికారులు, పోలీసులు కంటి మీద కునుకు లేకుండా వెతకసాగారు. ప్రసారాలు బొంబాయి నుంచే నిర్వహిస్తున్నా దేశంలో ఎక్కడి నుంచి అవుతున్నాయో తెలియక గింజుకున్నారు.

మూడు నెలలు

రహస్య రేడియో ప్రసారాలు మూడు నెలలు సాగాయి. కాని పరికరాలు సమకూర్చిన మోత్వాని లొంగిపోయి రేడియో స్టేషన్ చిరునామా చెప్పేశాడు. నవంబర్ 12, 1942న పోలీసులు దాడి చేసి ఉషా మెహతాను అరెస్ట్ చేశారు. ఆరు నెలల పాటు ఆమెను ఇంటరాగేట్ చేశారు. 4 ఏళ్ల జైలు శిక్ష పడింది. ఉషా ఏ మాత్రం జంకలేదు. 1946 నాటి మధ్యంతర ప్రభుత్వ హయాంలో మురార్జీ దేశాయ్ హోమ్ మినిస్టర్‌గా ఉండగా ఆమె విడుదల జరిగింది. కాని జైలు జీవితం ఆమె ఆరోగ్యాన్ని బాగా దెబ్బ తీసింది. బయటకు వచ్చాక ఆమె చదువు కొనసాగించి ముంబై యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసి 1980లో రిటైర్ అయ్యింది. గాంధీజీ భావజాలాన్ని ప్రచారం చేస్తూ 2000 సంవత్సరంలో తుది శ్వాస విడిచింది.

ఉషా మెహతా జీవితం ఆధారంగా నిర్మించిన బయోపిక్ 'అయ్ వతన్ మేరే వతన్' అమేజాన్‌లో మార్చి 21న విడుదలైంది.

హెల్త్

వృత్తిపరమైన శబ్దాలు... వినికిడి సమస్యలు!

చెవులకు హెడ్‌ఫోన్స్ తగిలించుకుని... కళ్లను కంప్యూటర్ స్క్రీన్‌కు అప్పగించి గంటలు గంటలు ఉద్యోగం చేసే వాళ్లను ఐటీ ఆఫీసుల్లో చూస్తుంటాం. పైకి స్టయిలిష్‌గా కనిపించినా దీర్ఘకాలంలో ఇలాంటి ఉద్యోగాలు వినికిడి శక్తిని దెబ్బతీస్తాయి. ప్రకంపనలు నేరుగా చెవుల్లోకి చొచ్చుకెళ్ళి కర్ణభేరిని తాకుతుండటం వల్ల వినికిడి వ్యవస్థ (ఆడిటరీ సిస్టమ్)కు హాని జరిగే అవకాశాలు ఎక్కువ. వృత్తిపరంగా వచ్చే ఈ వినికిడి సమస్యల నివారణ, దానిని అధిగమించడం ఎలా అనే దానిపై అవగాహన కోసం ఈ కథనం.



పని ప్రదేశమంటే పట్టణాలు, నగరాల్లో రకరకాల వస్తు తయారీ పరిశ్రమలు, గనుల తవ్వకం, భారీ యంత్రసామగ్రి, ఉపకరణాల చప్పుళ్లే కాదు... పల్లెల్లోని వ్యవసాయ పనుల్లోనూ మోటర్ల వాడకం... వంటివి శబ్దాలకు కారణమై దీర్ఘకాలంలో వినికిడి సమస్యలకు దారితీసేవి. దీనికి తోడు నిశ్శబ్దంగా ఉండే పని ప్రదేశంలోనూ హెడ్‌ఫోన్స్, ఇయర్‌ఫోన్స్ వాడకమూ పెరగడంతో వినికిడి సమస్యలు వచ్చే అవకాశాలూ పెరిగాయి.

మరికొన్ని అంశాలు...

- **శబ్దాల తీవ్రత :** శబ్దాల తీవ్రత 85 డెసిబుల్స్‌కు మించడం.
- **శబ్దాలకు ఎక్స్‌పోజ్ అయ్యే వ్యవధి:** శబ్దాలకు ఎంత ఎక్కువగా ఎక్స్‌పోజ్ అయితే వినికిడి సమస్యకు అంతగా అవకాశం ఎక్కువ.
- తమ ప్రమేయం లేకుండానే మరికొన్ని అంశాలు కూడా వృత్తిపరమైన వినికిడి సమస్యకు కారణమవుతాయి. ఉదాహరణకు జన్యుపరంగా వచ్చే సమస్యల తోపాటు వయసు పెరుగుతున్న కొద్దీ వినికిడి శక్తి తగ్గడం వంటివి


డాక్టర్ మోగంటి అశోక్ పృథ్వీరాజు,
కన్సల్టెంట్ ఈఎన్‌టీ సర్జన్

వృత్తిపరమైన వినికిడి సమస్యలు ప్రభావాలూ - పర్యవసానాలు

- **కమ్యూనికేషన్స్ కష్టం కావడం :** మాటలు అర్థంగాక కమ్యూనికేషన్‌కు అవరోధాలు ఏర్పడతాయి. ఫలితంగా చేయాల్సిన పనులు కుంటుపడతాయి.
- **వృత్తిపరమైన సామర్థ్యాలు తగ్గడం :** వినికిడి సమస్యలు పెరగడంతో వృత్తిపరమైన సామర్థ్య లోపాలు కనిపిస్తాయి.
- **భద్రతలో ముప్పు :** కొన్ని శబ్దాలు వినిపించకపోవడం లేదా కొన్ని హెచ్చరికలను వినలేకపోవడంతో పని ప్రదేశంలో ప్రమాదాలకు గురికావడం, గాయపడటం వంటి ముప్పు ఉంటుంది.
- **మానసికమైన దుష్ప్రభావాలు :** తమకు సరిగా వినిపించడం లేదన్న వాస్తవం చాలామందిని సామాజిక ఒంటరితనంలోకి నెడుతుంది, యాంగ్జైటీ, డిప్రెషన్‌కు లోనవుతారు.

నివారణ...

వినికిడి సమస్యలు రెండు రకాలు. మొదటిది తాత్కాలికం. రెండోది శాశ్వతం. తాత్కాలిక సమస్య తగ్గేందుకు అవకాశాలు ఎక్కువే అయినా ఒకసారి వినికిడి సమస్య ఏర్పడితే అది పూర్తిగా నయం కావడం కష్టం. శాశ్వత వినికిడి సమస్యకు దారితీసే అవకాశాలు ఎక్కువ. అందుకే నివారణకు ముందు నుంచే తగిన చర్యలు తీసుకోవాలి. అవి...

- **ఇంజనీరింగ్ కంట్రోల్స్‌తో :** శబ్దాలు తక్కువగా వచ్చేలాంటి యంత్రాల రూపకల్పన, ఆ మేరకు మార్పులు, సౌండ్‌ప్రూఫింగ్, మెటీరియల్ మార్చడం ద్వారా తక్కువ శబ్దాలు వచ్చే ఉపకరణాల తయారీ వంటి జాగ్రత్తలు పాటించడం.
- **వ్యక్తిగతమైన రక్షణ ఉపకరణాలు :** శబ్దాల విపరీతంగా వినిపించే చోట చెవులను రక్షించే కొన్ని సాధనాలు (ఉదాహరణకు ఇయర్ ప్లగ్స్ లాంటివి) వాడటం.
- **శిక్షణ - అవగాహనలు :** పెద్ద శబ్దాలతో చెవులు, వినికిడి విషయంలోనే గాక ఇతరత్రా ఆరోగ్య అంశాల్లో కలిగే చేటు వంటి అంశాలపై అవగాహన కల్పించడం, వాటి నివారణకు అవసరమైన చర్యల్లో శిక్షణ ఇవ్వడం, శబ్దాలను ఎలా నియంత్రించాలో తెలపడం, వినికిడి తగ్గినట్లుగా తెలుసుకునే లక్షణాలను గుర్తించడమెలా అన్న విషయంపై అవగాహన కల్పించడం, ఆ తర్వాత చేయాల్సిన పనులు, డాక్టర్లను కలవాల్సిందెప్పుడో తెలుసుకునేలా వివరించడం.

నిర్ధారణ పరీక్షలు...

ఆడిటరీ పరీక్షలు అని పిలిచే కొన్ని రకాల వినికిడి సామర్థ్య పరీక్షలతో పాటు మరికొన్ని ఇతరత్రా సాధారణ ఆరోగ్య పరీక్షలు.

చికిత్స...

- తాత్కాలిక వినికిడి సమస్యలు కలిగినప్పుడు వెంటనే డాక్టర్‌ను కలిస్తే వారు తగిన చర్యలను సూచించి, పరిస్థితి మరింత దిగజారకుండా చేస్తారు.
- కొన్నిసార్లు కాక్లియాలో సమస్యలు వచ్చినప్పుడు (సడన్ హియరింగ్ లాస్ లేదా కాక్లియార్ మైక్రో సర్క్యులేషన్ డిస్టర్బెన్సెస్ వంటి కేసుల్లో) కొన్ని రకాల స్టెరాయిడ్స్ ద్వారా వినికిడిని మెరుగుపరచేందుకు ప్రయత్నిస్తారు.
- కొన్ని రకాల వినికిడి సమస్యలకు తగిన వినికిడి ఉపకరణాలను బాధితులకు తగిన ఫ్రీక్వెన్సీలో అమర్చడం ద్వారా సమస్యను చక్కదిద్దుతారు.
- మరికొన్ని రకాల వినికిడి సమస్యలకు చివరి పరిష్కారంగా శస్త్రచికిత్స కూడా అవసరం పడవచ్చు.

మెడి టిప్

పాదాల నొప్పి తగ్గడం ఎలా?



మడమ కింది భాగం నుంచి కాళ్ల వేళ్ల వద్ద ఉండే ఎముకల వరకు... మొత్తం పాదాన్నంతా 'ప్లాంటార్ ఫేషియా' అంటారు. అది ఎముకనూ, కండరాలనూ కలుపుతుంది. దీనికి సాగే గుణం ఎక్కువ. ఈ ఫేషియాకు గాయం తగిలినా లేదా వయసు పెరిగే కొద్దీ ఫేషియా సాగే గుణం తగ్గడం వల్ల పాదాల నొప్పి రావడం సాధారణం.

పాదాల నొప్పుల తగ్గడానికి కొన్ని సూచనలు...

- పాదంపై పడే భారాన్ని బాగా తగ్గించి, తగినంత విశ్రాంతినివ్వాలి.
- పాదం మధ్యలో ఒంపు తిరిగి ఉన్న భాగానికి సపోర్ట్ ఇచ్చేలా ఉండే పాదరక్షలను ఎంచుకోవాలి.
- ఫేషియాను సాగేలా చేసేవీ, కాలి కండరాలను బలపరిచేవీ అయిన కొన్ని రకాల వ్యాయామాల సహాయంతో పాదాల నొప్పులు తగ్గుతాయి. ఈ సూచనలు పాటించాక కూడా నొప్పి తగ్గకపోతే అప్పుడు డాక్టర్‌ను తప్పక సంప్రదించాలి.

గర్భిణులు... వ్యాక్సిన్‌లు!

ప్రతి మహిళా గర్భం ధరించినప్పటినుంచి కొన్ని వ్యాక్సిన్లు తీసుకోవాల్సి ఉంటుంది. మరికొన్ని గర్భవతి కాకముందే తీసుకోవాల్సినవీ ఉంటాయి. అలాగే గర్భవతులు అసలు తీసుకోకూడని వ్యాక్సిన్లు కూడా ఉండవచ్చు. అందుకే ఇన్ఫెక్షన్లు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన వ్యాక్సిన్ల గురించి మహిళలకు... ముఖ్యంగా కుటుంబ సభ్యులకు అవగాహన ఉండాలి. సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) మార్గదర్శకాల ప్రకారం... గర్భిణులూ - వారు తీసుకోవాల్సిన వ్యాక్సిన్లపై అవగాహన కోసం ఈ కథనం.

ముందే తీసుకోవలసిన వ్యాక్సిన్లు

ప్రెగ్నెన్సీకి ప్లాన్ చేసుకున్నప్పుడే మీజిల్స్, మంప్స్, రుబెల్లా, చికెన్ పాక్స్ వంటి వ్యాక్సిన్లను తీసుకోవాలి. ఎందుకంటే గర్భం ధరించిన తర్వాత ఈ వ్యాక్సిన్లు తీసుకోవడం మంచిది కాదు. రొటీన్ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా మీజిల్స్, మంప్స్, రుబెల్లా (ఎమ్ఎమ్ఆర్) వంటి వ్యాక్సిన్‌లను చిన్నప్పుడు తాము తీసుకున్నారా లేదా అనే సందేహం ఉంటే ఆ విషయాన్ని డాక్టర్‌తో తప్పక చెప్పాలి. అప్పుడు ఒక రక్తపరీక్ష ద్వారా ఆ మహిళ ముందుగానే ఎమ్ఎమ్ఆర్ వ్యాక్సిన్ తీసుకొని ఉన్నారా, లేదా నిర్ధారణ చేసి అంతకుముందు తీసుకుని ఉండకపోతే ఇస్తారు.

- **గర్భిణికి వారిసెల్లా (చికెన్‌పాక్స్) వైరస్** వల్ల బిడ్డలో పుట్టుకతోనే కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఒక చిన్న రక్తపరీక్షతో గతంలోనే చికెన్‌పాక్స్ వ్యాక్సిన్ తీసుకున్నారో లేదో తెలుసుకుని, తీసుకోకపోతే ప్రెగ్నెన్సీ ప్లానింగ్‌కు నెల రోజుల ముందే దాన్ని తీసుకోవడం మంచిది.
- **హ్యూమన్ పాపిలోమా వైరస్:** హెచ్‌పీవీ అని పిలిచే ఈ వ్యాక్సిన్‌ను అమ్మాయిలు తమ పన్నెండేళ్ల వయసు నాటి నుంచి 45 ఏళ్ల వరకు ఎప్పుడైనా తీసుకోవచ్చు. అయితే గర్భం దాల్చకముందే దీన్ని తీసుకోవాలి. గర్భంతో ఉన్నప్పుడు తీసుకోకూడదు. అవసరమైతే ఆ తర్వాత (అంటే ప్రెగ్నెన్సీ లేని టైమ్‌లో) తీసుకోవచ్చు.

ప్రతి గర్భిణీ తీసుకోవాల్సిన వ్యాక్సిన్‌లు...

- **ఇన్‌ఫ్లుయెంజా (ఫ్లూ) వ్యాక్సిన్:** మహిళలందరూ దీన్ని తీసుకోవాలి, గర్భవతులు తప్పనిసరిగా తీసుకోవాలి. గర్భధారణ సమయంలో దీన్ని తీసుకోవడం వల్ల పిండంపై దుష్ప్రభావం పడుతుందా లేదా అనే దిశగా ఎటువంటి అధ్యయనాలు లేవు. అయితే గర్భం ధరించి ఉన్నప్పుడు తీసుకుంటే బిడ్డ పుట్టాక మొదటి ఆర్నెల్లపాటు చిన్నారికీ అది రక్షణ ఇస్తుంది. కాబట్టి నిర్భయంగా తీసుకోవచ్చు. ఫ్లూ వల్ల గర్భవతిలో చలి జ్వరం, కండరాల నొప్పులు, దగ్గు, గొంతు బొంగురు పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- **టెటనస్, డిఫ్తీరియా, పెర్టుసిస్ (డీపీటీ) వ్యాక్సిన్ :** బాధితుల్లో ఒకవేళ టెటనస్ వచ్చినట్లయితే కండరాలు బిగుసుకు పోయినట్లుగా అయ్యి, అసాధారణంగా ప్రవర్తిస్తాయి. డిఫ్తీరియా వస్తే గొంతు లోపల వెనక భాగంలో ఒక మందపాటి పొరగా ఏర్పడి, శ్వాస సమస్యలకు కారణమవుతుంది. ఆగకుండా వచ్చే 'కోరింత దగ్గు' (పెర్టుసిస్) మహిళల్ని ఎంతో బాధిస్తుంది. అందుకే ఈ మూడు ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించుకోడానికి గర్భవతి విధిగా డీపీటీ వ్యాక్సిన్ తీసుకోవాలి.

టీ డాప్ అంటూ సంక్షిప్తంగా పిలిచే ఈ వ్యాక్సిన్‌ను గర్భం ధరించిన ప్రతిసారీ... గర్భధారణ తర్వాత 20 వారాలప్పుడు తీసుకోవాలి. కుదరని పక్షంలో 27వ వారం నుంచి 36వ వారం మధ్యలోనూ తీసుకోవచ్చు.

- **హెపటైటిస్ బి వ్యాక్సిన్ :** కాలేయానికి ఇన్‌ఫ్లమేషన్ (వాపు, మంట) కలగజేసే హెపటైటిస్ బి వైరస్ చాలా తీవ్రమైనది. అందుకే హెపటైటిస్ బిని నివారించడానికి ఇప్పుడు బిడ్డ చిన్నవయసులో ఉండగానే మూడు మోతాదుల హెపటైటిస్ బి ఇవ్వడం మొదలైంది. ఈ వ్యాక్సిన్ తీసుకుంటే గర్భస్థ శిశువుకు హాని జరిగినట్టు ఎటువంటి అధ్యయనాలూ లేవు కాబట్టి నిర్భయంగా ఈ వ్యాక్సిన్ తీసుకోవచ్చు.
- **కోవిడ్ వ్యాక్సిన్ :** కోవిడ్ వ్యాక్సిన్ ఎప్పుడైనా తీసుకోవచ్చు. ప్రెగ్నెన్సీ టైమ్‌లో తీసుకున్నా ఇబ్బంది లేదు.
- **రెస్పిరేటరీ సిన్సీషియల్ వైరల్ వ్యాక్సిన్:** ఈ వ్యాక్సిన్‌ను కూడా 32 వారాల నుంచి 36 వారాల ప్రెగ్నెన్సీ సమయంలో తీసుకోవచ్చు.




డా. కావ్యప్రియ వజ్రాల,
కన్సల్టెంట్ ఆబ్‌స్టెట్రీషియన్ అండ్ గైనకాలజిస్ట్

కొందరికి మాత్రమే వాడాల్సిన వ్యాక్సిన్లు...

కొంతమంది గర్భవతులకు కొన్ని అంశాల్లో ముప్పును నివారించడానికి వారి పరిస్థితిని బట్టి వాళ్లు నిర్దిష్టంగా తీసుకోవాల్సిన వ్యాక్సిన్‌లు ఇవి...

- **న్యూమోకాకస్ వ్యాక్సిన్:** న్యూమోకాక్సీ అనేది ఒక రకం బ్యాక్టీరియా. దీనివల్ల నిమోనియాతో పాటు మరెన్నో ఇన్ఫెక్షన్లు రావచ్చు. ఉదాహరణకు చెవి ఇన్ఫెక్షన్స్, మెనింజైటిస్ వంటివి. కొందరు హై రిస్క్ మహిళలకు న్యూమోకాకల్ ఇన్ఫెక్షన్స్ సోకకుండా ఈ వ్యాక్సిన్ వాడాలి. వాస్తవానికి ఈ వ్యాక్సిన్‌ను గర్భధారణకు ముందే ఇవ్వడం మంచిది. అయితే... ఇది గర్భధారణ తర్వాత మొదటి మూడు త్రైమాసికాలలో ఎప్పుడైనా తీసుకోవచ్చు.
- **ఎల్లో ఫీవర్ వ్యాక్సిన్ :** ఇది విదేశాలకు చెందిన దోమల ద్వారా వ్యాపించే ఒక రకం వైరల్ జ్వరం. దీని వల్ల కాలేయం, కిడ్నీలు దెబ్బతినడమే కాదు... ఒక్కోసారి తీవ్ర అంతర్గత రక్తస్రావంతో మరణం కూడా సంభవించవచ్చు. ఈ వ్యాధి మన దేశంలో లేదు గానీ... గర్భధారణ సమయంలో వృత్తిపరంగా కొన్ని ఆఫ్రికా దేశాలకు వెళ్లాల్సిన మహిళలు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ తీసుకోవాలి. ఇందుకోసం సాంక్రమిక వ్యాధుల (ఇన్ఫెక్షియస్ డిసీజెస్)కు చికిత్స చేసే నిపుణుల ఆధ్వర్యంలో తీసుకోవడం మంచిది.

గర్భిణికి ఇవ్వకూడని వ్యాక్సిన్

జీవించి ఉండే వైరస్‌తో తయారు చేసే వ్యాక్సిన్ అయిన జోస్టర్ వ్యాక్సిన్‌ను గర్భవతికి ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వకూడదు. మామూలుగా దీన్ని 50 ఏళ్లు, అంతకు పైబడిన లేదా గర్భధారణ వయసు మీరిన వారికే ఎక్కువగా సిఫార్సు చేస్తుంటారు.

ఇవిగాక మరికొన్ని... ఇవే కాకుండా గర్భవతులు అవసరాన్ని బట్టి మరికొన్ని వ్యాక్సిన్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు కలరా, మెనింగోకోకస్, రేబీస్, జపనీస్ ఎన్‌కెఫలైటిస్, టైఫాయిడ్, హీమోఫీలస్ ఇన్‌ఫ్లుయెంజా బీ వంటి వ్యాక్సిన్లను... ఆయా మహిళల వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితిని బట్టి... డాక్టర్ల సూచనలకు లోబడి తీసుకోవాల్సి ఉంటుంది.